# మానవహక్కులు - 2004

బులెటిన్ - 6

---

**మానవహక్కుల వేదిక ప్రచురణ**
Humanrights Forum Publication

ప్రచురణ సంఖ్య: 10
ప్రచురణ కాలం: ఫిబ్రవరి 2004
కాపీలు: 2000, వెల: 10 రూపాయలు
బొమ్మలు: మోహన్
ముద్రణ: నవ్య ప్రింటర్స్

ప్రతులకు:
**ఎస్.జీవన్ కుమార్**
3-12-117/ఎ-2/1, పి.ఎస్.కాలనీ
గణేష్‌నగర్, రామంతాపూర్
హైదరాబాద్-13, ఫోన్: 27039519

**ప్రజాశక్తి, నవోదయ, దిశ బుక్ హౌస్‌లు**

సంపాదకీయం

# మనమేం చేద్దాం?

మళ్లీ ఎన్నికలొస్తున్నాయి.

ఎన్నికలొస్తున్నాయంటే ఒక సంబరం వస్తున్నదని ఎదురుచూసే వారు రాష్ట్రంలో లేక పోలేదు గానీ ఏమవుతుందోనని భయంతో ఎదురుచూసేవారు కూడా ఉన్నారు.

ఈసారి ఎన్నికలలో 'నక్సలిజం' ప్రధాన సమస్య అని చంద్రబాబు నాయుడు ప్రకటించ డంతో భయపడేవారి సంఖ్య, భయపడడానికి గల కారణాలు పెరిగాయి. ఏడో ఎనిమిదో బెటాలియన్ల ప్యారామిలిటరీ బలగాలు కేంద్రం నుంచి దిగబోతున్నాయన్న వార్త చదివి 1994ను జ్ఞాపకం చేసుకొని ఒళ్లు చల్లబడ్డవాళ్లు చాలామందే ఉంటారు.

తెలుగుదేశానికి సీట్లు ఎన్ని వస్తాయన్న ప్రశ్న పక్కన పెట్టండి. 'నక్సలిజం' ప్రధాన సమస్య అంటూ ఎన్నికలకు దిగడం సమంజసమని వీధిలో ఒక్కరిచేతనయినా చంద్రబాబు చెప్పించగలడా? కరువు, రైతుల ఆత్మహత్యలు, 'విషజ్వరాల'తో పిల్లల చావులు, నిరుద్యోగం, తెలంగాణ – సహేతుకమైన అంశాన్ని చేపట్టి ఎన్నికలకు దిగదలచుకుంటే ఎన్ని లేవు? వీటిలో దేన్నయినా ఎంచుకొని 'నేనది చేశాను, నా అవగాహన ఇది, నేనింకా ఇది చేయ బోతాను, నాకు వోటు వేయండి' అని ప్రజల ముందుకొచ్చినట్టయితే వోటు వేసినా వేయకున్నా ప్రజాస్వామ్యాన్ని గౌరవించాడని ప్రజలతనిని గౌరవించవచ్చు. చెప్పుకోవడానికీ అడగడానికీ ఏమీలేని దివాళాకోరుతనం కాకపోతే 'నక్సలిజాన్ని' ప్రధాన సమస్య చేస్తాడా?

పైగా తానే కృత్రిమంగా ఈ విషయాన్ని ప్రధానం చేసి దానిని సమర్థించుకోవడానికి పెద్దయెత్తున కేంద్ర ప్యారామిలిటరీ బలగాలను తీసుకొచ్చి ప్రజల ప్రాణాల మీదికి తెస్తాడా?

ఈ దొల్లతనాన్ని, ఈ దుర్మార్గాన్ని ఎన్నికలలో ప్రధాన అంశం చేయడం అవసరం. ఎవరు గెలుస్తారు, ఎవరు ఓడిపోతారు అనేది కాదు. ఆ ప్రక్రియ ప్రజల అవసరాలనూ అభిప్రాయాలనూ గౌరవించేదిగా సాగాలి. లేకపోతే ఎన్నికలు జరుపుకోవడం అనవసరం, ప్రజల ఆమోదం పొందాడు అని ఒకడికి ముద్రవేసి అయిదేళ్లు రాష్ట్రం మీద వదలడం అనవసరం.

కరువు, ఆత్మహత్యలు, పిల్లల మరణాలేకాక తెలుగుదేశం పాలనలో మితిమీరిన పోలీసు హింస కూడా ఒక ఎన్నికల అంశం కాగలదు. పోలీసు యంత్రాంగం చట్టబాహ్యమైన పని తీరు రాశిలోనూ గుణంలోనూ కూడా గడచిన అయిదారేళ్లలో అపూర్వంగా దిగజారింది. పోలీసుల చేతికి చిక్కిన మనిషిని కోర్టులో హాజరుపెట్టే దాకా ప్రాణానికి గండం ఉంటుందిగానీ ఆ తరువాత భయం లేదన్న అభిప్రాయం చాలాకాలం ఉండింది. ఆ భరోసా లేకుండ చేసిన ఘనత తెలుగుదేశం పాలనకు దక్కుతుంది. రిమాండులో ఉన్న ఖైదీని కోర్టుకు తీసుకుపోతూ దారిలో కాల్చి చంపిన ఘటనలు, కోర్టు నుంచి జైలుకు తీసుకొస్తూ దారిలో చంపిన ఘటనలు, ఇంటరాగేషన్ కోసమని పోలీసు కస్టడీకి తీసుకొని లాకప్పులో కాల్చి చంపిన ఘటనలు గడచిన అయిదారేళ్లలో రాష్ట్రంలో అనేకం జరిగాయి.

పోలీసుల కనుసన్నలలో నడుచుకునే ప్రైవేటు హంతక ముఠాలను తయారుచేసిన ఘనత కూడా ఈ ప్రభుత్వానిదే. ఎన్‌కౌంటర్లు, చిత్రహింసలు, అక్రమ నిర్బంధాలు చట్టాన్నీ, రాజ్యాంగ ప్రాథమిక హక్కులనూ కాలరాసే చర్యలు కాగా, ఉద్యమాలలో పనిచేస్తున్న వారి బలహీనతలను వాడుకొని వారిని నేరస్తులుగా మార్చి వారిచేతనే వారి సహచరులను చంపించి బయటికొచ్చిన తరువాత సాయుధ ముఠాలుగా తయారయి పోలీసులకు అండగా ఉంటూ నేరాలు చేసుకుంటూ బతకమని ప్రోత్సహించడం చట్టబాహ్యమే కాక అదనంగా అనాగరికం, అనైతికం కూడా.

ఇటువంటి ముఠాలు ఇప్పుడు రాష్ట్ర రాజధానిలోనూ వరంగల్, కరీంనగర్, నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాలలోనూ ఉన్నాయి. ఇది బహిరంగ రహస్యమే. ఇంకా ఏ అనుమాన మయినా మిగిలి ఉంటే నవంబర్ నెలలో జరిగిన సిరాజ్ – లక్ష్మణ్‌ల ఉదంతం దానిని పటాపంచలు చేసి ఉండాలి. అయితే దుర్మార్గమైన ఈ ఎత్తుగడను అనుసరిస్తున్నందుకు రాష్ట్ర ప్రభుత్వం బోనెక్కవలసింది పోయి పౌరహక్కుల సంఘాన్ని బోనెక్కించి తాను తప్పుకోగలిగింది. ఇది దురదృష్టకరం.

ఎన్నికల సందర్భంగానయినా ఇవన్నీ చర్చకు రావడం అవసరం. ఎన్నికయి అధికారం చేపట్టిన తరువాత పాలకులను నిలదీసే సమర్థమైన మార్గాలేవీ మన ప్రజాస్వామ్యంలో లేవు. కనీసం ఎన్నికలప్పుడయినా నిలదీయాలి. ప్రస్తుత పాలకులనే కాదు, రేపు పాలకులు కాగోరేవారిని కూడా నిలదీయాలి. వారి చరిత్ర మనకు తెలియనిది కాదు – వారి మీద భ్రమలుండే అవకాశమూ లేదు. ప్రజల హక్కులకూ ప్రజాస్వామ్యానికీ సంబంధించిన ఒక్కొక్క అంశం మీదా వారినీ వీరినీ నిలబెట్టి జవాబు చెప్పించాలి.

ఇప్పుడు ఏ హామీలిచ్చినా రేపు అధికారానికి వచ్చినాక నిలబెట్టుకోకపోతే మనం చేయగలి గినదేమీ లేనప్పుడు ఈ శ్రమ ఎందుకని అడగవచ్చు. వెంటనే ప్రయోజనమేమీ రాకపో వచ్చును గానీ దీనిని ప్రజాస్వామ్యాన్ని మెరుగుపరచుకునే ప్రయత్నంగా అర్థం చేసుకుంటే వృథా శ్రమ అనుకోము. మనకున్నది అసమగ్రమైన ప్రజాస్వామ్య వ్యవస్థ. దానిని మరింత దిగజార్చడానికి అన్ని పార్టీలూ కలిసి నిరంతర కృషి చేస్తున్నాయి. ఇది సమగ్రమైన ప్రజాస్వామ్యం కాదు కాబట్టి దీనిని కాపాడే ప్రయత్నం అనవసరం అని మనం అనుకుంటే వారి ఎత్తుగడకే విజయం చేకూర్చిన వారిమవుతాము. ప్రజల ఆకాంక్షలకూ ఆలోచనలకూ పాలనా యంత్రాంగం జవాబుదారు కావాలన్నది ప్రజాస్వామ్యానికి ప్రాథమిక గీటురాయిగా భావించినట్టయితే ఆ దిశగా మన రాజకీయ వ్యవస్థనూ పాలనా వ్యవస్థనూ తీసుకుపోయే కృషి చేయడం అవసరం.

–మానవహక్కుల వేదిక

ఫిబ్రవరి, 2004

# ఇందులో ....

**సంపాదకీయం**

మనమేం చేద్దాం? ... 3

**వ్యాసాలు**

రెండవ లేబర్ కమిషన్ రిపోర్టు:

కాగల కార్యానికి ముందస్తు ఆశీస్సులు -కె.బాలగోపాల్ ... 9

కరువులు ఎందుకు వస్తాయి? -యం.కోదండరామ్ ... 22

ఏ రాజ్యానికీ చెందని పౌరులు -పి.త్రినాథరావు ... 29

వ్యవసాయానికి ఉచిత విద్యుత్ -కొత్తకోట రాజేంద్రరెడ్డి ... 33

**జుడీషయరీ వాచ్**

సమ్మె హక్కు:

న్యాయమూర్తుల అధిక ప్రసంగం ఉద్యోగ సంఘాల నిర్వ్యాపకత్వం ... 49

**రిపోర్టులు**

మెదడువాపు మరణాలు - వైద్య వ్యవస్థకు దర్పణం ... 57

సింగరేణి: జూన్ 16, 2003 ... 62

కాశ్మీర్ - సరిహద్దు వెతలు ... 67

కాంటాపురి - నేపథ్యం, ఉద్యమం, నిర్బంధం ... 75

**సంస్మరణ**

రామ్‌మనోహర్ లోహియా -యం.కోదండరామ్ ... 84

**కరపత్రాలు** ... 90-132

రెండవ లేబర్ కమిషన్ రిపోర్టు:

# కాగల కార్యానికి ముందస్తు ఆశీస్సులు

–కె. బాలగోపాల్ *

రెండవ లేబర్ కమిషన్ రిపోర్టు మీద ఇప్పటికే చాలామంది చాలా రాశారు, మాట్లాడారు. ఎక్కువ భాగం అందులోని కార్మిక–వ్యతిరేక అంశాలను ఖండించడమే జరిగింది తప్ప ఆ నివేదిక గురించి సమగ్రమైన సమీక్ష ఇప్పటికెవరూ చేయలేదు. అటువంటి సమీక్ష కేవలం సమగ్రత కోసమే కాక ఇతరత్రా కూడా అవసరం. అవాంఛనీయమైన పరిణామాలను సమూలంగా వ్యతిరేకిస్తూ కూడ దానికి అక్కడక్కడ అడ్డుకట్టవేయగల చిన్న చిన్న ప్రయత్నాలను ప్రోత్సహించడం ప్రజాతంత్ర కృషిలో ఎప్పుడూ ఉండేదే. అందుకు పనికి వచ్చే అంశాలు రెండవ లేబర్ కమిషన్ రిపోర్టులో లేకపోలేదు.



రెండవ లేబర్ కమిషన్ ఏర్పాటును, దాని 'టర్మ్స్ ఆఫ్ రెఫరెన్స్'నూ ప్రపంచీకరణలో భాగంగా జరిగిన పనులుగా విమర్శకులు సహేతుకంగా గుర్తించారు. అయితే ఆ కమిషన్ సభ్యులు ప్రపంచీకరణను నిర్విమర్శగా ఆరాధించే వ్యక్తులు కారు. అందువల్ల తమకు అప్పగించిన అజెండా కార్మికు లకు అన్యాయం చేయగలదని వారు గుర్తించారు. ముఖ్యమైన విషయాలలో ఆ

* మానవహక్కుల కార్యకర్త, హైకోర్టు న్యాయవాది

అజెండాకు తగిన సూచనలు చేస్తూ కూడా కొన్ని విషయాలలో తమనుంచి ప్రభుత్వం ఆశించిన సూచనలు ఇవ్వడానికి నిరాకరించారు. మరికొన్ని విషయాలలో ఆ అజెండా పరిధిలోనే కార్మికులకు కొంత భద్రత కల్పించే ప్రయత్నం చేశారు.

వారి నివేదికను కేంద్ర ప్రభుత్వం ఉన్నదున్నట్టు ఆమోదించవలసిన అగత్యం లేదు. తనకు నచ్చిన విషయాలు స్వీకరించి మిగిలిన వాటిని తిరస్కరించవచ్చు. ఆ పని 'దేశ అభివృద్ధి' పేరుమీదనే జరగబోతుంది కాబట్టి ఆ అభివృద్ధి అసలు లక్షణం ఏమిటో ప్రజలకు వివరించడానికి ప్రభుత్వమే నియమించిన ఈ కమిషన్ అభిప్రాయాలు, సూచనల సమగ్ర పాఠం ఉపయోగపడుతుంది. ఆ విమర్శ రేపు రాబోయే చట్ట సవరణలను కొంతమేరకయినా బలహీనపరచడానికి ఉపయోగపడితే అది కూడా ఒక ప్రయోజనమే.

i) సంఘటిత రంగంలో ప్రస్తుతం అమలులో ఉన్న చట్టాల క్రమబద్ధీకరణకు సూచనలు చేయడం;

ii) అసంఘటితరంగ కార్మికులకు కనీస రక్షణ కల్పించే ఒక సమగ్ర చట్టాన్ని సూచించడం రెండూ కేంద్ర ప్రభుత్వం రెండవ లేబర్ కమిషన్‌కు ఆదేశించిన కర్తవ్యాలు. 'క్రమబద్ధీకరణ' అని తెలుగులోకి మేము అనువాదం చేసిన ఇంగ్లీష్ పదం rationalisation. 'హేతుబద్ధీకరణ' అనే మాట ఎబ్బెట్టుగా లేకపోతే ఆ మాటే వాడి ఉండవచ్చు. ప్రస్తుతం సంఘటిత రంగానికి వర్తించే చట్టాలు అహేతుకంగా ఉన్నాయనీ, వాటిని హేతుబద్ధంగా సవరించడానికి సూచనలిమ్మనీ రెండవ లేబర్ కమిషన్‌ను కేంద్ర ప్రభుత్వం కోరింది.

ఏ కోణం నుంచి చూసినప్పుడవి అహేతుకంగా ఉన్నాయి? ఇన్నాళ్లూ లేనిది అవి అహేతుకంగా ఉన్నాయని ప్రభుత్వం ఈరోజు ఎందుకనుకుంటున్నది? ఈ ప్రశ్నకు జవాబును దాచిపెట్టే ప్రయత్నం ప్రభుత్వం చేయలేదు. నిర్మొగమాటంగానే చెప్పింది. ప్రపంచీకరణ; వర్తక పారిశ్రామిక సరళీకరణ; వేగంగా వస్తున్న సాంకేతిక మార్పులు, వాటికి పారిశ్రామిక రంగంపైన, ఉత్పత్తి ప్రక్రియపైన, ఉపాధిపైన, ఉపాధిని నిలబెట్టుకోవడానికి అవసరమైన శిక్షణపైన, కార్మికులను ఒక చోటి నుంచి మరొక చోటికి తరలించే అవసరంపైన, ఉండగల ప్రభావం; ఆర్థిక సామర్థ్యాన్ని సాధించుకోవడానికీ నిలబెట్టుకోవడానికీ అంతర్జాతీయ రంగంలో పోటీకి నిలబడడానికీ అవసరమైన చర్యలు – వీటిని దృష్టిలో పెట్టుకున్నట్టయితే ప్రస్తుత కార్మిక చట్టాలు అహేతుకంగా ఉన్నాయని ప్రభుత్వం భావిస్తున్నది. వాటికి అనుగుణంగా కార్మిక చట్టాలను తిరగరాయడానికి సూచనలిమ్మని కమిషన్‌కు ఏలిన వారి ఆదేశం. ఇవి కేంద్ర ప్రభుత్వం కాగితం మీద పెట్టిన విషయాలే. మన ఊహకూ వ్యాఖ్యలకూ ఏమీ విడిచిపెట్టలేదు.

ఇందులో ప్రపంచీకరణ, వర్తక పారిశ్రామిక సరళీకరణ, అంతర్జాతీయ ఆర్థిక రంగంలో పోటీకి నిలబడడం అనేవి ప్రధానమైన విషయాలు. సాంకేతిక మార్పులను వాటి కోణం నుంచి చూసినప్పుడు మాత్రమే ప్రస్తుత కార్మిక చట్టాలు ఆ మార్పులకు అనుగుణంగా లేవని తోచింది. లేకపోతే సాంకేతిక మార్పులు రావడంలో కొత్త ఏముంది? మన దేశంలోని కార్మిక చట్టాలు చాలావరకు బాగా పాతవి. వాటిని జారీచేసిన తరువాత సాంకేతిక మార్పులు అనేకం వచ్చాయి. చిన్న చిన్న సవరణలు మినహా చట్టాలలో పెద్ద మార్పులేం అవసరం కాలేదు. సాంకేతిక మార్పులకు కార్మిక చట్టాలు నిజంగానే అవరోధమైన చోట, ఆ మార్పు చట్టానికి అడ్జస్ట్ కావలసిందే తప్ప చట్టాన్ని మార్చేది లేదన్న విధానపరమైన వైఖరికూడ ఉండేది. ఇప్పుడు ఆ వైఖరిలో మార్పు రావడం వల్ల



సమస్య వచ్చింది.

ఒక్క ఉదాహరణ ఇక్కడే ఇచ్చుకుంటే ఉపయోగకరంగా ఉంటుంది. ఒక పరిశ్రమలో కొత్త సాంకేతిక ప్రక్రియను ప్రవేశపెట్టదలచుకున్నారనుకోండి. దానిమీద పనిచేయడానికి అవసరమైన నేర్పు ఇప్పుడున్న కార్మికులందరికీ ఉండదు. పైగా ఇప్పుడున్నంత మంది కార్మికులు అప్పుడు అవసరం ఉండరు. ఆ నేర్పును సంపాదించుకోగల వయసు దాటిపోయిన వారిని, ఆపైన కూడ తక్కువ ఖర్చుతో ఇంటికి పంపించి మిగిలిన వారికి శిక్షణ ఇచ్చి (లేదా అందరినీ పంపించేసి శిక్షణ పొందిన కొత్తవారిని నియమించి) కొత్త సాంకేతిక ప్రక్రియను ప్రవేశపెట్టే స్వేచ్ఛ తమకు ఉండాలని యజమానులు కోరుకుంటారు. ప్రస్తుతం ఉన్న పారిశ్రామిక వివాదాల చట్టం ప్రకారమయితే తొలగించే వారందరికీ గ్రాట్యుటీయే కాక అదనంగా అంత మొత్తం నష్టపరిహారం ఇయ్యవలసి ఉంటుంది. వంద మంది కంటె ఎక్కువ పనిచేసే కంపెనీ అయితే ఈ తొలగింపుకు ప్రభుత్వం అనుమతి తీసుకోవలసి ఉంటుంది. సీనియారిటీని దృష్టిలో పెట్టుకొని జూనియర్లనే ముందు తొలగించవలసి ఉంటుంది. కొత్త శిక్షణకు సీనియర్లే (వయసు, అలవాట్లరీత్యా) సిద్ధంగా ఉండరు కాబట్టి, వాళ్లను తొలగించి జూనియర్లను కొనసాగించడాన్ని చట్టం ఆమోదించదు కాబట్టి, సీనియర్లకు అదనంగా నష్టపరిహారం ఇచ్చి తమ హక్కు వదులుకొమ్మని సంజాయించవలసి ఉంటుంది. దీనిని మార్చాలన్నది ప్రభుత్వం లక్ష్యం. సాంకేతిక మార్పులకు చోటు కల్పించడం కోసం శిక్షణ పొందిన, లేక పొందగల వారిని మాత్రం ఉంచుకొని (అది కూడ అవసరం ఉన్న మేరకే) తక్కిన వారిని అతి తక్కువ ఖర్చుతో (అంటే గ్రాట్యుటీ మాత్రం ఇచ్చి) ఎవరి అనుమతీ అక్కర లేకుండా ఇంటికి పంపించే ఏర్పాటు (ఆ మాట అనకుండా 'ఇతర పారిశ్రామిక రంగాలకు తరలిపోయే సౌలభ్యం కల్పించడం' అన్నారు) చట్టానికి ఆమోదనీయం కావాలని ప్రభుత్వం ఆదేశం. విధాన దృక్పథంలో వచ్చిన మార్పువల్ల ఇది అవసరమయిందే తప్ప 'సాంకేతిక మార్పులకు' కార్మిక చట్టాలు వాటంతటవే ఆటంకం కాలేదు.

సాంకేతిక పురోగమనం సమాజానికి లాభదాయకం కాదా అని ఆవేశపడబోతారు. దీనికి జవాబుగా చెప్పుకోవలసిన విషయాలు చాలా ఉన్నాయి. సాంకేతిక పురోగమనం సమాజానికి లాభదాయకమని యజమానులు దానిని ఎంచుకోరు. తమకు లాభదాయకమని ఎంచుకుంటారు. అయితే అది శ్రామికుల ఉత్పాదన శక్తిని పెంచుతుంది కాబట్టి స్థూలమైన అర్థంలో సమాజానికి లాభదాయకమే కావచ్చు. కానీ కథ అక్కడితో అయిపోదు. ఆ సాంకేతిక ప్రక్రియ స్వభావాన్ని బట్టి, ఇతర పరిస్థితులను బట్టి దానివల్ల ఈ స్థూలమైన అర్థంలో ప్రయోజనమే కాక నిర్దిష్టమైన అర్థంలో నష్టాలు కూడా ఉండగలవు. అవి ఉపాధి అవకాశాల వినాశనం, ఆర్థిక అంతరాల పెరుగుదల, అభివృద్ధి కేంద్రీకరణ, పర్యావరణ విధ్వంసం మొదలయిన అనేక రూపాలలో ఉండగలవు. అందువల్ల సాంకేతిక మార్పు విషయంలో ఆచితూచి వ్యవహరించడం అవసరం. తమ లాభాలు తప్ప వేరే ఏమీ చూసుకోని పరిశ్రమల యజమానులు ఆ పని చేయరు. ప్రస్తుతం ఉన్న పరిస్థితులలో ప్రభుత్వం, కోర్టులు చేస్తున్నాయి. నిర్దిష్టమైన చట్టాల పరిధిలో చేస్తున్నాయి. ఇంతకంటె మెరుగయిన పర్యవేక్షణను ప్రతిపాదించడం ఆమోదనీయమే అవుతుందిగానీ ఉన్నదానిని తొలగించి యజమానుల లాభదృష్టే సరయిన నిర్ణయం చేస్తుందనడంలో అర్థం లేదు. నిజానికి యజమానుల లాభదృష్టి సామాజికంగా సరయిన నిర్ణయం చేస్తుందని కూడా మన విధానకర్తలు అనడంలేదు. అది

ఉత్పాదన సామర్థ్యాన్ని పెంచుతుందని, అంతర్జాతీయ పోటీలో తట్టుకునే బలాన్ని ఇస్తుందని, పెట్టుబడి దిగుమతులకు అనువయిన వాతావరణాన్ని కల్పిస్తుందనీ అంటున్నారు. సామాజిక శ్రేయస్సుకు 'మారోగోలీ' అంటున్నారు.

కాబట్టి రెండవ లేబర్ కమిషన్ టర్మ్స్ ఆఫ్ రెఫరెన్స్‌లోని మొదటి అంశంలోని అన్ని లక్ష్యాలూ వెరసి ఒకటే: ప్రపంచీకరణకు అనుకూలంగా సంఘటిత రంగంలోని కార్మిక చట్టాలను తిరగ రాయాలి. మరి ఈ పని చేస్తే కార్మికులందరూ 'అసంఘటిత' కార్మికుల స్థాయికి దిగజారిపోతారు కదా? అందుకే రెండవ అంశం చేర్చారు. అసంఘటిత రంగ కార్మికులకు 'కనీస రక్షణ' కల్పించే ఒక స్థూలమైన చట్టాన్ని రూపొందించమన్నారు. మన పాలకులు బొత్తిగా దయలేని వారు కారు.

నిజానికి అసంఘటిత రంగంలో చాలా వైవిధ్యం ఉంది. ఆ రంగంలో కార్మికులకు నిజంగా న్యాయం చేయాలంటే ఒక్కొక్కరకమైన అసంఘటిత శ్రమనూ విడిగా తీసుకొని దాని స్వభావానికి అనుగుణ్యమైన చట్టం చేయవలసి ఉంటుంది. రెండవ లేబర్ కమిషన్‌కు ప్రభుత్వం సూచించింది అది కాదు. అసంఘటిత రంగంలోని భిన్నత్వాన్ని లెక్కలోకి తీసుకోకుండ అందరికీ టోకున 'కనీస రక్షణ' కల్పించే ఒక గొడుగులాంటి చట్టాన్ని ('అంబ్రెల్లా లెజిస్లేషన్' అనేది ప్రభుత్వం వాడిన మాటే – మేము కల్పించిన ఉపమానం కాదు) సూచించమనింది. కమిషన్ తన కర్తవ్యాన్ని దానికి అనుగుణంగానే అర్థం చేసుకునింది.

కమిషన్ సమాజంలోని వివిధ వర్గాల నుంచి అభిప్రాయాలను ఆహ్వానించింది. పరిశ్రమల యజమానులు, కార్మిక సంఘాలు, ప్రభుత్వ ప్రతినిధులు కార్మిక చట్టాల 'క్రమబద్ధీకరణ' గురించి తమ అభిప్రాయాలు తెలియజేశారు. పరిశ్రమల యజమానులు, ప్రభుత్వ ప్రతినిధులు కోరిన మార్పులు ఇవి:

1. ఒక పారిశ్రామిక సంస్థను మూసేసే విషయంలో గానీ, అక్కరలేని కార్మికులను తాత్కాలికంగా 'లే-ఆఫ్' చేసే విషయంలో గానీ, పూర్తిగా తొలగించే విషయంలో గానీ యాజమాన్యానికి పూర్తి స్వేచ్ఛ ఉండాలి. గ్రాట్యుటీ, ప్రావిడెంట్ ఫండ్ తప్ప వేరే నష్టపరిహారం ఇయ్యవలసిన అవసరం ఉండకూడదు. ముందు నోటీసు ఇవ్వడం, ప్రభుత్వం అనుమతి తీసుకోవడం వగైరా ఆంక్షలు ఉండకూడదు. కోర్టుల జోక్యం ఉండకూడదు.

2. ఒక పారిశ్రామిక సంస్థ చేపట్టే ఉత్పత్తిలో, దానికి అనుబంధంగా జరిగే పనులలో దేనినయినా ఎప్పుడయినా కాంట్రాక్టుకు ఇచ్చి కాంట్రాక్ట్ కార్మికుల ద్వారా చేయించుకునే స్వేచ్ఛ, లేదా రోజువారీ పనిలోకి తీసుకునే క్యాజువల్ కార్మికుల చేత చేయించుకునే స్వేచ్ఛ యజమాన్యానికి ఉండాలి. దీనిపైన చట్టం ఏ ఆంక్షలూ పెట్టకూడదు, ప్రభుత్వమూ కోర్టులూ జోక్యం చేసుకోకూడదు.

కమిషన్ ఈ రెండు కోరికలనూ పాక్షికంగా ఆమోదించింది. కార్మికులను లేఆఫ్ చేయడానికీ అది ఎంత పెద్ద సంస్థ అయినా సరే ప్రభుత్వం అనుమతి తీసుకోనక్కరలేదనింది. 300 మంది కంటె ఎక్కువ కార్మికులున్న సంస్థ అయితే మూసివేయడానికి ముందుగా ప్రభుత్వం అనుమతి తీసుకోవాలనింది (ప్రస్తుతమున్న చట్టంలో 100 మంది కంటె ఎక్కువ కార్మికులున్న సంస్థ లేఆఫ్‌కూ, తొలగింపుకూ, మూసివేతకూ కూడా ప్రభుత్వం అనుమతి తీసుకోవాలి). అయితే నష్టాలలో ఉన్న సంస్థను బలవంతంగా నడిపించమనడంలో అర్థంలేదు కాబట్టి, అటువంటి సంస్థల మూసివేతను ఒక హక్కుగా గుర్తించడం అవసరమని వాదిస్తూ, అనుమతి కోసం పెట్టుకున్న అర్జీ మీద ప్రభుత్వం



60 రోజుల లోపల జవాబు చెప్పకపోతే అనుమతి ఇచ్చినట్టే భావించాలని కమిషన్ అంటుంది. నిజంగానే యాజమాన్యం ప్రయత్న లోపం లేని కారణాల వల్ల సంస్థ నష్టాలలో పడినట్టయితే దానిని బలవంతంగా కొనసాగించాలనడం ఎవరికీ ప్రయోజనకరం కాదుగానీ, నిజంగా నష్టాలలో ఉందా లేక మూసివేయడం కోసం నష్టాలలో ఉన్నట్టు కృత్రిమంగా చూపించబడుతున్నదా అన్నదే అసలు సమస్య. అందుకోసమే ప్రభుత్వ అజమాయిషీ అనేది కనీసం వంద మంది కంటె ఎక్కువ కార్మికులు ఉన్న సంస్థ విషయంలో సామాజికంగా అవసరం అని భావింపబడింది. ఇప్పుడు 60 రోజులలోగా ఏ సంగతీ తేల్చకపోయినట్టయితే అనుమతి ఇచ్చినట్టేనని అంటే ఆ మాత్రం ఆలస్యాన్ని ప్రభుత్వ అధికార్ల వద్ద పొందడం యాజమాన్యాలకు కష్టం కాదు. కాయితం మీద పెన్ను పెట్టకుండ డబ్బు సంపాదించుకునే మార్గం – కాయితం మీద పెన్ను పెట్టనందుకు డబ్బు సంపాదించుకునే మార్గం – లభిస్తే మన అధికారగణానికి అంతకంటే ఏం కావాలి?

వెరసి, ఎంత పెద్ద కంపెనీ అయినా సరే ఎంతమంది కార్మికులనయినా సరే లేఆఫ్ చేయడానికీ, తొలగించడానికీ కంపెనీని మూసివేయడానికీ ప్రభుత్వం అనుమతి తీసుకోనక్కరలేదని రెండవ లేబర్ కమిషన్ అభిప్రాయపడినట్టే భావించవచ్చు. కోర్టుల జోక్యాన్ని తొలగించడానికి మాత్రం కమిషన్ ఒప్పుకోలేదు. మూసివేత, తొలగింపు, లేఆఫ్‌ల విషయంలో వివాదం లేవదీసి కోర్టుకు ఎక్కే అవకాశాన్ని కార్మికులకు మిగిల్చింది.

యాజమాన్యాలు ఈ చర్యలకు ఎప్పుడూ సహేతుకమైన కారణాల వల్లనే పాల్పడతారని భావించినట్టయితే, ప్రస్తుత ఆర్థిక వ్యవస్థలో ఇటువంటి ఆంక్షలు పెట్టడం అర్థరహితం అనుకునే అవకాశం ఉంది. కానీ అది నిజం కాదు. ఆ సంగతి రెండవ లేబర్ కమిషన్ సభ్యులకు బాగానే తెలుసును. నైపుణ్యంతో ఉత్పాదన క్రియ నిర్వహించడం ద్వారా మాత్రమే లాభాలు సంపాదించుకోవలసిన అగత్యం పెట్టుబడిదార్లకు లేదు. ఆస్తులను అడ్డుపెట్టుకొని అనేక రూపాలలో డబ్బు సంపాదించుకోవచ్చు. దానికోసం లేని నష్టాలు ఉన్నట్టు చూపించవచ్చు, ఉన్న మార్కెట్ లేనట్టు చూపించవచ్చు. కార్మిక సంఘాలను దెబ్బతీయడానికి లేఆఫ్‌లు చేపట్టవచ్చు, నోరున్న కార్మికుల నోరు నొక్కేయడానికి రిట్రెంచ్ చేయవచ్చు. ఫ్యాక్టరీ మూసేసి కమర్షియల్ కాంప్లెక్స్ కట్టి అద్దెకిచ్చుకోవచ్చు. ఇన్నీ ఇంకా ఎన్నో కారణాలుండగలవు కాబట్టే యాజమాన్య నిర్ణయాలకు – కనీసం 100 కంటె ఎక్కువ మంది కార్మికులున్న కంపెనీల విషయంలో – ప్రభుత్వం పర్యవేక్షణ ఉండాలని చట్టం భావిస్తుంది. కార్మిక శాఖలో పేరుకుపోయిన అవినీతి కారణంగా ఈ పర్యవేక్షణ అసమర్థంగా ఉంటే ఉండవచ్చుగాక, దానికి సహేతుకమైన కారణం లేదనుకోవడం పొరబాటు.

అయితే తొలగించిన కార్మికులకు నష్టపరిహారం ఇచ్చే విషయంలో కమిషన్ యాజమాన్యాల కోరికను తిరస్కరించడమే కాక, ఇప్పుడున్న దానికంటె ఎక్కువ ఇవ్వాలని సూచించింది. ఈ సూచనను ప్రభుత్వం పక్కనపెట్టే అవకాశం ఉంది కాబట్టి, కమిషన్ ఈ విషయంలో అనుసరించిన వైఖరిని వివరించడం అవసరం. ప్రపంచీకరణ ఒత్తిడుల నేపథ్యంలో ఇప్పుడున్న పరిమితమైన అర్థంలో సహితం ఉద్యోగ భద్రత ఉండడం సాధ్యంకాదన్న పాలకుల వాదనతో ఏకీభవిస్తూనే, దాని స్థానంలో అర్థవంతమైన సామాజిక భద్రతను (సోషల్ సెక్యూరిటీని) ప్రవేశపెట్టాలని కమిషన్ భావించింది. ఇక్కడ సామాజిక భద్రత అంటే అర్థం, ఉద్యోగం కోల్పోయిన కార్మికుడు తిరిగి ఉద్యోగం సంపాదించుకునే దాక కనీస ఆదాయం ఉండేటట్టు చూడడం. ప్రభుత్వం నిరుద్యోగ భృతి

ఇవ్వడమో, లేక తొలగించిన యాజమాన్యం తగు మొత్తం నష్టపరిహారం ఇవ్వడమో దీనికి మార్గం అని భావించి, మొదటిది మన దేశంలో లేదు కాబట్టి రెండవది అవసరమని చెప్పి, ప్రస్తుతం చట్టంలో ఉన్న నష్టపరిహారం కన్నా ఎక్కువ మొత్తాన్ని కమిషన్ సూచించింది. ఆ మొత్తాన్ని ముందే కార్మికుని చేతిలో పెట్టినట్టయితేనే తొలగింపు చట్టబద్ధం అవుతుందనింది.

కాంట్రాక్ట్ కార్మికులను వినియోగించే 'స్వేచ్ఛ' విషయంలో కూడా కమిషన్ యాజమాన్యాల కోరికకూ కార్మిక సంఘాల అభ్యంతరానికీ మధ్యస్తంగా సూచనలిచ్చింది. ప్రతీ సంస్థలోనూ ఒక కేంద్ర, లేక ప్రధాన ఉత్పత్తి (లేక సేవా) రంగం ఉంటుంది. సైకిళ్ల ఫ్యాక్టరీ సైకిళ్లు ఉత్పత్తి చేస్తుంది, బొగ్గుగని బొగ్గు తవ్వి తీస్తుంది, ఆస్పత్రి వైద్య సేవలందిస్తుంది. ఇవి ఆ సంస్థల ప్రధాన ఉత్పత్తులు, లేక సేవలు. ఇవికాక, ఈ ప్రధాన ఉత్పత్తి లేక సేవకు అనుబంధంగా అనేక పనులు జరుగుతుం టాయి. ఊడవడం, తుడవడం, నిత్యం జరిగే లోడింగ్, అన్‌లోడింగ్, మిషన్ల రిపేర్లు, బొగ్గు తవ్వకం కోసం పై మట్టి తొలగించడం, ఆస్పత్రికి అనుబంధంగా మందుల విక్రయం, డయాగ్నొస్టిక్ సేవలు, ఉద్యోగుల కోసం క్యాంటీన్ నడపడం ఇత్యాది అనుబంధ కార్యాలు. ఇవన్నీ అనుబంధ కార్యాలే అయినప్పటికీ ఇవి అనునిత్యం జరుగుతాయి, ఇవి జరగనిదే ఆ సంస్థ చేసే ప్రధాన ఉత్పత్తి లేక సేవ జరగదు. ఇవికాక అప్పుడప్పుడు మాత్రమే జరిగే పనులు కొన్ని ఉంటాయి – బిల్డింగ్‌కు రంగులు వేయడం, ఏదయినా ముడిసరుకును నెలకొకసారి తెచ్చిపడేయడం వగైరా.

ఇందులో మూడవ కోవకు చెందిన పనులను మాత్రమే కాంట్రాక్ట్‌కు ఇయ్యవచ్చుననీ నిత్యం జరిగే పనులలో – అంటే మొదటి రెండు కోవలకు చెందిన పనులలో – సంస్థ తన కార్మికులనే పెట్టి పనిచేయించుకోవాలనీ కార్మిక సంఘాలు చాలాకాలంగా ఆందోళన చేస్తున్నాయి. చట్టం అంత దూరం పోలేదుగానీ, నిత్యం జరిగే పనిలో కాంట్రాక్ట్ కార్మికుల నియామకాన్ని నిషేధించే అధికారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చేతిలో కాంట్రాక్ట్ కార్మిక చట్టంలోని సెక్షన్ 10(1) పెట్టింది. ప్రభుత్వాలు ఆ అధికారాన్ని కొంతమేరకు ఉపయోగించుకొని కొన్ని పారిశ్రామిక రంగాలలో కొన్నిరకాల పనులలో కాంట్రాక్ట్ కార్మికుల వినియోగాన్ని నిషేధించి ఉన్నాయి. కోర్టులు దయతలచి ఆ నిషేధాజ్ఞలను కొట్టేయని సందర్భాలలో అవి అమలవుతున్నాయి కూడ.

ఈ సెక్షన్ 10(1)ని పూర్తిగా తొలగించివేయాలనీ, ఏ రంగంలోనయినా కాంట్రాక్ట్ కార్మికులను నియమించడం పైన ఎటువంటి నిషేధంగానీ, నిషేధం పెట్టే అధికారం గానీ చట్టంలో ఉండ కూడదనీ యాజమాన్యాల వాదన. రెండవ లేబర్ కమిషన్ సెక్షన్ 10(1)ని తొలగించాలన్న సూచ నకు అనుకూలంగానే స్పందించింది. అంటే ఒక పారిశ్రామిక రంగంలో లేక సంస్థలో నిత్యం జరిగే పనులలో కాంట్రాక్ట్ కార్మికుల నియామకాన్ని నిషేధించే అధికారం ప్రభుత్వానికి ఉండకూడ దనింది. అయితే యాజమాన్యాలు కోరే పూర్తి స్వేచ్ఛ వారికి ఇవ్వకుండా, ఒక సంస్థ చేపట్టే ప్రధాన లేక కేంద్ర ఉత్పత్తి (లేక సేవా) రంగాలలో కాంట్రాక్ట్ కార్మికుల నియామకాన్ని చట్టమే నిషేధించాలని సూచించింది. ప్రధాన లేక కేంద్ర ఉత్పత్తిలో కాంట్రాక్ట్ కార్మికుల నియామకాన్ని నిషేధించడానికీ, నిత్యం తప్పనిసరిగా జరిగే పనిలో నిషేధించడానికీ చాలా తేడా ఉండగలదు. మొదటిది రెండవ దానిలో ఒక భాగం (ఒక్కొకసారి అతి చిన్న భాగం) మాత్రమే. ఉదాహరణకు ఒక గనిలో ఖనిజాన్ని తవ్వితీసే పని మాత్రమే ప్రధాన లేక కేంద్ర ప్రక్రియ. దానికి అనుబంధంగా పై మట్టి (ఓవర్ బర్డెన్ అంటారు) తొలగించే పని, ఖనిజాన్ని ముక్కలు చేసి పేక్ చేసే పని, లోడ్ చేసే పని, మెయింటెనెన్స్



పని, నీళ్లు బయటకు తోడే పని, కార్మికుల కోసం క్యాంటీన్ నడిపే పని, ఊడ్చే పని, తుడిచే పని వగైరాలన్నీ అనునిత్యం అవసరమే అయినప్పటికీ ఇవి ఆ సంస్థ ప్రధాన ఉత్పత్తి ప్రక్రియ కిందికి రావు. ఈ పనులలో కాంట్రాక్ట్ కార్మికులను నియమించడాన్ని చట్టం ఇప్పటిదాకా నిషేధించకున్నా, ఆ నిషేధాన్ని ప్రకటించే అధికారం కాంట్రాక్ట్ కార్మిక చట్టంలోని సెక్షన్ 10(1) ప్రభుత్వానికి ఇచ్చింది. ప్రభుత్వాలు దానిని ఒకమేరకు సద్వినియోగం చేశాయి. ఇప్పుడు ఆ అధికారాన్ని పూర్తిగా తొలగించి, కేవలం ప్రధాన లేక కేంద్ర ఉత్పత్తి ప్రక్రియలో మాత్రమే కాంట్రాక్ట్ కార్మికుల నియామకాన్ని నిషేధించాలనడం అత్యధిక శాతం కార్మికులను కాంట్రాక్ట్ కార్మికుల బతుకుకు వదిలేయడమే అవుతుంది. నిజానికి చాలా సంస్థలలో ఇప్పటికే ఈ వరవడి మొదలయింది. సెక్షన్ 10(1) ఇచ్చిన అధికారాన్ని ఉపయోగించడం దాదాపు మానేశాయి కాబట్టి ఇది నిరాటంకంగా సాగుతున్నది. ఇది కార్మికులను ఏళ్లతరబడి నిత్య అభద్రతలో ఉంచుతుంది. ప్రతీ సంవత్సరమూ కాంట్రాక్టర్ మారు తుంటాడు గానీ కొత్తగా వచ్చిన కాంట్రాక్టరు కొత్త కార్మికులను తెచ్చుకోడు. తెచ్చుకుంటే వాళ్లకు పని నేర్పించడానికే కొన్ని నెలలు పడుతుంది. పాతవాళ్లను కొనసాగించడం అతనికే ప్రయోజనకరం కాబట్టి వారినే కొనసాగిస్తాడు. అందువల్ల ఈ 'కాంట్రాక్ట్ కార్మికులు' ఏళ్ల తరబడి అదే సంస్థలో అదే పనిలో కొనసాగుతుంటారు. అయితే నిత్య అభద్రతలో – ఏ సంవత్సరం కొత్తగా వచ్చిన కాంట్రాక్టరు ఏం చేస్తాడోనన్న భయంలో – బతుకుతుంటారు. వారి జీతాలు కూడా ఒక పద్ధతి ప్రకారం పెరగవు, ఇతర సదుపాయాలేవీ ఉండవు. అన్ని సంస్థలలో ఇప్పటికే నడుస్తున్న ఈ కపట నాటకాన్ని శాశ్వతం చేయడమే కమిషన్ సూచన ఫలితం.

కార్మిక – యాజమాన్య వివాదాల పరిష్కారం విషయంలో కూడా రెండవ లేబర్ కమిషన్ కార్మి కుల సంఘటిత శక్తిని పెంపొందించవలసిన అవసరాన్ని ఒకపక్క గుర్తిస్తూనే, వివాదాల పరిష్కారం జటిలంగా తయారు కావడానికి గల ప్రధాన కారణాన్ని గుర్తించకపోవడం వల్ల అవాస్తవిక వైఖరినే చివరికి ప్రదర్శించింది.

పారిశ్రామిక వివాదాలు ద్వైపాక్షిక చర్చల (నెగోషియేషన్) లోనయినా పరిష్కారం కావాలి, కార్మిక శాఖ అధికారుల మధ్యస్తం (కన్సిలియేషన్) లోనయినా పరిష్కారం కావాలి. కోర్టుల (అడ్జుడి కేషన్) లోనయినా పరిష్కారం కావాలి. ప్రస్తుతం నడుస్తున్నది ఈ వరుస క్రమం. ఎక్కువ భాగం వివాదాలు మూడవ దశలోనే పరిష్కారం అవుతున్నాయనీ, అది అవాంఛనీయం అనీ కమిషన్ అంటుంది. కానీ దానికి బాధ్యులెవరన్నది గుర్తించదు. ద్వైపాక్షిక పరిష్కారాలనూ అధికార్ల మధ్య స్తాలనూ యాజమాన్యాలు చులకనగా చూడడం దీనికి ప్రధాన కారణం. లేకపోతే సమస్యలు చర్చ లలో పరిష్కారం కాకుండ కోర్టుకెక్కాలని ఏ కార్మికులు కోరుకుంటారు?

కార్మికులు డిమాండ్లు లేవదీసి చర్చిద్దాం రమ్మంటే యాజమాన్యాలు రావు. మధ్యస్తానికి రమ్మని కార్మిక శాఖ అధికార్లు పంపే నోటీసులకు జవాబుండదు. ప్రతీ తేదీకీ కార్మిక శాఖ కార్యాలయంలో నిష్ఫలంగా హాజరు వేయించుకొని రావడంతో కార్మిక సంఘాల బాధ్యుల బతుకు సగం గడిచి పోతుంది. ఈ రెండు ప్రక్రియలనూ గౌరవించని యాజమాన్యాల మెడలు వంచే ఏర్పాటేదీ ఇప్పుడు లేదు, రెండవ లేబర్ కమిషన్ సూచించనూ లేదు. ద్వైపాక్షిక చర్చలకు కూర్చోవడానికి నిరాకరిం చినా, మధ్యస్తం నోటీసులను గౌరవించకున్నా అప్పటికప్పుడే భారీగా జుర్మానా వేసి దానిని కార్మికు లకు పంచే నియమమేదయినా ఉంటే తప్ప ప్రయోజనం ఉండదు.

లేదా సమ్మె హక్కునయినా బలోపేతం చేయాలి. చర్చలకు రాకపోతే సమ్మె చేస్తారన్న భయం ఉంటే చర్చలకూ, మధ్యస్తాలకూ యజమానులు హాజరవుతారు. పారిశ్రామిక వివాదాలు న్యాయ బద్ధంగా పరిష్కారం కావాలంటే కార్మిక సంఘాలు బలంగా ఉండడం అవసరం అని కమిషన్ గుర్తించింది. అవి రోజురోజుకూ బలహీనపడుతుండడం దురదృష్టకరం అని బాధపడింది. అంత వరకు బాగానే ఉంది. కానీ చర్చలకూ మధ్యస్తాలకూ యజమానులు రానప్పుడు సంఘం బలంగా ఉండి ఏం ప్రయోజనం? చిత్తశుద్ధితో ద్వైపాక్షిక చర్చలలో పాల్గొనకపోవడం 'అన్ ఫెయిర్ లేబర్ ప్రాక్టీస్' అనీ, అది శిక్షార్హమైన నేరమనీ చట్టం అంటుంది. కానీ ఆ శిక్ష పడవలసింది క్రిమినల్ కోర్టులో – కేసుపెట్టవలసింది ప్రభుత్వం. అది ఎప్పుడూ జరగదు. దానివల్ల వివాదం పరిష్కారానికి తక్షణ ప్రయోజనమూ లేదు. యాజమాన్యం చర్చలలో చిత్తశుద్ధితో పాల్గొననట్టయితే కార్మికులకు సమ్మె చేసే హక్కు ఉందని చట్టం గుర్తించినట్టయితే ప్రయోజనం ఉంటుంది.

ఈ సంగతి రెండవ లేబర్ కమిషన్ సభ్యులకు తెలియకపోలేదనడానికి తార్కాణం వారు బొం బాయి కార్మిక నాయకుడు దత్తా సామంత్ వ్యవహారశైలిని ప్రస్తావించిన వైనం. దత్తా సామంత్ కార్మిక శాఖ అధికారుల మధ్యస్తాలను ఎప్పుడూ ఆహ్వానించేవాడు కాదు. డిమాండ్లు పెట్టేవాడు, యాజమాన్యాలు దిగిరాకపోతే నేరుగా సమ్మె పిలుపు ఇచ్చేవాడు. ఈ ఎత్తుగడ ఫలితం ఇచ్చిన విషయం కమిషన్ తన నివేదికలో గుర్తించింది.

అయితే ఈ ఎత్తుగడ అన్ని సందర్భాలలోనూ పనిచేయదు. పెద్ద సంస్థలలో పనిచేసినంత సులభంగా చిన్న సంస్థలలో పనిచేయదు. అది పనిచేయాలంటే, యాజమాన్యాలు ద్వైపాక్షిక చర్చ లలో గానీ కార్మిక శాఖ మధ్యస్తాలలో గానీ చిత్తశుద్ధితో పాల్గొననట్టయితే (అన్ని డిమాండ్లూ వెంటనే ఒప్పేసుకోవాలని కాదు, నిజాయితీగా పరిష్కార ప్రయత్నంలో భాగం కావాలి) కార్మికులకు సమ్మె చేసే హక్కు ఉందని చట్టమే గుర్తించాలి.

ఈ అవసరాన్ని గ్రహించకుండా, పారిశ్రామిక సమస్యలు ద్వైపాక్షికంగానో, మధ్యస్తంలోనో పరిష్కారమయిపోవాలనుకోవడం అవాస్తవికం. అన్నీ తెలిసిన రెండవ లేబర్ కమిషన్ సభ్యులు ఈ అవాస్తవిక వైఖరిని అనుసరించడం దురదృష్టకరం. ప్రభుత్వ అధికారుల దగ్గరికీ కోర్టుకూ పోకుండ పారిశ్రామిక వివాదాలు పరిష్కారం కావడానికి యోగ్యమైనదిగా వారు భావించే యంత్రాంగాన్ని సూచించారు. ప్రతీ సంస్థలోనూ ఒక ఫిర్యాదుల పరిష్కారం కమిటీ ఒకటి ఉంటుంది. అందులో సగం మంది యాజమాన్య ప్రతినిధులూ సగం మంది కార్మిక ప్రతినిధులూ ఉంటారు. కార్మికుల వ్యక్తిగత సమస్యలన్నీ మొదట ఆ కమిటీ దగ్గరకు పోవాలి. ఈ సమస్యలను గుర్తింపు పొందిన యూనియనేకాక ఏ యూనియనయినా (పది శాతం సభ్యత్వం ఉంటే చాలు) లేవదీయవచ్చు. అక్కడ పరిష్కారం కాని పక్షంలో సమస్య మధ్యవర్తిత్వానికి పోవాలి.

ఈ మధ్యవర్తిత్వం కార్మిక శాఖ అధికారుల దగ్గర కాదు. ప్రభుత్వ అధికారులెవ్వరూ మధ్య వర్తిత్వం చేయకూడదని కమిషన్ అభిప్రాయం. దానికి వేరే మధ్యవర్తులు (ఆర్బిట్రేటర్స్) ఉంటారు. వీరు ఆ సంస్థలోని కార్మికులూ యాజమాన్యమూ ఇరువురూ అంగీకరించిన పెద్ద మనుషులు కావచ్చు. లేదా కార్మిక సంబంధాల కమిషన్ ఎంపిక చేసినవారు కావచ్చు. ప్రతీ రాష్ట్రంలోనూ కేంద్రంలోనూ ఒక కార్మిక సంబంధాల కమిషన్ ఉండాలనేది రెండవ లేబర్ కమిషన్ సూచనలలో ఒకటి.



మధ్యవర్తి దగ్గర సమస్య పరిష్కారం కాకపోతే అది కార్మిక సంబంధాల కమిషన్ దగ్గరకు పోతుంది. అక్కడ కూడా పరిష్కారం కాకపోతే లోక్ అదాలత్‌కు పోతుంది. ఎక్కడా కాకపోతేనే కోర్టుకు పోతుంది.

వ్యక్తిగత సమస్యలను ఏ యూనియన్ అయినా లేవదీయవచ్చునని చూశాం. సంస్థలోని కార్మి కుల ఉమ్మడి సమస్యలను లేవదీసే హక్కు ఒకే ఒక 'సంప్రదింపుల ప్రతినిధి' (నెగోషియేటింగ్ ఏజెంట్)కి ఉంటుంది. సంస్థలో ఏ యూనియన్‌కయినా 66 శాతం మించి సభ్యత్వం ఉన్నట్టయితే ఆ యూనియనే సంప్రదింపుల ప్రతినిధి అవుతుంది. లేనిపక్షంలో 25 శాతం మించి సభ్యత్వం ఉన్న అన్ని యూనియన్ల నుంచి దామాషా పద్ధతిలో ఎంపిక చేసిన కమిటీ సంప్రదింపుల ప్రతినిధి అవుతుంది. ఒకసారి గుర్తింపుపొందిన సంప్రదింపుల ప్రతినిధికి ఆ గుర్తింపు నాలుగు సంవత్సరాలు ఉంటుంది. ఆ నాలుగేళ్లు ఆ కమిటీ తప్ప వేరే ఎవ్వరికీ కార్మికుల ఉమ్మడి సమస్యలపైన వివాదం లేవదీసే అధికారం ఉండదు. సమ్మెకు పిలుపు ఇచ్చే అధికారం కూడ ఈ కమిటీకే ఉంటుంది. అయితే ఆ సమ్మె పిలుపు ఇతరత్రా చట్టబద్ధంగా ఉండడమే కాక ఇప్పుడు మరొక నియమాన్ని కూడా పాటించాలి. కార్మికులలో రహస్య బ్యాలట్ వోటింగ్ పెట్టి సమ్మెకు 51 శాతం అనుకూలత పొందిన తరువాతే సమ్మెకు పిలుపు ఇవ్వాలి. చట్టవిరుద్ధంగా సమ్మెకు పిలుపునిచ్చిన యూనియన్ గుర్తింపును రద్దుచేస్తారు. ఆ తరువాత రెండు సంవత్సరాలు దానికి గుర్తింపు ఇవ్వరు. చట్టవిరుద్ధమైన సమ్మెలో కార్మికులు పాల్గొన్నట్టయితే ఒక రోజుకు మూడు రోజుల జీతం కోసేయాలి.

ఇవి చాలా నష్టకరమయిన సూచనలు. నాలుగు సంవత్సరాల కోసం సంప్రదింపుల ప్రతినిధిగా ఎన్నికయిన యూనియన్, లేక సంఘం అందులో నాలుగోవంతు కాలం గడవకముందే కార్మికుల అభిమానాన్ని కోల్పోయినా, యాజమాన్యానికి అమ్ముడుపోయినా, సమస్యలు చేపట్టడం మానేసినా నాలుగేళ్లూ కార్మికులు ఆ ప్రతినిధి ద్వారానే వివాదాలు లేవదీయాలనడం ఏ విధంగా న్యాయం? సమ్మెకు పిలుపిచ్చే హక్కు కూడా వారికి మాత్రమే ఉంటుందంటే కార్మికులకు అన్ని అన్యమార్గాలూ మూసేయడమే కాదా?

సమ్మె హక్కును అన్నిరకాలుగానూ కట్టుదిట్టం చేసేసి సంప్రదింపులు, మధ్యవర్తిత్వాలకు మూడు అంచెలు నిర్దేశించి వాటి ద్వారానే అన్ని వివాదాలూ పరిష్కారం కావాలనీ ఆఖరుగా మాత్రమే కోర్టుకు పోవాలనీ కమిషన్ అంటుంది. సంప్రదింపులలోనూ మధ్యవర్తిత్వంలోనూ యాజమాన్యం చిత్తశుద్ధితో వ్యవహరించకపోతే వారిపైన ఒత్తిడిపెట్టే మార్గం కార్మికులకు ఏముంది? మన దేశంలో పారిశ్రామిక వివాదాలు ఎక్కువగా కోర్టుకు పోతున్నాయని కమిషన్ వాపోయిందిగానీ దానికి కారణ మేమిటో విశ్లేషించలేదు. కోర్టుల మీద కార్మికులకు మోజు ఉండడం దానికి కారణం కాదు. కోర్టు లంటే వకీళ్లకు తప్ప వేరే ఎవ్వరికీ మోజు ఉండే అవకాశం లేదు. సంప్రదింపులు, చర్చలు, మధ్యస్తాలంటే యాజమాన్యాలకు ఉండే తృణీకార భావం వల్ల వివాదాలు కోర్టుకు పోతున్నాయి. కోర్టుతో ఒక సౌకర్యం ఏమిటంటే ఇరుపక్షాలూ హాజరు కావడం కోసం అది అనంతంగా ఎదురు చూస్తూ కూర్చోదు. కొంత అవకాశం ఇచ్చిన తరువాత ఎక్స్–పార్టీ అవార్డు జారీచేసే అధికారం కోర్టుకు ఉంది. మధ్యస్తంలో అది సాధ్యం కాదు. మధ్యస్తమంటేనే ఇరువురూ ఒప్పుకున్న పరిష్కారా నికి అక్షరరూపం ఇవ్వడం అని అర్థం. కాబట్టి దానిలో ఎక్స్‌పార్టీ అవార్డులుండవు. బలవంతులయిన పక్షాన్ని రప్పించడానికి బలహీనుల వద్దగానీ మధ్యస్తం చేసే అధికారి దగ్గర గానీ ఏ అస్త్రం లేనప్పుడు

అది విఫలం కాక తప్పదు. మధ్యస్తాలకూ కోర్టు కేసుకూ మరొక తేడా కూడా ఉంది. అసమానుల మధ్య మధ్యస్తమంటే అర్థం బలహీనులను రాజీపడమని ఒత్తిడి పెట్టడమే. మధ్యస్తాలలో ఎక్కువ భాగం అదే జరుగుతుంది. ఈ రాజీకి ఏ సూత్రాలూ వర్తించవు. ఒత్తిడే దాని ఏకైక సూత్రం. కోర్టులో వేరే అవలక్షణాలు ఎన్ని ఉన్నా అది రాజీపడమని ఒత్తిడి పెట్టదు. ఆమోదం పొందిన న్యాయసూత్రాల ప్రకారం మంచో చెడో ఒక తీర్పు ఇస్తుంది.

కార్మికులు సంఘటితపడి ద్వైపాక్షిక చర్చలలో తమ సమస్యలు సమర్థంగా పరిష్కరించుకోవాలనీ, బలహీనపడుతున్న కార్మిక సంఘాలను ఇందుకోసం బలోపేతం చేయాలనీ రెండవ లేబర్ కమిషన్ తన నివేదికలో ఒకటికి రెండుచోట్లు అన్నప్పటికీ, వారు పారిశ్రామిక మధ్యస్తాలకు సంబంధించిన ఒక పార్శ్వాన్ని అసలే చూడకపోవడం వల్ల చాలా నష్టకరమయిన వ్యవస్థను సూచించారు.

## అసంఘటిత రంగం:

ఇక అసంఘటితరంగ కార్మికుల కోసం రెండవ లేబర్ కమిషన్ డిజైన్ చేసిన 'గొడుగు'ను పరామర్శిద్దాం.

'సంఘటిత రంగం', 'అసంఘటిత రంగం' అనేవి ఏ చట్టంలోనూ నిర్వచించిన మాటలు కావు. అవి వ్యవహారంలో పుట్టుకొచ్చిన మాటలు. కార్మికుల సంఖ్య కొంచెం ఎక్కువ ఉండి, ఉద్యోగ భద్రత కొంచెం ఉండి, సాంకేతిక స్థాయి ఆధునికంగా ఉండి, యజమాని అనే వాడొకడు స్పష్టంగా ఉండి, జీతాలు కొంత మెరుగ్గా ఉండి, యూనియన్లు ఉండి, కార్మిక సంక్షేమ చట్టాలు ఎప్పుడూ కాకున్నా అప్పుడప్పుడయినా అమలవుతూ ఉండే సంస్థలను 'సంఘటిత రంగం' అనీ, ఈ లక్షణాలు కొన్ని గానీ, అన్నీ గానీ లేని సంస్థలను లేదా ఉపాధి ప్రక్రియలనూ 'అసంఘటిత రంగం' అనీ వ్యవహరిస్తారని స్థూలంగా చెప్పుకోవచ్చు.

సంఘటిత రంగంలో పనిచేసే కాంట్రాక్ట్ కార్మికులనూ క్యాజువల్ కార్మికులనూ అసంఘటిత రంగ కార్మికులుగా లెక్కించడం జరుగుతున్నది. వీరేకాక ఇంకా చాలారకాల శ్రామికులు 'అసంఘటితం' నిర్వచనం కిందికి వస్తారు. ఒక జాబితా తయారు చేయడమే కష్టం. వీరికి యూనియన్లు ఉండవు, ఉద్యోగ భద్రత ఉండదు, కార్మిక సంక్షేమ చట్టాలు కొన్ని వర్తించవు, వర్తించేవి అమలు కావు, అమలు చేయించుకునే మార్గాలు అందుబాట్లో ఉండవు. జీతాలు (లేక సంపాదన) చాలా తక్కువ స్థాయిలో ఉండడమే కాక వాటిలో క్రమబద్ధమైన పెరుగుదల ఏదీ ఉండదు. తరుగుదల ఉండదన్న భరోసా ఉండదు. అనారోగ్యం, స్త్రీలయితే కాన్పులు, పనిస్థలంలో ప్రమాదాలు మొదలయిన కారణాల వల్ల వైద్య సహాయం అవసరమయితే దానిని కల్పించే వ్యవస్థ లేదు. అటువంటి సమయాలలో 'వేతనంతో సెలవు' పొందే అవకాశం లేదు. యజమాని అనే వాడెవడయినా ఉంటే వాడితో వేతన ఒప్పందాలు ఉండవు, ప్రభుత్వమే దయదలచి ఏవైనా జీవోలు జారీచేసినా అవి అమలుకావు.

అసంఘటిత రంగంలో కొందరికి యజమాని ఎవడనేది స్పష్టంగా ఉండదు. కొందరికి యజమానే ఉండదు. కార్మిక సంక్షేమ చట్టాలు చాలావరకు యజమాని – ఉద్యోగి అన్న సంబంధాన్ని ఆశ్రయించి ఉంటాయి. అందువల్ల వాటిని అసంఘటిత రంగానికి అన్వయించాలన్నా కష్టమే. సొంత రిక్షా పెట్టుకున్న రిక్షా కార్మికులు, సొంత షాపు పెట్టుకున్న మంగలులు, పది ఇళ్ళ నుంచి బట్టలు తెచ్చి ఉతికే చాకలులు, సొంత పడవ, వలలు పెట్టుకొని చేపలు పట్టే మత్స్యకారులు, ఊరందరి పశువులు మేపుకొచ్చే పశువుల కాపర్లు, పది ఇళ్ళలో అంట్లుతోమే పనిమనుషులు, ఏరోజు ఏ రైతు పిలిస్తే ఆ రోజు అతని పొలంలో పనిచేసే వ్యవసాయ కూలీలు, తాము లైసెన్స్ పొందిన చెట్టెక్కి కల్లుతీసి చెట్టుకిందే అమ్మే గీత కార్మికులు, పట్టణాలలో అడ్డామీద నిలబడి ఏ బిల్డింగ్ కాంట్రాక్టర్ పిలిస్తే అతనితో పోయి తాపీపనో తట్టలు మోసే పనో చేసే పట్టణ ప్రాంత కూలీలు, కమిషన్ ఏజెంటు దగ్గర బీడీ ఆకు, పొగాకు తీసుకొని బీడీలు చుట్టి కంపెనీకి అప్పగించే బీడీ కార్మికులు, పట్టణాలలో తోపుడు బండ్ల మీద వందరకాల సరుకులు అమ్ముకుంటూ తిరిగే చిల్లర బేరగాళ్లు, రోడ్డు పక్కన చిత్తుకాగితాలు, పాత సీసాలు, ఇనప తుక్కు ఏరి వర్తకులకు అమ్ముకొని బతికేవారు – వీరంతా యజమాని లేని, లేక యజమాని ఫలానా అని స్పష్టంగా తెలీని అసంఘటిత కార్మికులు. వీళ్లకు జీతం, డిఏ, ప్రావిడెంట్ ఫండ్, ప్రసూతి సెలవు, ఆరోగ్య భద్రత, గ్రాట్యుటీ, వేతనంతో సెలవు మొదలైన హక్కులను అర్థవంతంగా కల్పించాలంటే ఇప్పుడున్న కార్మిక సంక్షేమ చట్టాల స్వరూపమే మార్చవలసి ఉంటుంది.

అసంఘటిత రంగంలో కొందరికి ఇప్పటికే ప్రత్యేకమైన చట్టాలు రూపొందించారు. బీడీ కార్మికులకు, బిల్డింగ్ కార్మికులకు, హమాలీలకు, కాంట్రాక్ట్ కార్మికులకు వేరు వేరు సంక్షేమ చట్టాలున్నాయి. ఆయా రంగాల నిర్దిష్టతను దృష్టిలో ఉంచుకొని తయారుచేసిన చట్టాలివి. అటువంటి చట్టాలే రిక్షా కార్మికులకు, ఇళ్ళల్లో పనిమనుషులకు, చాకలి, మంగలి తదితర వృత్తుల వారికి, ఇతర అసంఘటిత కార్మికులకు రూపొందించినట్టయితే చాలా ఉపయోగకరంగా ఉండేది. ఆ కోణం నుంచి ప్రభుత్వం మీద కార్మిక ఉద్యమం ఎన్నడూ ఒత్తిడి పెట్టలేదు. పెట్టకపోవడానికి కారణం భారత కార్మికోద్యమంలోని ప్రధాన బలహీనత: అది సంఘటిత రంగ కార్మికోద్యమమే తప్ప కార్మికులందరి ఉద్యమం కాదు. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వానికి అసంఘటిత కార్మిక వర్గం గుర్తుకు రావడానికి కారణం వారి మీద ప్రేమ కాదు. సంఘటిత రంగాన్ని అసంఘటితం చేసే విధాన మార్పులు ఆ రంగంలోని కార్మికులకు, వారి యూనియన్లకూ, సామాజిక ప్రజాభిప్రాయానికీ మింగుడు పడాలంటే అసంఘటిత రంగానికి కొంత కనీస భద్రత కల్పించడం అవసరం. అందుకే అసంఘటిత రంగంలోని ఒక్కొక్క వర్గాన్నీ విడిగా పరిశీలించి వారి వారి పరిస్థితులకు తగిన సంక్షేమ చట్టాన్ని రూపొందించమని రెండవ లేబర్ కమిషన్‌ను కోరకుండా, టోకున కొంత కనీస భద్రత కల్పించే సూచనలు ఇమ్మని కోరింది.

కమిషన్ తన నివేదికలో అసంఘటిత రంగ కార్మికుల జీవిత పరిస్థితుల గురించి వివరంగానే చర్చించింది. తమ అవగాహన, సానుభూతి చూపించింది. ఈ మధ్య ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న చర్చలను లెక్కలోకి తీసుకొని సెక్స్ వర్కర్స్‌ను కూడా అసంఘటిత కార్మికులుగా భావించి వారి సమస్యలను ప్రస్తావించింది. (అయితే గృహిణులు చేసే ఇంటి పనిని అసంఘటిత శ్రమలో లెక్కించలేదు).

1991 జనాభా లెక్కలలో భారతదేశ జనాభాలో 34 కోట్ల మంది కార్మికులుగా తమను తాము నమోదు చేసుకున్నారని కమిషన్ అంటుంది. వారిలో 90.6 శాతం మంది అసంఘటిత రంగానికి చెందినవారు. వ్యవసాయం, అటవీ ఉత్పత్తులు, తోటలు, చేపల వేటలలో పనిచేసే 19.1 కోటి మందిలో 19.0 కోటి మంది (అంటే 99.2 శాతం) అసంఘటిత రంగ కార్మికులు. పారిశ్రామిక

ఉత్పత్తి రంగంలోని 2.89 కోట్ల కార్మికులలో 2.16 కోట్లు (అంటే 75 శాతం) అసంఘటిత కార్మికులు. బిల్డింగులు, రోడ్లు మొదలయిన కట్టడపు పనులలో ఉన్న కార్మికులలో 78 శాతం, వర్తక వాణిజ్య రంగంలోని కార్మికులలో 98 శాతం, రవాణా ప్రసార రంగాలలో 61.5శాతం అసంఘటిత కార్మికులు.

ఈ గణాంకాలు సమస్య పరిమాణాన్ని సూచిస్తాయి. కానీ ప్రభుత్వం రెండవ లేబర్ కమిషన్‌ను సూచించమని కోరిన పరిష్కారం పరిధి చాలా చిన్నది. కమిషన్ అసంఘటితరంగాన్ని విహంగ వీక్షణం చేసి అందులోని కార్మికుల సమస్యలను క్లుప్తంగా ఏకరువు పెట్టి కొంచెం ఆవేశపడి 'రాజ్యాంగాన్ని ప్రకటించిన యాభై ఏళ్ల తరువాత కూడ దేశ శ్రామిక జనాభాలో 90 శాతానికి హామీ ఇచ్చిన హక్కులకు భరోసా కల్పించలేకపోతున్నామంటే మనం చెప్పేదానికీ చేసేదానికీ పొంతన లేదని అనడంలో తప్పులేదు' అంటుంది.

అయితే తాను మాత్రం చేయమన్న పనికి పరిమితమయిన సూచనలు మాత్రమే చేసింది. టోకున కనీస భద్రత కల్పించడానికి కమిషన్ చేసిన ప్రధాన సూచన అసంఘటిత రంగ శ్రామికులకు సంక్షేమ నిధి లేక నిధులు ఏర్పాటు చేయడం. అసంఘటిత రంగ శ్రామికులందరూ తమ పేర్లు వగైరా కార్మిక శాఖ వద్ద నమోదు చేసుకుంటారు. అందరికీ గుర్తింపు కార్డులు ఇస్తారు. వారి వేతనం, లేక సంపాదన నుంచి కొంత, యజమాని అనేవాడు ఉంటే వాడి ఆదాయం నుంచి కొంత, ప్రభుత్వ బడ్జెట్ నుంచి కొంత, ఆయా రంగాల వర్తక వాణిజ్య పారిశ్రామికవేత్తల నుంచి పన్నురూపంలో కొంత సేకరించి ఒక సంక్షేమ నిధి (లేక నిధులు) నెలకొల్పుతారు. అదే అసంఘటిత కార్మిక రంగానికి అందియ్యబోయే గొడుగు. నిరుద్యోగ భృతి, ప్రసూతి సహాయం, గ్రాట్యుటీ, అనారోగ్య భృతి, వృత్తిలో తగిలే గాయాలకు, కలిగే అనారోగ్యానికి నష్టపరిహారం – అన్నీ ఈ నిధి నుంచే పొందుతారు.

కేరళ రాష్ట్రం ఇటువంటి నిధులు దాదాపు 30 నిర్వహిస్తున్నది. అసంఘటిత రంగ కార్మికుల సమస్యల మీద దృష్టిపెట్టి తగు చర్యలు చేపట్టిన రాష్ట్రాలలో కేరళ ప్రథమం. (మహారాష్ట్ర హమాలీల హక్కులు, భద్రత విషయంలో మంచి వ్యవస్థను రూపొందించింది – అసంఘటిత రంగ కార్మికులకు ఏమీ చేయని రాష్ట్రాలలో మనది ఒకటి). అదే స్ఫూర్తితో రెండవ లేబర్ కమిషన్ పై ఆలోచన చేసింది.

దానిని వ్యతిరేకించవలసిన అవసరమేమీ లేదుగానీ, ఈ సంక్షేమ నిధి పరిధిలోకి రాని విషయాలు చాలా ఉన్నాయి. వేతనాలు (లేక ఆదాయం), పని స్థలంలో భద్రత వీటిలో రెండు. యజమాని – ఉద్యోగి సంబంధం ఎక్కడున్నా అక్కడ కనీస వేతనాల చట్టం అమలవుతుంది. దానికి సంఘటితం – అసంఘటితం అన్న తేడా లేదు. అయితే అసంఘటిత రంగానికి సంబంధించిన కనీస వేతనం జివోలు అమలుకావడం చాలా కష్టం. వాటిని అమలు చేయించుకునే ప్రయత్నమే కార్మికులకు దుస్సాహసంగా కనిపిస్తుంది. యజమాని అనేవాడు స్పష్టంగా లేనిచోట ఒక కనీస ఆదాయ ప్రమాణాన్ని నిర్వచించి దానిని నిలబెట్టే ప్రయత్నమూ అవసరమే. అది ఒక్కొక్క రంగంలోనూ ఒక్కొక్క రకంగా ఉండవలసి ఉంటుంది. పని స్థలంలో ఆరోగ్యం, భద్రతల విషయమూ అంతే. ప్రస్తుతమున్న చట్టాలు ఫ్యాక్టరీలకూ గనులకూ మాత్రమే వర్తిస్తాయి. అసంఘటిత రంగంలో కూడ శారీర అవయవాలకు అపాయం కలిగించే ప్రమాదాలకు తావు ఉంటుంది. అంతకంటె



ఎక్కువగా వృత్తి రోగాలకు (ఆక్యుపేషనల్ డిసీజస్) అవకాశం ఉంటుంది. వాటి గురించి అవగాహన లేదు, జాగ్రత్తలు తెలియవు.

రెండవ లేబర్ కమిషన్ కనీసం ఈ రెండు విషయాలలోనయినా నిర్దిష్టమైన సూచనలు చేసి ఉండవలసింది. ప్రభుత్వం నిర్దేశించిన 'కనీస రక్షణ'లో ఇవి భాగం కాదని ఎందుకు అనుకోవాలి? ఆ కనీస రక్షణను సంక్షేమ నిధికి కుదించి వేయడం ద్వారా, ప్రభుత్వం ఏ కారణంగా అసంఘటిత రంగానికి కొంత రక్షణ కల్పించాలని భావించిందో, దానికే – అంటే సంఘటిత రంగం నుంచి అసంఘటిత రంగంలోకి నెట్టివేస్తున్న కార్మికులకు కొంత ఉపశమనం కలిగించే కర్తవ్యానికే – కమిషన్ తన ప్రయత్నాన్ని పరిమితం చేసినట్టయింది. ఇంకొంచెం విశాలంగా ఆలోచించినట్టయితే అసంఘటిత రంగంలో ముందు నుంచీ ఉన్న సమస్యలకు కొంతమేరకయినా పరిష్కారం దొరికినట్టయి ఉండేది. కమిషన్ అసంఘటిత రంగ కార్మికుల సమస్యల గురించి చేసిన సవివరమయిన సమీక్షలో ఆ స్పృహ కనిపిస్తుందిగానీ సూచనల దగ్గరికొచ్చేసరికి పాలకుల అవసరాలకే కమిషన్ ఆలోచనలు పరిమితం అయ్యాయి.

C

# కరువులు ఎందుకు వస్తాయి?

–యం.కోదండరామ్ *

**క**రువు వర్షాభావం వలన వచ్చినా కరువు ప్రభావం ప్రభుత్వాలు అనుసరించే విధానాలను బట్టి మారుతుంటుంది. ప్రభుత్వాలు ప్రజలకు కనీస వసతులను ఒక హక్కుగా కల్పించినచోట కరువు ప్రభావం అంతగా కనిపించదు. కానీ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన చోట కరువు వలన తినడానికి తిండి, తాగడానికి నీరు లేకుండా బాధపడుతున్నారు. ఈ పరిస్థితికి నేటి ఆంధ్ర ప్రదేశ్ ఒక సాక్ష్యం.

1995లో చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తరువాత ఆర్థిక సంస్కరణలను ప్రవేశపెట్టారు. అప్పటినుంచి సంక్షేమ విధానాలను రద్దుచేసి ప్రైవేటు రంగాన్ని పెంపొందించే బాధ్యతలను మాత్రమే నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే నేడు నెలకొన్న కరువును అర్థం చేసుకోవాలి. అయితే సరళీకరణ విధానాల ప్రభావాన్ని చూసే ముందు ఆర్థికాభివృద్ధి పేరుతో అంతకు ముందు ప్రభుత్వాలు అనుసరించిన విధానాల వలన తలెత్తిన పరిణామాలను పరిగణనలోనికి తీసుకోవాలి.



* మానవహక్కుల కార్యకర్త, ఉస్మానియా యూనివర్శిటీలో అధ్యాపకులు



మన రాష్ట్రంలో 1980ల దాకా సాగునీటి సౌకర్యాన్ని పెంపొందించడానికి, నిలబెట్టడానికి చాలా కృషి జరిగింది. దిగువ పట్టికను పరిశీలిస్తే వివిధ ప్రణాళికల్లో సాగునీటి సౌకర్యాన్ని పెంపొందించడానికి ప్రభుత్వం చేసిన ఖర్చు తెలుస్తుంది.

## ప్రణాళికా వ్యయంలో ఇరిగేషన్‌కైన ఖర్చు

(కోట్ల రూపాయలలో)

| 1 | 2 | 3 | 4 | |
|---|---|---|---|---|
| ప్రణాళిక | భారీ, మధ్యతరహా | మైనర్ ఇరిగేషన్ | మొత్తం | శాతం |
| మొదటి ప్రణాళిక 1951-56 | 37.47 | 3.52 | 40.99 | 22 |
| రెండవ ప్రణాళిక 1956-61 | 57.43 | 4.38 | 61.81 | 34 |
| మూడవ ప్రణాళిక 1961-66 | 91.52 | 18.60 | 110.12 | 34 |
| మూడు వార్షిక ప్రణాళికలు | 60.87 1966 | 10.81 -69 | 71.68 | 32 |
| నాల్గవ ప్రణాళిక 1969-74 | 118.71 | 18.15 | 136.86 | 26 |
| ఐదవ ప్రణాళిక 1974-78 | 269.11 | 38.82 | 307.93 | 30 |
| వార్షిక ప్రణాళికలు 1978-80 | 257.69 | 23.79 | 281.48 | 30 |
| ఆరవ ప్రణాళిక 1980-85 | 729.59 | 50.73 | 780.32 | 27 |
| ఏడవ ప్రణాళిక 1985-90 | 1306.40 | 131.40 | 1437.80 | 25 |
| వార్షిక ప్రణాళిక 1990-91 | 282.75 | 63.23 | 345.98 | } |
| వార్షిక ప్రణాళిక 1992-92 | 333.92 | 57.93 | 391.85 | 21 |
| ఎనిమిదవ ప్రణాళిక | 2754.35 | 431.56 | 3185.91 | 23 |

| | | | | |
|---|---|---|---|---|
| 1992-97 | | | | |
| 1997-98 | 662.77 | 121.57 | 784.34 | 24 |
| 1998-99 | 642.26 | 194.45 | 836.71 | |
| 1999-2000 | 962.99 | 170.61 | 1133.60 | |
| **మొత్తం** | **8567.83** | **1339.55** | **9907.38** | |

**(13.52%)**

ఈ పెట్టుబడుల ఫలితంగా సుమారు 20 లక్షల హెక్టార్ల భూమి భారీ ప్రాజెక్టుల కింద సాగులోకి వచ్చింది. 1980దాకా ఈ వ్యయం 30 శాతం దాకా ఉండేది. ఆ తర్వాతే తగ్గింది. 1980 తర్వాత కొత్త ప్రాజెక్టులేవీ రాష్ట్రంలో రాలేదు. అంతకు ముందు చేపట్టిన ఈ ప్రాజెక్టులకే డబ్బు కేటాయించారు. ఈ మొత్తం వ్యయానికి ప్రధానంగా ఒక పరిమితి ఉన్నది. ఈ పెట్టుబడుల వలన అత్యధిక ఫలితం కోస్తా ఆంధ్రకే దక్కింది. కోస్తా ఆంధ్రలో సాగునీటి సౌకర్యం గల ప్రతి వంద ఎకరాలలో 60 ఎకరాలకు కాలువల కింద పారకం ఉన్నది. రాయలసీమలో సాగునీటి సౌకర్యం గల భూమిలో 20 శాతం భూమికే కాలువల నుంచి నీళ్ళందుతున్నాయి. ఇక తెలంగాణలో 19 శాతం సాగునీటి సౌకర్యం గల భూమి మాత్రమే కాలువల కింద సేద్యమౌతున్నది.

పై పట్టికను చూస్తే ఇంకొక విషయాన్ని కూడా గమనించవచ్చు. సాగునీటి సౌకర్యం కల్పించడానికి ప్రభుత్వం చేసిన కేటాయింపుల్లో సుమారు 90 శాతం భారీ ప్రాజెక్టుల మీదే ఖర్చయింది. ప్రభుత్వం 10 శాతం మొత్తాన్ని మాత్రమే చిన్ననీటి పారుదల సౌకర్యాల కొరకు కేటాయించింది. ప్రభుత్వ నిరాదరణ వలన చిన్న నీటిపారుదల వ్యవస్థ చితికిపోయింది. రాయలసీమలో1960 నాటికి సాగునీటి సౌకర్యం గల ప్రతి 100 ఎకరాలలో 50 ఎకరాలకు, తెలంగాణలో ప్రతి 100 ఎకరాలలో 63 ఎకరాలకు చెరువుల నుంచి నీరందేది. శతాబ్దాంతానికి చెరువుల కింద పారకం పూర్తిగా తగ్గిపోయింది.

రాయలసీమలో 9 శాతం, తెలంగాణలో 18 శాతం మాత్రమే చెరువుల కింద సాగవుతున్నది. చెరువులు క్షీణించి, కాలువల కిందా నీరు అందకపోవడం వలన ఈ ప్రాంతాల్లో రైతులు సాగునీటికై బావులపై ఆధారపడుతున్నారు. తెలంగాణలో బావుల కింద పారకం 1960-2000 మధ్యకాలంలో 18 శాతం నుంచి 63 శాతానికి పెరిగింది. ఇక రాయలసీమలో ఈ సంఖ్య 27 శాతం నుంచి 70 శాతానికి పెరిగింది.

ఈ విధంగా బావుల కింద పారకం పెరగడం వలన రెండు సమస్యలు తలెత్తాయి. మొదటిదేమిటంటే బావుల కొరకు రైతులే పెద్ద మొత్తంలో పెట్టుబడి పెట్టవలసి వచ్చింది. అయినా ఫలితం దక్కలేదు. ఎందుకంటే కాలువలు, చెరువులు లేకుండా భూగర్భ జలం పెంపొందదు. కాబట్టి బావుల్లో నీళ్ళు రావాలంటే చెరువులూ, కాలువలూ ఉండి తీరాలి. ఇవిలేకపోతే భూగర్భ జలం ఊట పెరగదు. బావులు ఎండిపోతాయి. ఇవ్వాళ తెలంగాణ, రాయలసీమల సాగునీటి సంక్షోభానికి, నీటి ఎద్దడికి ఈ పరిస్థితే ప్రధాన కారణం. బావుల సంఖ్య, వాటి కింద పారకం దిగువ పట్టికలో చూడవచ్చు.



## తెలంగాణ జిల్లాలలో బావుల సంఖ్య

| | 1979-80 | 1984-85 | 1989-90 | 1992-93 | 1997-98 | 2000-01 |
|---|---|---|---|---|---|---|
| మహబూబ్‌నగర్ | 61479 | 78265 | 84214 | 104422 | 125661 | 125155 |
| రంగారెడ్డి | 21375 | 48625 | 33043 | 45919 | 51041 | 57548 |
| మెదక్ | 50924 | 73919 | 75448 | 119220 | 61896 | 91700 |
| నిజామాబాద్ | 42710 | 56906 | 55222 | 60146 | 105377 | 121879 |
| ఆదిలాబాద్ | 15851 | 21589 | 21612 | 28771 | 33830 | 31557 |
| కరీంనగర్ | 158475 | 210336 | 163155 | 172603 | 180094 | 224956 |
| వరంగల్ | 127199 | 218271 | 154583 | 237653 | 186106 | 187611 |
| ఖమ్మం | 16665 | 28150 | 23520 | 34598 | 40525 | 41184 |
| నల్లగొండ | 64100 | 74456 | 93622 | 95273 | 129983 | 142823 |

బావుల నుంచి పారకం పెరుగుతున్న కాలంలోనే భూ సంబంధాలలోనూ మార్పులు వచ్చాయి. 1970ల తరువాత చిన్న, సన్నకారు రైతుల సంఖ్య, వాళ్ళ అధీనంలోని భూమి పెరిగింది. మొత్తం సాగుభూమిలో 1970-71లో 38 శాతం భూమి మాత్రమే చిన్న, సన్నకారు రైతుల అధీనంలో ఉండగా 1990-91 నాటికి అది 61 శాతానికి పెరిగింది. 1980 దశకం చివరి నాటికి పెద్దగా పెట్టుబడి అవసరం లేని జొన్నలు, సజ్జలు, రాగులు, మక్కలు, ఆముదాలు, నువ్వులు వంటి వర్షాధార తృణధాన్యాలు పుష్కలంగా పండేవి. అందుకని చిన్న రైతులకు కూడా అటు తిండికి, ఇటు పశువుల మేతకు సమస్య ఉండేది కాదు. కానీ భూమిలో తేమ లేక, ఆహారపు అలవాట్లలో వచ్చిన మార్పుల వలన తృణ ధాన్యాలకు గిట్టుబాటు ధరలు లేక చిన్న, సన్నకారు రైతుల వ్యవసాయ పద్ధతులు ఆటుపోట్లకు లోనయ్యాయి.

ఈ పరిస్థితిలోనే ఆదాయాన్ని పొందడానికి ప్రధానంగా వ్యాపార పంటలను వేయవలసి వస్తున్నది. ఆ పంటల నుంచి నిలకడైన ఆదాయాన్ని పొందడానికి సాగునీటి ఏర్పాట్లను కల్పించక తప్పదు. అదే బావుల సంఖ్య పెరగడానికి తోడ్పడింది. పెద్దయెత్తున జరిగిన బోర్ల తవ్వకానికైన ప్రభుత్వ బ్యాంకుల నుంచి దొరికిన రుణం కాదు. ప్రైవేటుగా వడ్డీకి తెచ్చారు. ఆవిధంగా రైతు అప్పుల వలలో చిక్కుకున్నాడు. బావి తవ్వడానికయ్యే ఖర్చులే తలకు మించిన భారంగా ఉండగా దానికి బావి నుంచి నీరు తోడడానికయ్యే ఖర్చు కూడా తోడైంది. మోటారు కొనాలి. కరెంటు కనెక్షనుకు పైసలు కట్టాలి. ఇంకా లిస్టు పూర్తికాలేదు. స్తంభాలకు, తీగలకు, ట్రాన్స్‌ఫార్మర్ల కోసం విద్యుత్తు బోర్డుకు డబ్బులు సమకూర్చాలి. తడిసి మోపెడన్నట్లు, వీటికితోడు కరెంటు బిల్లు, కరెంటు మోటారు రిపేర్లకయ్యే ఖర్చులు.

ఈ సమయంలోనే సంస్కరణల యుగం మొదలైంది. ప్రభుత్వం అదనంగా పెట్టుబడులు పెట్టి వ్యవసాయ రంగాన్ని పునరుద్ధరించే బదులు సంస్కరణల్లో భాగంగా అసలు పెట్టుబడులనే నిలిపేసింది. ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ రంగంలో పెట్టుబడుల వృద్ధిరేటు తగ్గిపోయింది. వివరాలను దిగువ పట్టికలో చూడవచ్చు.

## పెట్టుబడుల వృద్ధిరేటు

| | 1980-90 | 1990-2000 |
|---|---|---|
| పబ్లిక్ పెట్టుబడుల వృద్ధిరేటు | 8.5 | 1.4 |
| ప్రైవేటు పెట్టుబడుల వృద్ధిరేటు | 4.7 | -3.8 |
| **మొత్తం** | **6.6** | **-1.1** |

1990 దశకంలో వ్యవసాయ రంగంలో పెట్టుబడులు తగ్గిపోయామని స్పష్టంగానే కనబడుతున్నది. పరిస్థితి విషమించినా ప్రభుత్వం వ్యవసాయానికి కేటాయింపులను పెంచడం లేదు.

గ్రామీణ, సహకార బ్యాంకుల నుంచి రుణ సౌకర్యాలు తగ్గిపోతున్నాయి. అప్పు చెల్లించగల సామర్ధ్యం గలవారికో రుణాలు ఇవ్వాలని, వచ్చిన వడ్డీతోనే జీతభత్యాల ఖర్చులను భరించాలని ఈ సంస్థలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సరళీకరణ విధానాలలో భాగంగా ఆదేశించాయి. అందుకని వీటి నుంచి రైతులకు ఏ సహాయమూ అందడంలేదు. మొత్తం రుణ అవసరాలలో 10 శాతం మాత్రమే బ్యాంకులు అందించగలుగుతున్నాయి.

ఈ పరిస్థితిలో పెరుగుతున్న పెట్టుబడికి గాను దొరికిన చోటల్లా అప్పు చేస్తున్నారు రైతులు. అయినా నీళ్ళు లేక పెట్టిన పెట్టుబడి కూడా రావడంలేదు. తృణధాన్యాలు గిట్టుబాటు కాకపోవడం వలన, వాటి స్థానంలో కొత్త పంటలను లాభసాటిగా పండించే అవకాశమూ లేక రైతులు భూమిని సాగుచేయడంలేదు. పడావు ఉంచుతున్నారు. ఈ నేపథ్యంలోనే రాష్ట్రంలో పడావు భూమి పెరిగింది. తెలంగాణలోనే గత పది సంవత్సరాల కాలంలో 15 లక్షల ఎకరాలు బీడుపడిపోయింది. ఫలితంగా ఆహార ధాన్యాల ఉత్పత్తిలో పెరుగుదల లేదు.

సాగుభూమి తగ్గి, సాగునీటి సౌకర్యాలు క్షీణించి పంట దిగుబడి తగ్గిపోతున్న తరుణంలో ఈసారి కరువు వచ్చింది. సరిగ్గా ఈ పరిస్థితిలోనే ప్రభుత్వం కూడా వ్యవసాయ రంగం నుంచి పూర్తిగా ఉపసంహరించుకొన్నది.

సరళీకరణ విధానాలలో భాగంగానే తెలుగుదేశం ప్రభుత్వం నూతన వ్యవసాయ విధానాన్ని రూపొందించింది. ఈ విధానం మూలసూత్రాలు ప్రపంచ వాణిజ్య సంస్థ పట్ల తెలుగుదేశం వ్యక్తం చేసిన అభిప్రాయాలలోనే స్పష్టమయ్యాయి. ప్రపంచ వాణిజ్య సంస్థ ఏర్పడిన తరువాత, వ్యవసాయ ఉత్పత్తులు, ఎగుమతులు, దిగుమతులపై ఆంక్షలు సడలించిన తరువాత తెలుగుదేశం పార్టీ విదేశీ దిగుమతులను ఆపాలని అడగలేదు. అంతర్జాతీయ మార్కెట్లలో పోటీపడి వ్యవసాయోత్పత్తులను అమ్ముకోగలగాలన్నది. నాణ్యమైన, చవకైన ఉత్పత్తులను సాధించాలంటే పెట్టుబడులు పెరగాలని గుర్తించింది. కాని వ్యవసాయ రంగంలో పెట్టుబడులు ప్రైవేట్ రంగం నుండే రావాలని తెలుగుదేశం భావిస్తున్నది. ఈ అంశాన్నే వ్యవసాయ విధాన పత్రంలో విశదీకరించింది.

విధాన పత్రం ప్రకారం ప్రైవేటు రంగమంటే కేవలం పారిశ్రామికవేత్తలే. వారు వ్యవసాయోత్పత్తుల మార్కెటింగులో ప్రవేశించాలన్నది తెలుగుదేశం అభిమతం. అలా ప్రవేశించేవారు వ్యవసాయోత్పత్తులను కొంటారు. వాటిని పొడి చేసో, ఎండబెట్టో, ద్రావకంగా మార్చివేసో డబ్బాలలో నింపో లేక ఇతర వస్తువులుగా మార్చివేసో అమ్ముకుంటారు. కాబట్టి రైతులకు పెట్టుబడి పెట్టి, సాంకేతిక పరిజ్ఞానం అందించి – కేవలం తమ వ్యాపార ప్రయోజనాల రీత్యా – నాణ్యమైన



ఉత్పత్తులను పొందడానికి ప్రయత్నిస్తారు. ఉత్పత్తి ప్రక్రియ పారిశ్రామిక రంగానికి అనుసంధానమవుతుంది. పారిశ్రామిక రంగం నుంచి వ్యవసాయ రంగానికి పెట్టుబడులు ప్రవేశిస్తాయి. కేవలం తమ ప్రయోజనాల కొరకు పారిశ్రామిక రంగం నాణ్యమైన విత్తనాలను, కల్తీలేని మందులను రైతులకు అందుబాటులోకి తెలుస్తుంది. ఎందుకంటే అలా చేయడం వలన పారిశ్రామిక రంగం నాణ్యమైన ఉత్పత్తులను పొందుతుంది కనుక. కాబట్టి ప్రభుత్వ పెట్టుబడులు, సహాయం లేకుండానే వ్యవసాయ రంగం అభివృద్ధి చెందుతుందని ప్రభుత్వం తన విధాన పత్రంలో పేర్కొన్నది.

కాకపోతే వ్యవసాయాధారిత పరిశ్రమలకు అవసరమైన సదుపాయాలను ఏర్పాటు చేసే కర్తవ్యాన్ని మాత్రమే ప్రభుత్వం నిర్వహించ దలుచుకున్నది. శీతలీకరణ కేంద్రాల ఏర్పాటు, రోడ్ల నిర్మాణం ఈ కోవ కిందికి వస్తాయి. అయితే ఈ బాధ్యతలను కూడా ఎగుమతికి అవకాశం గల పంటలు పండగల ప్రాంతాలలోనే చేపట్టింది.

ఈ దృక్పథం వలన అసలు వ్యవసాయ రంగంలో పెట్టుబడులు పెంచాలన్న విధానం రూపొందే అవకాశమే లేదు. అందుకని వెనుకబడిన ప్రాంతాలలో సాగునీటి సౌకర్యాలు పెంపొందడానికి పెట్టుబడులు ప్రభుత్వం నుంచి ఇక రావు.

ఈ విధంగా ప్రభుత్వం తన బాధ్యతల నుంచి వైదొలగి, పెట్టుబడి తగ్గించుకోవడం వలన కరువున్న గ్రామాల్లో ఇప్పుడు ఇంతగా దుర్భర పరిస్థితులు ఏర్పడినాయి. ఈ పరిస్థితికి తార్కాణాలు ఏ గ్రామంలో చూసినా కనబడతాయి. కరువున్న ఏ ఊరికి పోయినా రెండు విషయాలను గమనించవచ్చు. మొదటిదేమంటే ఈ గ్రామాలలో కాలువలు లేవు. కాలువలు లేని గ్రామాల్లోనే ఈసారి కరువు ప్రభావం తీవ్రంగా ఉన్నది. గ్రామస్థులు గత 30 సంవత్సరాలుగా ఇటువంటి కరువు చూడలేదంటున్నారు. అయితే గతంలో కరువున్నా నీళ్ళుండేవి. ఈసారి నీళ్ళు కూడా దొరకడం లేదు.

ఏ గ్రామంలోనూ తినడానికి తిండి లేదు. ఈసారి చెరువుల్లోకి నీళ్ళు రాలేదు. కాబట్టి చెరువుల కింద సాగులేదు. వర్షాలు ఆగస్టు తర్వాత పడలేదు. కనుక వర్షాధార పంటలూ ఎండిపోయాయి. బోర్ల కింద కొంత పంటైనా వస్తుందని రైతులు ఆశపడ్డారు. కానీ అక్టోబర్ కల్లా మూడువంతుల బోర్లు ఎండిపోయాయి. మిగిలిన కొద్ది బోర్ల కిందనే ఇంతో అంతో సాగైంది. మామూలుగా వచ్చే పంటలో 10 శాతం పంట కూడా రాలేదు. ప్రభుత్వం నుంచి కూడా సహాయం అందలేదు. గతంలో ప్రభుత్వం రెండు రూపాయలకు కిలో బియ్యం చొప్పున కనీసంగా 25 కిలోల బియ్యం అందించేది. ఇప్పుడు రేషన్ బియ్యం రేటు పెరిగింది. ఒక కార్డు మీద 20 కిలోలకు మించి ఇవ్వడంలేదు. అందుకనే తిండి గింజల కొరత ఏర్పడింది.

పోనీ పనిచేసి కొనుక్కుందామన్నా ఏ గ్రామంలోనూ పనిదొరకడంలేదు. అందుకే పట్టణాలకు వలసపోతున్నారు కానీ వలసలు పెరిగి పట్టణాలలో కూడా పనులు దొరకడంలేదు. సంపాదించింది తిండికి కూడా చాలడంలేదు. వృద్ధుల పరిస్థితి మరీ దారుణం. వలస పోలేరు. ఊళ్ళో పని దొరకదు. తినడానికి తిండి లేదు. కనుకనే చాలామంది తిండి లేక చనిపోతున్నారు. పనిచేయగల రైతుల పరిస్థితి కూడా ఇలానే ఉన్నది. అప్పులు తీరక, తిండికి కొత్త అప్పు పుట్టకపోవడం వలన ఏర్పడిన సమస్యను తట్టుకోలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. గత 3-4 నెలల్లో ఏ జిల్లాలో చూసినా పదుల సంఖ్యలో ఆకలి చావులు, ఆత్మహత్యలు జరిగాయి.

సుప్రీంకోర్టు తిండికి కొరత లేకుండా చూడాలని రాష్ట్రాలను ఆదేశించడమే కాక, అందరికీ

తిండి లభించడానికి చేపట్టవలసిన చర్యలనూ సూచించింది. ఈ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వమూ పలు పథకాలను ప్రవేశపెట్టింది. పథకాలు బాగానే ఉన్నాయి. కానీ లాభం శూన్యం. ఎందుకంటే ఈ పథకాల వలన మొత్తం 10 శాతం అవసరాలు కూడా తీరడంలేదు.

మనుషుల అవసరాలే తీరడంలేదు. ఇక పశువులకు మేత ఎలా తేగలరు? మేత లేక పెద్ద సంఖ్యలో పశువులను అమ్ముకొంటున్నారు. ఆ విధంగా వారికున్న పెట్టుబడి కూడా తరిగిపోతున్నది.

నీళ్ళు లేకపోవడం వలన స్త్రీల పనిభారం విపరీతంగా పెరిగిపోతున్నది. గంటల తరబడి నీళ్ళు మోస్తున్నారు. ఏ ఊరికి పోయినా నీళ్ళ కోసం క్యూలు కనబడతాయి. కనుక మళ్ళీ వానలు పడగానే పరిస్థితి బాగైపోతుందని నమ్మడం కష్టం. ఈసారి కరువు వ్యవసాయ రంగంలో నెలకొన్న సంక్షోభానికి సంకేతం మాత్రమే. ఆ సంక్షోభాన్ని నివారించే ప్రయత్నం జరుగకపోతే, వ్యవసాయమే చితికిపోతుంది.

C



## సరిహద్దు గ్రామాల ఆదివాసీలు:

# ఏ రాజ్యానికీ చెందని పౌరులు

-పి.త్రినాథరావు *

రాష్ట్ర సరిహద్దు అటవీ ప్రాంతంలో నివసిస్తున్న ఆదివాసీ కుటుంబాలు అందరు ఆదివాసులలాగ వారికి హక్కులకు దూరంగా దుర్భర జీవితాన్ని గడుపుతుండటమే కాక, ఏ రాజ్యానికీ చెందని పౌరులుగా ఉంటున్నారు. సాయుధుల పలక రింపులు మినహా పౌర అధికారుల సహకారం అందని ప్రాంతాలు అవి. సాయుధ సంఘర్షణలు జరిగిన వెంటనే ఆ ప్రాంత ఆదివాసులు తీవ్ర భయాందోళనలకు లోనవడం సర్వసాధారణం. అటవీ, పోలీసు శాఖాధికార్ల కన్నెర్రకు కొన్ని సందర్భాలలో ఆదివాసీ తండాలు సైతం దగ్ధం అయిపోతున్నాయి. జీవించే హక్కు అనుక్షణం ఉల్లంఘనకు గురిఅవుతూనే ఉంటుంది. పోలీసుల కళ్లలో అనుమానితులుగానే ఉంటూ తీవ్ర అభద్రతకు లోనయి బతుకుతుంటారు ఇక్కడి ఆదివాసీ ప్రజలు.



సరిహద్దు అటవీ ప్రాంతాలలో ఇంత ప్రత్యేకమైన పరిస్థితి ఎందుకుంది?

రాజమండ్రిలో న్యాయవాది

ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రా లు కలిసే సరిహద్దు ప్రాంతాలయిన విశాఖపట్నం, తూర్పు గోదావరి, ఖమ్మం జిల్లాల అటవీ క్షేత్రాలలో ఎన్నో ఏళ్లుగా సామంత, బగత, కోందు, పోర్జా, మురియా వంటి ఆదివాసీ జాతులవారు నివసిస్తున్నారు. వీరు మొదటి నుంచీ మన రాష్ట్ర నివాసులు కారు. ఒరిస్సాలోని మాచ్‌ఖండ్, చిత్రకొండ, బలిమెల ప్రాజెక్టుల వలన నిర్వాసితులయిన వేలాది గిరిజన కుటుంబాలు సరిహద్దుదాటి విశాఖపట్నం, తూర్పు గోదావరి ఏజెన్సీ ప్రాంతాల కొచ్చారు. అభివృద్ధి పేరిట నిర్మించిన ఈ జల విద్యుత్ ప్రాజెక్టులు ఆదివాసుల భూములను, ఇళ్ళను నీటముంచాయి. ప్రాజెక్టు నిర్మాణం జరిగినంత కాలం కూలీలుగా అక్కడ కాలం వెళ్లబుచ్చి ఆ తరువాత నిలువ నీడలేక విశాఖ, తూర్పు గోదావరి ఏజెన్సీ ప్రాంతాలకు వలసవచ్చి దట్టమైన అడవులు సైతం నరికి వ్యవసాయం చేయడం ఆరంభించారు. పొరుగు రాష్ట్రా లలో తీవ్ర దుర్భిక్షం కారణంగా మరికొందరు వలస వచ్చారు. వీరంతా అటవీ క్షేత్రాలలో ఆవాసాలు ఏర్పరచుకున్నారు. కొండవాలు ప్రాంతాలలో పోడు వ్యవసాయం చేస్తున్నారు.

విశాఖపట్నం ఏజెన్సీలోని పెదబయలు, జి.మాడుగుల, పాడేరు, డుంబ్రిగూడ, ముంచింగ్‌పుట్ మండలాలలో ఇటువంటి 'వలస గిరిజనులు' పెద్ద సంఖ్యలో నివసిస్తున్నారు. వారు 1980కి పూర్వం నుంచి (అంటే అటవీ సంరక్షణ చట్టం జారీకాకముందు నుంచి) అడవి భూములను సాగు చేసుకుంటున్నప్పటికీ వారి భూమి హక్కును ప్రభుత్వం క్రమబద్ధీకరించలేదు. స్థానిక గిరిజనులకే ఆ భాగ్యం దక్కనప్పుడు 'బయటివార'యిన వలస గిరిజనుల హక్కులు గుర్తించేదెవరు?

షెడ్యూల్డు తెగల గుర్తింపు రాష్ట్రాల వారీగా జరుగుతుంది. ఒక రాష్ట్రంలో షెడ్యూల్డు తెగ అయినది మరొక రాష్ట్రంలో కానక్కరలేదు. ఒరిస్సా, ఛత్తీస్‌గఢ్‌ల నుంచి వచ్చిన వలస గిరిజనులలో కొన్ని తెగలకు మన రాష్ట్రంలో ఎస్‌టిగా గుర్తింపులేని కారణంగా 'ఎస్‌టి'లకు చట్టం ఇచ్చే కొద్దిపాటి హక్కులు కూడా వారికి దక్కడంలేదు. ఒకవేళ ఒక తెగకు ఇక్కడ కూడా ఎస్‌టిగా గుర్తింపు ఉన్నప్పటికీ కుల ధృవీకరణ పత్రాలు పొందడం కష్టమయిపోతోంది.

ఆదివాసులకు కొంతమేరకు చేయూతనిచ్చే ఐటిడిఏ ఈ 'వలస గిరిజనులు' ఇక్కడి గిరిజనులు కారంటూ వారి కోసం ఏ పథకాలూ అమలు చేయడంలేదు. నిజానికి ఐటిడిఏకి వర్తించే నియమాలు రిజర్వేషన్ చట్టాలంత కచ్చితమైనవి, కఠినమైనవి కావు. ఆ సంస్థ అధికారులు నిర్ణయించుకుంటే 'వలస గిరిజను'లకు కూడా ఇతర ఆదివాసులకిచ్చే సహాయ సహకారాలు అందియ్యవచ్చు.

ఒరిస్సా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకొక సరిహద్దు తగాదా ఉంది. ఈ రెండు రాష్ట్రాలు నా భూభాగ మంటే నా భూభాగమని తగువులాడుకుంటున్న ఈ ప్రాంతంలో 21 గ్రామాలలో ఏడువేల మంది గిరిజనులు జీవిస్తున్నారు. వీరికి కనీస ప్రాథమిక సదుపాయాలు లేవు. విద్య, వైద్యం లేక సతమత మవుతున్నారు. ఇది ఏ రాష్ట్రానికి చెందుతుందన్న తగాదా 1968 నుంచి సుప్రీంకోర్టులో కేసుగా నడుస్తున్నది. 1942 సర్వేలో ఈ 21 గ్రామాలను విశాఖపట్నం జిల్లాలో చూపించినందువల్ల ఇవి నావేనని ఆంధ్రప్రదేశ్ అంటుండగా కాదు నావని ఒరిస్సా అంటున్నది. ఈ తగాదాపైన దావా స్వీకరించిన సుప్రీంకోర్టు, కేసు విచారణ పూర్తయ్యేదాకా 'యథాస్థితి' కొనసాగాలని అలవాటు ప్రకారం అనగా, మన రాష్ట్ర ప్రభుత్వం ఆ గ్రామాలవాసులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇవ్వడానికి సహితం జంకింది. చివరికి హైకోర్టు చేత మొట్టికాయలు తిని పాస్ పుస్తకాలు ఇచ్చింది. దావాను సాగదీయకుండా సామరస్యంగా పరిష్కరించుకొమ్మని సుప్రీంకోర్టు ఇరు రాష్ట్రాలకూ 1983లో చేసిన సూచన గాలికి పోయింది. ఈ గ్రామాల కోందులు రెండు రాష్ట్రాల నుంచీ కూడా కనీస వైద్య సదుపాయాలు దొరకక తరచుగా మృత్యువాత పడుతున్నారు.

మరోవైపు బతుకుతెరువు వేటలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన గొత్తికోయలు, ఖమ్మం జిల్లా ఏజెన్సీ ప్రాంతాలైన దుమ్ముగూడెం, చర్ల, వెంకటాపురం, చింతూరు మండలాల్లోకి వలస వచ్చారు. అటవీ క్షేత్రాలలో ఆవాసాలు ఏర్పర్చుకొని అటవీ వ్యవసాయం చేసుకొని జీవిస్తున్నారు. 1980కి పూర్వమే అడవులు నరికి భూములను చదునుచేసి సామ, కంది, కొర్రలు, జొన్నలు వంటి పంటలు సాగుచేస్తున్నారు. అటవీశాఖ మాత్రం వీరి ఆవాసాలు తగులబెట్టి గొత్తికోయలను తరిమివేయడానికి విఫలయత్నం చేస్తూనే ఉంది. అయితే షెడ్యూల్డు కులాల, తెగల కమిషన్ ఆదివాసుల పక్షాన నిలిచింది. మధ్యప్రదేశ్, ఆంధ్ర ప్రభుత్వాలు సంయుక్తంగా గొత్తికోయల వలస సమస్యను పరిష్కరిం చుకోవాలని 1984లో అప్పటి ఎస్‌సి, ఎస్‌టి కమిషనర్ డా॥ బి.డి.శర్మ ఆదేశించినా అది ఇంకా కార్యరూపం దాల్చలేదు.

మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతూ అటవీ శాఖాధికార్లు నిర్దయతో గొత్తికోయలను తరిమికొట్టేందుకు వారి ఆవాసాలను తగులబెడుతున్న సంఘటనలు అనేకం జరిగాయి. చింతూరు మండలం పూంగుట్టు గ్రామంలో నివసిస్తున్న 25 కుటుంబాల గొత్తికోయల పాకలను, వస్తు సామగ్రిని, పండించుకొని నిల్వ ఉంచుకొన్న ఆహార ధాన్యాలను మూడుసార్లు అటవీశాఖ సిబ్బంది తగులబెట్టింది. రాష్ట్ర హైకోర్టుని ఆశ్రయించి గొత్తికోయ కుటుంబాలను అటవీ ప్రాంతం నుంచి తొలగించకుండా ఉత్తర్వులు పొందాల్సి వచ్చింది. బూర్గంపాడు, పాల్వంచ మండలాల సరిహద్దు అటవీ ప్రాంతంలోని గొత్తికోయల గ్రామాలు కూడా అటవీ శాఖాధికార్ల కారణంగా దహన మయ్యాయి. ఖమ్మం ఏజెన్సీలో గద్దమడుగు, పావుర్లంక, తిప్పాపురం, నల్లకుంట... ఇలా ఎన్నో తండాలు అటవీశాఖ ఆగ్రహానికి గురయ్యాయి.

వీళ్లంతా ఎన్నో ఏళ్లుగా అడవులలో స్థిరనివాసం ఏర్పరచుకొని జీవనం సాగిస్తున్నవారే తప్ప అడవికి బయటివారు కారు. ఎటొచ్చీ తమ చేతిలో లేని కారణాల వల్ల కొద్దిగా స్థానభ్రంశం చెంది తమను పరాయి వారికింద లెక్కించే రాష్ట్రంలోకి వచ్చారు. రిజర్వ్ ఫారెస్టులో 'స్థానిక' గిరిజనుల హక్కులకే దిక్కులేనిది వీరినడిగేది ఎవరు? ప్రస్తుతం దేశంలో అమలులో ఉన్న అటవీ సంరక్షణ చట్టం 1980లో జారీ అయింది. అంతకు పూర్వం నుండే ఆదివాసులు 'రిజర్వ్' అడవులలో నివసిస్తు న్నారు. అటవీ భూములు సాగుచేసుకొని జీవిస్తున్నారు. అయితే అడవిని రిజర్వ్ అడవిగా ప్రకటించే టప్పుడు ఆదివాసుల భూములు, ఆవాసాలను మినహాయించడం చాలా సందర్భాలలో జరగక పోవడం వల్ల ఆదివాసులకు చాలా అన్యాయం జరిగింది. ఎస్‌సి, ఎస్‌టి జాతీయ కమిషన్ తన 29వ నివేదికలో ఆదివాసుల హక్కుల విషయంలో కొన్ని వాస్తవాలను గుర్తించి పరిష్కారానికి సూచనలు చేసింది. ఆ సూచనలననుసరించి కేంద్ర ప్రభుత్వం కొన్ని సర్క్యులర్‌లు జారీ చేసింది. అయితే వాటిని అమలు చేయలేదు. చొరబాటుదార్లంటూ ఆదివాసులపైన తప్పుడు కేసులు పెట్టడం, వారి ఆవాసాలను తగలబెట్టడం అటవీశాఖ అనుసరిస్తున్న ఆటవిక న్యాయం. నక్సలైట్లు పనిచేస్తున్న ప్రాంతంలో 'తీవ్రవాదులు' అన్న బెదిరింపు కూడా పరిపాటి అయింది. 'స్థానిక గిరిజ నుల' పరిస్థితే ఇలా ఉంటే ఇక 'వలస గిరిజనుల' గురించి చెప్పుకోనవసరం లేదు.

ఖమ్మం జిల్లాలోని భద్రాచలం సరిహద్దు ఏజెన్సీలో సుమారు 40 తండాలలో ఛత్తీస్‌గఢ్ నుంచి

వలస వచ్చిన ఆదివాసులు నివసిస్తున్నారు. ఈ తండాలలో అభివృద్ధి కార్యక్రమాలు 'స్థానిక' గిరిజన గ్రామాలలో చేపట్టిన మేరకు కూడా ప్రభుత్వం చేపట్టడం లేదు. వారిపైన ట్రెస్‌పాస్ కేసులు బనాయించడం, భద్రాచలం సబ్ జైలుకు తరలించడం, చార్జిషీటు త్వరగా దాఖలు చేయకుండా కేసు విచారణ ముగించకుండా సాగదీయడం, బెయిలు మంజూరయినా స్థానిక జామీన్‌దార్లు దొరకని కారణంగా ముద్దాయిలు దీర్ఘకాలం జైలులోనే ఉండిపోవడం – ఇదీ గొత్తికోయల దయనీయ గాథ.

ఇదిలా ఉండగా రాష్ట్ర ఏజెన్సీ ప్రాంతాలలోనే ఐటిడిఎ పరిధి సరిహద్దు గ్రామాలలో నివసిస్తున్న గిరిజనులు సైతం ఎవరి పాలనకు పట్టని స్థితిలో ఉన్నారు. విశాఖ జిల్లా ఏజెన్సీ మండలాలు గూడెం కొత్తవీధి, కొయ్యూరు, అలాగే తూర్పుగోదావరి జిల్లా ఏజెన్సీ వై.రామవరం మండలాల సరిహద్దు గ్రామాలలో నివసిస్తున్న ఆదివాసీల పరిస్థితి రాష్ట్రంలో మానవహక్కుల అమలును ప్రశ్నిస్తుంది. ఆయా జిల్లాల ఐటిడిఎ అంచున గ్రామాలు ఉండడంతో అధికారులు వీరి అభివృద్ధి కోసం ఎటువంటి చర్యలు తీసుకోవడంలేదు. ఐటిడిఎ కార్యాలయం సందర్శించాలంటే సుమారు 200 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సిన గ్రామాలు కూడా ఉన్నాయి. కొండరెడ్డి, బగత, కొండదొర, వాల్మీకులు నివసించే సరిహద్దు గ్రామ ప్రజలు వారి మండల కేంద్రానికి వెళ్ళా లంటే సుమారు 20 నుంచి 30 కిలోమీటర్లు కాలినడకన వెళ్ళాల్సి ఉంటుంది. అక్కడ నుంచి ఐటిడిఎ కేంద్రాలకు బస్సుపై ప్రయాణించాల్సి ఉంటుంది. విద్య, వైద్య, నీరు సౌకర్యాలు లేవు. ఆర్థికాభివృద్ధి కార్యక్రమాలు ఏమీ అమలు కావడంలేదు. అభివృద్ధి పొందే హక్కు అడిగితే అది అరణ్య రోదనగానే ఉంటుంది. వీరు ఎవరికీ పట్టని పౌరులుగానే ఉన్నారు. తూర్పు గోదావరి, విశాఖ ఏజెన్సీ సరిహద్దు గ్రామాలు సుమారు 25 వరకూ ఉంటాయి. ఆ గ్రామాలలో నివసిస్తున్న ఆదివాసుల గ్రామాలు ఆలన, పాలనకు నోచుకోవడంలేదు. రోగాలకు గురైతే మృత్యువు ఒడిలోకి చేరిపోవాల్సిందే.

దీనికితోడు నక్సలైట్లకు సానుభూతిగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణల వల్ల వారు పోలీసులు పెట్టే అక్రమ కేసులను ఎదుర్కోవాల్సి వస్తున్నది. నక్సలైట్లకు ఆదివాసీలు ఆశ్రయం కల్పిస్తున్నారనే ఆరోపణలు వారిమీద నిరంతరం చేస్తున్నారు. దీనివల్ల వారు నిత్యం అభద్రతలో జీవించాల్సి వస్తున్నది. గతంలో పోలీసుల ఆగ్రహానికి విశాఖ, తూర్పు గోదావరి ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన గ్రామాలు దహనమయ్యాయి.

రాష్ట్ర సరిహద్దు గ్రామ ఆదివాసుల విషయంలో మానవహక్కుల ఉల్లంఘన ఇంత తీవ్రస్థాయిలో జరుగుతున్నందున వారి పౌరహక్కుల్ని కాపాడవలసిన అవసరం ఉంది.

C



# వ్యవసాయానికి ఉచిత విద్యుత్ ఎందుకంటే?

–కొత్తకోట రాజేంద్రరెడ్డి *

ఇటీవల కాలంలో వ్యవసాయ విద్యుత్ చార్జీలపై జరుగుతున్న చర్చలను పరిశీలిస్తే, ఇది రాజకీయ పార్టీల మధ్య సమస్యగా కనిపిస్తోందే తప్ప పంపుసెట్టు రైతుల సాధక బాధకాలను, ప్రత్యేకించి ప్రాజెక్టు రైతులకు గల మెరుగైన సదుపాయాలను దృష్టిలో ఉంచుకొని చర్చించడంలేదు. అధికార పార్టీ వాళ్లు ప్రతిపక్షాలతో మీ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాలలో ఉచిత విద్యుత్ ఎందుకు ఇవ్వడం లేదంటున్నారే తప్ప వాస్తవాలను పరిశీలించి హేతు బద్ద నిర్ణయం గైకొనడంలేదు.



వ్యవసాయ రంగంలోని విద్యుత్ వినియోగం వలన విద్యుత్ రంగానికే కాక రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకే ప్రమాదం వాటిల్లుతోందని చాలా మంది రాజకీయ నాయకుల, ఆర్థిక విశ్లేషకుల అభిప్రాయం. వ్యవసాయరంగానికి విద్యుత్ కేటాయింపే విద్యుత్‌రంగ నష్టాలకు కారణమని బలమైన వాదనలను లేవదీసి విద్యుత్ రంగంలోని అవకతవకలను కప్పి పుచ్చే ప్రయత్నాలు జరుగు

* కన్వీనర్, రాష్ట్రీయ రైతు సేవా సమితి, చిత్తూరు జిల్లా

తున్నాయి. ఇది కేవలం నిజానిజాలు తెలియక అవగాహనా రాహిత్యము వలన కొందరు ఏర్పరచుకొన్న అభిప్రాయము అయితే, మరికొందరు ఘనులు అన్నీ తెలిసి స్వలాభం కొరకు ఏమీ తెలియనట్లు నటిస్తున్నారు. ఇది అత్యంత దురదృష్టకరం. వ్యవసాయ విద్యుత్ వినియోగం వలన సమాజానికి ఒనగూడుతున్న లబ్దిని పరిగణనలోనికి తీసుకుంటే వ్యవసాయ విద్యుత్ వినియోగంపై పెట్టుబడి లేశమాత్రమే. ఏ రంగంలోనైనా లాభనష్టాలను బేరీజు వేసేటప్పుడు ఏకపక్షంగా కాక అన్నికోణాల నుంచి సమస్యను విశ్లేషించి అంతిమ ఫలితాన్ని నిర్ణయించాలి. కాని దురదృష్టవశాత్తు వ్యవసాయ విద్యుత్ విషయంలో అత్యధిక విద్యుత్ నిపుణులు, ఆర్థిక విశ్లేషకులు, రాజకీయ నాయకులు ఆంధ్ర ప్రదేశ్ విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ వారు సైతం సమస్యను ఏకపక్షంగా విశ్లేషిస్తున్నారు. సదరు విశ్లేషకలందరూ వ్యవసాయ విద్యుత్‌కు అయ్యే ఖర్చుతోపాటు వినియోగం వలన సమాజానికి ఒనగూడుతున్న లాభాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలి.

స్వాతంత్ర్యం వచ్చేనాటికి విదేశీ పాలకుల దోపిడీ, కర్కశ పాలన వలన దేశం కుక్కలు చింపిన విస్తరి వలే అస్తవ్యస్తమైనది. దేశంలో ఎక్కడ చూసినా అశాంతి, అలజడులతో పాటు అన్నమో రామచంద్రా అనే ఆర్తనాదాలే. ఆనాటి దీనావస్థ నుంచి నేటి ఆహార రంగంలో స్వయం సమృద్ధికి, ఆహార భద్రతకు కారణం మన పరిపాలకుల దక్షత, శాస్త్రజ్ఞుల వితరణ మాత్రమే కాదు, రైతుల శక్తికి మించిన త్యాగాలు కూడా ఇందుకు దోహదపడ్డాయి.

దురదృష్టవశాత్తు స్వాతంత్ర్యానంతరం నుంచి నేటివరకు మన రాష్ట్రంలోను, దేశంలోను వివిధ నీటిపారుదల పద్ధతుల ద్వారా సాగుబడి జరుగుతున్న భూమి వివరాలు పూర్తిగా లభించడంలేదు. లభించినంతవరకు గల గణాంకాలను పరిశీలిద్దాం. గత పది సంవత్సరాలుగా మన రాష్ట్రంలో వివిధ పద్ధతుల ద్వారా నీటిపారుదల రంగంలో వచ్చిన మార్పులను పట్టిక 1లో గమనిద్దాం.

## పట్టిక-1

## వివిధ నీటిపారుదల పద్ధతుల ద్వారా సాగుభూమి విస్తీర్ణం

(లక్షల హెక్టార్లలో)

| సంవత్సరం | కాలువలు | చెరువులు | బావులు | బోరుబావులు | ఇతరములు | మొత్తం |
|---|---|---|---|---|---|---|
| 1990-91 | 18.46 | 9.69 | 10.21 | 2.83 | 1.77 | 43.06 |
| 1991-92 | 18.26 | 9.26 | 10.66 | 3.36 | 1.63 | 43.51 |
| 1992-93 | 17.27 | 7.28 | 10.27 | 3.84 | 1.56 | 40.29 |
| 1993-94 | 16.59 | 6.33 | 9.16 | 5.26 | 1.81 | 38.90 |
| 1994-95 | 16.06 | 6.72 | 8.81 | 5.99 | 1.81 | 39.59 |
| 1995-96 | 15.39 | 7.47 | 9.47 | 7.10 | 1.94 | 41.24 |
| 1996-97 | 16.29 | 8.44 | 9.87 | 7.41 | 1.68 | 43.95 |
| 1997-98 | 15.37 | 5.62 | 9.03 | 7.74 | 1.98 | 39.44 |
| 1998-99 | 16.34 | 8.10 | 9.81 | 9.16 | 1.98 | 45.39 |
| 1999-2000 | 16.34 | 6.52 | 9.00 | 10.00 | 1.98 | 43.84 |



మూలం: వి.హనుమంతరావు (2001)

పై పట్టికను పరిశీలిస్తే రాష్ట్రంలో ప్రభుత్వ ఖర్చుతో నిర్మించి నిర్వహిస్తున్న కాలువల ద్వారా సాగుబడి 1990-95 సంవత్సరంలో 18.46 లక్షల హెక్టార్ల నుంచి 1999-2000 నాటికి 16.34 లక్షల హెక్టార్లకు పడిపోయి కాలువల క్రింద సాగు ఒక దశాబ్ద కాలంలో అనగా 1990-2000ల సంవత్సరాల మధ్య 11.48 శాతం తరుగుదల నమోదైంది. ఇదే కాలంలో చెరువుల ద్వారా సాగు 9.69 లక్షల హెక్టార్ల నుంచి 6.52 లక్షల హెక్టార్లకు దారుణంగా పడిపోయి 32.17 శాతం తరుగుదల నమోదు అయింది. ఇదే కాలంలో రైతుల సొంత పెట్టుబడి నిర్వహణలో గల బావులు, బోరుబావుల ద్వారా సేద్యం 13.04 లక్షల హెక్టార్ల నుంచి 19 లక్షల హెక్టార్లకుపెరిగి 45.70 శాతం పెరుగుదల నమోదయింది.

ఇదే కాలంలో మొత్తం నీటిపారుదల సాగుబడి విస్తీర్ణంలో కాలువలు, చెరువుల ద్వారా అయ్యే సాగుబడి విస్తీర్ణం 65.37 శాతం నుంచి 52.14 శాతానికి పడిపోయింది. ఇదే కాలంలో రైతులు స్వశక్తితో నిర్వహిస్తున్న బావులు, బోరుబావుల క్రింద సాగుబడి శాతం 30.20 నుంచి 43.34 శాతానికి పెరిగింది. ఈ పెరుగుదలను విశ్లేషకులు జాగ్రత్తగా పరిశీలించాలి.

జాతీయ స్థాయిలో 1970 నుంచి 1996వ సంవత్సరం వరకు దేశంలో వివిధ పద్ధతుల ద్వారా సాగుబడి జరుగుతున్న భూమి విస్తీర్ణం వివరాలు పట్టిక రెండులో చూడండి.

## పట్టిక-2

## నికర నీటిపారుదల భూమిలో వివిధ సాగునీటి పద్ధతుల శాతం

| సంవత్సరం | కాలువలు | చెరువులు | బోరుబావులు | ఇతర బావులు | మొత్తంబావుల ద్వారా సాగు | ఇతరములు |
|---|---|---|---|---|---|---|
| 1970-71 | 41.28 | 13.22 | 14.34 | 23.88 | 38.22 | 7.29 |
| 1980-81 | 39.49 | 8.22 | 24.62 | 21.08 | 45.70 | 6.59 |
| 1990-91 | 36.34 | 6.13 | 29.69 | 21.73 | 51.12 | 6.11 |
| 1995-96 | 32.04 | 5.81 | 33.52 | 22.16 | 55.68 | 6.47 |

మూలం: సి.ఎం.ఐ.ఇ., బాంబే (సెప్టెంబర్ 1999)

పై గణాంకాలను పరిశీలిస్తే గత పాతిక సంవత్సరాలుగా అనగా 1970-71 నుంచి 1995-96 వరకు భారతదేశంలో అందరూ అనుకొంటున్నట్టు కాలువల ద్వారా సాగుబడి శాతం పెరగలేదు. అందుకు భిన్నంగా 1970-71 సంవత్సరంలో కాలువల సాగుశాతం 41.28, కాగా పాతిక సంవత్సరాల తరువాత అంటే 1995-96 సంవత్సరానికి 32.06 శాతానికి పడిపోయింది. ఇదేకాలంలో చెరువుల క్రింద సాగు 13.22 శాతం నుంచి 5.81 శాతానికి పడిపోయింది. కానీ బోరుబావులు, ఇతర బావుల ద్వారా సాగయ్యే మొత్తం 38.22 శాతం నుంచి గణనీయంగా పెరిగి 55.68 శాతానికి చేరుకుంది. ఇక్కడ ముఖ్యంగా గమనించవలసిన అంశం ఏమిటంటే ప్రభుత్వ పెట్టుబడి నిర్వహణలో వున్న కాలువలు, చెరువుల ద్వారా సాగుబడి గణనీయంగా పడిపోగా రైతులు సొంత పెట్టుబడి, స్వశక్తితో నిర్వహించబడుతున్న బావులు, బోరుబావుల ద్వారా సాగుబడి శాతం గణనీయంగా పెరిగింది.

జాతీయస్థాయిలో పాతిక సంవత్సరాల కాలంలో అనగా 1970–71 నుంచి 1995–96 వరకు వివిధ పద్ధతుల ద్వారా సాగుబడి జరిగిన విస్తీర్ణం వివరాలు పట్టిక 3లో పొందుపర్చబడినవి.

## పట్టిక-3

## వివిధ పద్ధతుల ద్వారా సాగు విస్తీర్ణం

(000 హెక్టార్లలో)

| సంవత్సరం | కాలువలు | చెరువులు | బోరు బావులు | ఇతర బావులు | మొత్తం బావులు | ఇతరములు | మొత్తం సాగువిస్తీర్ణం |
|---|---|---|---|---|---|---|---|
| 1970–71 | 12838 | 4112 | 4461 | 7426 | 1187 | 2266 | 31103 |
| 1980–81 | 15292 | 3182 | 9531 | 8164 | 17695 | 2551 | 38720 |
| 1990–91 | 17453 | 5944 | 14257 | 10437 | 24694 | 2932 | 48023 |
| 1995–96 | 17112 | 1111 | 1793 | 11860 | 29797 | 3460 | 53510 |
| **శాతంతోమార్పు** | **.33.5** | **–24.3** | **.30.2** | **.59.7** | **.150** | **.52.7** | **.41.9** |

మూలం: సి.ఎం.ఐ.ఇ., బాంబే (సెప్టెంబర్, 1999)

పై పట్టికను పరిశీలిస్తే దేశంలో పాతిక సంవత్సరాలలో అనగా 1970–95 మధ్య కాలంలో ప్రభుత్వ ఖర్చుతో నిర్మించి నిర్వహింపబడుతున్న కాలువల ద్వారా సాగుబడి విస్తీర్ణం పెరుగుదల కేవలం 33.5 శాతమే. చెరువుల ద్వారా సాగుబడి అయ్యే విస్తీర్ణంలో 24.3 శాతం తరుగుదల గమనార్హం. కానీ రైతులే సొంత పెట్టుబడితో నిర్వహించే అన్నిరకాల బావుల ద్వారా సాగయ్యే విస్తీర్ణంలో 150 శాతం పెరుగుదల ఉన్నదనేది విశ్లేషకులు గమనించాలి.

పట్టిక-4లో 1970–71 నుంచి 1997–98 సంవత్సరం వరకు సంవత్సరాల వారీగా భారతదేశంలో వివిధ నీటిపారుదల పద్ధతుల ద్వారా సాగుబడి అయిన భూమి విస్తీర్ణం చూపబడింది. పట్టిక–5లో 1970–71 నుంచి 1997–98 సంవత్సరం వరకు దేశంలో వివిధ నీటిపారుదల పద్ధతుల ద్వారా సంవత్సరాల వారీగా సాగుకాబడిన భూమి శాతం వివరంగా చూపబడింది. పట్టిక–6 నందు దేశంలోని రాష్ట్రాల వారీగా 1997–98 సంవత్సరంలో వివిధ నీటిపారుదల పద్ధతుల ద్వారా సాగుకాబడిన భూమి విస్తీర్ణం చూపబడింది. పట్టిక–7లో దేశంలోని వివిధ రాష్ట్రాలలో వివిధ నీటిపారుదల పద్ధతుల ద్వారా 1997–98 సంవత్సరంలో సాగుకాబడిన భూమి శాతం పేర్కొనబడింది. ఈ పట్టికలలోని గణాంకాలను నిశితంగా అధ్యయనం చేయండి.

## పట్టిక-4

## దేశవ్యాప్తంగా నీటి పారుదల వనరులు

(000 హెక్టార్లు)

| సంవత్సరం | ప్రభుత్వ కాలువలు | ప్రైవేటు కాలువలు | మొత్తం కాలువలు | చెరువులు | గొట్టపు బావులు | ఇతర బావులు | మొత్తం బావులు | ఇతర వనరులు | మొత్తం నికర సాగువిస్తీర్ణం |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1970–71 | 11972 | 866 | 12838 | 4112 | 4461 | 7426 | 11887 | 2266 | 31103 |
| 1971–72 | 12246 | 869 | 13115 | 3734 | 4745 | 7535 | 12280 | 2417 | 31546 |
| 1972–73 | 12134 | 862 | 12996 | 3619 | 5393 | 7571 | 12964 | 2255 | 31834 |
| 1973–74 | 12196 | 869 | 13065 | 3900 | 5604 | 7679 | 13283 | 2298 | 32546 |
| 1974–75 | 12657 | 857 | 13514 | 3544 | 6583 | 7646 | 14229 | 2422 | 33709 |
| 1975–76 | 12933 | 858 | 13791 | 3972 | 6843 | 7601 | 14444 | 2386 | 34593 |
| 1976–77 | 13016 | 845 | 13861 | 3901 | 7432 | 7655 | 15087 | 2300 | 35149 |
| 1977–78 | 13734 | 842 | 14576 | 3904 | 7641 | 7943 | 15584 | 2482 | 36546 |
| 1978–79 | 14304 | 845 | 15149 | 3937 | 8159 | 8270 | 16429 | 2544 | 38059 |
| 1979–80 | 13931 | 843 | 14774 | 3481 | 9307 | 9557 | 17864 | 2405 | 38524 |
| 1980–81 | 14450 | 842 | 15292 | 3182 | 9531 | 8164 | 17695 | 2551 | 38720 |
| 1981–82 | 15456 | 490 | 15946 | 3376 | 10334 | 8403 | 18737 | 2444 | 40503 |
| 1982–83 | 15716 | 496 | 16185 | 2936 | 10770 | 8577 | 19347 | 2223 | 40691 |
| 1983–84 | 16294 | 470 | 16764 | 3533 | 10922 | 8470 | 19392 | 2260 | 41949 |
| 1984–85 | 15805 | 470 | 16275 | 3021 | 11566 | 8828 | 20394 | 2455 | 42145 |
| 1985–86 | 15715 | 465 | 16180 | 2765 | 11903 | 8515 | 20418 | 2502 | 41865 |
| 1986–87 | 16039 | 456 | 16495 | 2677 | 12298 | 8524 | 20822 | 2575 | 42569 |
| 1987–88 | 15286 | 460 | 15746 | 2523 | 13185 | 8611 | 21796 | 2827 | 42892 |
| 1988–89 | 16640 | 462 | 17102 | 2996 | 13716 | 9498 | 23248 | 2926 | 46248 |
| 1989–90 | 16646 | 478 | 17124 | 2941 | 14049 | 9837 | 23886 | 2751 | 46702 |
| 1990–91 | 16973 | 480 | 17453 | 2944 | 14257 | 10437 | 24694 | 2932 | 48023 |
| 1991–92 | 16810 | 491 | 17301 | 3329 | 15170 | 16867 | 20637 | 3200 | 49867 |
| 1992–93 | 16503 | 483 | 16986 | 3179 | 15815 | 11106 | 26920 | 3211 | 50296 |
| 1993–94 | 16628 | 483 | 17111 | 3152 | 16376 | 11386 | 27762 | 3427 | 51452 |
| 1994–95 | 16799 | 481 | 17280 | 3276 | 17190 | 11722 | 28912 | 3533 | 53001 |
| 1995–96 | 16561 | 559 | 17120 | 3118 | 17910 | 11787 | 29697 | 3467 | 53402 |
| 1996–97 | 556872 | 480 | 17352 | 3343 | 18433 | 12392 | 30825 | 3623 | 55143 |
| 1997–98 | 16617 | 475 | 17092 | 3100 | 18432 | 12448 | 30880 | 3491 | 545613 |

## పట్టిక-5
## దేశవ్యాప్తంగా నీటి పారుదల వనరులు

(నికర సాగు విస్తీర్ణ శాతం)

| సంవత్సరం | ప్రభుత్వ కాలువలు | ప్రైవేటు కాలువలు | మొత్తం కాలువలు | చెరువులు | గొట్టపు బావులు | ఇతర బావులు | మొత్తం బావులు | ఇతర వనరులు |
|---|---|---|---|---|---|---|---|---|
| 1970-71 | 38.49 | 2.78 | 41.28 | 13.22 | 14.34 | 23.88 | 38.22 | 7.29 |
| 1971-72 | 38.42 | 2.75 | 41.57 | 11.84 | 15.04 | 23.89 | 38.93 | 7.66 |
| 1972-73 | 38.12 | 2.71 | 40.82 | 11.37 | 16.94 | 23.78 | 40.72 | 7.08 |
| 1973-74 | 37.47 | 2.67 | 40.14 | 11.98 | 17.22 | 23.59 | 40.81 | 7.06 |
| 1974-75 | 37.55 | 2.54 | 40.09 | 10.51 | 19.53 | 22.68 | 42.21 | 7.19 |
| 1975-76 | 37.39 | 2.48 | 39.87 | 11.48 | 19.78 | 21.97 | 41.75 | 6.90 |
| 1976-77 | 37.03 | 2.40 | 39.43 | 11.10 | 21.14 | 21.78 | 42.92 | 6.54 |
| 1977-78 | 37.58 | 2.30 | 39.88 | 10.68 | 20.91 | 21.73 | 42.64 | 6.79 |
| 1978-79 | 37.58 | 2.22 | 39.80 | 10.34 | 21.44 | 21.73 | 43.17 | 6.68 |
| 1979-80 | 36.16 | 2.19 | 38.35 | 9.04 | 24.16 | 22.21 | 46.37 | 6.24 |
| 1980-81 | 37.32 | 2.17 | 39.49 | 8.22 | 24.62 | 21.08 | 45.70 | 6.69 |
| 1981-82 | 38.16 | 1.21 | 39.37 | 8.34 | 25.51 | 20.75 | 46.26 | 6.03 |
| 1982-83 | 38.62 | 1.15 | 39.78 | 7.22 | 26.47 | 21.08 | 47.55 | 5.46 |
| 1983-84 | 38.84 | 1.12 | 39.96 | 8.42 | 26.04 | 20.19 | 46.23 | 5.39 |
| 1984-85 | 37.50 | 1.12 | 38.62 | 7.17 | 27.42 | 20.95 | 48.39 | 5.83 |
| 1985-86 | 37.54 | 1.11 | 38.65 | 6.60 | 28.43 | 20.34 | 48.77 | 5.98 |
| 1986-87 | 37.68 | 1.06 | 38.75 | 6.29 | 28.89 | 20.02 | 48.91 | 6.05 |
| 1987-88 | 35.64 | 1.07 | 36.71 | 5.88 | 30.74 | 20.08 | 50.82 | 6.59 |
| 1988-89 | 35.98 | 1.00 | 36.98 | 6.48 | 29.66 | 20.54 | 50.19 | 6.35 |
| 1989-90 | 35.64 | 1.02 | 36.67 | 6.03 | 30.08 | 21.06 | 51.16 | 5.89 |
| 1990-91 | 35.34 | 1.00 | 36.34 | 6.13 | 29.69 | 21.73 | 51.42 | 6.11 |
| 1991-92 | 33.71 | 0.98 | 34.69 | 6.68 | 30.42 | 21.79 | 52.21 | 6.42 |
| 1992-93 | 32.81 | 0.96 | 33.77 | 6.32 | 31.44 | 22.08 | 53.52 | 6.38 |
| 1993-94 | 32.32 | 0.94 | 33.26 | 6.13 | 31.83 | 22.13 | 53.96 | 6.66 |
| 1994-95 | 31.70 | 0.91 | 32.60 | 6.18 | 32.43 | 22.12 | 54.55 | 6.67 |
| 1995-96 | 31.01 | 1.05 | 32.06 | 5.84 | 33.54 | 22.07 | 55.61 | 6.49 |
| 1996-97 | 30.60 | 0.87 | 31.47 | 6.06 | 33.43 | 22.47 | 55.90 | 6.57 |
| 1997-98 | 30.45 | 0.87 | 31.33 | 5.68 | 33.78 | 22.81 | 56.60 | 6.40 |

భారత వ్యవసాయ, ఆర్థిక పర్యవేక్షక సంస్థ (నవంబర్ 2001)



## పట్టిక-6
## 1997-98లో రాష్ట్రాలవారీగా నీటి పారుదల వనరులు

(000 హెక్టార్లలో)

| రాష్ట్రం | మొత్తం కాలువలు | చెరువులు | మొత్తం బావులు | ఇతర వనరులు | మొత్తం నికర సాగు విస్తీర్ణం |
|---|---|---|---|---|---|
| ఆంధ్రప్రదేశ్ | 1538 | 563 | 1676 | 168 | 3945 |
| అరుణాచల్‌ప్రదేశ్ | - | - | - | 36 | 36 |
| అస్సాం | 362 | - | - | 210 | 572 |
| బీహార్ | 1072 | 117 | 1794 | 641 | 3624 |
| ఢిల్లీ | 3 | - | - | 4 | 41 |
| గోవా | 8 | - | 16 | - | 24 |
| గుజరాత్ | 613 | 29 | 2386 | 14 | 3042 |
| హర్యానా | 1397 | 1 | 1363 | 32 | 2793 |
| హిమాచల్‌ప్రదేశ్ | 3 | 1 | 13 | 88 | 105 |
| జమ్మూ కాశ్మీర్ | 284 | 2 | 2 | 21 | 309 |
| కర్ణాటక | 903 | 240 | 861 | 359 | 2363 |
| కేరళ | 104 | 45 | 83 | 118 | 350 |
| మధ్యప్రదేశ్ | 1783 | 219 | 3503 | 799 | 6304 |
| మహారాష్ట్ర | 538 | 369 | 1571 | 89 | 2567 |
| మణిపూర్ | - | - | - | 65 | 65 |
| మేఘాలయ | - | - | - | 47 | 47 |
| మిజోరాం | 8 | - | - | - | 8 |
| నాగాలాండ్ | - | - | - | 62 | 62 |
| ఒరిస్సా | 949 | 305 | 836 | - | 2090 |
| పంజాబ్ | 1356 | - | 2357 | 134 | 3847 |
| రాజస్థాన్ | 1525 | 182 | 3657 | 57 | 5421 |
| సిక్కిం | - | - | - | 16 | 16 |
| తమిళనాడు | 838 | 657 | 1413 | 19 | 2945 |
| త్రిపుర | 26 | 2 | 4 | 5 | 35 |
| ఉత్తరప్రదేశ్ | 3059 | 84 | 8583 | 286 | 12012 |
| పశ్చిమబెంగాల్ | 717 | 263 | 712 | 219 | 1911 |
| ఇతర రాష్ట్రాలు | 1 | - | 2 | - | 3 |
| **మొత్తం** | **17092** | **3100** | **30880** | **3491** | **54563** |

## పట్టిక-7

## 1997-98లో రాష్ట్రాల వారీగా నీటి పారుదల వనరులు

(నికర సాగు విస్తీర్ణ శాతం)

| రాష్ట్రం | మొత్తం కాలువలు | చెరువులు | మొత్తం బావులు | ఇతర వనరులు |
|---|---|---|---|---|
| ఆంధ్రప్రదేశ్ | 38.99 | 14.27 | 42.48 | 4.26 |
| అరుణాచల్‌ప్రదేశ్ | - | - | - | - |
| అస్సాం | 63.29 | - | - | 36.71 |
| బీహార్ | 29.58 | 3.23 | 49.50 | 17.69 |
| ఢిల్లీ | 7.32 | - | - | 9.76 |
| గోవా | 33.33 | - | 66.67 | - |
| గుజరాత్ | 20.15 | 0.95 | 78.44 | 0.46 |
| హర్యానా | 50.02 | 0.04 | 48.80 | 1.15 |
| హిమాచల్‌ప్రదేశ్ | 2.86 | 0.95 | 12.38 | 83.81 |
| జమ్ముకాశ్మీర్ | 91.91 | 0.65 | 0.65 | 6.80 |
| కర్ణాటక | 38.21 | 10.16 | 36.44 | 15.19 |
| కేరళ | 29.71 | 12.86 | 23.71 | 33.71 |
| మధ్యప్రదేశ్ | 28.28 | 3.47 | 55.57 | 12.67 |
| మణిపూర్ | - | - | - | - |
| మేఘాలయ | - | - | - | - |
| మిజోరాం | 100.00 | - | - | - |
| నాగాలాండ్ | - | - | - | - |
| ఒరిస్సా | 45.41 | 14.59 | 40.00 | - |
| పంజాబ్ | 35.25 | | 61.27 | 3.48 |
| రాజస్థాన్ | 28.13 | 3.36 | 37.46 | 1.05 |
| సిక్కిం | - | - | - | - |
| తమిళనాడు | 28.46 | 22.92 | 47.98 | 0.65 |
| త్రిపుర | 74.29 | 5.71 | 11.43 | 14.29 |
| ఉత్తరప్రదేశ్ | 25.47 | 0.70 | 71.45 | 2.38 |
| పశ్చిమ బెంగాల్ | 37.52 | 13.76 | 37.26 | 200 |
| **మొత్తం** | **31.33** | **5.68** | **56.60** | **6.40** |

భారత వ్యవసాయ, ఆర్థిక పర్యవేక్షక సంస్థ (నవంబర్ 2001)



పై వివరాలను పరిశీలించిన పరిశోధకులు శ్రీయుతులు కాంచన్ చోప్రా, బిశ్వనాథ్ గోల్డర్ వారి పరిశోధనా పత్రం 'Sustainable Development Work for India. The case of water resources'లో రానున్న 18 సంవత్సరాలలో అనగా 2020 సంవత్సరానికి బావుల ద్వారా సేద్యం 75 శాతానికి పెరుగుతుందని అంచనా వేశారు. ఇందుకు కారణం లోపభూయిష్ఠమైన కాలువల నిర్వహణ, కాలువల చివర భూములకు సాగునీరు సరిగా అందకపోవడమేనని అనిశ్చిత స్థితిలో గల కాలువల నీటిపారుదల వ్యవస్థ నుంచి రైతులు నమ్మకమైన బావుల సేద్యానికి మళ్లడమేనని చెప్పారు.

పట్టిక 4, 5 విశ్లేషిస్తే జాతీయ స్థాయిలో 1970-71 సంవత్సరంలో మొత్తం సాగుబడి విస్తీర్ణం 3,11,03,000 హెక్టార్లు ఉండగా ఇందులో కాలువల ద్వారా విస్తీర్ణం 1,28,38,000 హెక్టార్లు. అంటే కాలువల సాగు శాతం 40.28గా నమోదయినది. ఇదే కాలంలో చెరువుల ద్వారా సాగు విస్తీర్ణం 41,12,000 హెక్టార్లుగా ఉండి 13.22 శాతంగా నమోదు కాబడింది. ఇదే కాలంలో బావుల ద్వారా సేద్యం 1,18,87,000 హెక్టార్లు. 38.22 శాతం, 1997-98 సంవత్సరంలో అనగా సుమారు మూడు దశాబ్దాల తరువాత జాతీయ స్థాయిలో మొత్తం నీటిపారుదల విస్తీర్ణం 5,45,63,000 హెక్టార్లుగా ఉండగా, అందులో కాలువల ద్వారా సాగు 1,70,92,000 హెక్టార్లుగా నమోదు కాబడి మొత్తం నీటిపారుదల సాగుబడిలో 31.33 శాతంగా గుర్తించారు. ఇదే కాలంలో చెరువుల ద్వారా సాగు 5.68 శాతం, బావుల ద్వారా సాగు 56.60 శాతంగా నమోదు కాబడింది. అనగా మూడు దశాబ్దాల కాలంగా జాతీయ స్థాయిలో కాలువల ద్వారా సాగు 41.28 నుంచి 31.33 శాతానికి, చెరువుల ద్వారా సాగు 13.22 నుంచి 5.68 శాతానికి పడిపోగా రైతులు స్వశక్తితో సొంత పెట్టుబడితో నిర్వహిస్తున్న బావుల ద్వారా సేద్యం 38.22 నుంచి గణనీయంగా 56.60 శాతానికి పెరిగింది.

కాలానుగుణంగా వచ్చే మార్పులను ప్రభుత్వం అప్పటికప్పుడు గ్రహిస్తేగాని వివిధ వర్గాలకు న్యాయం జరగదు. ఎప్పుడో పుట్టిన రెవిన్యూ రికార్డులలో మెట్టభూమి, పల్లపు భూమి (పుంజ, నంజ) అని వర్గీకరణ ఉంది. మెట్టభూములు వర్షం ఆధారంగా సాగుబడి అవుతాయి. పల్లపు భూమి ప్రభుత్వంవారు సరఫరా చేసే సాగునీటి ఆధారంగా సాగుబడి అవుతుంది. అనాది కాలం నుంచి నేటివరకు ఇదే వర్గీకరణ కొనసాగుతోంది. కాలగతిలో వచ్చిన ఆధునిక సాంకేతిక విప్లవం వలన వ్యవసాయ రంగంలో యాంత్రీకరణ పద్ధతులు ప్రవేశించాయి. తత్ఫలితంగా మెట్ట రైతులు, పల్లపు రైతులకు మధ్య పంపుసెట్ రైతు ఆవిర్భవించాడు. మెట్ట రైతు మనుగడ భగవంతుని చేతిలో ఉండగా పల్లపు రైతు మనుగడ ప్రభుత్వం చేతిలో ఉండగా పంపుసెట్ రైతు మనుగడను అటు భగవంతుడు, ఇటు ప్రభుత్వం వారు విస్మరించగా తన మనుగడను తానే సవాల్‌గా స్వీకరించి తానే పెట్టుబడులు, నిర్వహణ భారాన్నిమోస్తూ సాగునీటిని సమకూర్చుకుంటున్నాడు. కాలగతిలో వచ్చిన ఈ మార్పును ప్రభుత్వం గ్రహించి పంపుసెట్ రైతు ఆవిర్భావాన్ని, పంపుసెట్ సేద్యాన్ని గుర్తించి, అవసరమైన రికార్డులలో అధికారికంగా నమోదుచేసి పంపుసెట్ రైతును ప్రత్యేక తరగతిగా గుర్తించి అవసరమైన వనరులన్నీ సమకూర్చాలి.

ప్రస్తుతం రాష్ట్రంలో సాగునీటి పారుదల కింద వ్యవసాయం జరుగుతున్న 108.284 లక్షల ఎకరాలలో ప్రభుత్వ నిర్వహణలో గల కాలువలు, చెరువుల ద్వారా 56.464 లక్షల ఎకరాలు

సాగుబడి అవుతోంది. ఇదే కాలంలో పంపుసెట్ రైతుల సొంత పెట్టుబడి నిర్వహణలో 43.93 లక్షల ఎకరాలు సాగుబడి అవుతోంది. ఇతరముల ద్వారా 4.89 లక్షల ఎకరాలు సాగవుతోంది. ప్రభుత్వ నిర్వహణలో గల కాలువలు, చెరువుల క్రింద గల 56.464 లక్షల ఎకరాల భూమికి ప్రభుత్వం ఎకరా ఒక్కింటికి నీటితీరువా రెండు పంటలకు కలిపి సాలీనా రూ.350లు మాత్రమే వసూలు చేస్తున్నది. అనగా ఈ మొత్తం భూమికి నీటిపారుదల వ్యయంగా ప్రభుత్వం పల్లపు రైతుల వద్ద నుంచి రూ.197.62 కోట్లు వసూలు చేస్తోంది. ఇదేతరహాలో పంపుసెట్టు రైతు కూడా ఎకరా ఒకటికి నీటితీరువా సాలీనా రూ.350 వంతున చెల్లిస్తే ప్రభుత్వానికి జమయ్యేది. 164.25 కోట్లు మాత్రమే. కాని పంపుసెట్టు రైతులు చెల్లిస్తున్నది అంతకంటే చాలా ఎక్కువ. అదెలాగో పరిశీలిద్దాం.

ఒక్కొక్క బోరు బావి క్రింద నీటిపారుదల విస్తీర్ణం రెండు ఎకరాలుగా పరిగణించి ఒక ఎకరా సాగునీటి పారుదల ఖర్చును లెక్కిస్తే ఈ క్రింద విధంగా ఉంటుంది. బోరు వేయడానికి పంపుసెట్టు బిగించి విద్యుత్ కనెక్షన్ తెచ్చుకోవడానికి పెట్టుబడి లక్ష రూపాయలన్నది జగమెరిగిన సత్యమే.

## ఎకరా నీటిపారుదల ఖర్చు

| | | |
|---|---|---|
| 1. | బోరు పంపుసెట్టు, విద్యుత్ కనెక్షన్ పెట్టుబడి ఒక లక్ష రూపాయలకు 24 శాతం వడ్డీ వంతున అయ్యే వడ్డీ ఖర్చు | రూ.24,000.00 |
| 2. | వార్షిక నిర్వహణ వ్యయం | రూ.4,000.00 |
| 3. | వార్షిక విద్యుత్ చార్జీల వ్యయం | రూ.6,000.00 |
| 4. | బోరు బావి జీవితకాలం పది సంవత్సరాలుగా పరిగణిస్తే వార్షిక తరుగుదల | రూ.10,000.00 |
| | **మొత్తం:** | **రూ.44,000.00** |

పెట్టుబడి కాక సంవత్సరానికి రెండు ఎకరాల నీటిపారుదలకు అయ్యే ఖర్చు మొత్తం రూ.44 వేలు. అనగా పంపుసెట్టు రైతుకు సాలీనా ఒక ఎకరా సాగునీటి పారుదల ఖర్చు రూ.22 వేలు.

అంటే పల్లపు రైతు సాలీనా ఎకరా సాగునీటి తీరువాకు రూ.350 చెల్లిస్తే పంపుసెట్ రైతులు సాలీనా ఎకరాకు రూ.22 వేల వంతున 43.93 లక్షల ఎకరములకు మొత్తం రూ.10 వేల 324 కోట్లు వ్యయం చేస్తున్నారు. ప్రాజెక్టు రైతులతో పోల్చి చూస్తే ఎకరా ఒక్కింటికి రూ.350 వంతున 43.93 లక్షల ఎకరాలకు వీళ్లు రూ.164 కోట్లు మాత్రమే వ్యయం చేయవలసి ఉంటుంది. అదే ప్రాజెక్టు రైతు ఎకరా ఒక్కింటికి రూ.22 వేలు వంతున వ్యయం చేస్తే సాలీనా మొత్తం 12 వేల 422 కోట్ల భారాన్ని వాళ్లు మోయవలసి ఉంటుంది. కానీ వారు ప్రభుత్వానికి చెల్లిస్తున్నది 197 కోట్లు మాత్రమే. ఒకో రాష్ట్రంలో ఒకో పరిపాలనలో నీటిపారుదల వ్యయాలలో ప్రాజెక్టు రైతుకు, పంపుసెట్టు రైతుకు ఇంతటి భారీ వ్యత్యాసమా? ఇది సమంజసమా? ఒక ఎకరా నీటిపారుదల ఖర్చు ఏడాదికి రూ.22 వేలుగా గల పంపుసెట్టు రైతు ఎకరా నీటిపారుదల ఖర్చు రూ.350గా గల ప్రాజెక్టు రైతుతో పోటీపడి ఎలా మనుగడ సాధించగలడు?

నీటిపారుదల వ్యయంలో ప్రాజెక్టు రైతుకు, పంపుసెట్ రైతుకు ఇంతటి భారీ వ్యత్యాసం ఉన్న నేపథ్యంలో ఉచిత వ్యవసాయ విద్యుత్ డిమాండ్ ఉద్యమం ప్రారంభమైంది. ఈ డిమాండ్ ఎంతవరకు సమంజసమో చూద్దాం.



ప్రభుత్వం కోటానుకోట్ల రూపాయలు వెచ్చించి సాగునీటి ప్రాజెక్టులు నిర్మించి కాలువలు త్రవ్వించి సాగునీటిని రైతుల పొలం ముంగిటకు సరఫరా చేయడమే కాక సదరు ప్రాజెక్టు, కాలువల నిర్వహణను కూడా తనే భరిస్తున్నది. సదరు ప్రాజెక్టు కిందవాళ్లు వసూలు చేస్తున్న నీటితీరువా చార్జీలను పట్టిక 8లో పరిశీలిద్దాం.

## పట్టిక-8
## నీటితీరువా చార్జీలు

| పంట వివరాలు | కేటగిరి-1<br>భారీ, మధ్యతరహా ప్రాజెక్టుల కింద ఒక ఎకరాకు నీటితీరువా | కేటగిరి-2<br>4 నెలల పైబడి సాగునీటి వసతి ఉన్న అన్నిరకాల ప్రభుత్వ వనరులకు ఒక ఎకరాకు తీరువా |
|---|---|---|
| మొదటి లేక 1 నీటి పంటకు (వరి) | రూ.200 | రూ.100 |
| 2వ మరియు 3వ నీటి పంటకు (వరి) | రూ.150 | రూ.100 |
| మొదటి ఆరుతడి పంటకు | రూ.100 | రూ.100 |
| 2వ మరియు 3వ ఆరుతడి పంటకు | రూ.100 | రూ.60 |
| ఒక ఫసలీలు 2 ఫసలీలు పంటకు | రూ.350 | రూ.350 |
| చేపల పెంపకము 1 సం॥నకు | రూ.500 | రూ.500 |

పట్టిక 9ని జాగ్రత్తగా పరిశీలించండి.

## పట్టిక-9
## ప్రభుత్వం చేసిన ఖర్చు - భారీ x చిన్న ప్రాజెక్టులు

| | |
|---|---|
| ఆంధ్రప్రదేశ్‌లో సాగుయోగ్యమైన భూమి | 167.139 లక్షల హెక్టార్లు |
| సాగుచేస్తున్న భూమి<br>(సాగు యోగ్యమైన భూమిలో 70%) | 118.17 లక్షల హెక్టార్లు |
| సాగునీటి వసతి కల్పించిన భూమి<br>(సాగు యోగ్యమైన భూమిలో 30%) | 50.15 లక్షల హెక్కాటర్లు |
| **సాగునీటి వసతిలో-** | |
| 1950కి ముందు కల్పించినది | 27 లక్షల హెక్టార్లు |
| 1950కి తరువాత కల్పించినది | 23 లక్షల హెక్టార్లు |
| **1950 తరువాత కల్పించిన దానిలో-** | |
| భారీ, మధ్యతరహా ప్రాజెక్టుల కింద | 17 లక్షల హెక్టార్లు (73.9%) |
| చిన్నతరహా ప్రాజెక్టుల కింద<br>(పంచాయతీరాజ్ స్కీంలతో సహా) | 6 లక్షల హెక్టార్లు (26.1%) |

| | |
|---|---|
| భారీ, మధ్యతరహా ప్రాజెక్టుల కింద చేపట్టిన స్కీములు | 157 |
| చిన్నతరహా ప్రాజెక్టుల కింద చేపట్టిన స్కీములు | 14253 |
| అందులో పంచాయతీరాజ్ స్కీంలు | 10045 |

**1950-2000 కాలంలో పెట్టిన ఖర్చు-**

| | |
|---|---|
| భారీ ప్రాజెక్టుల కోసం | రూ.8736.68 కోట్లు |
| చిన్నతరహా ప్రాజెక్టుల కోసం (పంచాయతీరాజ్‌తో సహా) | రూ.1350.87 కోట్లు |

**ఒక హెక్టార్ నీటివసతి కల్పన కోసం పెట్టిన ఖర్చు-**

| | |
|---|---|
| భారీ, మధ్యతరహా ప్రాజెక్టులలో | రూ.51,392 |
| చిన్నతరహా ప్రాజెక్టులలో | రూ.22,514 |

ఆంధ్రప్రదేశ్‌లో నీటిపారుదల రంగంపై నోట్, 1999

అర్ధ శతాబ్ద కాలంలో అనగా 1950 నుంచి 2000 సంవత్సరం వరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అన్నిరకాల నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణానికి కలిపి ఖర్చు పెట్టింది కేవలం రూ.10,087.65 కోట్లు. ఇదేకాలంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పంపుసెట్ రైతులు తమ స్వశక్తితో 22 లక్షల పంపుసెట్లుకి గాను 22 వేల కోట్ల రూపాయలను సాగునీటి పారుదల రంగంలో పెట్టుబడి పెట్టారు. అనగా ప్రభుత్వంవారు పెట్టిన పెట్టుబడుల కంటే పంపుసెట్టు రైతులు దాదాపు రెండింతలకు పైగా రాష్ట్ర నీటిపారుదల రంగంలో పెట్టుబడి పెట్టడం గమనించదగ్గ విషయం. ఈ విషయాన్ని ప్రభుత్వంవారు ఎందుకు గ్రహించడంలేదు.

ప్రభుత్వం ప్రకటిస్తున్న కనీస మద్దతు ధరలు అన్నిరకాల వ్యవసాయదారులకు అనగా ప్రభుత్వమే సాగునీటి సదుపాయాన్ని కల్పించి నామమాత్రపు నీటిపారుదల చార్జీలను వసూలుచేస్తున్న ప్రాజెక్టు పరిధిలోని రైతుల వ్యవసాయ ఉత్పత్తులకూ రైతులు తమంత తాముగా ఆర్థిక భారం వహించి సాగునీటి సదుపాయం కల్పించుకొని పండించిన పంటలకూ ఒకేరకమైన కనీస మద్దతు ధరలు నిర్ణయించడంలో గల న్యాయం ఏమిటి? కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటిస్తున్న వ్యవసాయ ఉత్పత్తుల కనీస మద్దతు ధరల నిర్ణయంలో అతి కీలకపాత్ర వహిస్తున్న అంశం ఉత్పత్తి ఖర్చు. పంపుసెట్టు రైతుల ఉత్పత్తి ఖర్చుకు ప్రాజెక్టు రైతుల ఉత్పత్తి ఖర్చుకు వ్యత్యాసం లేదా? పంపుసెట్ రైతుల అధిక ఉత్పత్తి ఖర్చులకు పరిహారం ఇవ్వవలసిన బాధ్యత ప్రభుత్వానికి లేదా? మన సమాజంలో కొన్ని వర్గాల మధ్య గల అసమానతలు, అన్యాయాలు రూపుమాపుటకు ప్రభుత్వం కొన్ని ప్రత్యేక నిబంధనలు రూపొందించడంలేదా? ఉదాహరణకు సంఘటిత రంగంలో గల ఉద్యోగుల విషయాన్ని పరిశీలిద్దాం. ఒక తరగతి ఉద్యోగులు దేశంలో ఎక్కడ పనిచేస్తున్నా మూలవేతనం మాత్రం ఒక్కటే. కానీ వారు పనిచేస్తున్న వివిధ ప్రదేశాలలో గల అధిక జీవన వ్యయాన్ని దృష్టిలో ఉంచుకొని సదరు అధిక జీవన వ్యయాన్ని తటస్థీకరింప చేయడానికి ప్రభుత్వం వివిధరకాల అలవెన్సులతో ఉద్యోగులను ఆదుకోవడంలేదా? ఒక ఉద్యోగి హైదరాబాద్‌లో పనిచేసినా, చిత్తూరులో పనిచేసినా, గ్రామీణ ప్రాంతంలో పనిచేసినా మూలవేతనం ఒక్కటే. కానీ ప్రభుత్వం అతనికి చెల్లించే ఇంటి అదేలో గ్రామీణ ప్రాంతాలకు, పట్టణ ప్రాంతాలకు, నగరాలకు వ్యత్యాసం ఉంది కదా! ఉద్యోగులు సంఘటిత



రంగంలో ఉన్నందున వారి పోరాటానికి జడిసి ప్రభుత్వం వారికి ఈ సదుపాయాలు కల్పిస్తోంది. అసంఘటిత రంగంలో గల పంపుసెట్ రైతులకు జరుగుతున్న అన్యాయానికి ఉపశమనం కల్గించ వలసిన బాధ్యత మాత్రం ప్రభుత్వానికి లేదా?

పంపుసెట్ రైతు కరెంట్ చార్జీలను ఏ వనరుల నుంచి చెల్లించాలి? పంపుసెట్ ద్వారా తాను సేద్యం చేసి సదరు వ్యవసాయంలో లాభం పొందితేనే కదా కరెంటు చార్జీలు చెల్లించగలడు. మరి అతడు లాభాలను పొందుతున్నాడని ప్రభుత్వం భావిస్తున్నదా? రైతులు సొంత వనరులతో బోరు వేసి మోటారు అమర్చి విద్యుత్ సరఫరా పొంది చార్జీలు చెల్లించి వ్యవసాయం చేసి మనుగడ సాగించగలరని ప్రభుత్వం నిజంగానే భావిస్తున్నదా? ప్రభుత్వం కోరినచోట తమ భూములలో ప్రయోగాత్మకంగా ప్రదర్శన క్షేత్రం నిర్వహించడానికి రైతులు సిద్ధంగానే ఉన్నారు. ప్రభుత్వం పెట్టుబడితో బోరు వేద్దాం, మోటారు అమర్చుదాం, విద్యుత్ సరఫరా చేద్దాం, విద్యుత్ చార్జీలు చెల్లిద్దాం, సేద్యం చేద్దాం. సంయుక్తంగా జమాఖర్చులు నిర్వహిద్దాం. రైతులు బ్రతికి బట్టకట్టగలరేమో చూద్దామా? అందుకు ప్రభుత్వం సిద్ధమేనా?

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారి ఎకనామిక్స్, స్టాటిస్టికల్ డైరెక్టరేట్ 2000 సంవత్సరం విడుదల చేసిన స్టాటిస్టికల్ ఆబ్‌స్ట్రాక్ట్ టేబుల్ నెం.5.2, పట్టిక-10 ప్రకారం పరిశీలించగా చిత్తూరు జిల్లాలో కాలువల ద్వారా 239 హెక్టార్లు మాత్రమే సాగవుతుండగా, గుంటూరు జిల్లాలో గరిష్ఠంగా 3,09,240 హెక్టార్లకు కాలువల ద్వారా సాగునీరు అందుతోంది. ఈ పట్టికను నిశితంగా పరిశీలిస్తే ఒక్కొక్క జిల్లాకు కాలువల ద్వారా సాగునీరు అందుతున్న భూమి విస్తీర్ణం మధ్య తేడాలు ఎంత భారీగా ఉన్నాయో తెలుస్తుంది. ఇంతటి భారీ అసమానతలకు కారణం కేవలం ప్రకృతిలోని అసమతుల్యమే కాదు, పాలకుల నిర్లక్ష్యం కూడా. ఇప్పటికైనా ప్రభుత్వం వారు మేల్కొని ఈ భారీ అసమానతలను తగ్గించడానికి పటిష్ట చర్యలు గైకొనాలి.

## పట్టిక-10
## 1999-2000లో (జిల్లాల వారీగా) వివిధ నీటి వనరుల ద్వారా సాగుచేయబడిన భూమి

(హెక్టార్లలో)

| వ. సం. | జిల్లా నికర సాగుభూమి | గొట్టపు బావులు కాలువలు | చెరువులు | గొట్టపు బావులు | ఇతర వనరులు | | ఒకసారి కంటే ఎక్కువ నీటిపారుదల లభించేభూమి | | మొత్తం సాగు భూమి |
|---|---|---|---|---|---|---|---|---|---|
| (1) | (2) | (3) | (4) | (5) | (6) | (7) | (8) | (9) | (10) |
| 1. | శ్రీకాకుళం | 89,063 | 72,533 | 5,792 | 5,287 | 181,538 | 9,538 | 191,076 | |
| 2. | విజయనగరం | 36,442 | 88,660 | 5,259 | 10,681 | 2,557 | 143,599 | 21,943 | 165,542 |
| 3. | విశాఖపట్నం | 41,131 | 32,736 | 6,420 | 6,065 | 26,269 | 112,621 | 35,368 | 147,989 |
| 4. | తూర్పు గోదావరి | 184,961 | 34,578 | 49,417 | 2,305 | 11,147 | 282,408 | 182,274 | 464,682 |
| 5. | పశ్చిమ గోదావరి | 188,222 | 33,753 | 117,769 | 18,939 | 9,385 | 368,068 | 238,744 | 606,812 |
| 6. | కృష్ణ | 238,305 | 32,738 | 22,282 | 14,699 | 16,507 | 324,531 | 141,024 | 465,555 |

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 7. గుంటూరు | 309,240 | 5,270 | 38,329 | 4,037 | 15,627 | 372,503 | 24,416 | 396,919 |
| 8. ప్రకాశం | 73,516 | 15,040 | 39,954 | 29,172 | 26,480 | 184,162 | 6,778 | 190,940 |
| 9. నెల్లూరు | 71,095 | 64,105 | 46,339 | 42,338 | 7,972 | 231,849 | 37,567 | 269,416 |
| 10. చిత్తూరు | 239 | 25,073 | 45,941 | 101,200 | 195 | 172,648 | 47,632 | 220,280 |
| 11. కడప | 20,153 | 2,415 | 88,800 | 20,129 | 1,607 | 133,104 | 37,214 | 170,318 |
| 12. అనంతపురం | 30,727 | 4,663 | 61,653 | 38,048 | 3,314 | 138,405 | 33,560 | 171,965 |
| 13. కర్నూలు | 72,581 | 11,625 | 43,920 | 31,500 | 8,748 | 168,374 | 36,015 | 204,389 |
| 14. మహబూబ్‌నగర్ | 14,584 | 3,359 | 95,464 | 38,510 | 5,269 | 157,186 | 43,416 | 200,602 |
| 15. రంగారెడ్డి | 1,062 | 2,356 | 38,319 | 32,515 | 1,614 | 75,866 | 18,678 | 94,544 |
| 16. హైదరాబాద్ | - | 32 | 22 | 14 | 104 | 172 | - | 172 |
| 17. మెదక్ | 3,186 | 14,600 | 94,851 | 25,322 | 1,176 | 139,135 | 50,765 | 189,900 |
| 18. నిజామాబాద్ | 24,746 | 23,938 | 107,503 | 9,972 | 3,646 | 169,805 | 115,944 | 285,749 |
| 19. ఆదిలాబాద్ | 23,600 | 19,967 | 16,678 | 14,700 | 2,079 | 77,024 | 19,555 | 96,579 |
| 20. కరీంనగర్ | 64,477 | 31,900 | 5,142 | 151,923 | 2,742 | 256,184 | 116,963 | 373,147 |
| 21. వరంగల్ | 2,633 | 69,334 | 17,803 | 193,100 | 4,293 | 287,163 | 58,305 | 345,468 |
| 22. ఖమ్మం | 65,100 | 52,422 | 17,415 | 34,898 | 26,257 | 196,092 | 14,242 | 210,334 |
| 23. నల్లగొండ | 79,189 | 10,330 | 34,553 | 71,374 | 16,241 | 211,687 | 71,818 | 283,505 |
| **మొత్తం** | **1634,252** | **651,427** | **999,625** | **900,304** | **198,516** | **4384,124** | **1361,759** | **5745,883** |

మూలం: డైరెక్టరేట్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టిక్స్, ఆంధ్రప్రదేశ్

ఈ వివరాలనే కోస్తా, రాయలసీమ, తెలంగాణ ప్రాంతాల వారీగా పరిశీలిద్దాం.

## పట్టిక నెంబర్-11
## 1999-2000 సంవత్సరంలో ప్రాంతాల వారీగా వివిధ పద్ధతుల ద్వారా జరుగుతున్న సాగుబడి

(హెక్టార్లలో)

| ప.నెం. | ప్రాంతం పారుదల విస్తీర్ణం | | | | | |
|---|---|---|---|---|---|---|
| | కాలువలు | చెరువులు | బోరుబావులు | ఇతరబావులు | ఇతరములు | మొత్తం |
| 1. కోస్తా | 1231975 | 379413 | 331561 | 137099 | 121431 | 2211279 |
| 2. రాయలసీమ | 123700 | 43776 | 240314 | 190877 | 13864 | 612531 |
| 3. తెలంగాణ | 278577 | 228248 | 427750 | 572328 | 63221 | 1560314 |
| **మొత్తం:** | **1634252** | **651427** | **999625** | **900304** | **198516** | **2384124** |



కాలువల కింద సాగును ప్రాంతాల వారీగా పరిశీలిస్తే కోస్తా ప్రాంతంలో 12,31,975 హెక్టార్లు సాగవుతుండగా రాయలసీమలో 1,23,700 హెక్టార్లు, తెలంగాణ ప్రాంతంలో 2,78,577 హెక్టార్లు మాత్రమే సాగవుతున్నది. వెనుకబడిన ప్రాంతమైన రాయలసీమ, తెలంగాణలోని 14 జిల్లాలలో కలిపి కాలువల క్రింద 4,02,277 హెక్టార్లు సాగవుతుండగా కోస్తా ప్రాంతంలోని తొమ్మిది జిల్లాలలో 12,31,975 హెక్టార్లు సాగవుతున్నది. ఈ భారీ వ్యత్యాసానికి పాలకుల నిర్లక్ష్యం కారణం కాదా?

చెరువుల విషయానికి వస్తే అభివృద్ధి చెందిన కోస్తా ప్రాంతంలోని తొమ్మిది జిల్లాలలో 379413 హెక్టార్లు సాగవుతుండగా రాయలసీమ, తెలంగాణలోని 14 జిల్లాలలో 2,72,024 హెక్టార్లు మాత్రమే సాగవుతున్నది.

పై గణాంకాలను పరిశీలిస్తే ప్రభుత్వ ఖర్చుతో నిర్మించిన కాలువలు, చెరువుల ద్వారా కోస్తా ప్రాంతపు తొమ్మిది జిల్లాలలో 16,11,388 హెక్టార్లు సాగవుతుండగా వెనుకబడిన ప్రాంతం అయిన రాయలసీమ, తెలంగాణలలోని 14 జిల్లాలలో కేవలం 6,74,310 హెక్టార్లు సాగవుతున్నట్టు స్పష్టమవుతున్నది.

అభివృద్ధి చెందిన కోస్తా ప్రాంతంలో రైతులు సొంత వ్యయంతో వేసుకున్న బోరుబావుల ద్వారా కేవలం 4,68,660 హెక్టార్లు సాగవుతుండగా రాయలసీమ, తెలంగాణ వాసులు సొంత ఖర్చులతో 14,31,269 హెక్టార్లలో సాగుచేస్తున్నారు. దీన్నిబట్టి ఒక ప్రాంతం వారు ప్రభుత్వ నిధులలో అత్యధికంగా లబ్ధిపొందుతుండగా పాలకుల నిర్లక్ష్యం ఫలితంగా మిగతా ప్రాంతవాసులు నామమాత్రపు లబ్ధిని మాత్రమే పొందుతున్నారు. ఇప్పటికైనా ఈ ప్రజలు మేల్కొని తమ హక్కులు సాధించుకొనకపోతే భవిష్యత్‌తరాల వారు క్షమించరు.

దాదాపు అన్ని రాష్ట్రాలలోనూ (కొన్ని రాష్ట్రాలు మినహాయిస్తే) బావులు, బోరుబావుల కింద సాగు కాలువలు, చెరువుల కింద సాగుబడికంటే ఎక్కువగా ఉండడం గమనార్హం. దీన్ని అర్థం చేసుకోకుండా పంపుసెట్ రైతుల సంక్షేమాన్ని విస్మరించి రాజకీయ నాయకులు, ఆర్థిక విశ్లేషకులు కూడా ఉచిత వ్యవసాయ విద్యుత్ డిమాండ్‌ను వ్యతిరేకిస్తూ ఒక వర్గం రైతుల సేవలను పూర్తిగా దోపిడీ చేస్తున్నారు. ఇందుకు కారణం అవగాహనా లోపంతో విద్యుత్ ఉత్పత్తి ప్రసార పంపిణీ ఖర్చులను మాత్రమే పరిగణనలోకి తీసుకొని పంపుసెట్ రైతు ఖర్చులను విస్మరించడమే. పంపుసెట్ వ్యవసాయం వలన దేశానికి, ప్రభుత్వానికి కలుగుతున్న సేవలను వారు గుర్తించడం లేదు. వ్యవసాయ విద్యుత్ ఖర్చును, పంపుసెట్ రైతుల వలన దేశానికి కలుగుతున్న లబ్ధిని పోల్చి చూస్తే వ్యవసాయ విద్యుత్ ఖర్చు నామమాత్రమే.

దురదృష్టవశాత్తు ఈ సత్యాన్ని ప్రభుత్వం గ్రహించక మొండిగా, ఏకపక్షంగా ఉచిత వ్యవసాయ విద్యుత్ డిమాండ్‌ను తిరస్కరిస్తోంది. పంపుసెట్ రైతులకు తీరని అన్యాయం చేస్తోంది.

రాష్ట్రంలో సాగునీటి పారుదల కిందగల భూమిలో 52 శాతం భూమికి ప్రభుత్వంవారే వేలాది కోట్ల రూపాయలు వెచ్చించి ఎకరా ఒకటికి రూ.350 రూపాయలు నీటితీరువాగా వసూలుచేసి నీటిపారుదల సౌకర్యాన్ని కల్పిస్తుండగా 43 శాతం భూమికి రైతులే తమ సొంత పెట్టుబడి నిర్వహణలో 22 లక్షల పంపుసెట్‌ల ద్వారా 22 వేల కోట్ల రూపాయలు వ్యయంచేసి సాగునీటి సౌకర్యం కల్పించుకొంటున్నారు. అంతేకాక నీటిపారుదల వ్యయం ఎకరా ఒకటికి రూ.350 వంతున 164 కోట్ల రూపాయలు భరించవలసి ఉండగా వాస్తవానికి నీటిపారుదల వ్యయం ఎకరా ఒకటికి రూ.22

వేలు చొప్పున పంపుసెట్ రైతులు సాలీనా 10 వేల 324 కోట్ల వ్యయం భరిస్తూ ప్రభుత్వానికి ఎదురు సబ్సిడీగా రూ.10,000 కోట్లకు పైగా సమకూరుస్తున్నారు. పంపుసెట్ రైతులచే నిర్వహించ బడుతున్న ఈ 43 శాతం వ్యవసాయం లేకుండా రాష్ట్ర ఆహార పరిస్థితిని ఊహించగలమా.

పంపుసెట్ రైతుల వలన రాష్ట్ర ధాన్యాగారానికే కాక కోశాగారానికి కూడా వివిధ పన్నుల రూపేణా వస్తున్న ఆదాయాన్ని ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవలసిన అవసరం లేదా? వివిధ వర్గాల మధ్య అసమానతలను రూపుమాపి కొంతవరకైనా న్యాయం కలుగజేయవలసిన బాధ్యత ప్రభుత్వానికి లేదా? పంపుసెట్ రైతులు అడుగుతున్నది ఉచిత విద్యుత్ మాత్రమే. పంపుసెట్ రైతుల సాధక బాధకాలను గుర్తించింది కాబట్టే ప్రభుత్వం వ్యవసాయ విద్యుత్‌పై సబ్సిడీ ఇస్తున్నది. కానీ ప్రపంచ బ్యాంకు ఆదేశాలకు తలొగ్గి రాష్ట్ర ప్రభుత్వం పంపుసెట్ రైతుల మనుగడను విస్మరించి వ్యవసాయ విద్యుత్ విషయంలో మొండి వైఖరిని అవలంబిస్తున్నది.

వ్యవసాయ విద్యుత్ చార్జీల విషయం గణాంక వివరాలతో చర్చించాల్సిన విషయం మాత్రమే కాదు. ఇది సామాజిక సమస్య. సమస్య జటిలం కాకముందే ప్రభుత్వం సమస్య తీవ్రతను గ్రహించాలి. వ్యవసాయ విద్యుత్ బలవంతపు వసూళ్ళను భరించలేక రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా వందలాది కోట్ల రూపాయల వ్యవసాయ విద్యుత్ బకాయిలు పేరుకొన్నాయి. ప్రభుత్వం ఇప్పటికైనా వాస్తవాలను గ్రహించకుంటే రైతులు చట్టాన్ని తమ చేతులలోనికి తీసుకొనే రోజులు ఎంతో దూరం లేదు.

సంపన్న దేశాలలో రైతులకు వారి ప్రభుత్వాలు 50 శాతం సబ్సిడీ చెల్లిస్తూ మన దేశాలకు వచ్చేసరికి రైతుకు ఏ రకం సబ్సిడీ ఇవ్వకుండా చేస్తూ వాళ్లతో పోటీపడమనడం అన్యాయమని భారత ప్రభుత్వం ఇప్పటికే గుర్తించింది. విదేశీ రైతు వలన మన రైతుకు జరుగుతున్న అన్యాయాన్ని గ్రహించిన ప్రభుత్వం స్వదేశంలో ఒక ఎకరాకు రూ.22 వేలు నీటిపారుదల ఖర్చుకాగల పంపుసెట్ రైతును ఓక ఎకరా నీటిపారుదల ఖర్చు రూ.350 గల ప్రాజెక్టు రైతుతో పోటీపడమనడం ఏం న్యాయం?

ఈ నేపథ్యంలో భారత రాష్ట్రపతి అబ్దుల్ కలామ్ తన ప్రథమ రిపబ్లిక్ డే సందేశంలో చెప్పిన వాస్తవాలను మనం గ్రహించాలి. "దేశంలో వ్యవసాయ ఉత్పత్తులకు బాగా డిమాండ్ పెరుగుతోంది. మరోవైపు అందుకు దీటుగా సాగుభూమి కన్పించడంలేదు. పైగా ఉన్న సాగుభూమి కూడా కుంచించుకుపోతోంది. ప్రస్తుతం దేశంలో 17 కోట్ల హెక్టార్ల వ్యవసాయ భూమి ఉంది. 2020 నాటికి అది పదికోట్ల హెక్టార్లకు తగ్గబోతున్నది. జనాభా పెరుగుదల, పర్యావరణావసరాలు, ఇతర ఒత్తిడులు దీనికి కారణం. ఈ నేపథ్యంలో ఉన్న భూమి నుంచే దిగుబడులు భారీగా పెంచడం అవసరం...". ఈ విషయంలో పంపుసెట్ రైతులే గణనీయమైన పాత్ర పోషించవలసి ఉంటుంది. ఇందుకు తగిన ప్రోత్సాహం ఇవ్వవలసిన బాధ్యత ప్రభుత్వానిదే.

ఇప్పటికైనా ప్రభుత్వం రాష్ట్రంలో నీటిపారుదల కింద సాగవుతున్న భూమిలో దాదాపు 45 శాతం రైతులు సొంత పెట్టుబడి నిర్వహణలో గల బావుల ద్వారానే సాగుబడి జరుగుతోందనే సత్యాన్ని గ్రహించాలి. అదేవిధంగా దేశంలో దాదాపు 60 శాతం సాగుబడి బావుల ద్వారానే జరుగుతున్నదనే సత్యాన్ని ప్రభుత్వం గుర్తించి పంపుసెట్ రైతుల మనుగడకు, దేశ ఆహార భద్రతకు ఉచిత వ్యవసాయ విద్యుత్ సరఫరా అనివార్యమని గ్రహించాలి. C





సమ్మె హక్కు:

# న్యాయమూర్తుల అధిక ప్రసంగం ఉద్యోగ సంఘాల నిర్వ్యాపకత్వం

– కె.బాలగోపాల్ *

**కా**ర్మికులకూ ఉద్యోగులకూ సమ్మె చేసే హక్కు లేదని సుప్రీంకోర్టు తమిళనాడు ఉద్యోగుల సమ్మె కేసులో చెప్పిందని దేశంలో చాలా ఆందోళన చెలరేగుతున్నది.



ఆ తీర్పులో సుప్రీంకోర్టు అనవసర ప్రసంగం చాలా చేసిందిగానీ కార్మికులకు సమ్మె హక్కు లేదనలేదు. ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రమే లేదనింది. అది కూడా సుప్రీంకోర్టు సొంతగా వెలిబుచ్చిన అభిప్రాయం కాదు. ప్రభుత్వ ఉద్యోగుల ప్రవర్తనా నియమావళిలోనే సమ్మెలో పాల్గొనడం శాఖాపరమయిన నేరం అని ఉంది. అలా ఉండడం రాజ్యాంగ విరుద్ధం కాదనీ – అంటే సమ్మెలో పాల్గొనే ప్రాథమిక హక్కేదీ ఉద్యోగులకు రాజ్యాంగం ఇవ్వలేదనీ – నలభై ఏళ్ల కిందనే సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం (కాన్‌స్టిట్యూషన్ బెంచి) ప్రకటించింది.

మరయితే తమిళనాడు ఉద్యోగుల కేసు విషయంలో దేశంలో జరుగుతున్న అలజడి అనవసర మయినదా? కాదు. ఒక్కొక్కసారి

అపోహల వల్ల కూడా మేలు జరగగలదన డానికి ఈ అలజడి ఒక తార్కాణం. అయితే దాని పూర్వాపరాల గురించి సరయిన అవగాహన అవసరం.

సుప్రీంకోర్టు మొన్న ఇచ్చిన తీర్పులోని అభ్యంతర కర లక్షణాలలో ఒకటేమిటంటే, అసలు తమిళనాడు ఉద్యోగులు ఎందుకోసం సమ్మె చేశారని ఎక్కడా చర్చించకపోవడం. ఆ తీర్పులో సమ్మెకు గల కారణాన్ని గురిం చిన కనీస ప్రస్తావన సహితం లేదు.

తమిళనాడు ఉద్యోగులు ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని కొత్త కోరికలేవీ కోరలేదు. ఆర్థిక భారం వేసే డిమాండ్లేవీ పెట్టలేదు. (ఈ రెండు పనులూ చేయకూడదని కాదు - చేయలేదనేది వాస్తవం) గతంలో చేసుకున్న ఒప్పం దాన్ని అమలుచేయమన్నారు, రిటైరయిన ఉద్యోగుల తదనంతర హక్కుల పైన పెట్టిన ఆంక్షలను తొలగించ మన్నారు. ఈ కోరికలతో వాళ్లు వెంటనే సమ్మెకు దిగలేదు. చాలా దఫాలు చర్చలూ, సంప్రదింపులూ జరిపారు. ఆ ప్రయత్నం ఫలించకపోయేసరికి సమ్మె నోటీసు ఇచ్చి సమ్మెకు దిగారు.

తమిళనాడు ప్రభుత్వం ఈ సమ్మెను ఎదుర్కొనడానికి 'ఎస్మా' ప్రయోగించింది. ఆ రాష్ట్ర ప్రభుత్వం లోని సకల శాఖలనూ 'అత్యవసర సర్వీసులు'గా ప్రకటించి సమ్మెను నిషేధించింది.

అయినప్పటికీ ఉద్యోగులు సమ్మెకు ఉపక్రమించారు. ఒకరూ ఇద్దరూ కాదు, లక్షల సంఖ్యలో సమ్మెకు దిగారు. అప్పుడు తమిళనాడు ప్రభుత్వం ఎస్మాకు ఆర్డినెన్స్ ద్వారా ఒక సవరణ తీసు కొచ్చింది. ఈ సవరణ సారాంశం ఏమిటంటే ఎస్మా కింద నిషేధించిన సమ్మెలో పాల్గొన్న వారిని విచారణ లేకుండా శిక్షించవచ్చును.

ఆ సవరణను ఆర్డినెన్స్ ద్వారా జారీచేసిన జయలలిత ప్రభుత్వం వెంటనే లక్షల మంది ఉద్యోగు లను బర్తరఫ్ చేసింది. ఈ చర్య చెల్లుతుందా అన్నది తమిళనాడు ఉద్యోగులు కోర్టు ముందుకు తెచ్చిన సమస్య. ఏ నేరానికైనా తప్పిదానికైనా విచారణ లేకుండా ఎవ్వరినీ శిక్షించడానికి వీలులేదనేది ప్రాథమిక సహజ న్యాయసూత్రం. దీనికి ఎంతో అరుదుగా తప్ప కోర్టులు మినహాయింపులు ఇవ్వ లేదు, ఇవ్వజాలవు. అటువంటప్పుడు నిషిద్ధ సమ్మెలో పాల్గొన్న పాపానికి నిర్విచారణగా లక్షలాదిగా ఉద్యోగులను బర్తరఫ్ చేయొచ్చునని చెప్పే చట్టం చెల్లుతుందా? ఉద్యోగులకు సమ్మె చేసే హక్కు లేదనే అనుకుందాం. ఎస్మా ప్రయోగించినప్పుడే కాదు, ప్రయోగించనప్పుడు కూడా లేదనుకుందాం. అయినప్పటికీ సమ్మె చేసినట్టయితే ఏ విచారణా జరపకుండా, ఎవరు బుద్ధెరిగి సమ్మెలో పాల్గొన్నారో, ఎవరు నలుగురిలో నారాయణా అంటూ పాల్గొన్నారో, ఎవరు సమ్మెకారులు కొడతారేమోనన్న భయంతో పాల్గొన్నారో, ఎవరు సమ్మె జరగకున్నా ఆ పూట వేరే కారణాల వల్ల డ్యూటీకి పోకపోదురో - ఇదేదీ విచారించకుండా అందరినీ టోకుగా శిక్షించడం న్యాయ సమ్మతమేనా? అట్లా శిక్షించే అధికారం ఇచ్చే చట్టం రాజ్యాంగ సమ్మతమేనా?

తమిళనాడు ఉద్యోగులు న్యాయస్థానాలను తేల్చమన్నది ఈ ప్రశ్నలను. కానీ న్యాయస్థానాలు చాలా విచిత్రంగా వ్యవహరించాయి. మొదట వారి కేసు విచారణకు తీసుకున్న మద్రాసు హైకోర్టు జడ్జి ఆ ఆర్డినెన్స్‌నూ దానికింద జరిగిన బర్తరఫ్‌లనూ వెంటనే 'స్టే' చేశాడు. నాగరిక సమాజాలలో అమలులో ఉన్న న్యాయసూత్రాలతో ఏ కొంచెం పరిచయం ఉన్న జడ్జి అయినా చేయవలసిన పని అదే. అయితే ఆ మధ్యాహ్నమే ఆ 'స్టే' మీద తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం చీఫ్ జస్టిస్ బెంచి ముందు అప్పీల్ వేసింది. పొద్దున్న జారీచేసిన ఆర్డర్ మీద మధ్యాహ్నం అప్పీలు స్వీకరించడం సాధారణంగా జరిగే విషయం కాదు గానీ, జయలలిత పాలన సాధారణమైనది కాదు కదా!

'ఉద్యోగుల సర్వీస్‌కు సంబంధించిన విషయాలను విచారించవలసింది అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునలే తప్ప హైకోర్టు కాదు' అంటూ చీఫ్ జస్టిస్ సుభాషణరెడ్డిగారు తమిళనాడు ప్రభుత్వం అప్పీల్‌ను అనుమతించారు. అసలు తమిళనాడు రాష్ట్ర అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్‌లో ఒకటి తప్ప అన్ని పోస్టులూ ఖాళీగా ఉన్నాయట. అక్కడ కేసులు విచారించడమూ తీర్పులు ఇవ్వడమూ జరగడం లేదంట. ఒక వేళ ట్రిబ్యునల్ సక్రమంగా నడుస్తూ ఉండినా, ఉద్యోగుల సర్వీస్‌కు సంబంధించిన కేసులు వినే బాధ్యత దానిదే అయినప్పటికీ అత్యవసర పరిస్థితులలో 'స్టే' ఇచ్చే అధికారాన్ని హైకోర్టు చలాయిం చకపోలేదు. సుభాషణ్‌రెడ్డిగారు గతంలో మన రాష్ట్ర హైకోర్టు జడ్జిగా ఉన్నప్పుడు అదే వైఖరి అవలంబించారు. వారికి ముందూ వారి తరువాతా మన హైకోర్టే కాక అన్ని హైకోర్టులూ అదే వైఖరి అవలంబించాయి, అవలంబిస్తున్నాయి. లక్షల మంది ఉద్యోగుల ఆకస్మిక బర్తరఫ్ ఒక అత్య వసర సందర్భం కాదని ఎవ్వరూ అనలేరు.

దీని మీద తమిళనాడు ఉద్యోగులు సుప్రీంకోర్టుకు అప్పీల్ చేశారు. సుప్రీంకోర్టు వ్యవహరించిన తీరును విచిత్రం అని కాక వేరే ఏమీ అనలేము. ఉద్యోగుల బర్తరఫ్ విషయంలో సుప్రీంకోర్టు ప్రాథమికంగా సరయిన వైఖరే తీసుకుంది. చట్ట విరుద్ధమయిన సమ్మెలో పాల్గొన్న వారందరినీ ఒకే గాటన కట్టడానికి వీలులేదనీ, గుంపులో ఒకరిగా పాల్గొన్న వారిని బర్తరఫ్ చేయడానికి వీలులేదనీ (ఏదయినా చిన్న శిక్ష వేస్తే వేసుకోవచ్చుననీ) సమ్మె చట్టవిరుద్ధం అని తెలిసీ దానిని నిర్వహించిన వారిపైన, సమ్మె చేయించడానికి బలప్రయోగం చేసిన వారిపైన కఠిన చర్యలు తీసుకోవచ్చుననీ, అయితే అది కూడా తొలగింపే కానక్కరలేదనీ, ఏ శిక్ష ఉచితం అనేది పరిస్థితులను బట్టి ఉంటుందనీ కనీసం ఒక డజను కేసులలో సుప్రీంకోర్టు గతంలో ప్రకటించి ఉంది. ఆ అభిప్రాయాన్ని కాదనడం ప్రస్తుత జడ్జిలకు సాధ్యమూ కాదు, వారు ఆ సాహసమూ చేయలేదు. అందువల్ల సమ్మె సందర్భంగా హింసకు పాల్పడినట్టు ఎఫ్ఐఆర్‌లో నమోదయిన వారిని మినహాయించి మిగిలిన వారినందరినీ తమిళనాడు ప్రభుత్వం తిరిగి పనిలోకి తీసుకోవాలని సూచించారు. ఎఫ్ఐఆర్ నమోదయిన వారికి ఏ శిక్ష వేయడం ఉచితంగా ఉంటుందో నిర్ణయించడానికి ముగ్గురు రిటైర్డు న్యాయమూర్తులతో ఒక కమిటీ వేసి, వారి నుంచి వివరణ స్వీకరించి నిర్ణయించాలన్నారు.

ఇప్పటివరకు దేశంలో అమలులో ఉన్న న్యాయ సిద్ధాంతానికిది అనుగుణంగానే ఉంది. అయితే సుప్రీంకోర్టు దీనిని తన ఆదేశంగా జారీచేయకుండా, తమిళనాడు ప్రభుత్వానికి సూచనగా అందజేసి వారి ఒప్పుకోలును నమోదు చేసింది. ఇదెక్కడి న్యాయనిర్ణయం? న్యాయబద్ధమైన తీర్పును ఆదే శంగా జారీచేయకుండా దోషికి దానిని సూచించి వారి ఒప్పుకోలును ఆదరపూర్వకంగా నమోదు చేయడం ఏ రకమైన ధర్మం? గ్రామాలలో పెత్తందార్ల దురాగతాల మీద పంచాయతీలు చేసే పెద్ద మనుషులు పెత్తందారు మనసు నొప్పించే పద్ధతిలో తీర్పు చెప్పకుండ, వారికో అనునయంగా నచ్చచెప్పి ఒప్పిస్తుంటారు. సుప్రీంకోర్టు అదే పని చేస్తే ఏమనాలి?

గ్రామాలలో జరిగే పంచాయతీలతో పోలిక అక్కడితో ఆగిపోలేదు. పనిలోకి తీసుకునే సిబ్బంది తమిళనాడు ప్రభుత్వాన్ని క్షమాభిక్ష కోరుతూ ఇంకెప్పుడూ సమ్మెలో పాల్గొనమని చెప్తూ కాగితం మీద రాసిచ్చి పనిలోకి పోవాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఇది చాలా అభ్యంతరకరమైన విష యం. బర్తరఫ్ చట్టబద్ధమయితే కోర్టు ఆ విషయాన్ని ప్రకటించి ఉద్యోగులను ఇంటికి పంపించ

వచ్చు. చట్ట విరుద్ధమైతే తిరిగి పనిలోకి తీసుకొమ్మని ప్రభుత్వాన్ని ఆదేశించవచ్చు. అంతే తప్ప 'కాల్మొక్కురా – దొర మంచోడు, నేన్ జెప్తే పనిలోకి దీస్కుంటడు' అనేది ఒక తీర్పూ, ఒక న్యాయ నిర్ణయమా, ఒక న్యాయస్థానం అనుసరించదగ్గ వైఖరా?

రెండవది, కోర్టు తీర్పు రూపంలో ప్రకటించినా రచ్చబండ పంచాయతీ రూపంలో చెప్పినా చట్టవిరుద్ధమైన సమ్మెలో పాల్గొన్న వారినందరినీ డిస్మిస్ చేయడం సరయినది కాదని సుప్రీంకోర్టు భావించిన తరువాత, ఇంక తమిళనాడు ప్రభుత్వ ఆర్డినెన్స్ చెల్లనట్టే కదా? ఆ విషయం ప్రకటించ వలసి ఉండింది కదా? సుప్రీంకోర్టు ఆ పని చేయలేదు. పంచాయతీ చేసి తమిళనాడు ప్రభుత్వాన్ని అనునయంగా ఒప్పించి 'ఆర్డినెన్స్ గురించి మేము ఏమీ చెప్పడంలేదని స్పష్టం చేస్తున్నాం. ఆ విష యం మద్రాసు హైకోర్టుకు వదిలేస్తున్నాం' అనింది. ఒకవేళ రేపు మద్రాసు హైకోర్టు ఆర్డినెన్స్ సక్రమమయినదేననే నిర్ణయానికి వచ్చిందనుకోండి. అప్పుడు సుప్రీంకోర్టు చేసిన పంచాయతీ చట్ట విరుద్ధం కాదా? ఆ విషయం మద్రాసు హైకోర్టు అనగలదా?

ఇక్కడితో ఆగిపోయినా పోనీలే అనుకుందుమేమో. కానీ సుప్రీంకోర్టు ఇక్కడితో ఆగిపోలేదు. అడిగిన ప్రశ్నకు జవాబు చెప్పకుండ, అడగని ప్రశ్న గురించి అధిక ప్రసంగం చేసింది. ఇదే ఎక్కువ మందికి కోపం తెప్పించింది. న్యాయస్థానాల తీర్పులు ఆయా కేసులలో లేవదీసిన ప్రశ్నలకు పరిమితం కావాలనేది న్యాయవ్యవస్థ క్రమశిక్షణకు సంబంధించిన ఒక ప్రాథమిక సూత్రం. ఒక మంచి కోసం దానిని కొంచెం అతిక్రమించమని మనమెప్పుడయినా కోరితే న్యాయమూర్తులు ససే మిరా అంటారు. కానీ ప్రజాస్వామ్యానికీ ప్రజాస్వామ్య హక్కులకూ నష్టం చేయడానికి దానిని అతిక్రమించడానికి వారే ఈ మధ్య కాలంలో ఆరాటం ప్రదర్శిస్తున్నారు.

ప్రభుత్వ ఉద్యగులకు సమ్మె చేసే హక్కు ఉందా లేదా అని కోర్టుకెక్కిన తమిళనాడు ఉద్యోగులు అడగలేదు. చట్టం నిషేధించిన సమ్మెలో పాల్గొన్న వారందరినీ నిర్విచారణగా బర్తరఫ్ చేసే అధికారం ఇచ్చే ఆర్డినెన్స్ చెల్లుతుందా లేదా చెప్పమని అడిగారు. అడిగిన ప్రశ్నను మద్రాసు హైకోర్టుకు వది లేసి, అడగని ప్రశ్న గురించి సుప్రీంకోర్టు సుదీర్ఘంగా వ్యాఖ్యానించింది.

సమ్మె హక్కు ఎప్పుడూ దుర్వినియోగం అవుతుందనింది. దీనికి ఆధారాలేమున్నాయి? ఈ దేశంలో గడచిన యాభై సంవత్సరాలలో జరిగిన సమ్మెలన్నింటినీ ఎవరయినా విశ్లేషించి అందులో ఎంత దుర్వినియోగం ఉందో వివరిస్తూ ఒక నివేదిక ఏదయినా సుప్రీంకోర్టుకు సమర్పించారా? అదేం లేదు. అది జడ్జిల అభిప్రాయమే తప్ప ఆధారాలతో వారి ముందు ఎవరూ వాదించిన విష యం కాదు. మనకందరికీ ఉన్నట్టు వారికి కూడా అభిప్రాయాలు ఉండే హక్కు ఉందిగానీ తమ అభిప్రాయాలను రుజువయిన సత్యాలుగా ప్రకటించే అధికారం లేదు. ఈ తీర్పు ఇచ్చిన జస్టిస్ ఎం.బి.షా గారికి బంద్‌లు, సమ్మెలు, ఊరేగింపులు మొదలయిన కార్యకలాపాలంటే ఇష్టం లేదని గ్రహించడానికి చాలా దాఖలాలున్నాయి. బంద్ పిలుపు ఇవ్వడం రాజ్యాంగ విరుద్ధం అంటూ కేరళ హైకోర్టు ఇచ్చిన తీర్పును సిపిఐ (ఎం) వారు సుప్రీంకోర్టులో సవాలుచేస్తూ, బంద్ నిర్వహణ కోసం బలప్రయోగం చేస్తేనూ, బెదిరింపులకు పాల్పడితేనూ తప్పవుతుందిగానీ శాంతియుతంగా నిర్వ హించే ఉదేశ్యంతో బంద్ పిలుపు ఇచ్చినా రాజ్యాంగ విరుద్ధం ఎట్లా అవుతుందని వాదించగా, 'అవును, అవుతుంది. అదంతే'నని కేరళ హైకోర్టు తీర్పును ఏ వివేచనా లేకుండా ముక్తసరిగా సమర్థిస్తూ సుప్రీంకోర్టు తరపున తీర్పు జారీచేసిన పెద్దమనిషి ఎం.బి.షా గారు.



లాయర్లు సమ్మె చేయడానికి వీలులేదంటూ అయిదుగురు జడ్జిల సుప్రీంకోర్టు బెంచి ఇచ్చిన తీర్పులో కూడా ఎం.బి.షా గారి భాగస్వామ్యం ఉంది. ఎప్పుడయినా చాలా ప్రత్యేకమైన పరిస్థితు లలో చేయవచ్చునన్న చిన్న మినహాయింపు తక్కిన నలుగురూ ఇచ్చారుగానీ, ఏ మినహాయింపూ లేదనీ, ఎట్టి పరిస్థితులలోనూ లాయర్లు సమ్మె చేయడానికి వీలులేదనీ ఎం.బి.షా గారు అన్నారు.

కాబట్టి జస్టిస్ ఎం.బి.షా గారికి సమ్మెలు బంద్‌లు ఊరేగింపులు మొదలయిన విషయాలంటే ఇష్టం లేదనేది స్పష్టమే. కానీ దాని నుంచి ఆయన 'సమ్మె హక్కు ఎప్పుడూ దుర్వినియోగం అవు తుంది' అన్న నిర్ధారణకు వస్తే అది మనకందరికీ ఎందుకు శిరోధార్యం కావాలి?

తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం పెట్టే ఖర్చులో 90 శాతం ఉద్యోగుల జీతభత్యాలకే పోతున్నది కాబట్టి ఉద్యోగులకు సమ్మె చేసే నైతిక హక్కు లేదని కూడా సుప్రీంకోర్టు అనింది. ఈ మాట అనే ముందు ఆ ఉద్యోగులు దేనికోసం సమ్మె చేశారో ఒకసారి చూడవలసి ఉండింది. వాళ్ల గతకాలపు హక్కులను కాపాడుకోవడానికో తప్ప కొత్త హక్కుల కోసం సమ్మె చేయనప్పుడు ఈ ప్రస్తావన ఎందుకవసరమయింది?

సమస్యల పరిష్కారానికి అందుబాట్లో ఉన్న అన్ని మార్గాలనూ అన్వేషించకుండా సమ్మె చేయ కూడదని కూడా సుప్రీంకోర్టు అనింది. సూత్రప్రాయంగా దీనికెవ్వరూ అభ్యంతరం చెప్పరుగానీ ప్రభుత్వ ఉద్యోగులకు ఎన్ని ప్రత్యామ్నాయ మార్గాలు అందుబాట్లో ఉన్నాయి? మినిస్టర్ల చుట్టూ తిరిగి న్యాయం చేయమని అడుక్కోవడాన్నీ పైరవీ చేసుకోవడాన్నీ పరిష్కార మార్గాలుగా గుర్తించ దలచుకుంటే చెప్పలేము గానీ అవి కాక వేరే ఏ పరిష్కారమార్గాలూ లేవు. ఇక్కడ కూడా సుప్రీంకోర్టు తమిళనాడు ఉద్యోగులు సమ్మెకు దిగక ముందు ఎంతకాలం ఎన్ని రూపాలలో ప్రయత్నం చేశారో తెలుసుకునే ప్రయత్నమేదీ చేయలేదు. ఆ ప్రస్తావన తీర్పులో ఎక్కడా లేదు. అయినప్పటికీ ప్రత్యా మ్నాయ ప్రయత్నాలు చేయకుండ నేరుగా సమ్మెకు దిగుతున్నారు అనే నింద మొత్తంగానే ఉద్యోగ వర్గాల మీద వేసి అసలు సమ్మె హక్కే మీకు లేదుపొమ్మనింది.

హక్కుల గురించీ అధికారాల గురించీ సుప్రీంకోర్టు చేసే వ్యాఖ్యానం చట్టంతో సమానమని రాజ్యాంగం అంటుంది. ఎటొచ్చీ ఆ వ్యాఖ్యానం అప్పటికో ఉన్న చట్టాలకూ, రాజ్యాంగానికీ లోబడి ఉండాలి. 1980 తరువాత కొంతకాలం పాటు సుప్రీంకోర్టు ఈ అధికారాన్ని మంచికోసం – అంటే ప్రజల హక్కులను పెంపొందించడం కోసం – వాడుకునింది. ఈ మధ్య కాలంలో దానికి వ్యతిరేక దిశగా వాడుకోవడం మొదలయింది. సమ్మెల గురించి, బంద్‌ల గురించి ఎం.బి.షా గారు ఇచ్చిన తీర్పులు దీనికొక తార్కాణం.

ఇక సుప్రీంకోర్టు సంగతి కొంచెం సేపు పక్కనపెట్టి ఉద్యోగ సంఘాల గురించి కొంచెం సేపు ముచ్చటించుకుందాం. మొదట్లోనే చెప్పినట్టు ఉద్యోగులకు సమ్మె హక్కు లేదనేది సుప్రీంకోర్టు కొత్తగా చెప్పిన విషయం కాదు. అది ప్రభుత్వ ఉద్యోగుల ప్రవర్తనా నియమావళిలోనే ఉంది. ఆ ప్రవర్తనా నియమావళులలో సమ్మె హక్కుమీదనే కాదు, భావ ప్రకటనా స్వేచ్ఛ మీద కూడా తీవ్రమయిన ఆంక్షలున్నాయి. కళ, సాహిత్యం, సంస్కృతులు తప్ప ఇతర విషయాల గురించి ప్రభుత్వ ఉద్యోగులు తమ పైవారి అనుమతి లేకుండా రాయకూడదు, మాట్లాడకూడదు, ఏవిధమైన బహిరంగ వ్యక్తీకర ణకూ పాల్పడకూడదు వగైరా.

ఈ ప్రవర్తనా నియమావళులు (బహువచనం ఎందుకు వాడుతున్నామంటే కేంద్ర ప్రభుత్వ

ఉద్యోగులకొకటి, ఒక్కొక్క రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులకొక్కటీ ఉన్నాయి – అయితే హక్కుల లేమి అన్నిటా సామాన్యమే) రాజ్యాంగం రాసుకున్న తరువాత పుట్టినవి కావు. అప్పుడప్పుడు కొన్ని సవరణలు చేస్తున్నారు గానీ ఇవి మౌలికంగా వలస పాలన కాలానివి.

రాజ్యాంగ ప్రాథమిక హక్కులకు విరుద్ధమైన చట్టాలు, నియమాలు, నిబంధనలు చెల్లవని రాజ్యాంగం అంటుంది కాబట్టి, ఉద్యోగుల ప్రవర్తనా నియమావళులలోని ఈ నిషేధాలు, నిర్బంధాలు చెల్లవంటూ రాజ్యాంగం అమలులోకి వచ్చిన మొదటి పది సంవత్సరాలలోనే ప్రభుత్వ ఉద్యోగులు కోర్టుకెక్కారు. ఆ సవాలు చివరికి సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం వదేకు పోయింది. సుప్రీంకోర్టు ఉద్యోగుల వాదనలో సగభాగాన్ని ఆమోదించి సగభాగాన్ని తిరస్కరించింది. భావప్రకటనా స్వేచ్ఛ రాజ్యాంగ ప్రాథమిక హక్కులలో భాగం కాబట్టి దానిని అహేతుకంగా నిర్బంధించే నియమాలు చెల్లవనీ, దానిపైన హేతుబద్ధమైన పరిమితులు మాత్రమే పెట్టవచ్చుననీ అనింది. సమ్మె చేసే హక్కు రాజ్యాంగ ప్రాథమిక హక్కు కాదు కాబట్టి దానిని పూర్తిగా నిషేధించే నిబంధనలో తప్పేమీ లేదనింది. ఈ తీర్పు 1962లో అయిదుగురు జడ్జిలు ఇచ్చారు. ఆ కేసు పేరు కామేశ్వర్ ప్రసాద్ వర్సస్ స్టేట్ ఆఫ్ బీహార్.

అందువల్లనే, మొన్నటి తీర్పులో సుప్రీంకోర్టు కొత్తగా అన్నదేమీ లేదన్నాము. (అధిక ప్రసంగాన్ని పక్కనపెడితే) అయినప్పటికీ రెండు విషయాలు చెప్పుకోవాలి. 40 ఏళ్ల కింద ఇదే అభిప్రాయం ప్రకటించినప్పుడు కోర్టు సమ్మె హక్కును తేలికగా తీసిపారేయలేదు. దానినొక అర్థవంతమైన హక్కుగా గుర్తిస్తూ, ఉద్యోగుల వాదనలను సవివరంగా ఉటంకిస్తూ, ఏది ఏమయినా రాజ్యాంగంలో ఆ హక్కు ఇవ్వనప్పుడు దానిని పూర్తిగా నిషేధించే చట్టాలు చేసినా నియమ నిబంధనలు ప్రకటించినా మేమేం చేయలేం అని తమ అవగాహన మేరకు అన్నారు. ఇప్పటి తీర్పు ధ్వనే వేరు.

రెండవది, 40 ఏళ్ల నాటికీ నేటికీ సుప్రీంకోర్టు తన పర్యవేక్షణాధికారాన్ని అర్థం చేసుకున్న తీరులో మార్పు వచ్చింది. రాజ్యాంగం ఇచ్చిన అధికారంతో చట్ట సభలు, ప్రభుత్వము ఏ చట్టాన్న యినా ఏ నియమాన్నైనా రూపొందించవచ్చుననీ అది రాజ్యాంగంలోని ఏదయినా నిర్దిష్టమైన అంశానికి వ్యతిరేకమయితే తప్ప కోర్టులు జోక్యం చేసుకోజాలవనీ అప్పట్లో సుప్రీంకోర్టు భావించేది. 1970ల తరువాత ఈ అవగాహనలో మార్పు వచ్చింది. రాజ్యాంగంలోని నిర్దిష్టమైన అంశాలే కాక మరికొన్ని ప్రమాణాల ఆధారంగా కూడా చట్టాలనూ చట్ట సంబంధమైన నియమాలనూ న్యాయస్థానాలు చెల్లవని ప్రకటించవచ్చునని ఇప్పుడు కోర్టులు భావిస్తున్నాయి. సహజ న్యాయసూత్రాల వంటి మౌలిక విలువలకు వ్యతిరేకమైనా, చెప్పుకున్న లక్ష్యానికీ చేసిన చట్టానికీ (లేక నియమానికీ) అసలే పొంతన లేకున్నా, ప్రాథమిక సహేతుకత లోపించినా ఆ చట్టాన్నీ లేక చట్ట సంబంధమైన నియమాన్నీ కొట్టేయవచ్చునని ఇప్పుడు కోర్టులు భావిస్తున్నాయి. ప్రభుత్వ ఉద్యోగులెవ్వరూ ఏ పరిస్థితులలోనూ సమ్మె చేయడానికి అసలే వీలులేదని చెప్పే నియమం క్రమశిక్షణ అనే లక్ష్యంతో పొంతనలేని శాసనం అనీ, ప్రాథమిక సహేతుకత లోపించిన నిబంధన అనీ వాదించే అవకాశం ఉంది. అంతేకాక భారత ప్రభుత్వం సంతకం చేసిన అంతర్జాతీయ ఒడంబడికలనూ, ప్రకటనలనూ కూడా కోర్టులు ఒకమేరకు లెక్కలోకి తీసుకోవచ్చునని 1990 తరువాత కోర్టులు భావిస్తున్నాయి. (అంతకు ముందు, పార్లమెంటు వాటికి శాసన రూపం ఇస్తే తప్ప అవి కోర్టుల పరిగణనలోకి రావని భావించేవారు) భారత ప్రభుత్వం సభ్యదేశమైన అంతర్జాతీయ కార్మిక సంస్థ తీర్మానాలలో



కార్మికులకు, ఉద్యోగులకు హేతుబద్ధమైన పరిమితులకు లోబడి సమ్మె హక్కు ఇవ్వాలన్నది ఒకటి. ఈ మార్పులను సుప్రీంకోర్టు లెక్కలోకి తీసుకుని ఉంటే నలభై ఏళ్లనాటి తీర్పును సమీక్షించే ప్రక్రియ మొదలయి ఉండవచ్చు. అయితే ఆ పని చేయలేదు సరికదా, నలభై ఏళ్లనాడు సమ్మె అనే హక్కుకు ఇచ్చిన గౌరవం సహితం వీళ్లు ఇవ్వలేదు.

అదట్లాగుంచి, ఈ నలభై ఏళ్లలో ఆనాటి తీర్పును అధిగమించడానికి ఉద్యోగ నియమాలను సవరించాలన్న డిమాండుతో ఉద్యోగ సంఘాలు ఏనాడూ ఉద్యమించకపోవడం విశేషం. ఒక చట్టం, లేక రూలు రాజ్యాంగ విరుద్ధం కాదనీ సక్రమమైనదేననీ సుప్రీంకోర్టు ప్రకటించిన తరువాత, దానిని తొలగించుకోవాలంటే మళ్లీ శాసనాధికారాన్ని ఆశ్రయించవలసిందే. ప్రభుత్వ ఉద్యోగుల ప్రవర్తనా నియమావళిని సవరించి, ఉద్యోగులకు సమ్మె హక్కు ఇమ్మన్న డిమాండుతో (సహేతుకమైన పరిమితులు పెట్టుకుంటే పెట్టుకోవచ్చు) ఒక్క ఆందోళన కూడా ఇన్నేళ్లుగా ఉద్యోగ సంఘాలు చేపట్టలేదు. సుప్రీంకోర్టు మొన్న చేసిన అధిక ప్రసంగం ఆ విషయాన్ని గుర్తుచేసినందుకా ఇప్పుడింతగా గగ్గోలు పెడుతున్నారు?

సుప్రీంకోర్టు నిరాకరించిన సమ్మె హక్కు విషయంలోనే కాదు, సుప్రీంకోర్టు ఆమోదించిన భావ ప్రకటనా స్వేచ్ఛ విషయంలోనూ ఉద్యోగుల ప్రవర్తనా నియమావళులను తదనుగుణంగా సవరింప జేసే ప్రయత్నమేదీ ఉద్యోగ సంఘాలు చేయలేదు. 1962లోనే సుప్రీంకోర్టు చెల్లవని ప్రకటించిన నిషేధాలన్నీ చెక్కుచెదరకుండా ఉద్యోగుల ప్రవర్తనా నియమావళులలో అట్లాగే కొనసాగుతున్నాయి. వాటిని సవరించే ప్రయత్నం ప్రభుత్వాలూ చేయలేదు, సవరించాలన్న ఒత్తిడి ఉద్యోగ సంఘాలూ పెట్టలేదు. అవి చెల్లవని సుప్రీంకోర్టు చెప్పింది కదా, అవి కాయితాల మీద కొనసాగడం వల్ల వచ్చిన నష్టమేమిటని అడుగుతారేమో. నష్టమేమిటంటే అవి కాయితాల మీద ఉన్నంత కాలం వాటిని వాడుకొని ఉద్యోగులను అధికారులు సతాయించే అవకాశం ఉంటుంది. సతాయింపుకు గురయిన ఒక్కొక్క ఉద్యోగి కోర్టుకు పోయి సుప్రీంకోర్టు తీర్పును ఉటంకించి న్యాయం పొంద వచ్చును గానీ ఈ లోపల ఏ మూడేళ్లో నాలుగేళ్లో సస్పెన్షన్‌లోనో, పూర్తి నిరుద్యోగంలోనో గడప వలసి ఉంటుంది. సుప్రీంకోర్టు తీర్పుననుసరించి కనీసం భావ ప్రకటనా స్వేచ్ఛమేరకయినా ఉద్యోగుల ప్రవర్తనా నియమావళిని తిరగరాయించుకొని ఉంటే ఈ అవస్థ ఉండదుకదా! ఉద్యోగ సంఘాలు ఈ ప్రయత్నం సహితం ఎందుకు చేయలేదు?

ఆసక్తి లేదు కనుక. సమ్మె హక్కు, భావప్రకటనా స్వేచ్ఛ ఉద్యమాలు చేయదలచుకున్న వారికి కావాలి. ఎంఎల్ఏతో చెప్పించి, మంత్రితో ఫోన్ చేయించి, ముఖ్యమంత్రికి నచ్చిన మనిషిని సంఘం అధ్యక్షునిగా పెట్టుకొని – ఏదీ నడవకపోతే పైసలిచ్చి – పనులు చేయించుకునే సంస్కృతికి అలవాటు పడ్డ వారికి భావప్రకటనా స్వేచ్ఛ ఎందుకు, సమ్మె హక్కు ఎందుకు?

ఇప్పుడేమయిందంటే ఈ పైరవీలు కూడా హక్కులను కాపాడలేకపోతున్నాయి. ప్రభుత్వమే అక్కరలేదని ప్రపంచ బ్యాంకు అంటుంటే ఇంక ప్రభుత్వ ఉద్యోగుల గోడు, వారి హక్కుల గోడు వినేవారెవరు? పైరవీ సాగకపోతే ఉద్యమాలు అవసరం కాబట్టి ఉద్యోగ సంఘాలిప్పుడు సమ్మె హక్కో అంటూ గగ్గోలు పెడుతున్నాయి. అయితే ఇప్పుడు కూడా ఉద్యమించి ప్రవర్తనా నియమావళులను సవరించుకుంటామనడం లేదు. ముగ్గురు జడ్జిలో అయిదుగురు జడ్జిలో ఏడుగురు జడ్జిలో కూర్చొని ఉద్యోగులకు సమ్మె హక్కు లేదన్న ఇద్దరు జడ్జిల తీర్పు తప్పని ప్రకటించాలని కోరుకుంటు

న్నారు. మళ్లీ ఉద్యోగ సంఘాలన్నీ వామపక్ష దృక్పథమున్న సంఘాలే – మార్క్సిస్టు వామపక్షం, కాకపోతే నెహ్రూవాద వామపక్షం.

నిజానికి సమ్మె హక్కు గురించి మొన్నటి తీర్పులో సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలు ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రమే వర్తిస్తాయని అందరికీ అర్థం అయివుంటే ఇంత అలజడి, ఆందోళన జరిగి ఉండేవి కావు. అవి ప్రభుత్వ ఉద్యోగులకే కాక పారిశ్రామిక కార్మికులకు కూడా వర్తిస్తాయనుకోవడం వల్ల ఇంత స్పందన వచ్చింది. కార్మిక సంఘాలకు సహితం ఈ విషయంలో స్పష్టత లేదు కాబట్టి ఆ తీర్పు పారిశ్రామిక కార్మికులకు వర్తించదని చెప్పడం అవసరం. పారిశ్రామిక కార్మికులకు ఐడి చట్టం (పారిశ్రామిక వివాదాల చట్టం) ఒక పరిమితమైన సమ్మె హక్కు కల్పించింది. అది పరిమిత మైన హక్కే అయినప్పటికీ అది చట్టం గుర్తించిన హక్కే. దానికి భిన్నంగా తీర్పు జారీచేసే అధికారం సుప్రీంకోర్టుకు లేదు, చేసినా అది చెల్లదు.

ప్రభుత్వ ఉద్యోగాలలోనూ కొందరు పారిశ్రామిక కార్మికుల నిర్వచనం కిందికి వస్తారు. వారి సమ్మె హక్కును కూడా ఈ తీర్పు తీసేయదు. పోస్టల్, టెలికాం, రైల్వే, పోర్టు, బ్యాంకుల సిబ్బందిలోని కార్మికులు ఈ కోవకు చెందుతారు. పారిశ్రామిక కార్మికులు కాని ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రమే ఈ తీర్పు వర్తిస్తుంది.

ఈ వర్గమంటే ప్రజలలో ఎవ్వరికీ పెద్దగా సానుభూతి లేదు. లేకపోవడానికి ప్రజల కారణాలు ప్రజలకున్నాయి. అయితే వారి పట్ల ప్రజలలో ఉన్న వ్యతిరేకత కారణంగా సమ్మె హక్కు మొత్తంగా తీసేసే నిబంధనలను, వాటిని ఆమోదించే కోర్టు తీర్పులను ఉపేక్షిస్తే చాలా నష్టం జరగగలదు. రేపు ఐడి చట్టం పారిశ్రామిక కార్మికులకిచ్చే పరిమితమైన సమ్మె హక్కును సహితం పార్లమెంటు తీసేస్తే దానిని కోర్టులో సవాలు చేయడానికి ఈ తీర్పులు అడ్డం రాగలవు. అంతేకాక, ప్రభుత్వ అధికార్లలోనూ గుమాస్తాలలోనూ ఎన్ని లోపాలున్నా, వారికి సమస్యలు లేవనలేము, ఆ సమస్యల పరిష్కారానికి సమ్మె చేసే పరిస్థితి రాదనలేము.

అపోహ వల్లనయితేనేం, ఎందువల్లనయితేనేం, పారిశ్రామిక కార్మికులు, గని కార్మికులు, సాధారణ ప్రజలు అనేకమంది ఈ తీర్పుకు వ్యతిరేకంగా స్పందించడంలో ఉన్న ఔదార్యాన్ని ప్రభుత్వ ఉద్యోగులు గుర్తించి తాము ఇతరుల హక్కుల విషయంలో అంతే ఉదారంగా స్పందించడం ఇప్పుడయినా నేర్చుకుంటారా? ఉద్యమాలలోనే కాక నిత్య జీవితంలో ప్రజలతో వ్యవహరించే టప్పుడు కూడా ఈ వైఖరిని ప్రభుత్వ ఉద్యోగులు ప్రదర్శించడం దానంతటది అవసరమేకాక, ప్రపంచీకరణలో భాగంగా అందరి హక్కులు మీదా ఉమ్మడిగా జరుగుతున్న దాడిని ఎదుర్కొనడానికి చాలా ఉపయోగపడుతుంది. ఇంకా ఎక్కువమంది జడ్జిలతో కూడిన ధర్మాసనం కూర్చొని తమకు సమ్మె హక్కు ప్రసాదిస్తుందన్న ఆశకు ఇస్తున్న విలువ ఉద్యోగ సంఘాలు ఈ అవసరానికి ఇస్తే బాగుండేది.

C



**రిపోర్టులు**

## మెదడువాపు మరణాలు

# వైద్య వ్యవస్థకు దర్పణం

**2003** సంవత్సరం జులై – ఆగస్టు నెలలలో కరీంనగర్, వరంగల్ జిల్లాలలో కొన్ని వందల మంది పిల్లలు ఏదో కొత్తరకం జ్వరాలకు బలి అయ్యారని పత్రికలలో వార్తలు రావడం ప్రజలను బాగా కలవరపెట్టింది. పత్రికలు ఈ జ్వరాలకు 'విషజ్వరాలు' అని పేరు పెట్టాయి. ఈ మాట ఎప్పుడు పుట్టిందో ఎవరు దీని సృష్టికర్తలో తెలీదుగానీ, డాక్టర్లు పేరుపెట్టలేని అన్ని రోగాలనూ పత్రికలిప్పుడు 'విషజ్వరాలు' అంటున్నాయి.

జులై – ఆగస్టు నెలలలో వ్యాపించిన రోగానికి మెదడువాపు లక్షణాలున్నాయి గానీ అది మామూలుగా వచ్చే మెదడువాపు వ్యాధి కాదని మొదట్లోనే డాక్టర్లు అన్నట్టు పత్రికలు రాశాయి. అది ఏదో క్రిమి ద్వారా వ్యాపిస్తున్నదని మాత్రం గుర్తించారు. అయితే అది ఏ క్రిమో చెప్పగల 'వైరాలజీ' పరీక్ష చేసే పరిశోధనాలయం ఆంధ్రప్రదేశ్‌లో లేదు కాబట్టి పూనా నుంచి, ఢిల్లీ నుంచి పరిశోధకులను రప్పిస్తున్నామన్నారు.

ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ నుంచి ఆటల స్టేడియంల దాకా ప్రపంచంలో ఎక్కడ ఏది ఉన్నా దానిని ఆంధ్రప్రదేశ్‌కు రప్పించడానికి ఉత్సాహపడే ముఖ్యమంత్రి, వైరాలజీ పరిశోధనాలయం హైదరాబాద్‌లో లేదు, పూనాలోనే ఉందని తెలియగానే 'ఎవరక్కడ! వెంటనే వైరాలజీ పరిశోధనాలయం హైదరాబాద్‌లో నెలకొల్పండి' అని ఆదేశిస్తాడని అనుకున్నాం. ఆయన అటువంటిదేం చేయలేదు. ఆ పరిశోధనాలయాలు రాష్ట్రంలో ఉంటే పేద పిల్లల ప్రాణాలు కొన్ని దక్కుతాయేమోగానీ రాష్ట్ర స్థూల ఆదాయం పెరగదుకదా! దాని అభివృద్ధి రేటు పైకి ఎగబాకదు కదా! అందువల్లనేమో.

రోగ నిర్ధారణ జరగలేదు గానీ పిల్లలు మాత్రం ప్రతిరోజూ చనిపోతూనే ఉన్నారు. రోగం ఏదో తెలీకపోయినా దానికి మెదడువాపు వ్యాధి లక్షణాలు ఉన్నాయి కాబట్టి అదే ట్రీట్‌మెంట్ ఇస్తున్నామని కరీంనగర్‌లో డాక్టర్లు అన్నారు. చంద్రబాబు నాయుడు మొదలుపెట్టిన పద్ధతిని అనుసరించి వారే కాక వారి మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా బాధిత ప్రాంతాలకు పోయి వైద్యుల నుంచి గ్రామ సర్పంచ్‌ల దాకా అందరి మీదా ధూం ధాం అంటూ ఎగిరారు. డాక్టర్లను సస్పెండ్ చేయమనీ పందులను చంపమనీ ముఖ్యమంత్రి అప్పటికప్పుడు ఆదేశాలు జారీచేశాడు.

ఆ రోగం మెదడువాపులో ఒకరకమనీ దానిని మెనింజో–ఎన్‌కెఫాలైటిస్ అంటారనీ ఢిల్లీ నుంచి వచ్చిన డాక్టర్లు ప్రకటించేసరికి రోగం ఉధృతి దానంతటదే తగ్గిపోయింది. అసలు ఆ రోగం ఎటువంటిది, దాని నివారణ మార్గాలు ఏమిటి, రోగ లక్షణాలు ఎట్లాంటివి, ఏమి చేస్తే పిల్లల ప్రాణాలు దక్కుతాయి అనే విషయాలు తరువాత ప్రభుత్వం ప్రజలకు తెలియజేసే ప్రయత్నమేం చేయలేదు. అంతలో గోదావరి పుష్కరాలు వచ్చాయి. మెదడువాపును వదిలిపెట్టి పుష్కరాల గురించి ధూంధాం చేయడంలో ప్రభుత్వం నిమగ్నమయింది.

మెదడువాపు ఒకరకమైన క్రిమి ద్వారా వ్యాపించే ప్రాణాంతక రోగం. అది కొన్నిరకాల జంతువుల శరీరంలో అభివృద్ధి చెంది, దోమకాటు ద్వారా ఒక జంతువు నుంచి మరొక జంతువుకు పాకో

క్రిమి. ఇటువంటి క్రిములను వైద్య పరిభాషలో ‘ఆర్బోవైరస్’ అంటారు. మామూలుగా వచ్చే మెదడు
వాపు వ్యాధి ఒక గ్రూప్ ‘బి’ ఆర్బోవైరస్ వల్ల కలుగుతుంది. ఈ సంవత్సరం వచ్చినది చాందిపుర
అనే అర్బోవైరస్ ద్వారా కలిగింది.

మామూలుగా వచ్చే మెదడువాపు వ్యాధిని ‘జపనీస్ ఎన్‌కెఫాలైటిస్’ అంటారు. ఇది జపాన్,
చైనా, కొరియా దేశాలలో అధికంగా ఉండేది. అక్కడి నుంచి ఇతర తూర్పు ఆసియా దేశాలకు పాకి
ఇప్పుడు కొన్నేళ్లుగా దక్షిణ ఆసియాలోని ఇండియా, శ్రీలంకలను చేరుకుంది.

2000 సంవత్సరంలో ప్రచురించిన ఒక వైద్య గ్రంథంలో ఇచ్చిన సమాచారం ప్రకారం సాలీనా
ప్రపంచ వ్యాప్తంగా సగటున 43 వేల కోసులు వెలుగులోకి వస్తున్నాయని, సగటున 11 వేల
మంది చనిపోతున్నారని తెలుస్తున్నది. రోగగ్రస్తులలో దాదాపు 85 శాతం 15 సంవత్సరాల లోపు
వయసున్న పిల్లలే.

ఆర్బోవైరస్ క్రిములు జంతువుల శరీరాలలో పెరుగుతాయి. ఒక జంతువు నుంచి మరొక
జంతువుకు దోమ ద్వారా ప్రసారం అవుతాయి. మెదడువాపు క్రిమిని కలిసి ఉన్న జంతువును
దోమ కుడితే, ఆ దోమలో రోగం అభివృద్ధి చెందడానికి 9 నుంచి 17 రోజులు పడుతుంది. ఆపైన
ఆ దోమ మరొక జంతువును కుట్టినట్టయితే రోగం ఆ జంతువుకు కూడా వ్యాపిస్తుంది.

ఆర్బోవైరస్ క్రిములు ప్రధానంగా పందుల శరీరంలో అభివృద్ధి చెందుతాయి. పందులే కాక
బర్రెలు, ఎడ్లు, గుర్రాలు, కోళ్లు, బాతులు మొదలయిన జంతువుల శరీరాలలోనూ అభివృద్ధి చెంద
గలవు. ఆ జంతువును కుట్టిన దోమలో రోగం అభివృద్ధి చెందిన తరువాత అది మనిషిని కుట్టినట్ట
యితే అది మనిషికి కూడా వ్యాపిస్తుంది. (అయితే ఇది మనిషి నుంచి మనిషికి వ్యాపించదు. అంటే
ఒక రోగిని కుట్టిన దోమ మరొకరిని కుడితే వారికి రోగం రాదు)

ఈ కారణంగా మెదడువాపు విషయంలో పందులను ప్రధాన దోషులుగా నిలబెట్టి వాటిని
చంపడం, పందుల కాపర్లను ఊర్ల నుంచి తరిమివేయడం జరుగుతున్నది. కానీ మెదడువాపు రోగ
క్రిమి పందుల నుంచి నేరుగా మనుషులలోకి రాదు. దోమల ద్వారా మాత్రమే రాగలదు. ఇంటి
చుట్టూ ఎన్ని పందులున్నా, దోమలు లేకుండ చూసుకున్నట్టయితే ఈ వ్యాధి రాదు. అంతేకాక,
ఒకవేళ పందులన్నిటినీ చంపేసినా లేక తరిమేసినా ఇతర పశువులు, కోళ్లు, బాతుల నుంచి
దోమల ద్వారా ఈ క్రిమి మనుషుల రక్తంలోకి ప్రవేశించగలదు. ఆ జంతువులు పందులతో సమా
నంగా కాకున్నా ఒక మోతాదులో మెదడువాపు రోగ క్రిమికి ‘హోస్ట్’గా వ్యవహరించగలవు.
వాటినన్నిటినీ గ్రామీణ ప్రాంతాల నుంచి తొలగించడం సాధ్యపడదు. అవి లేనిదే గ్రామీణ జీవితమే
లేదు. పందుల పెంపకందార్లు హైందవ సమాజంలో అతి హీనంగా చూడబడే కులాలకు, తెగలకు
(తెలంగాణలో ప్రధానంగా ఎరుకల, వడ్డెర) చెందినవారు కావడం వల్ల మెదడువాపు అనగానే
పందులను చంపండి అంటున్నారు గానీ, హైందవ కుల వ్యవస్థలో పందుల పెంపకానికి ఇంకొంత
గౌరవనీయమయిన స్థానం ఉండి ఉంటే అది జరిగేది కాదు.

మెదడువాపు క్రిమిని నివారించడానికి ప్రధానంగా చేయవలసింది దోమలను నివారించడం.
తొలినాడు ఈ వ్యాధికి నిలయాలుగా ఉన్న జపాన్ వంటి తూర్పు ఆసియా దేశాలు దోమలను సమ
ర్థంగా నివారించడం ద్వారానే ఈ వ్యాధిని గట్టిగా నియంత్రించగలిగాయి.

ఎన్‌కెఫాలైటిస్ క్రిమిని వ్యాపింపజేసే దోమను క్యూలిసైన్ దోమ అంటారు. అవి మురుగునీటి



గుంటలలోనూ, వరిమళ్లలోనూ నిశ్చలమైన నీటి వనరులలోనూ వర్ధిల్లుతాయి. వాటిని అరికట్టా
లంటే మలాథియన్, ఫెనిట్రొథియన్ మొదలయిన పురుగుల మందులను గాలిలో, నేలమీద,
పొలాలపైన, ఇళ్ళ చుట్టూ ఉన్న మొక్కల మీద, స్థిర నీటివనరుల మీద, పశువుల కొట్టాలలో,
ఇళ్ళలో స్ప్రే చేయాలి. ఒక గ్రామంలో రోగం పొడచూపినట్టయితే దానికి రెండు మూడు కిలోమీటర్ల
పరిధిలో పురుగుల మందు స్ప్రే చేయాలి. ప్రజలు ఒంటినిండా బట్టలు వేసుకోవాలి, దోమతెరలు
వాడాలి.

ప్రతీ సంవత్సరం వర్షాకాలం మొదలుకాగానే మెదడువాపు వ్యాధి వ్యాపిస్తూనే ఉంది కాబట్టి
పైన చెప్పిన ప్రాథమిక నివారణోపాయాలు ప్రభుత్వ పారిశుధ్య విభాగానికి తెలిసే ఉండాలి. అయితే
నివారణ చర్యలేవైనా చేపట్టారా అని కరీంనగర్ జిల్లాలో ఈ వ్యాధిసోకి వందల సంఖ్యలో పసిపిల్లలు
చనిపోయిన గ్రామాలలో వాకబుచేస్తే వచ్చే సమాధానం చాలా బాధాకరమైనది. చావులు మొద
లయ్యేదాకా ఏ నివారణ చర్యలూ చేపట్టలేదు. పిల్లల చావులను పత్రికలు మరీ అతిగా రాసాయని
డాక్టర్లూ వైద్య విధాన పరిషత్ అధికార్లూ గొడవపెట్టారు గానీ పత్రికలే రాయకపోతే ఆ తరువాత
కూడా ఏం జరిగేది కాదు.

కానీ చేసిందేమిటంటే, పిల్లలు చనిపోయిన ఇళ్ళలో పురుగుల మందు చల్లడం, లేదా ఆ వీధిలో
చల్లడం. పశువుల కొట్టాలలో మందు స్ప్రే చేసిన ఉదంతం ఒక్కటీ లేదు. మురుగునీటి గుంటల
మీద మందు చల్లారుగానీ వాటిని పూడ్చే ప్రయత్నం చాలాచోట్ల జరగలేదు. ఇళ్ళ చుట్టూ ఉన్న
కలుపు మొక్కలను తొలగించే ప్రయత్నంగానీ వాటి మీద పురుగుల మందు చల్లే ప్రయత్నంగానీ
జరగలేదు. ఎందుకు జరగలేదన్న ప్రశ్నకు బాధిత గ్రామ పంచాయతీల సర్పంచ్‌లే జవాబు చెప్తు
న్నారు. పారిశుధ్యం కోసం చిన్న గ్రామ పంచాయతీలకు ఐదువేల రూపాయలు, పెద్ద గ్రామ
పంచాయతీలకు పదివేల రూపాయలు ప్రభుత్వం అనుమతించింది. కొన్ని గ్రామలకు ప్రభుత్వం ఆ
సొమ్ము ఇచ్చిందిగానీ చాలా గ్రామాలకు ఆ మేరకు తమ పంచాయతీ నిధుల నుంచి ఖర్చు చేసుకోవ
డానికి అనుమతి మాత్రమే ఇచ్చింది!

‘హుటాహుటిన’, ‘యుద్ధ ప్రాతిపదికన’ మొదలయిన మాటలు ముఖ్యమంత్రి తరచుగా
వాడుతుంటాడు. వాటిని ఈ పిసినారితనంతో జతచేసి చూసుకున్నప్పుడు తప్ప అసలు విషయం
అర్థం కాదు.

ఇది నివారణ సంగతి.

చికిత్స సంగతి చూద్దాం. దోమకాటు ద్వారా మెదడువాపు క్రిమి మనిషి శరీరంలోకి ప్రవేశించిన
తరువాత 5 నుంచి 15 రోజులకది రోగం రూపం తీసుకోగలదని అంచనా. (అందరికీ రోగం
రానక్కరలేదు. క్రిమిసోకిన వారిలో సగటున 500 మందిలో ఒకరు మాత్రమే రోగగ్రస్తులవుతారని
అంచనా) మొదటిదశలో జ్వరం, తలనొప్పి, బలహీనత రోగలక్షణాలు. ఒకటి నుంచి ఆరు రోజుల
లోపల ఇది రెండవ దశను చేరుకోగలదు. రెండవ దశలో విపరీతమైన జ్వరం కాస్తుంది. ఫిట్స్
వస్తాయి. ఈ దశను దాటితే బతికినట్టే, కానీ దానికో సత్వరం, సమర్థం అయిన చికిత్స అవసరం.
రోగం సోకిన తొలి దినాలలోనే అటువంటి చికిత్స దొరకకపోతే ప్రాణం దక్కడం కష్టం. సగటున
తొమ్మిది రోజులలో ప్రాణం పోతుందని వైద్య గ్రంథాలు అంటాయి గానీ మొన్న కరీంనగర్, వరం
గల్ జిల్లాలలో చనిపోయిన పిల్లలు ఎక్కువగా రెండు మూడు రోజులలోనే చనిపోయారు.

కాబట్టి దగ్గరిలోనే సమర్థమైన వైద్య సదుపాయం దొరకకపోతే పిల్లల ప్రాణం దక్కదని అర్థం అవుతుంది. కానీ ఇదే లోపించింది. గ్రామీణ ప్రజలకు అందుబాట్లో ఉండే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పిహెచ్‌సి) స్థితి అధ్వాన్నంగా ఉంది. కరీంనగర్ జిల్లాలో పిల్లలు ఎక్కువ సంఖ్యలో చని పోయిన మండలాలలో సుల్తానాబాద్ ఒకటి. ఆ మండలం ప్రజలకు సుల్తానాబాద్ పిహెచ్‌సి అతి సమీపంలోని ఆస్పత్రి. జులై 3 నుంచి 20 దాకా ఈ ఆస్పత్రికి 400 మంది మెదడువాపు రోగులు చికిత్స కోసం వచ్చారు. అందులో 30 మందిని ఇన్ పేషెంట్లుగా అడ్మిట్ చేసుకున్నారు. 20 మం దిని కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి రిఫర్ చేశారు. అయితే ఈ ఆస్పత్రి దుస్థితి ఏమిటంటే అందులో వైద్యుల పోస్టులు 4 ఉండగా 3 ఖాళీగా ఉన్నాయి. ఉన్న ఒక్క డిప్యూటీ సివిల్ సర్జన్ ప్రతీ రోజూ పొద్దున్న 7 నుంచి రాత్రి 9 గంటల దాకా పనిచేసి ప్రజలచేత మంచివాడనిపించుకున్నాడు గానీ, అతను ఎంత న్యాయం చేయగలిగి ఉంటాడు?

ప్రాథమిక ఆరోగ్యం మాత్రమే ప్రభుత్వం బాధ్యత అనీ ఆపైన ప్రైవేట్ రంగానికి వదిలిపెట్టడం మేలనీ ప్రపంచ బ్యాంకు ఆదేశించిన సంగతీ చంద్రబాబు ఆమోదించిన సంగతీ కూడ మనకు తెలుసును. నిజానికి చంద్రబాబు ఒకడుగు వెనక్కిపోయి వైద్య వ్యాపారంలో పెట్టే పెట్టుబడి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ వికాసానికి ఒక చోదకశక్తిగా పనిచేస్తుందని విజన్ 2020లో ప్రకటించిన సంగతి కూడా మన మెరుగుదుము. ప్రైవేట్ వైద్య వ్యాపారం ఉన్నవాళ్ల అవసరాలు తీరిస్తే ప్రభుత్వం లేనివాళ్ల అవసరాలు చూసుకోవచ్చును కదా, ఇందులో వైరుధ్యం ఏముందని అనవచ్చును. ప్రైవేట్ వైద్యం అసలే ఉండవద్దని కాదుగానీ ప్రధాన వైద్యరంగాన్ని అది ఆక్రమించుకుంటే ప్రభుత్వరంగంలో ఏమున్నదీ లేనిదీ చూసేవారూ అడిగేవారూ ఎవరూ ఉండరు. కేవలం దరిద్రులు మాత్రమే పొందే సేవలు బాగున్నా లేకపోయినా ప్రభుత్వం మీద ఒత్తిడి పెట్టే వారెవరుంటారు? కానీ కేవలం దరిద్రు లకు మాత్రమే వచ్చే రోగాలకు ప్రభుత్వరంగంలో తప్ప వేరే ఎక్కడా చికిత్స దొరకదు. వేరే ఎవరికీ ఈ వర్గాలకు చికిత్స చేయడం లాభదాయకం కాదు. మరి ప్రైవేట్ ఆస్పత్రులే ప్రధాన చికిత్సాలయా లుగా మారిన నేటి పరిస్థితిలో పేదలకు మాత్రమే వచ్చే రోగాలకు సమర్థమయిన చికిత్స దొరకా లంటే సాధ్యమా?

ప్రైవేట్ చికిత్సా వ్యవస్థలో అనేక రోగాలకివాళ వైద్యం దొరుకుతున్నది. వరంగల్ సాపేక్షంగా పెద్ద పట్టణం కాబట్టి దానికంటె కరీంనగర్‌ను ఉదాహరణగా తీసుకోవడం ఉచితంగా ఉంటుంది. కరీంనగర్ పట్టణంలో క్లినిక్‌లు, ఆస్పత్రుల బోర్డులు చూసుకుంటూ తిరిగినట్టయితే ఫెర్టిలిటీ క్లిని క్‌లు, ఒబీసిటీ క్లినిక్‌లతో సహా అనేకరకాల ప్రత్యేక వైద్యసేవాలయాలు కనిపిస్తాయి. ఇవి అనవసరం అని కాదు గానీ వాటి సరసన ఎక్కడా ఎన్‌కెఫలైటిస్ క్లినిక్‌లుగానీ అతిసార వ్యాధి చికిత్సాలయాలు గానీ కనిపించవనేది గమనించడం అవసరం. ఆ రోగాలు సాధారణ చికిత్సా కేంద్రాల బాధ్యతే.

అయినా ఆ ఫీజులు చెల్లించుకునే స్థోమత మెదడువాపు బాధితులలో మెజారిటీకి లేదు కాబట్టి వారంతా ప్రభుత్వ ఆస్పత్రులకో వెళ్లారు. నయం చేసినా చేయకున్నా వారిని చూసుకున్నది ప్రభుత్వ ఆస్పత్రులే. కరీంనగర్‌లో నయంకాని పిల్లలు వరంగల్ గాంధీ దవాఖానాకో, హైదరాబాద్‌లోని నీలోఫర్ దవాఖానాకో పోయారు తప్ప అపోలోకు పోలేదు, యశోదాకు పోలేదు. అయితే ఈ వర్గం ప్రజలు మాత్రమే వచ్చే ఆ చికిత్సా కేంద్రాలు ఎంత మెరుగయిన సేవలు అందించగలుగుతున్నాయని అడిగే ఆసక్తి ఎవరికీ లేదు. అడిగితే జవాబు చెప్పేవారూ లేరు.



చివరిగా, పరిసరాల పారిశుధ్యం గురించి ఏ పట్టింపూ లేకుండా, రోగాలు వచ్చినప్పుడు ఆర్భా టంగా పందులను చంపే ఈ వైఖరి గురించి మా మాటలలో కాకుండా రాష్ట్ర హైకోర్టు మాటలలో చెప్పుకోవడం ఉచితంగా ఉంటుంది. ఇది 23 ఏళ్ల కింద ఇచ్చిన తీర్పు! హైదరాబాద్ నగరంలో మెదడువాపు వ్యాధికి కారణం అవుతున్నాయంటూ పందులను చంపే మునిసిపల్ కార్పొరేషన్ వారి కార్యక్రమాన్ని ఉద్దేశించి,

> పందుల యజమానులు లైసెన్స్ తీసుకొని మునిసిపల్ కార్పొరేషన్ చట్టానికి లోబడి తమ వ్యాపారం నడుపుకునేటట్టు చూడడం కార్పొరేషన్ బాధ్యత. ఏళ్ల తరబడి లైసెన్స్‌ల గురించి పట్టించుకోకుండా రోగాలు వ్యాపించిన సంవత్సరాలలో మాత్రం మేల్కొని చట్టాన్ని అమలు చేయాలని ప్రయత్నించడం, అత్యధికంగా షెడ్యూల్డు కులాలకు చెందిన పేద ప్రజలయిన పందుల యజమానులను చాలా ఇబ్బందులకు గురిచేస్తుంది. వీరికి తెలియ చెప్పి లైసెన్స్‌లు తీసుకునేటట్టు, చట్టం ప్రకారం నడుచుకునేటట్టు చూడడం కార్పొరేషన్ బాధ్యత. చట్టం ఇచ్చే అధికారాన్ని వినియోగించేటప్పుడు పందుల యజమానులు నిరక్ష రాస్యులన్న విషయాన్ని గుర్తెరిగి, అవసరమైన మేరకు మాత్రమే కార్పొరేషన్ అధికారులు తమ అధికారాలు ప్రయోగిస్తారని ఆశిస్తాం. అకస్మాత్తుగా పందుల మీదపడి వాటిని ఏరి వేయడం కార్పొరేషన్ ఈ భయంకర వ్యాధి మీద గొప్ప పోరాటం చేస్తున్నదన్న అభి ప్రాయాన్ని కలిగించడానికి మాత్రమే పనికొస్తుంది. వారి నిజమయిన కర్తవ్యం అదికాదు. పందుల యజమానులు లైసెన్స్‌లు తీసుకొని పందులను పరిశుభ్ర ప్రదేశాలలో ఉంచి వీధుల వెంబడి తిరగకుండా ఉండేటట్టు చూసుకునే విధంగా కట్టుదిట్టం చేయడం కార్పొ రేషన్ అసలు బాధ్యత. అంతకంటే ముఖ్యమైన పని, నగరంలో విపరీతంగా పెరిగిపోతున్న దోమల బెడదను అరికట్టడానికి కార్పొరేషన్ పెద్దఎత్తున చర్యలు చేపట్టడం.

ఇది 1980లో అప్పటి రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అయిన జస్టిస్ అల్లాడి కుప్పుస్వామి ఇచ్చిన తీర్పు ముగింపు భాగం. 1987లో దీనిని మరింత విశదీకరిస్తూ, హైకోర్టు ఆంధ్రప్రదేశ్ ఆదిమ జాతి సేవా సంఘం వేసిన కేసులో కొన్ని నిర్దిష్టమైన ఉత్తర్వులు జారీచేసింది. ప్రతీ మునిసి పాలిటీ ఆ పట్టణం వెలుపల మరీ దూరాన కాకుండా పందుల కాపర్లకు స్థలాలు కేటాయించాలి. ఏకపక్షంగా చేయకుండా, రెండు మూడు ప్రత్యామ్నాయాలు వారికి చూపించి వారిని ఎంచుకో మనాలి. అన్ని పందులకూ లైసెన్స్‌లు ఇవ్వాలి. పునరావాస స్థలానికి తరలిపోవడానికి అవసర మయిన అన్నిరకాల సహాయం వారికి అందివ్వాలి. ఆ పైన ఏవయినా పందులు మెడలో లైసెన్స్ లేకుండా పట్టణ వీధులలో తిరుగుతున్నట్టయితే వాటిని చంపవచ్చును.

ఇవి మునిసిపల్ పట్టణాలకు సంబంధించిన తీర్పులే అయినప్పటికీ వీటి స్ఫూర్తి గ్రామ పంచా యతీలకు కూడా వర్తిస్తుంది. అయితే ఇన్ని సంవత్సరాలు గడిచినా ఈ తీర్పుల స్ఫూర్తినిగానీ, ఆదేశాలను గానీ మన రాష్ట్రంలోని స్థానిక సంస్థల అధికారులు అమలు చేసిన పాపాన పోలేదు. పారిశుధ్యం గురించి ఏమీ చేయకుండా కాలక్షేపం చేస్తుండడం, దోమల బెడద తగ్గడానికి ఏ చర్యలూ చేపట్టకుండా ఉండడం, మెదడువాపు వ్యాధి సోకగానే మాత్రం హుటాహుటిన బయలుదేరి యుద్ధప్రాతిపదికన పందులను చంపడం – ఇది ఒక వార్షిక తంతు అయిపోయింది.

**–కరీంనగర్, వరంగల్ జిల్లా కమిటీలు**

# సింగరేణి: జూన్ 16, 2003

**2003** జూన్ 16ను సింగరేణి కార్మికులు సులభంగా మరచిపోరు. ఆరోజు మధ్యాహ్నం 1.20 సమయంలో రామగుండంలోని 7 ఎల్.ఇ.పి. గనిలోకి నీళ్లు వరదగా ప్రవహించి అక్కడ పనిచేస్తున్న కార్మికులు 17 మందిని ముంచెత్తి ప్రాణం తీశాయి. మరికొద్ది మంది తృటిలో తప్పించుకున్నారు.

సింగరేణికి ప్రమాదాలు కొత్తేం కాదు గానీ ఒకో ప్రమాదంలో ఇంతమంది చనిపోవడం మామూలు విషయం కాదు. పైగా 7 ఎల్ఇపి గనిని నియమాలకు విరుద్ధంగా నడుపుతున్న సంగతి కార్మికులకూ తెలుసును కాబట్టి కార్మికులకు మరింత ఆగ్రహం వచ్చింది.

అసలు భూగర్భ గనుల్లో పని చేయడమంటేనే మృత్యువుతో తలపడడం. కప్పు కూలిపోవచ్చు. భూగర్భ జలాలు ఉబికి నీళ్లు ముంచెత్తవచ్చు. బొగ్గు అంటుకొని మంటలు చెలరేగవచ్చు. విషవాయువులు వ్యాపించవచ్చు. పని స్థలంలో కార్మికులు జారి కిందపడవచ్చు.

పారిశ్రామిక ఉత్పత్తి మొదలయినప్పటి నుంచి ప్రపంచ వ్యాప్తంగా ఖనిజాల తవ్వకం పెద్ద యెత్తున జరుగుతూనే ఉంది కాబట్టి ఈ విషయాలలో కనీసం రెండు శతాబ్దాల అనుభవం ఉంది. ఆ అనుభవం నుంచి చాలా పటిష్టమైన భద్రతా నియమాలు పుట్టాయి. మన దేశంలో ఒక గనుల చట్టం, దానికింద రూపొందించిన గనుల నియమావళి కాక బొగ్గు గనులకు ప్రత్యేకమైన బొగ్గు గనుల నియమావళి కూడా ఉన్నాయి. సుదీర్ఘమైన అనుభవం నుంచి పుట్టిన నియమాలు కాబట్టి ఇవి చాలా వివరంగా ఉంటాయి. వీటిని తు.చ. తప్పకుండ పాటిస్తే బహుశా ప్రమాదాలే జరగవు. కానీ అన్నీ పాటించేటట్టయితే ఆర్థికంగా దుర్భరమవుతుంది కాబట్టి దానికంటె గనులు మూసేసుకోవడం మేలని సింగరేణి అధికారులు పత్రికల వారితో 'ఆఫ్ ది రికార్డ్' అంటున్నారు.

ఈ వైఖరి పర్యవసానాన్ని సింగరేణి ప్రమాదాల చిట్టాలో చూడవచ్చు. ప్రమాదాలలో గాయపడిన వారి సంఖ్య తగ్గుతున్నది గానీ మృతుల సంఖ్యలో తగ్గుదల లేకపోగా 2003-04 సంవత్సరం రికార్డు సృష్టించే అవకాశం ఉంది. ప్రమాదాల సంఖ్య కూడా గడచిన మూడు సంవత్సరాలలో పెరుగుతున్నాయని సింగరేణి యాజమాన్యం ప్రకటించిన గణాంకాలే చెప్తాయి. 2000 సంవత్సరంలో 87 ప్రమాదాలు జరుగగా 2001లో 105, 2002లో 117 జరిగాయి.

సింగరేణి నష్టాల నుంచి బయటపడిందనీ దశాబ్దం తరువాత తొలిసారిగా లాభాలు చూపించిందనీ సమ్మెలు బాగా తగ్గాయనీ కార్మికులలో క్రమశిక్షణ పెరిగిందనీ ఉత్పత్తి రికార్డులను బద్దలు కొడుతున్నదనీ ఇత్యాది వార్తలు మీరు పత్రికలలో చూసే ఉంటారు. ఈ 'విజయాలకూ' గని ప్రమాదాలలో పెరుగుదలకూ సన్నిహిత సంబంధం ఉందని కార్మికులు అంటారు. 7 ఎల్ఇపి ప్రమాదం దానికి నిదర్శనం.

భూగర్భం నుంచి బొగ్గు తీయడానికి సొరంగం లాగా తవ్వుకుంటూ పోతారు. బొగ్గు పొర ఏ వైపు విస్తరించి ఉంటే ఆ దిశగా సొరంగం సాగుతుంది. అయితే పొర ఎంత మందంగా ఉన్నా, రెండున్నర మీటర్ల ఎత్తును మించి సొరంగం తవ్వరు. ఒక సొరంగానికి పైన కనీసం ఐదు మీటర్లు విడిచిపెట్టి ఇంకొక సొరంగం తవ్వవచ్చు.



7 ఎల్ఇపిలో 3 సీమ్ ఎగువ, 3 సీమ్ దిగువ, 4 సీమ్ అనే మూడు సొరంగాలు ఒకదాని మీద ఒకటి ఉన్నాయి. జూన్ 16 నాటి ప్రమాదం 3 సీమ్ ఎగువలో జరిగింది. 3 సీమ్ దిగువ నుంచి నీరు తన్నుకువచ్చి 3 సీమ్ ఎగువ గని చివరి భాగాన్ని నీటితో ముంచెత్తింది. కింద అంత నీళ్లు పోగయిందని గానీ అది పైకి తన్నుకువచ్చి 3 సీమ్ ఎగువ సొరంగం గోడలను ఛేదించి ముంచెత్తుతుందని గానీ యాజమాన్యంలో పైనుంచి కింది దాకా ఎవరూ ఊహించలేదు.

ఎందుకు ఊహించలేదు? అసలు కిందనున్న సొరంగం (సీమ్)లో అంత నీళ్లెందుకు చేరింది? అది అంతటి ఒత్తిడితో పైకి ఎట్లా తన్నుకొచ్చింది? ఈ వైఫల్యంలో ఎవరి పాత్ర ఎంత?

ఈ ప్రశ్నలకు పూర్తి జవాబు ప్రమాదం పైన విచారణ జరుపుతున్న 'కోర్ట్ ఆఫ్ ఎంక్వైరీ' నివేది

## సింగరేణిలో ప్రమాదాలు

| సంవత్సరం | మృతుల సంఖ్య | క్షతగాత్రుల సంఖ్య |
|---|---|---|
| 1982-83 | 28 | 485 |
| 83-84 | 21 | 595 |
| 84-85 | 33 | 611 |
| 85-86 | 39 | 506 |
| 86-87 | 46 | 663 |
| 87-88 | 26 | 329 |
| 88-89 | 17 | 244 |
| 89-90 | 17 | 261 |
| 90-91 | 24 | 317 |
| 91-92 | 19 | 310 |
| 92-93 | 27 | 278 |
| 93-94 | 31 | 270 |
| 94-95 | 50 | 254 |
| 95-96 | 21 | 191 |
| 96-97 | 29 | 147 |
| 97-98 | 35 | 125 |
| 98-99 | 36 | 103 |
| 99-2000 | 27 | 106 |
| 2000-01 | 33 | 90 |
| 01-02 | 25 | 115 |
| 02-03 | 23 | 120 |
| 03-(డిసెంబర్ నాటికి) | 39 | -- |

కలో బహుశా దొరకవచ్చు. కానీ కొన్ని ప్రాథమిక వాస్తవాలను గుర్తించినట్టయితే ఒక నిర్ధారణకు రావడం కష్టం కాదు.

బొగ్గు పొర అవిచ్ఛిన్నంగా సాఫీగా సాగినంత దూరం దానిని తవ్వుకుంటూ పోతారు. అయితే పొర ఒక్కొక్కసారి అకస్మాత్తుగా ఆగిపోయి మళ్లీ కొంచెం ఎగువనో దిగువనో మొదలవుతుంది. దీనిని ఇంగ్లీష్‌లో 'ఫాల్ట్' అంటారు. ఫాల్ట్ వచ్చినప్పుడు తవ్వకం ఆపేస్తారు. మళ్లీ మొదలుపెట్టదలచుకుంటే అక్కడ అంతరాయం కలిగిన పొర మళ్లీ ఎక్కడ నుంచి మొదలవుతుందో అక్కడి నుంచి మొదలుపెట్టాలి. ఆ పని చేయొద్దనుకుంటే ఆ పొరను అక్కడితో వదిలేస్తారు.

7 ఎల్ఇపికి 1995లో అటువంటి అంతరాయం (ఫాల్ట్) వచ్చింది. బొగ్గు పొర 8 మీటర్లు కిందికి పోయింది. దానిని అక్కడితో వదిలేశారు. కానీ 2000 సంవత్సరం జనవరిలో 8 మీటర్లు కింద నుంచి మళ్లీ 3 సీమ్ ఎగువను, 3 సీమ్ దిగువను, 4 సీమ్‌ను తవ్వడం మొదలుపెట్టారు. బొగ్గుపొర అంతరాయం తరువాత 8 మీటర్లు కిందికి దిగడం వల్ల, 3 సీమ్ ఎగువ 3 సీమ్ దిగువకు కొనసాగింపుగానూ, 3 సీమ్ దిగువ 4 సీమ్‌కు కొనసాగింపుగానూ (దాదాపు) పునఃప్రారంభించగలిగారు. కానీ 2000 డిసెంబర్‌లో ఈ తవ్వకాన్ని ఆపేశారు.

బొగ్గు గనిని తవ్విన తరువాత పూర్తిగా వదిలేయదలచుకుంటే, తవ్వినప్పుడు స్తంభాలుగా వదిలి పెట్టిన బొగ్గు ముక్కలను తొలగించి (దీనిని 'డీ-పిల్లరింగ్' అంటారు) సొరంగాన్ని ఇసుకతో నింపుతారు. సొరంగాన్ని ఇసుకతో నింపడాన్ని 'సాండ్ స్టోవింగ్' అంటారు. ఒక పాలు ఇసుకను రెండు పాళ్లు నీటితో కలిపి గనిలోకి ఒత్తిడితో పంపుతారు. నీటిని క్రమంగా బయటకు పంపుల ద్వారా తీసి గనిని దట్టంగా ఇసుకతో నింపుతారు.

2000 సంవత్సరం డిసెంబర్ తరువాత 7 ఎల్ఇపిలోని 3 సీమ్ దిగువ, 4 సీమ్ సొరంగాలను మూసేయాలని సింగరేణి యాజమాన్యం నిర్ణయించింది. అయితే ఒక గనిని ప్రారంభించాలన్నా, మూసేయాలన్నా దేశంలోని గనుల భద్రతకు అత్యున్నత అధికారి అయిన డైరెక్టర్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ (డిజిఎంఎస్) అనుమతి తీసుకోవాలని గనుల నియమావళి అంటుంది. దాని ప్రకారం వారు 3 సీమ్ దిగువ, 4 సీమ్ సొరంగాలను సాండ్ స్టోవింగ్ ద్వారా మూసేయడానికి డిజిఎంఎస్ అనుమతి కోరారు.

గనుల భద్రతే ప్రధాన కర్తవ్యంగా గల డిజిఎంఎస్ ఒక షరతుతో దానికి అనుమతి ఇచ్చారు. ఆ షరతు ఏమిటంటే 7 ఎల్ఇపిలో ఏ సీమ్‌లోనూ ఇంక బొగ్గు తవ్వకాన్ని పునః ప్రారంభించకూడదని. సింగరేణి యాజమాన్యం తరఫున కార్పొరేట్ ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్ డైరెక్టర్ ఆ షరతుకు సమ్మతి తెలిపాడు. ఆ పైన 3 సీమ్ దిగువలోనూ 4 సీమ్‌లోనూ ఇసుక నింపి సాండ్ స్టోవింగ్ చేశారు.

అయితే సక్రమంగా చేయలేదు. ఇసుక తగ్గించి నీళ్లు ఎక్కువ నింపి డబ్బు ఆదా చేశారు. డబ్బు కంపెనీ కోసం ఆదా చేశారో లేక ఎవరయినా జేబులో వేసుకున్నారో విచారణలో తేలుతుందని ఆశిద్దాం. కానీ సక్రమంగా సాండ్ స్టోవింగ్ చేయలేదనేది మాత్రం అందరూ ఒప్పుకుంటున్న సత్యం. ఆ రెండు సొరంగాలలోనూ నీళ్లు పుష్కలంగా మిగిలిపోయాయి.

అక్కడితో ఆగకుండా, 7 ఎల్ఇపిలో ఏ సీమ్‌నూ పునఃప్రారంభించమని డిజిఎంఎస్‌కు హామీయిచ్చిన సంగతి 'మరచిపోయి' 2003 మే నెలలో 3 సీమ్ ఎగువను పునఃప్రారంభించారు. కొత్త



గని ప్రారంభించాలన్నా, మూసేసిన గని పునః ప్రారంభించాలన్నా బొగ్గు గనుల నియమావళి ప్రకారం డిజిఎంఎస్ అనుమతి తప్పనిసరి. కానీ 3 సీమ్ ఎగువ పునఃప్రారంభానికి ఆ అనుమతి తీసుకోలేదు. తీసుకోకుండానే, కింద నీళ్లు నిండిన సీమ్‌ను పెట్టుకొని 3 సీమ్ ఎగువను మే నెలలో మొదలుపెట్టారు. 17వ లెవెల్ దగ్గర 2000 సంవత్సరంలో ఆగిపోయిన సొరంగాన్ని కొనసాగించి 18వ లెవెల్ దాటి 19వ లెవెల్‌లో పనిచేస్తుండగా ప్రమాదం జరిగింది.

కింది సీమ్‌లో నీళ్లెకవేళ ఉన్నా, పై సీమ్‌కు ఇబ్బంది ఏముండగలదని అడగవచ్చు. కింది నుంచి నీళ్లు పైకి ఎట్లా రాగలవని అడగవచ్చు. ఈ సొరంగాలు (సీమ్‌లు) నేలకు సమాంతరంగా ఉన్నట్టయితే రాలేవు. కానీ ఈ సీమ్‌లు ఏటవాలుగా ఉన్నాయి. కింది సీమ్ తొలి లెవెల్స్ కంటే పై సీమ్ మలి లెవెల్స్ దిగువన ఉంటాయి. అందువల్ల కింది సీమ్‌లో నిలువ ఉన్న నీటి ఒత్తిడి పై సీమ్ మలి లెవెల్స్ గోడలను బద్దలు కొట్టి పైకి తన్నుకురాగలవు. అంతే కాకుండా, సరిగ్గా ప్రమాదం జరిగిన చోటనే ఇంకొక 'ఫాల్ట్' కూడా ఉందనీ, 3 సీమ్ దిగువ ఆ చోట రెండు మీటర్లు పైకి కదిలినందువల్ల దానికీ 3 సీమ్ ఎగువకూ మధ్యనున్న ఎడం నియమావళి ప్రకారం ఉండవలసిన 5 మీటర్లు కాక 3 మీటర్లే ఉండడం వల్ల కూడా కిందనున్న నీరు మరింత సులభంగా పైకి తన్నుకు రాగలిగిందని అంటారు.

దగ్గరిలో (కిందనయినా పక్కనయినా) వేరొక సీమ్ ఉన్నప్పుడు రెండిటికీ మధ్యనున్న గోడలలో 'పొక్కలు' బోర్ చేసి ఎప్పటికప్పుడు అవతలి సీమ్ నుంచి నీరు పొంగివచ్చే పరిస్థితి ఉందేమో చూసుకోవాలని కూడా బొగ్గు గనుల నియమావళి అంటుంది. ఆ పని కూడా చేయలేదు.

ఇంత అజాగ్రత్తగా వ్యవహరించడానికి గల కారణం 'ఉత్పత్తి'ని వేగంగా పెంచాలన్న ఆరాటం. అన్ని ప్రభుత్వ శాఖలూ అన్ని ప్రభుత్వ సంస్థలూ తమ తమ రంగాలలో ఉత్పత్తి మరింతగా సాధించి చూపించాలన్న చంద్రబాబు ప్రభుత్వ ఆదేశాన్ని అనుసరించి నడుచుకునే అధికారులు సింగరేణిని ఏలుతున్నారు. ఎక్కడ బొగ్గు దొరికినా తవ్వి తీయాలి. ఎంత తవ్వగలిగితే అంత తవ్వేయాలి. నెల తిరిగే నరికి ఉత్పత్తి గణాంకాలు ఆకర్షణీయంగా చూపించగలగాలి. కిందటి సంవత్సరం ఇదే నెలలో జరిగిన ఉత్పత్తి కంటే ఈ సంవత్సరం 10 శాతమో, 15 శాతమో ఎక్కువ జరిగిందని ఒక చక్కటి పట్టిక కంప్యూటర్‌లో ఎక్కించి చూపించాలి. ఈ ఆరాటం ప్రత్యక్షంగా 7 ఎల్ఇపిలో ప్రమాదానికి దారితీసింది.

కాగా, డిజిఎంఎస్‌ను కూడా కొన్ని ప్రశ్నలు అడగాలి. గనుల చట్టం కింద ఈ అధికారి దేశంలోని అన్ని గనుల భద్రతా వ్యవస్థకు చీఫ్ ఇన్స్‌పెక్టర్. వీరి కార్యాలయం బీహార్‌లోని ధన్‌బాద్‌లో ఉంటుంది. గని ప్రమాదాలు ఎక్కడ జరిగినా డిజిఎంఎస్ అక్కడికి పోయి గని యాజమాన్యం మీద ధూంధాం అంటూ ఎగరడం చూస్తుంటాం. కానీ దీనిని మించిన ప్రహసనం వేరొకటి ఉండదు.

గనుల చట్టంలోనూ దానికింద రూపొందించిన నియమాలలోనూ డిజిఎంఎస్‌కు ఉన్న అధికారం కేవలం శవపరీక్ష చేసే అధికారం కాదు. దేశంలోని ప్రతీ గనిలోనూ ప్రతీ నిత్యం భద్రతా నియమాలకు అనుగుణంగా పనులు జరుగుతున్నాయా లేదా అని ఎవరి ఫిర్యాదూ లేకుండ తనంతట తానుగా పర్యవేక్షించే అధికారం, బాధ్యత ఆ అధికారికి ఉన్నాయి. దానికి కావలసిన యంత్రాంగం ఉంది.

తనకిచ్చిన హామీకి విరుద్ధంగా 7 ఎల్ఇపికి చెందిన 3 సీమ్ ఎగువను సింగరేణి యాజమాన్యం

పునఃప్రారంభించిన సంగతి నెలన్నర తరువాత కూడా డిజిఎంఎస్‌కు తెలియలేదంటే వారు ఏం చేస్తున్నట్టు? పునఃప్రారంభించిన తరువాత తగు జాగ్రత్తలు తీసుకోకుండా పనిచేస్తుంటే ఆ విషయం వారి దృష్టికి ఎందుకు రానట్టు? సింగరేణి కంపెనీ కింద నాలుగు జిల్లాలలో ఉన్న 54 గనులలో ఏ ఒక్కటీ సంపూర్ణంగా బొగ్గుగనుల నియమావళిని అనుసరించి నడవడం లేదని సింగరేణి అధికారులే 'ఆఫ్ ది రికార్డ్' అంటున్నారు. మరి డిజిఎంఎస్ ఏం చేస్తున్నట్టు?

**-కరీంనగర్ జిల్లా కమిటీ**



## కాశ్మీర్

# సరిహద్దు వెతలు

దేశభక్తి గలవాళ్లంతా దేశ సరిహద్దుల గురించి చాలా ఆవేశపడుతుంటారు. వాటిని పొరుగు దేశాలు దురాక్రమించకుండా చూడడం ప్రభుత్వానికి వుండే ముఖ్య కర్తవ్యాలలో ఒకటని నమ్ముతారు. అందుకోసం ప్రభుత్వం ఏం చేసినా తప్పులేదని విశ్వసిస్తారు.

ఇది సరిహద్దుకు దూరంగా, దేశం లోపల వుండే దేశభక్తుల సంగతి. సరిహద్దు దగ్గర బతికే వాళ్లకు కూడా దేశభక్తి వుంటుంది, అయితే దేశభక్తికీ దేశ సరిహద్దుకూ మధ్యనున్న సంబంధం వారికి కొంచెం భిన్నంగా కనిపిస్తుంది. సరిహద్దును పొరుగు దేశాల నుంచి కాపాడడానికి ప్రభుత్వం చేపట్టే చర్యలకు బలిఅయ్యేది ఈ ప్రజలే. దూరాన బతికేవాళ్లు సరిహద్దు భద్రత గురించి చేసే ప్రేలాపన వారికి అవాస్తవికంగా ధ్వనించవచ్చు. ఒక్కొక్కసారి హాస్యాస్పదంగానూ ధ్వనించవచ్చు. భారత పాకిస్తాన్‌లు కాశ్మీర్ వివాదాన్ని ఏదోఒకరకంగా పరిష్కారం చేసేసుకుని తమను పాకిస్తాన్‌లో పడేసినా ఫరవాలేదు గానీ ఈ నిత్య ఘర్షణను ఇంక భరించలేం అని జమ్ము ప్రాంతపు సరిహద్దు వాసులయిన హిందువులు విసుక్కుంటున్నారంటే ఎంతమంది నమ్ముతారు?

భారతదేశానికీ పాకిస్తాన్‌కూ దీర్ఘమైన విభజన రేఖ వుంది. అది గుజరాత్‌లో మొదలయి రాజస్థాన్, పంజాబ్, జమ్ము కాశ్మీర్‌ల మీదుగా పోయి లడఖ్‌లోని కార్గిల్‌లో ముగుస్తుంది. ఈ సరిహద్దు సమీపంలో కొన్ని లక్షల కుటుంబాలు నివసిస్తున్నాయి. వారు బుద్ధిపూర్వకంగా సరిహద్దు సమీపంలో వచ్చి వుండడం లేదు. వారి ఊర్ల మధ్య 1947లో సరిహద్దు పుట్టింది. అప్పటినుండి ఇప్పటిదాకా వారు అనుభవించిన అణచివేత వర్ణనాతీతం.

గుజరాత్ నుండి జమ్ములో సగభాగం దాకా ఈ సరిహద్దు ఇరుదేశాలూ అంగీకరించే అంతర్జాతీయ సరిహద్దు (ఐబి). అది జమ్ములోని అఖ్నూర్ తాలూకాలోని పల్లన్‌వాలా గ్రామంలో ముగుస్తుంది. అక్కడినుండి కార్గిల్ దాకా వున్న విభజన రేఖ వివాదాస్పదమయిన 'వాస్తవాధీన రేఖ' (ఎల్‌ఓసి).

గుజరాత్ నుండి అఖ్నూర్ దాకా ఈ విభజన రేఖ వెంబడి నివసించే జనం అత్యధిక భాగం హిందువులు. అక్కడినుండి కార్గిల్ దాకా వాస్తవాధీన రేఖ వెంబడి నివసించే వారిలో ముస్లింలు ఎక్కువ. పోనుపోను అంతా ముస్లింలే.

గుజరాత్ నుండి అఖ్నూర్ దాకా ఈ విభజన రేఖ మైదాన ప్రాంతంలో వుంది. అక్కడి నుండి కొండలలోకి ప్రవేశిస్తుంది. పోనుపోను ఆ కొండలు చాలా ఎత్తయినవి. ప్రపంచంలోనే అన్నిటికంటే ఎత్తయిన యుద్ధక్షేత్రంగా పేరుపొందిన సియాచెన్ ఇక్కడే వుంది.

అంతర్జాతీయ సరిహద్దు సమీపంలో నివసించే కుటుంబాలు భారత పాకిస్తాన్‌ల మధ్య యుద్ధం వచ్చినప్పుడల్లా తమ ఇళ్లూ పొలాలూ విడిచిపెట్టి లోపలికి తరలివచ్చారు. 1947లో ఒకసారి, 1965లో ఒకసారి, 1971లో ఒకసారి ఇది జరిగింది. ఆ తరువాత యుద్ధం ఎప్పుడూ జరగలేదు

గానీ సరిహద్దు దగ్గర సైన్యాల మోహరింపు, కాల్పులు జరిగాయి. 1989లో కాశ్మీర్ లోయలో స్వయం నిర్ణయాధికార పోరాటం మిలిటెంట్ రూపం తీసుకున్నప్పటినుండి ఈ టెన్షన్ నిరంతరాయంగా వుంది. 1999లో కార్గిల్ ఘర్షణ తరువాత ఇది పెరిగింది. 2001 డిసెంబర్ 13న భారత పార్లమెంట్‌పైన మిలిటెంట్ల దాడి జరిగిన తరువాత భారత్ 10 నెలలపాటు సరిహద్దు దగ్గర 7 లక్షల సైన్యాన్ని మోహరించింది. అప్పుడు మళ్లీ అంతర్జాతీయ సరిహద్దు దగ్గరి గ్రామాలను ఖాళీ చేయించి అందరినీ లోపలికి తరలించింది.

ఊరు ఖాళీ చేసి వెళ్లిపోతే పొలాలు బీడుపడతాయి. ఇళ్లు పాడుబడి గోడలలో మొక్కలు మొలుస్తాయి. చిన్నాచితక వ్యాపారాలూ వృత్తులూ దెబ్బతింటాయి. పిల్లల చదువులకు భంగం కలుగుతుంది. పది సంవత్సరాలకొకసారి ఇది జరిగినట్టయితే ఆ కుటుంబాలు కోలుకోవడం కష్టం. గుజరాత్ నుండి జమ్ములోని అఖ్నూర్ తాలూకా దాకా వేలాది కుటుంబాలు ఈ దుర్గతిని అనుభవించాయి, అనుభవిస్తున్నాయి.

13 డిసెంబర్ 2001 తరువాత జరిగిన వలసలో ఒక్క జమ్ము జిల్లాలోనే 28,000 కుటుంబాలు సరిహద్దు గ్రామాలను విడిచిపెట్టి లోపలికి వచ్చాయని జమ్ము జిల్లా డిప్యూటీ కమిషనర్ (మన భాషలో జిల్లా కలెక్టర్) అంటాడు. అన్ని రాష్ట్రాలలో అన్ని జిల్లాలనూ లెక్కలోకి తీసుకుంటే ఒక లక్షకు పైగా కుటుంబాలు వలస వచ్చి వుంటాయని నిస్సందేహంగా చెప్పవచ్చు.

వీరికి సమగ్రమైన పునరావాసం కల్పించే ప్రయత్నం జమ్ము కాశ్మీర్ ప్రభుత్వం చేయలేదు. సరిహద్దు నుండి ఒక ఇరవై కిలోమీటర్లు లోపలికి వున్న దేవీపూర్ అనే గ్రామం దగ్గర 2800 గుడారాలు రాష్ట్ర ప్రభుత్వం, రెడ్‌క్రాస్, ఆక్స్‌ఫాం సంస్థల సహాయంతో వేసింది. జమ్ము జిల్లా సరిహద్దు ప్రాంతం నుండి వలస వచ్చిన 28000 కుటుంబాలకూ ఇదే ప్రభుత్వం కల్పించిన విడిది. ఒక్కొక్క గుడారంలో ఒకటి, అధవా రెండు కుటుంబాల కంటే వుండలేరు కాబట్టి మెజారిటీకి ప్రభుత్వం పునరావాసం కల్పించనట్టే లెక్క. వారంతా ఏం చేశారంటే బంధువుల ఇళ్ళల్లోనో, కిరాయి నివాసాలలోనో కాలం వెళ్లదీశారు.

అందరికీ గుడారాలు ఇవ్వకపోయినా తిండిగింజలు మాత్రం ప్రభుత్వం సరఫరా చేసింది. మనిషికి నెలకు 2 కిలోల బియ్యం, 9 కిలోల గోధుమ పిండి, తలసరి నెలకు 400 రూపాయల నగదు (కుటుంబంలో నలుగురికి మాత్రమే) ఇచ్చింది. ఈ 'రేషన్' మీదనే ఎవరూ బతకలేరనేది స్పష్టమే. అయితే వేరే పని ఏదీ అందరికీ దొరకడం సాధ్యంకాదు కాబట్టి అధికభాగం కాందిశీకులు 10 నెలలపాటు అర్ధాకలితో బతికారు.పిల్లల చదువులు వలస వచ్చిన చోట కొనసాగించడానికి కొంత ఏర్పాటు జరిగినప్పటికీ అది అసంతృప్తికరంగానే వుండింది.

పార్లమెంటుపైన దాడి తరువాత భారత ప్రభుత్వం సరిహద్దు దగ్గర జరిపిన సైన్యం మోహరింపునకు 'ఆపరేషన్ పరాక్రమ్' అని పేరు పెట్టారు. పాకిస్తాన్‌పైన ఒత్తిడిపెట్టి సరిహద్దుకు ఆవలి నుండి ఈవలికి సాయుధ మిలిటెంట్లను పంపే ప్రక్రియను (సీమాంతర ఉగ్రవాదాన్ని) ఆపించాలని భారత్ లక్ష్యం. అయితే మోహరింపు కొనసాగించినట్టయితే ఏ ఒక్క తొందరపాటు చర్య అయినా యుద్ధానికీ అణుయుద్ధానికీ దారితీసే ప్రమాదం వుందన్న భయంతో ఇతర దేశాలు విరమించమని భారత్‌పైన ఒత్తిడి పెట్టాయి. 10 నెలల తరువాత భారత్ 'ఆపరేషన్ పరాక్రమ్'ను ఉపసంహరించింది.

ఉపసంహరించిన తరువాత, వలస వచ్చిన కుటుంబాలన్నిటినీ తిరిగి తమ సరిహద్దు సమీప గ్రామాలకు పొమ్మని చాలా ఒత్తిడి పెట్టారు. గుజరాత్, రాజస్థాన్, పంజాబ్‌లలో ఇది సాఫీగానే జరిగింది గానీ జమ్ము ప్రాంతంలో వలసవచ్చినవారు వెనక్కి పోవడానికి పెద్దగా సుముఖత చూపలేదు. మాటిమాటికీ పొలాలు బీడుపెట్టి వలసవచ్చే ఈ గతి ఎన్నాళ్లు అనుభవిస్తాం, మాకు లోతట్టు ప్రాంతంలో శాశ్వత పునరావాసం కల్పించండి అని ప్రభుత్వాన్ని కోరారు. 'కాశ్మీర్ సమస్య' విషయంలో భారత పాకిస్తాన్‌ల మధ్య సయోధ్య ఎప్పటికయినా కుదురుతుందన్న నమ్మకం సరిహద్దు ప్రజలలో అసలే లేదు.

'హిందూస్తాన్ మొత్తం నాశనమయినా సరే కాశ్మీర్‌లో ఒక్క అంగుళం కూడా వదులుకోవడానికి భారత్ సిద్ధపడదు. పాకిస్తాన్ కూడా అంతే. ఈ రెండు దేశాలలో ఏ నాయకుడు రాజీకి సిద్ధపడినా వాడి కుర్చీ పోతుంది' ఈ మాటలు అంటున్నది జమ్ము జిల్లాలోని దేవీపూర్ క్యాంపులోని ఒక హిందూ కాందిశీకుడు. దాదాపు సరిహద్దు ప్రాంతం వారందరి అభిప్రాయమూ ఇదే. అందుకే వారు రాష్ట్రం లోపలిభాగంలో శాశ్వత పునరావాసం కల్పించమని కోరుతున్నారు.

కానీ ప్రభుత్వం ససేమిరా అంటున్నది. 'వాళ్ల భూములలో పెరిగిన మొక్కలు పీకించి బాగు చేయడానికీ వాళ్లకు పక్కా ఇళ్లు కట్టియ్యడానికీ ఒక ప్రతిపాదన తయారుచేసి కేంద్ర ప్రభుత్వానికి పంపాము. అది సరిహద్దు ప్రాంతం కాబట్టి ఏ నిర్మాణమైనా కేంద్రం అనుమతితోనే జరగాలి. అనుమతి రాగానే చేసేస్తాం. అంతే తప్ప లోపలి ప్రాంతాలలో పునరావాసం ఏర్పాటు చేసే ఆలోచన లేదు. అది జరగదు' అని జమ్ము జిల్లా డిప్యూటీ కమిషనర్ కచ్చితంగా అంటాడు. అయినా సరే మొండిగా మేము తిరిగి పోమని ఎవరయినా అంటే వారి 'రేషన్' నిలిపివేస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది. వెనక్కిపోయినట్టయితే భూములు మళ్లీ సాగు యోగ్యం అయ్యేదాకా 'రేషన్' ఇస్తాము గానీ పోకపోతే మీకు ఒక్క గింజ కూడా ఇచ్చేది లేదనింది. ఈవిధంగా ఒత్తిడి పెట్టి చాలామందిని వెనక్కి పంపించేశారు.

ప్రభుత్వం అనుసరిస్తున్న ఈ మొండివైఖరికి కారణం ఏమిటని అడిగితే చెప్పరు గానీ మనం ఊహించడం కష్టం కాదు. సరిహద్దు ప్రజలను లోపలికి తీసుకొచ్చి పునరావాసం కల్పించడమంటే భారత ప్రభుత్వం తన చేతకానితనాన్ని ఒప్పుకోవడమేనని ప్రస్తుతం దేశాన్ని ఏలుతున్న కాషాయ దేశభక్తి భావిస్తున్నది. తలచుకుంటే పాకిస్తాన్‌పైన అరక్షణంలో దాడిచేసి తరతరాలు జ్ఞాపకం పెట్టుకునేటట్టు భారత్ బుద్ధిచెప్పగలదని కదా వారి నిత్య ప్రగల్భం. అటువంటి వారు ఈ తగాదా ఇప్పట్లో తెగేది కాదని ఒప్పుకొని సరిహద్దు జనాన్ని శాశ్వతంగా సురక్షిత ప్రాంతాలకు ఎట్లా తరలిస్తారు? వారి 'పౌరుషానికి' ప్రజలు బలికాక తప్పదు మరి.

జమ్ము ప్రాంత కాందిశీకులకు ఇంకొక రెండు ఫిర్యాదులున్నాయి. అందరికీ పునరావాస శిబిరాలు కల్పించకపోయినా తిండిగింజలు, రొక్కం కొంత ఇచ్చారని చెప్పాము. అది జరుగుబాటుకు సరిపోదని కూడా సూచించాము. జమ్ము కాందిశీకులు తమ పరిస్థితిని కాశ్మీర్ పండిట్‌లతో పోల్చుకుని, 'అందరమూ వలసవచ్చిన కాందిశీకులమే కదా, మా మధ్య ఈ వివక్ష ఎందుకు?' అని అడుగుతున్నారు. కాశ్మీర్ లోయలో మిలిటెన్సీ కారణంగా కాశ్మీర్ పండిట్‌లు 1990తో మొదలుపెట్టి లోయ నుండి జమ్ముకు వచ్చి కాందిశీకులుగా వుంటున్నారు. వాళ్లకు దశాబ్దం పైగా ప్రభుత్వం 'రేషన్' ఇస్తున్నది. తలసరి నెలకు 5 కిలోల బియ్యం, 11 కిలోల గోధుమ పిండి, కుటుంబానికి నెలకు 3000 రూపాయల దాకా రొక్కం ఇస్తుంది ప్రభుత్వం. కానీ సరిహద్దు నుండి తరలివచ్చిన

జమ్ము కాందిశీకులకు 2 కిలోల బియ్యం, 9 కిలోల గోధుమపిండి, కుటుంబానికి గరిష్ఠం 1600 రూపాయలు ఇస్తున్నారు.

ఈ వ్యత్యాసానికి కారణం ఎవ్వరూ చెప్పకపోగా, దేవీపూర్ శిబిరంలో మాత్రం దాని గురించి రకరకాలుగా జోక్ చేసుకుంటున్నారు. పండిట్‌లు 'ఎ' క్లాస్ కాందిశీకులు కాగా తాము 'బి' క్లాస్ అని ఒకరు (పండిట్‌లు అందరూ బ్రాహ్మణులు కాగా, జమ్ము సరిహద్దువాసులు అధికభాగం అబ్రాహ్మణులనేది వాస్తవం), 'వాళ్లు తెల్లగా వుంటారు, మేము నల్లగా వుంటాం' అని ఇంకొకరు అంటున్నారు. జమ్మువాసులు మనకంటే 'తెల్లగా'నే వుంటారు గానీ కాశ్మీరీలతో పోలిస్తే 'నలుపే'!

ఇంకొక ఫిర్యాదు మందుపాతరలకు సంబంధించినది. యుద్ధ ప్రమాదం దగ్గరికొచ్చినప్పుడు శత్రుసైన్యాలు దేశంలోకి ప్రవేశించకుండా ఆపడంకోసం సరిహద్దు దగ్గర మందుపాతరలు పెట్టే యుద్ధతంత్రం తెలిసిందే. ట్యాంకుల వంటి భారీ వాహనాలు ప్రవేశిస్తే వాటి ఒత్తిడికి పేలి వాటిని ధ్వంసం చేసేవి ఒకరకం మందుపాతరలు కాగా, మనిషి కాలుపెడితే కూడా పేలి ఆ మనిషిని చంపేవి రెండవ రకం. ఈ రెండవరకాన్ని ఇంగ్లీష్‌లో anti-personnel mines అంటారు. ఈ మందుపాతరలు అమర్చినట్టయితే సరిహద్దు దగ్గర నివసించే మనుషులకు, వారి పశువులకు కూడా హానికరం కాబట్టి వీటిని పూర్తిగా నిషేధించాలన్న ప్రయత్నం ఐక్యరాజ్య సమితి కొంత కాలంగా చేస్తున్నది. 1996లో మొదలయిన ఈ ప్రయత్నం ఒక మందుపాతరల నిషేధ ఒప్పందం (Mine Ban Treaty) రూపం తీసుకుంది. 2003 మే 13 నాటికి 147 దేశాలు దానిపైన సంతకం చేశాయి. వాటిలో 134 దేశాలు ఆ ఒప్పందాన్ని తమ దేశాల రాజ్యాంగాలు నిర్దేశించే పద్ధతిని అనుసరించి ఆమోదించాయి. సంతకం చేయని దేశాలు కేవలం 46. ఈ ఉగ్రవాదులలో మనం ఉన్నాము, మన పొరుగు వారయిన పాకిస్తానీలున్నారు, ఇద్దరికీ కావలసిన అమెరికా వారున్నారు.

2001 డిసెంబర్ 13 తరువాత సరిహద్దు వద్ద జరిగిన సైనిక మోహరింపులో భాగంగా భారత్ సరిహద్దు వెంబడి మందుపాతరలు విస్తృతంగా అమర్చింది. ఈ అమరిక అంతర్జాతీయ సరిహద్దు వద్దా జరిగింది. దానికి కొనసాగింపైన వాస్తవాధీన రేఖ వద్ద కూడా జరిగింది.

వాస్తవాధీన రేఖ వెంబడి అమర్చిన మందుపాతరల వల్ల చాలామంది సరిహద్దువాసులు ప్రాణాలు, శరీర అంగాలు పోగొట్టుకున్నారు (దీనికి గల కారణాలను దిగువ చూద్దాం). కాగా అంతర్జాతీయ సరిహద్దు వద్ద మనుషుల ప్రాణాలు ఎక్కువ పోకపోయినా వారి పశువులు అపారంగా చనిపోయాయి.

మందుపాతరలు ఫలానాచోటి దాకా వున్నాయని ప్రజలకు చూచాయగా మాత్రమే తెలుసును. అయితే అంతర్జాతీయ సరిహద్దు ఎక్కువభాగం పల్లపు మైదానంలో వుంది కాబట్టి ఆ ఊహాత్మక రేఖను ప్రజలు పాటించగలిగారు. ప్రాణాలు కాపాడుకోగలిగారు. కానీ తమ పశువులను కాపాడు కోవడం వారికి సాధ్యం కాలేదు. మేతకోసం సరిహద్దు సమీపానికి పోయి మందుపాతరలను తొక్కి కాళ్లు, ప్రాణం పోగొట్టుకున్న పశువులు 'వేల సంఖ్యలో' వున్నాయని అధికారులు ఒప్పుకుంటున్నారు. వాటి సంఖ్య కచ్చితంగా ఎందుకు తెలియదంటే ఈ విధంగా చనిపోయిన, అంగవైకల్యం పొందిన పశువుల యజమాన్లకు ఏ రకమైన నష్టపరిహారం ఇవ్వడం లేదు. మొదట్లో ఈ సంగతి తెలియని రైతులు అర్జీలు పెట్టుకున్నారు. అయితే అందుకోసం మూడు సర్టిఫికెట్లు తేవలసి వచ్చేది. పశువు నిజంగా చచ్చిందని వెటరినరీ డాక్టర్ సర్టిఫికెట్, అది మందుపాతర వల్లనే చచ్చిందని పోలీసు సర్టిఫికేటు, ఆ పశువు ఈ అర్జీదారుకు చెందినదే అని గ్రామ అధికారి సర్టిఫికెటు పెట్టేవారు. ఇంతా చేసి నష్టపరిహారం ఇచ్చే పాలసీయే లేదని గ్రహించి ఉసూరుమన్నారు.

ఇప్పుడు మందుపాతరలు మొత్తం తవ్వి తీసేస్తేనే వెనక్కి తిరిగిపోతామని కాందిశీకులు అనడంతో అంతర్జాతీయ సరిహద్దుకు సంబంధించినంతవరకు ఆ పని చేసేశారు.

వాస్తవాధీన రేఖ వెంబడి వున్న ఆవాసాల ప్రజలది మరీ దుర్భరమైన పరిస్థితి. దీనికి చాలా కారణాలున్నాయి. అంతర్జాతీయ సరిహద్దు ఉభయ దేశాలూ ఆమోదించే సరిహద్దు కాబట్టి అక్కడ నిత్యం కాల్పులు జరగవు. భారత్ – పాక్ సంబంధాలు వేడెక్కినప్పుడు మాత్రమే జరుగుతాయి. వాస్తవాధీన రేఖ వివాదాస్పద సరిహద్దు కాబట్టి దానిని ఇటూ అటూ నెట్టే ప్రయత్నంలో రెండు సైన్యాలూ నిత్యం కాల్పులు జరుపుతూనే వుంటాయి. ఈ కాల్పులు తుపాకీ కాల్పులే అయినట్టయితే ప్రజలకు అపాయం వుండేది కాదుగానీ ఇప్పుడు కొన్ని సంవత్సరాలుగా ఫిరంగులు వాడడం పరిపాటి అయింది. ఈ ఫిరంగుల దెబ్బకు సరిహద్దు ప్రజలు చనిపోవడం, అంగవైకల్యం పొందడం ఎంత మామూలు విషయం అయిపోయిందంటే, రాష్ట్ర ప్రభుత్వం సరిహద్దు దగ్గర ఫిరంగి గుండ్ల వల్ల చనిపోయిన వారి కుటుంబాలకు 1 లక్ష రూపాయలు, శాశ్వతంగా వికలాంగులయిన వారికి 75,000 రూపాయలు నష్టపరిహారం ఇచ్చే జీవో జారీ చేసింది.

రెండవ సమస్య ఏమిటంటే, పాకిస్తాన్ వైపునుండి ఇండియా వైపునకు మిలిటెంట్లు 'చొరబడే' ప్రాంతం ఈ వాస్తవాధీన రేఖే. వాళ్లు రేఖ దాటడానికి వెసులుబాటు కల్పించడంకోసం పాకిస్తాన్ సైన్యం భారత సైన్యాన్ని కాల్పులతో వెనక్కి నెట్టే ప్రయత్నం చేస్తుంటుంది. భారత సైన్యం 'చొరబాటు దార్లు' రేఖ దగ్గరకు రాకుండా నిలువరించడానికి ఇవతలివైపు నుండి అంతే పట్టుదలతో కాల్పులు జరుపుతుంటుంది. ఈ కారణంగా కూడా వాస్తవాధీన రేఖ దగ్గర ఎడతెరిపి లేకుండా కాల్పులు జరుగుతుంటాయి. సరిహద్దువాసులయిన ప్రజలు అనునిత్యం ఫిరంగి గుండ్లను ఎదుర్కొం టుంటారు.

'చొరబాటు'దార్ల కారణంగా వాస్తవాధీన రేఖ వద్ద మందుపాతరలు మరింత దట్టంగా వుంటాయి. వాటిని తొలగించడం ఎప్పుడూ జరగదు కాబట్టి మందుపాతరలు తొలగిస్తే వెనక్కి పోతాం అని షరతుపెట్టే అవకాశం ఇక్కడ లేదు. అవి వుంటుండగానే వెనక్కిపోవాలి, పోయి బత కాలి.లేదా కాందిశీకులకు ప్రభుత్వం ఇస్తున్న రేషన్ వదులుకుని తమ చావు తాము చూసుకోవాలి.

వాస్తవాధీన రేఖ వద్ద ఇంకొక సమస్య ఏమిటంటే అంతర్జాతీయ సరిహద్దు లాగ ఇది మైదాన ప్రాంతం కాదు. కొండ ప్రాంతం. అఖ్నూర్ తాలూకాలోని పల్లన్‌వాలా గ్రామం వద్ద అంతర్జాతీయ సరిహద్దు అయిపోతుంది, మైదానమూ అయిపోతుంది. అక్కడినుండి కొండప్రాంతం, వాస్తవాధీన రేఖ మొదలవుతాయి. చిన్నచిన్న కొండలుగా మొదలయి కాశ్మీర్ చేరేసరికి బాగా ఎత్తు పెరిగి కార్గిల్ చేరేలోపల ప్రపంచంలోనే అతి ఎత్తయిన యుద్ధక్షేత్రమైన సియాచెన్ తగులుతుంది. ఇది కొండప్రాంతం, పోనుపోను మంచుకొండల ప్రాంతం కావడం వల్ల వాస్తవాధీన రేఖ ఎక్కడుందో కచ్చితంగా ఎవరూ చెప్పలేరు. ప్రజలు తమకే తెలియకుండా ఇండియా నుండి పాకిస్తాన్‌లోనికి, పాకిస్తాన్ నుండి ఇండియాలోకి 'చొరబడు'తుంటారు. ప్రాణాపాయాన్ని తెలియకుండానే కొనితెచ్చు కుంటుంటారు.

ఈ సమస్య ఎక్కువగా ఎదుర్కొనేది పశువుల కాపర్లయిన గుజ్జర్, బఖర్‌వాల్ తెగలు. కొండ

ప్రాంతంలోని వాస్తవాధీన రేఖ సమీపంలో అత్యధికంగా నివసించేది వీరే. రెండు దేశాల సైన్యాలు పేల్చుకునే ఫిరంగి గుండ్లకు, భారత సైన్యం అమర్చిన మందుపాతరలకు, మిలిటెంట్ల తూటాలకు, భారత సైన్యం తూటాలకు అత్యధికంగా బలి అవుతున్నది, బలి అయింది వీరే. గడచిన యాభై ఏళ్లలో తాతల తరంలో, తండ్రుల తరంలో, పిల్లల తరంలో ఒక్కొక్కరిని కోల్పోయిన కుటుంబాలు వీరిలో అనేకం వున్నాయి. అయితే ఈ ప్రజలకు రాజకీయ ప్రతినిధులు గానీ వీరి సమస్యల గురించి రాయగల మేధావులు గానీ లేరు. వీరు జమ్ము ప్రాంతవాసుల భాష అయిన డోగ్రీ గానీ కాశ్మీర్ లోయ భాష అయిన కాశ్మీరీ గానీ, సరిహద్దు ప్రాంతంలోని ప్రధాన సామాజిక వర్గాలు మాట్లాడే పహాడీ గానీ మాట్లాడరు. వీరి భాష గోజ్రీ. రూపురేఖలలోనూ సంస్కృతిలోనూ విలక్షణంగా వుంటారు. ఎప్పటికయినా వీరికి నోరొచ్చి మాట్లాడడం మొదలుపెడితే యాభైఏళ్ల భారత – పాక్ వైరం వల్ల అత్యధికంగా నష్టపోయిన ప్రజా సమూహాలుగా ప్రపంచం వీరిని గుర్తిస్తుంది. కాశ్మీర్ పండిట్ల కంటే ఎన్నోరెట్లు అధికంగా వీరు హింస అనుభవించారు, నిత్యం అనుభవిస్తున్నారు. అయితే వాళ్లు హిందువులు, బ్రాహ్మణులు, దేశ పాలనలో అత్యున్నత స్థానాలలో బంధువర్గాన్ని కల్గినవారు. వీరు ముస్లింలు, అందులోనూ అల్పసంఖ్యాక వర్గానికి చెందినవారు. చదువులు ఉద్యో గాలు ఎరుగని సంచార జీవులు.

గుర్రాలెక్కి పశువులనూ గొర్రెలనూ మేకలనూ తోలుకుంటూ తమ పెంపుడు కుక్కలు తప్ప వేరే భద్రత ఏదీ లేకుండా ప్రపంచంలోనే అతి ప్రమాదకరమైన సరిహద్దుగా గుర్తింపుపొందిన భారత్ –పాక్‌ల వాస్తవాధీన రేఖ వద్ద వీళ్లు సంచరిస్తుంటారు. అవే కొండ చరియలలో ఇక్కడొకటీ అక్కడొకటీ వీరి ఇళ్లు, గుడిసెలు వుంటాయి. పాకిస్తాన్ వైపునుండి ప్రవేశించే మిలిటెంట్లకు తోవ చూపించడానికీ తిండిపెట్టడానికీ భారత సైన్యం గురించి సమాచారం ఇవ్వడానికీ వీరు తప్ప వేరే ఎవ్వరూ దొరకరు. కొందరు ఇష్టపూర్వకంగా ఇస్తారు, కొందరు డబ్బుకోసం ఇస్తారు, కొందరు భయానికి ఇస్తారు. మిలిటెంట్లు వీరినే ఆశ్రయిస్తారని భారత సైన్యానికి తెలుసు కాబట్టి వీరిని విపరీతమైన హింసకు గురిచేస్తుంది. కొట్టడం, హింసించడం, చంపడమే కాక వాస్తవాధీన రేఖ సమీపంలో సైన్యం జరిపే 'ఆపరేషన్ల'కు అవసరమయిన కూలిపని యావత్తు గుజ్జర్, బఖర్‌వాల్ ప్రజల చేతనే చేయించుకుంటుంది. గుడారాలు వేయడం, నీళ్లు తేవడం, మూటలు మోయడం, చెట్లు కొట్టడం ఇత్యాది పనులు పైసా కూలి ఇవ్వకుండా చేయించుకుంటుంది. మళ్లీ అప్పుడప్పుడు తన 'ఆపరేషన్' అవసరాల రీత్యా ఆ ప్రాంతాన్ని వదిలి వెళ్లిపొమ్మంటుంది. తాను అనుమతి ఇచ్చేంత వరకు తిరిగి రావద్దంటుంది. ఈ హింస భరించలేక వారు తమకు సహాయం చేయడం మానేస్తారేమోనన్న భయంతో మిలిటెంట్లు ఈమధ్యకాలంలో వాస్తవాధీన రేఖ సమీపంలోని గుజ్జర్ – బఖర్‌వాల్ ప్రజలపైన భౌతిక హింస విపరీతంగా పెంచారు. భారత్ సైన్యానికి ఎవరు సహకరిస్తున్నారని తెలిసినా వారినే కాక వారి కుటుంబ సభ్యులయిన స్త్రీలను, పిల్లలను, ముసలి వాళ్లను కాల్చి చంపుతున్నారు, అవయవాలు తెగకోస్తున్నారు.

అయితే ఈ హింసకంటె ఎక్కువగా వారికి ప్రాణాపాయం కలిగిస్తున్నది మందుపాతరలు. అంతర్జాతీయ సరిహద్దు దగ్గర మందుపాతరలు పెట్టేది యుద్ధమొచ్చినప్పుడు, లేదా 'ఆపరేషన్ పరాక్రమ్' లాంటి యుద్ధాన్ని పోలిన పరిస్థితులు వచ్చినప్పుడు. ఆ పరిస్థితి గడిచిపోయిన తరువాత మందుపాతరలను తీసివేయడం జరుగుతుంది. వాస్తవాధీన రేఖ పరిస్థితి వేరు. ఇక్కడ పెట్టే మందు



పాతరల లక్ష్యం పాకిస్తాన్ సైన్యాన్ని నిలువరించడం కాదు. 'చొరబాటుదార్ల'ను నిలువరించడం. 1989లో కాశ్మీర్ లోయలో స్వయం నిర్ణయాధికార పోరాటం మొదలయిన తరువాత వాస్తవాధీన రేఖ దగ్గర భారత్ మందుపాతరలు పెట్టడం మొదలుపెట్టింది. 1999లో జరిగిన కార్గిల్‌యుద్ధం తరువాత ఇది మరీ పెరిగింది. 2001 డిసెంబర్ 13 తదుపరి దాదాపు 10 నెలలు నెలకొన్న సరిహద్దు సంక్షోభంలో ఇంకింతగా మందుపాతరలు విస్తరించాయి. వీటిని ఇంక తొలగించే ప్రసక్తి లేదు.

ఇది కొండ ప్రాంతం కాబట్టి ఇక్కడ మందుపాతరలొక సరళ రేఖలో వుండవు. వర్షాలు వచ్చినప్పుడు కొండ చరియలలో మట్టి కదులుతుంది. మట్టితోపాటు మట్టిలో పాతిన మందుపాతరలు కూడా కదులుతాయి. అవి తొలినాడు పెట్టినచోటే వుండవు. 'నిజం చెప్పాలంటే వాస్తవాధీన రేఖ వద్ద మందుపాతరలు ఎక్కడ వున్నాయో మాకు సహితం తెలీదు' అని సైనిక అధికారులే ఒప్పుకుంటున్నారు.

'వికలాంగులకు సర్టిఫికెట్లు పంచడానికి నేను నౌషేరా తాలూకాకు పోయినప్పుడు అక్కడ ఎంతమంది వికలాంగులున్నారో చూసి ఆశ్చర్యపోయాను' అని రాజౌరి జిల్లా డిప్యూటీ కమిషనర్ (జిల్లా కలెక్టర్) అంటాడు. 'ఒక్కొక్క ఇంట్లో ఇద్దరు ముగ్గురు వికలాంగులుండడం గమనించాను. కారణం కనుక్కుంటే మందుపాతరల వల్ల గాయపడ్డారని చెప్పారు' అంటాడు.

జమ్ము కాశ్మీర్ రాష్ట్ర ప్రభుత్వం పాకిస్తానీ సైనికుల ఫిరంగి గుండ్ల వల్ల క్షతగాత్రులయిన వారికి, మిలిటెంట్ల చేతిలో గాయపడ్డవారికి నష్టపరిహారం ఇస్తున్నది. చనిపోతే 1 లక్ష రూపాయలు, శాశ్వతంగా వికలాంగులయితే 70,000 రూపాయలు ఇస్తున్నది. ఈ కారణంగా ఎంతమంది ఈ రెండు కారణాల వల్ల చనిపోయారు, లేక గాయపడ్డారు అన్న గణాంకాలు ప్రభుత్వం దగ్గర దొరుకుతాయి. కానీ మందుపాతరలలో గాయపడినా చనిపోయినా అవి వున్నచోటికి నిన్నెవరు పొమ్మన్నారు అంటూ చాలాకాలం పాటు ఏ నష్టపరిహారం ఇచ్చేవారు కాదు. గొడవ చేయగా చేయగా ఈమధ్య నామ మాత్రము నష్టపరిహారం ఇవ్వడం మొదలుపెట్టారు. మందుపాతర పేలి ప్రాణం పోతే 10,000 రూపాయలు, అంగవికలురైతే 1,000 రూపాయలు ఇస్తున్నారు. ఈ వివక్షకు కారణం వివరించగల వాళ్లెవరూ లేరు. అవి 'వాళ్ల' ఆయుధాలు, ఇవి 'మన' మందుపాతరలు అయినందుకేననుకోవాలి!

అదెట్లాగున్నా, చాలాకాలం మందుపాతర మరణాలకు, గాయాలకు ఏ నష్టపరిహారం ఇవ్వని కారణంగా వీటికి సంబంధించిన గణాంకాలు ప్రభుత్వం దగ్గర లేవు. ప్రైవేట్ వ్యక్తులు గానీ, హక్కుల సంఘాలు గానీ సమగ్రమైన గణాంకాలు సేకరించే పరిస్థితి వాస్తవాధీన రేఖ దగ్గర లేదు. ఒక్కొక్క గూడెం తిరిగి లెక్కలుతీస్తే తప్ప తెలీదు.

అయితే 'శత్రు' సైన్యం ఫిరంగి గుండ్లకన్నా, మిలిటెంట్ల తుపాకి తూటాలకన్నా 'మన' మందు పాతరలే ఎక్కువ హాని చేశాయని కొంత ఆధారంతో వాదించే వ్యక్తి ఒకరు పూంచ్‌లో వున్నాడు. ఆయన మిలిటెంట్ కాదు. కాశ్మీరీ కాదు. ముస్లిం కూడా కాదు. డాక్టర్ జగ్బీర్‌సింగ్ సూదన్ అనే సంఘ సేవకుడయిన వైద్యుడు. సిక్కు మతంలోని సేవాస్ఫూర్తితో అతను ప్రీతం స్పిరిచువల్ ఫౌండేషన్ అనే ధర్మ సంస్థను పూంచ్‌లో నడుపుతున్నాడు. వికలాంగులకు సహాయం చేయడం ఈ సంస్థ ప్రధాన లక్ష్యం. ఈ సంస్థ 1975లోపనిచేయడం మొదలుపెట్టినప్పుడు కాశ్మీర్‌లో మిలిటెంట్ పోరాటం లేదు, సరిహద్దుకు ఆవలినుండి చొరబాట్లు లేవు. సరిహద్దు దగ్గర మందుపాతరలూ

పెద్దగా లేవు. ఆనాడు వారు వికలాంగుల సేవను తమ కార్యరంగంగా యథాలాపంగానే ఎంచుకొని వుండవచ్చును. కానీ వారి నిర్ణయంతో ప్రమేయం లేని కారణాల వల్ల వికలాంగుల సేవే ఆ ప్రాంతంలో ఎవరయినా చేపట్టగల ప్రధాన వైద్య సేవ అయికూర్చుంది.

పూంచ్ జమ్ము ప్రాంతంలోని ఒక జిల్లా కేంద్రం. ఆ వూరు దాదాపు వాస్తవాధీన రేఖ మీదనే వుంది. ఆ జిల్లాలోనూ పొరుగు జిల్లా అయిన రాజౌరి జిల్లాలోనూ సరిహద్దు వాసులెవరయినా ఏ దాడిలోనయినా గాయపడితే పూంచ్ ప్రభుత్వ ఆస్పత్రికి రావడం సహజం. అక్కడ తెగిన అవయవానికి శస్త్రచికిత్స చేసుకున్న తరువాత కృత్రిమ అవయవాలకోసం డాక్టర్ జగ్బీర్‌సింగ్ సూదన్ దగ్గరికి వస్తారు. ఈ సిక్కు మతస్తుడు మరొక జైన మత సంస్థ సహాయంతో (దాని పేరు భగవాన్ మహావీర్ వికలాంగ్ సహాయతా సమితి, జైపూర్) ప్రధానంగా ముస్లింలయిన క్షతగాత్రులను ఢిల్లీ తీసుకుపోయి ఉచితంగా కృత్రిమ అవయవాలు అమరుస్తుంటారు.

గడచిన 13 సంవత్సరాలలో తాము 1738 మందికి కృత్రిమ అవయవాలు అమర్చామని, అందులో మందుపాతరల వల్ల గాయపడినవారు, సరిహద్దు వద్ద అవతలివైపు నుండి జరిగే ఫిరంగి గుండ్ల కాల్పులలో గాయపడినవారు, మిలిటెంట్ల చేతులలో గాయపడినవారూ వున్నారనీ, అయితే అందరికంటే ఎక్కువమంది మందుపాతరలలో గాయపడినవారేనని డాక్టర్ సూదన్ అంటాడు. ఆయన మాటలను అనుమానించవలసిన అవసరమేమీ లేదు.

కాశ్మీర్ లోయలోకి పోతే వాస్తవాధీన రేఖ సమీపంలో నివసించేవారి స్థితి మరీ దారుణం. కాశ్మీర్‌లో కుప్వారా జిల్లా పూర్తిగా వాస్తవాధీన రేఖను ఆనుకొని వున్న జిల్లా. కిందటి సంవత్సరం డాక్టర్ జగ్బీర్‌సింగ్ సూదన్ కుప్వారా జిల్లాలో వికలాంగులకు ఉపయోగపడే పరికరాలను అందివ్వడంకోసం క్యాంప్ నిర్వహించగా, లాంగేట్ అనే ఒక్క సరిహద్దు గ్రామంలోనే 300 మంది వికలాంగులు సహాయం కోరారట. ఆ ఒక్క ఊరిలోనే ఆయన 31 మూడుచక్రాల సైకిళ్లు, 41 రెండు చక్రాల కుర్చీలు, 61 చంక కింద పెట్టుకునే కర్రలు పంచాడంట!

'ఆపరేషన్ పరాక్రమ్' ముగిసిన తరువాత అంతర్జాతీయ సరిహద్దు వద్దనుండి వలస వచ్చిన కాందిశీకులను వెనక్కి పొమ్మన్నట్టే, వాస్తవాధీన రేఖ వద్దనుండి వలసవచ్చిన కాందిశీకులనూ ఆ రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి పొమ్మనింది. వాళ్లు కనీసం మళ్లీ యుద్ధమో యుద్ధ పరిస్థితో వచ్చేంతవరకు కొంచెం భయంగానయినా సరే బతుకు వెళ్లదీయవచ్చు. వీళ్ల ఫిరంగి గుండ్లనూ మందుపాతరలనూ ఎదుర్కొంటూ ప్రతిరోజూ చస్తూ బతకవలసిందే. మొదట్లో చెప్పినట్టు, గుజరాత్ నుండి జమ్ము జిల్లాలోని అఖ్నూర్ తాలూకా దాకా అంతర్జాతీయ సరిహద్దు సమీపంలోని ఆవాసాలలో వుండే జనం అత్యధిక శాతం హిందువులు కాగా, వాస్తవాధీన రేఖ మొదలయిన దగ్గర నుండి జనాభాలో ముస్లింల శాతం పెరుగుతుంది. పూంచ్ జిల్లాకు వచ్చేసరికి దాదాపు అందరూ ముస్లింలే. వాళ్ల గోడే విననిది వీళ్ల గోడెవరు వింటారనడానికి ఎంత ఇబ్బంది అనిపించినా అనక తప్పదు.

**–నిజనిర్ధారణ కమిటీ నివేదిక**



## కాంటాపురి

# నేపథ్యం, ఉద్యమం, నిర్బంధం

పశ్చిమ బెంగాల్ చిత్రపటం మీరు చూసే ఉంటారు. పెద్ద పొట్ట, సన్నటి మెడ, ఒక మోస్తరు తలకాయ ఉన్న మృగంలాగ ఉంటుంది. ఆ మెడ మధ్య భాగంలో అడ్డంగా గంగానది ప్రవహిస్తుంది. నదికి ఉత్తర భాగాన ఉన్న ప్రాంతాన్ని 'ఉత్తర బెంగాల్' అంటారు. అందులో ఆరు జిల్లాలున్నాయి. డార్జిలింగ్, జల్పాయ్‌గుడి, కూచ్–బిహార్, మాల్దా, ఉత్తర దినాజ్‌పూర్, దక్షిణ దినాజ్‌పూర్.

డార్జిలింగ్ జిల్లాలోని కొండ ప్రాంతాలలో నివసించే నేపాలీలు తమకొక ప్రత్యేక రాష్ట్రం (గూర్ఖాలాండ్) కావాలంటూ ఆయుధాలు పట్టుకొని కొంతకాలం ఉద్యమించి కొంత స్వయం ప్రతిపత్తిని సాధించుకున్న సంగతి తెలిసిందే.

తక్కిన అయిదు ఉత్తర బెంగాల్ జిల్లాలలోనూ డార్జిలింగ్ జిల్లాలోని మైదాన ప్రాంతాలలోనూ ఒక దశాబ్దం కాలంగా ప్రత్యేక రాష్ట్ర ఉద్యమమొకటి నడుస్తున్నది. దానిని 'కాంటాపురీ' ఉద్యమం అని పిలుస్తున్నారు. ('కామ్టాపురి' అని పలకాలి) ఆ ఉద్యమకారులు కోరుకుంటున్న ప్రత్యేక రాష్ట్రం పేరు 'కాంటాపూర్'. ఆ ఉద్యమం తరఫున కాంటాపూర్ పీపుల్స్ పార్టీ (కెపిపి) అనే పార్టీ ఒకటి ఉంది. ఆ పార్టీ గత పంచాయతీ ఎన్నికలలో పాల్గొని 27 గ్రామ పంచాయతీలలో సర్పంచ్ పదవి గెలుచుకునింది. అసెంబ్లీ ఎన్నికలలో జల్పాయ్‌గుడి జిల్లాలో ఒక సీటుకు పోటీచేసి ఓడిపోయింది కూడా.

కెపిపియే కాక, అఖిల కాంటాపురీ విద్యార్థి సంఘం (ఎకెఎస్‌యు – 'ఆక్సు') కాంటాపురీ స్త్రీల హక్కుల సంఘం (కెడబ్ల్యుఆర్ఏ) అనే ప్రజా సంఘాలు కూడా ఈ ఉద్యమానికి ఉన్నాయి. వాటితో పాటు కాంటాపురి విమోచన సంస్థ (కెఎల్ఓ) అనే అండర్‌గ్రౌండ్ సాయుధ సంస్థ కూడా ఉంది.

ఈ కెఎల్ఓ పెద్దఎత్తున హింసకు పాల్పడిన దాఖలాలేవీ లేవుగానీ కాంటాపురీ ఉద్యమం ఏ చర్యకు పాల్పడినా దానిని కెఎల్ఓతో ముడిపెట్టి విరుచుకుపడడం పశ్చిమ బెంగాల్ పోలీసులకూ వారికి అండగా ఉత్తర బెంగాల్‌లో మోహరించిన కేంద్ర పారామిలిటరీ బలగాలకూ పరిపాటి అయింది.

పశ్చిమ బెంగాల్‌లో వామపక్ష సంఘటన అధికారంలో ఉండడం వల్ల ఏ తేడా రాలేదా అంటే ఒక్క తేడా మాత్రం ఉంది. కాంటాపురీ ఉద్యమం మీద 'పోటా' ప్రయోగించడం లేదు. అయితే 'పోటా' ప్రయోగించడం వల్ల ప్రభుత్వానికి ఉండగల ఒక ప్రయోజనాన్ని (బెయిలు రాకుండ దీర్ఘ కాలం రిమాండులో ఉంచే సదుపాయాన్ని) మాత్రం అన్యమార్గాల ద్వారా పశ్చిమ బెంగాల్ పోలీసులు సాధించుకుంటున్నారు.

ఈ నిర్బంధం వివరాలలోకి పోయేముందు కాంటాపురీ ఉద్యమం చారిత్రక, సామాజిక పూర్వాపరాలను తెలుసుకోవడం ఉచితంగా ఉంటుంది.

ఈ ఉద్యమానికి పునాది రాజ్‌బన్షి (రాజవంశి అని చదువుకుంటే మనకు సులభంగా ఉంటుంది) అనే కులం. వీళ్లు పశ్చిమ బెంగాల్‌లో షెడ్యూల్డు కులం, అస్సాంలో వెనుకబడిన కులం, త్రిపురలో షెడ్యూల్డు తెగ! మన సమాజంలో ఆదివాసీ తెగ నుంచి కులానికి కొంత పరివర్తన చెంది ఇంకా పూర్తిగా చెందకుండ ఉండిపోయిన ప్రజా సమూహాలు ఉన్నాయి. అటువంటి సమూహాలలో ఒకటిగా రాజ్‌బన్షిలను అర్థం చేసుకోవచ్చునేమో.

దేశ స్వాతంత్ర్యానికి పూర్వం ఈ రాజ్‌బన్షి తెగకు (లేక కులానికి) చెందిన రాజులు కూచ్‌బిహార్ అనే సంస్థానాన్ని ఏలేవారు. దాని పక్కనే ఉన్న బైకుంఠపూర్ అనే సంస్థానంతో కలుపుకుంటే మొత్తం ఉత్తర బెంగాల్ రాజ్‌బన్షిల దేశంగా ఉండింది. 1947 దాకా కూడా బ్రిటిష్ వారు ఈ ప్రాంతాన్ని ప్రత్యక్షంగా పరిపాలించలేదు. అయితే స్వాతంత్ర్యం తరువాత దీనిని పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో కలిపేశారు.

స్వాతంత్ర్యం వచ్చిన తొలిదశలో భాష ప్రాతిపదికన రాష్ట్రాలను వర్గీకరించారు కాబట్టి ఇది పూర్తిగా కృత్రిమమయిన నిర్ణయమని అనలేము. రాజ్‌బన్షి ప్రజల భాష బెంగాలీకి బాగా సన్నిహిత మైనది. అది వేరే భాష అని కాంటాపురీ ఉద్యమకారులు అంటుండగా, అది బెంగాలీకి ఒక మాండలికం మాత్రమేనని సగటు బెంగాలీలు అంటారు. 'వాళ్లు మాతో మాట్లాడినప్పుడు యాస సమస్య తప్ప వేరే సమస్య ఏమీ ఉండదుగానీ వారిలో వారు మాట్లాడేది మాకు అర్థం కావడం కొంచెం కష్టమే'నని బెంగాలీలలో కొంచెం ప్రజాస్వామిక దృష్టిగల వాళ్లు అంటారు.

'నిజంగా' వేరు భాషా కాదా అని తర్కించడం కంటే, భాషలోని ఈ తేడా ఏ చారిత్రక క్రమంలో తాము వేరన్న రాజ్‌బన్షీల భావనలో భాగమయిందో తెలుసుకోవడం ఎక్కువ ఉపయోగకరం. రాజ్‌బన్షీల జీవన సంస్కృతికీ రూపురేఖలకూ కూడా ఇది వర్తిస్తుంది. ఏ రెండు కులాల లేక తెగల సంస్కృతిలోనయినా సహజంగా ఉండే తేడాలను పక్కనపెడితే, వ్యవసాయకంగా వెనుకబడిన ప్రజల జీవన సంస్కృతికీ వ్యవసాయ ఆధునికత అలవరచుకున్న వారి సంస్కృతికీ మధ్యన ఉండే భేదాన్ని మించి రాజ్‌బన్షి-బెంగాలీ అనే సాంస్కృతిక భేదం ఉందా అంటే అనుమానమే.

అయితే కొన్ని చారిత్రక కారణాలు ఈ తేడాల ప్రాముఖ్యాన్ని పెంచాయి. ఇందులో ప్రధానమయినది తూర్పు బెంగాల్ నుంచి పెద్ద సంఖ్యలో రాజ్‌బన్షీల భూభాగానికి వచ్చిన బెంగాలీల వలస. ఈశాన్య భారతంలో అన్ని రాష్ట్రాలనూ ఈ వలస ప్రభావితం చేసింది. వలస వచ్చినవారు స్థానికుల కంటె వ్యవసాయకంగా అభివృద్ధి చెందినవారు, ఇంగ్లీష్ చదువు ఎక్కువ నేర్చినవారు కావడం వల్ల స్థానికుల ప్రయోజనాలను దెబ్బతీయగలిగారు.

ఉత్తర బెంగాల్‌కు తూర్పు బెంగాల్ (నేటి బంగ్లాదేశ్) నుంచి 1947లో ఒకసారి, 1952లో ఒకసారి, 1970లో ఒకసారి ప్రజలు పెద్ద సంఖ్యలో వలస వచ్చారు. రాజ్‌బన్షీలు ఈ కాందిశీకులను 'భాటియా'లు అంటారు. దీనిని భూస్వాముల వలస అంటే అతిశయోక్తి అవుతుందిగానీ తూర్పు బెంగాల్‌లోని హిందువులు స్థానిక ముస్లింల కంటే భూమి, సంపద, చదువు సాపేక్షంగా ఎక్కువ గలవారే. 1947 తరువాత తూర్పు బెంగాల్ నుంచి వలస వచ్చిన వారిలో పొట్టకూటి కోసం వచ్చిన ముస్లింలు సహితం ఉన్నారుగానీ ఎక్కువ శాతం వలస వచ్చింది హిందువులే. వారు వలస వెళ్లిన ప్రాంతాల ప్రజలు వారికంటె విద్యా ఆర్థిక విషయాలలో వెనుకబడిన వారు కావడం వారికక్కడ స్థిరపడి బాగుపడడానికి అవకాశం కల్పించింది. అదే కారణంగా స్థానికులలో ఈ వలస వల్ల తమకు అన్యాయం జరిగిందన్న నిరసన చోటు చేసుకుంది. ఉత్తర బెంగాల్ అట్టి ప్రాంతాలలో ఒకటి.

బెంగాలీలలో ఈ నిరసనను సానుభూతితో అర్థం చేసుకున్నవారి సంఖ్యను వేళ్ల మీద లెక్కపెట్ట వచ్చు. 'రాజ్‌బన్షీలు తమ భూమిని భాటియాలకు స్వచ్ఛందంగానే అమ్మారు. వారినెవ్వరూ బలవంతం చేయలేదు. ఇప్పుడు మా భూమి అంతా పరాయివాళ్ల పాలయిపోయిందని గొడవ చేయడం ఏం న్యాయం?' అని సిపిఐ (ఎం) జల్పాయ్‌గుడి జిల్లా కార్యదర్శి మనీష్ సన్యాల్ అంటాడు. అతను స్వయంగా తూర్పు బెంగాల్ నుంచి వలస వచ్చిన 'భాటియా' కుటుంబానికి చెందినవాడు. ఉత్తర బెంగాల్‌లోని సిపిఐ (ఎం) నాయకులంతా భాటియాలేననేది రాజ్‌బన్షీల ఫిర్యాదులలో ఒకటి.

భూములు అమ్ముకొమ్మని రాజ్‌బన్షీలను ఎవ్వరూ బలవంతం చేయలేదు. ఉత్తర బెంగాల్‌లో వర్షపాతం సమృద్ధిగా ఉంటుంది కాబట్టి (మన రాష్ట్రంలోని అత్యధిక వర్షపాతానికి దాదాపు నాలుగు రెట్లు కురుస్తుందక్కడ) కరువు కాటకాల వల్ల భూములు అమ్ముకున్నారనడానికీ వీలులేదు. అయితే పెట్టుబడి, చదువు లోపించిన కారణంగా (చదువులో ఇప్పటికీ రాజ్‌బన్షీలు చాలా వెనుకబడి ఉన్నారని సిపిఐ (ఎం) నాయకులు సహితం ఒప్పుకుంటున్నారు) ఆ భూమిలో ప్రకృతి ఇచ్చే రాబడిని మించి పొందడానికి అవసరమైన ఆధునిక వ్యవసాయ పద్ధతులు రాజ్‌బన్షీలకు దూరం ఉండిపోయాయి. అందువల్ల వారి భూములు కొనుక్కొని వాటిపైన పెట్టుబడిపెట్టి సాంకేతిక అభివృద్ధి సాధించడానికి సిద్ధంగా ఉన్న భాటియాలకు పెద్ద మొత్తంలోనే తమ భూములు అమ్ముకున్నారు. ఇప్పుడు తాము ఏం కోల్పోయామో గ్రహించడానికి కావలసిన జ్ఞానం వారు పొందారు. కానీ అది భూములు తిరిగి రాబట్టుకోవడానికి పనికిరాలేదు.

భూముల బదలాయింపు విషయంలో 'ఇందులో ఎవరి తప్పూ లేదు' అనడానికి అవకాశమయినా ఉందేమోగానీ ఇతర విషయాలలో లేదు. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం రాజ్‌బన్షీలను ఎస్‌సిలుగా గుర్తించిందిగానీ వారి అభివృద్ధి కోసం ప్రత్యేకమైన కృషి ఏమీ చేయలేదు. విద్యా ఉద్యోగ రంగాలలో రాజ్‌బన్షీల భాగస్వామ్యం చాలా స్వల్పమని అధికారులు సహితం ఒప్పుకుంటున్నారు. వామపక్ష పార్టీలు వలస వచ్చిన భాటియాల వోట్లు మీద ఆధారపడతాయి కాబట్టి వారి 'వోటు బ్యాంక్' రాజకీయం రాజ్‌బన్షీల పట్ల నిర్లక్ష్యంగా మారిందని కాంటాపురీ ఉద్యమకారుల వ్యాఖ్య.

కారణమేదయితేనేం, దాని పరిష్కారం కోసం 1979లోనే ఉత్తరబంగా తబ్సీలీ జాతీ ఆదివాసీ సంఘటన్ ('ఉబ్జాస్' అంటారు) అనే సంస్థ ఏర్పడింది. ఉత్తర బెంగాల్‌లోని ఎస్‌సి, ఎస్‌టిల బాగు కోసం కృషిచేయడం దీని లక్ష్యం. ఇక్కడ ఎస్‌సి అంటే ప్రధానంగా రాజ్‌బన్షీలు, ఎస్‌టిలు అంటే తేయాకు తోటలలో పనిచేయడానికోసం ఈనాటి జార్ఖండ్ నుంచి తీసుకురాబడిన సంతాల్ తదితర ఆదివాసీ తెగలు అని అర్థం. ఈ సంస్థ ప్రత్యేక రాష్ట్రం కావాలన్న డిమాండ్ పెట్టలేదు. జాతుల ప్రాతిపదికన సమస్యను వ్యాఖ్యానించలేదు. కాంగ్రెస్ వారికి కాకపోయినా కనీసం వామపక్ష పార్టీలకు సులభంగా మింగుడు పడగల భాషలోనే మాట్లాడింది.

ఉబ్జాస్ తన లక్ష్యాన్ని కొంతమేరకయినా సాధించి ఉంటే ఏమయ్యేదో గానీ అది జరగలేదు.

1992లో అఖిల కాంటాపురి విద్యార్థి సంఘం (ఆక్సు) పుట్టింది. అప్పటివరకు ఉబ్జాస్‌లో పనిచేసిన రాజ్‌బన్షి యువత ఆక్సులోకి వచ్చారు. ఆక్సు కూడ తొలినాడు ప్రత్యేక రాష్ట్రం డిమాండు పెట్టలేదు. కాంటాపురి ప్రాంత భాషా సంస్కృతులను కాపాడడం తన ప్రధాన లక్ష్యంగా ప్రకటించుకుంది.

ప్రత్యేక రాష్ట్రం డిమాండు కాంటాపురి పీపుల్స్ పార్టీ (కెపిపి)తో ముందుకొచ్చింది. ఈ పార్టీ 1996 జనవరి 7న ఏర్పడింది. దాని అధ్యక్షుడు సిలిగురిలో ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్న అతుల్ చంద్రరాయ్. అదే సంవత్సరం సెప్టెంబర్ 26న అతను భారత ప్రభుత్వానికి సమర్పించిన వినతి పత్రంలో తమ పార్టీ లక్ష్యాన్నీ, డిమాండ్లనూ వివరించాడు. ఉత్తర బెంగాల్ మూలవాసుల తరపున కెపిపి మాట్లాడుతున్నదన్నాడు. వారు జనాభాలో 80 శాతం ఉన్నారన్నాడు. 'సాంస్కృతికంగా, భాషాపరంగా, చారిత్రకంగా, సాంఘికంగా' ఈ ప్రజలు బెంగాలీల కంటె భిన్నమైన వారన్నాడు. ఒకప్పుడు కూచ్‌బిహార్, వైకుంఠపూర్ రాజ్యాలలో ఉన్న ఈ ప్రజలను బలవంతంగా బెంగాల్‌తో కలిపేయడం జరిగిందన్నాడు.

పశ్చిమ బెంగాల్‌లో భాగం చేయబడ్డ ఉత్తర బెంగాల్ లేక కాంటాపూర్ 'ఉద్దేశ్యపూర్వకంగా వెనుకబాటుతనంలో ఉంచబడింది' అన్నాడు. ముడి సరుకులు ఇక్కడి నుంచి తీసుకొనిపోయి కలకత్తా నగరాన్నీ దాని పరిసరాలనూ పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తున్నారన్నాడు. ఉత్తర బెంగాల్ లేక కాంటాపూర్‌లో లభ్యమయ్యే వెదురు, కలప, తేయాకు, జనపనార, పొగాకు, ఔషధ మొక్కలు, పండ్లు కలకత్తాకు ఎగుమతయిపోయి ఆ నగరం పారిశ్రామిక అభివృద్ధికి తోడ్పడుతున్నాయనీ ఈ ప్రాంతం మాత్రం వెనుకబడి ఉండిపోయిందనీ అన్నాడు. కాంటాపురి భాషా సంస్కృతులను పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం, భారత ప్రభుత్వం ఉద్దేశ్యపూర్వకంగా నిర్లక్ష్యం చేస్తున్నాయన్నాడు. తూర్పు బెంగాల్ (బంగ్లాదేశ్) నుంచి వచ్చిన, వస్తున్న వలస కారణంగా ఉత్తర బెంగాల్‌లోని మూలవాసులు మైనారిటీ అయిపోతున్నారనీ తమ ఉనికిని కోల్పోతున్నారనీ అన్నాడు. పశ్చిమ బెంగాల్ పాలకులు ఈ కాందిశీకుల వోట్ల మీద ఆధారపడుతున్నారు కాబట్టి వారి నుంచి స్థానికులను కాపాడే ప్రయత్నం చేయడం లేదన్నాడు.

జల్పాయ్‌గుడి, కూచ్‌బిహార్, మాల్డా, దక్షిణ దినాజ్‌పూర్, ఉత్తర దినాజ్‌పూర్ జిల్లాలనూ డార్జిలింగ్ జిల్లాలోని మైదాన ప్రాంతాన్నీ కలిపి కాంటాపూర్ రాష్ట్రంగా రూపొందించి ప్రత్యేక రాష్ట్ర ప్రతిపత్తి కల్పించాలన్నది కెపిపి ప్రధానమైన డిమాండు కాగా, కాంటాపురి భాషను భారత రాజ్యాంగంలోని ఎనిమిదవ షెడ్యూలులో చేర్చాలని, కాంటాపురి ప్రాంతంలోకి ప్రవేశించడానికి బయటి వారెవ్వరైనా 'పర్మిట్' తీసుకోవాలన్న చట్టం చేయాలనీ, సిలిగురి ఆకాశవాణి కేంద్రం కాంటాపురి భాషలో కార్యక్రమాలు ప్రసారం చేయాలనీ, తియెస్తా నదిపైన తలపెట్టిన ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించాలనీ, కూచ్‌బిహార్‌లో ఒక విశ్వవిద్యాలయం నెలకొల్పాలనీ, 1971 ఇందిరా-ముజిబ్ ఒడంబడిక ప్రాతిపదికన బయటి వారినందరినీ గుర్తించి వెళ్లగొట్టాలనీ, కాంటాపురి ప్రజల ఆర్థిక సాంస్కృతిక స్థితిగతులపైన పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలనీ కూడా కెపిపి డిమాండ్ చేస్తున్నది.

కాంటాపురి ఉద్యమం కేవలం రాజ్‌బన్షిల ఉద్యమమా లేక 1947కు పూర్వం నుంచి ఉత్తర బెంగాల్‌లో ఉంటున్న బెంగాలీలు, ఇతర (ఆదివాసీ) ప్రజా సమూహాలు కూడా స్థానికుల కిందికే వస్తారా అన్న ప్రశ్నకు కెపిపి జల్పాయ్‌గుడి జిల్లా శాఖ అధ్యక్షురాలు మిటాలీరాయ్ స్పష్టంగానే జవాబు చెప్తారు. 'ఇది రాజ్‌బన్షీలకూ బెంగాలీలకూ మధ్య ఘర్షణ కాదు. స్థానికులకూ బయటి వారికీ మధ్య ఘర్షణ' అని ఆమె స్పష్టం చేస్తున్నారు. ఈ స్థానికులలో పూర్వం నుంచి ఉంటున్న బెంగాలీలే కాక అనేక ఆదివాసీ తెగలు కూడా ఉన్నాయి. అయితే 'కాంటాపురి భాషా సంస్కృతులు' అన్నప్పుడు ప్రస్తావనకు వస్తున్నది రాజ్‌బన్షీ ప్రజల భాషా సంస్కృతులేననేది స్పష్టమే. ఉత్తర బెంగాల్‌లో 1947కు పూర్వం అత్యధిక జనాభా రాజ్‌బన్షీలేనని గుర్తుంచుకుంటే ఇక్కడ పెద్దగా వైరుధ్యం ఉండకపోవచ్చు. ఆర్థిక హక్కులు, భూమి హక్కు, ఉద్యోగ హక్కు మొదలయిన విషయాలలో కెపిపి 1947కు పూర్వం నుంచి ఉత్తర బెంగాల్‌లో ఉంటున్న వారందరినీ ఒకటిగా చూసినప్పటికీ 'భాషా సంస్కృతుల' విషయంలో మూలవాసులయిన రాజ్‌బన్షీల సంప్రదాయాన్నే కాంటాపురి అధికారిక సంప్రదాయంగా పరిగణించదలచుకుందని స్పష్టం అవుతుంది.

1947కు పూర్వం ఈ అయిదున్నర జిల్లాలలో రాజ్‌బన్షీల జనాభా ఎంత శాతం ఉండిందన్న విషయంలో కచ్చితమైన గణాంకాలు లేకపోయినప్పటికీ వారే మెజారిటీ అని సిపిఐ (ఎం) సహితం ఒప్పుకుంటుంది. కాంటాపురి ఉద్యమానికి కేంద్రమైన జల్పాయ్‌గుడి జిల్లాలో రాజ్‌బన్షీలు 75 శాతం ఉండేవారనీ, కూచ్‌బిహార్ జిల్లాలో 80 శాతం ఉండేవారనీ మిటాలిరాయ్ అంటారు. అది అతిశయోక్తి అని సిపిఐ (ఎం) నాయకులు అంటారు. అయితే వారి జనాభా ఆనాడు అక్కడ మెజారిటీ అనీ 1947, 1952, 1970 లలో వచ్చిన 'భాటియా'ల కారణంగా వారిప్పుడు మైనారిటీ అయిపోయారనీ అందరూ ఒప్పుకుంటారు.

మొదట్లో చెప్పినట్టు కెపిపి ఎన్నికలలో పాల్గొనే పార్టీ. గత పంచాయతీ ఎన్నికలలో ఉత్తర బెంగాల్‌లో 27 సర్పంచ్ పదవులు గెలుచుకున్నారు. అయితే పోలీసు నిర్బంధం కారణంగా ఆ పార్టీ ఉనికే ఇప్పుడు ప్రశ్నార్థకం అయింది. దీని వివరాలు దిగువన చూద్దాం.

కాంటాపురి డిమాండ్‌తో ఆయుధాలు పట్టుకున్న కెఎల్ఓ గురించి స్పష్టమైన సమాచారం లేదు. ఇది 1999లోనో, 2000 సంవత్సరంలోనో ఏర్పడింది. దీనికి అస్సాంలోని అల్ఫాతో సంబంధాలున్నాయని పోలీసుల కచ్చితమైన అభిప్రాయం. కెఎల్ఓ కార్యకర్తలు భూటాన్‌లో ఆయుధ శిక్షణ పొందుతున్నారనేది మరొక అభియోగం.

కెఎల్ఓ గురించి కచ్చితమైన సమాచారం లేకపోవడానికి కారణమేమిటంటే ఆ సంస్థ కరపత్రాలు గానీ, పోస్టర్లు గానీ ఏ రకమైన ప్రచురణలు గానీ చేపట్టదు. పత్రికా ప్రకటనలు సహితం ఇవ్వదు. బహుశా ఇంత పూర్తిగా 'రహస్యం'గా పనిచేసే సంస్థ ఇండియాలో వేరే ఏదీ లేదేమో! దీనిని నెలకొల్పింది ఎవరు, వారికి కెపిపితో గానీ, ఆక్సుతో గానీ ఏమైనా సంబంధాలు ఉన్నాయా అనే విషయాలు కూడా తెలీవు. వీరంతా ఒకటేనని ప్రభుత్వం సులభంగా కొట్టిపారేస్తుంది. కెఎల్ఓ పేరు చెప్పి అందరి మీదా నిర్బంధం ప్రయోగించడానికి ఆ ప్రకటన ప్రభుత్వానికి పనికొస్తుంది. అయితే రాజ్‌బన్షీలు ఈ విషయంలో ఏమీ చెప్పరు. కెఎల్ఓ అనే సంస్థ ఒకటి ఉందని తమకు తెలుసునుగానీ దాని గురించి అంతకంటే ఏమీ తెలీదంటారు.

## నిర్బంధం

ఒకే లక్ష్యం కోసం సాయుధ సంస్థలూ లీగల్ సంస్థలూ పనిచేస్తున్న చోట మొత్తంగా ఆ లక్ష్యాన్నే నిషిద్ధ లక్ష్యంగా పరిగణించి దానికోసం జరిగే సకల కార్యాచరణనూ టెర్రరిజంగా ప్రకటించి శిక్షించే ఆనవాయితీ పోలీసు వ్యవస్థలో దేశవ్యాప్తంగా ఉంది. వామపక్ష సంఘటన పరిపా

లిస్తున్న పశ్చిమ బెంగాల్ ఇందుకు మినహాయింపు కాదని కాంటాపురి పోరాటం చూపుతుంది.

పశ్చిమ బెంగాల్ పోలీసులు, కేంద్ర పారా మిలిటరీ కలిసి కాంటాపురి ఆపరేషన్-I, కాంటాపురి ఆపరేషన్-II, కాంటాపురి క్రాక్‌డవున్, ఆపరేషన్ షాడో అనే పేర్లతో నాలుగు దఫాలుగా కాంటాపురి ఉద్యమం పైన దాడులు నిర్వహించారు. నాలుగూ ముగిసేసరికి 800 మందిని అరెస్టు చేశారు. అందులో 350 మంది ఈ సంవత్సరం జనవరి నాటికి ఇంకా జైలులోనే ఉన్నారు. కెపిపి, ఆక్సు బాధ్యులు దాదాపు అందరూ జైలులో ఉన్నారు.

పోటా ప్రయోగించకుండానే ఇంతమందిని ఇంతకాలం జైలులో ఉంచడం పశ్చిమ బెంగాల్ పోలీసులకు ఎట్లా సాధ్యం అయింది? ఐపిసిలోని అతి తీవ్రమైన సెక్షన్ల కింద కేసులు బుక్ చేయడం, ఒకవేళ బెయిలు వస్తే వెంటనే కొత్త కేసు నమోదుచేసి తిరిగి రిమాండు చేయించడం అనే 'రెండంచెల వ్యూహం' ఈ ఫలితాన్ని ఇచ్చింది. భారత ప్రభుత్వం మీద యుద్ధం చేయడం (సెక్షన్ 121), దానికోసం కుట్ర చేయడం (121ఎ), దాని కోసం ఆయుధాలు సమీకరించడం (122), ఆ విషయాన్ని గోప్యంగా ఉంచడం (123), వెరసి రాజద్రోహానికి పాల్పడడం (124ఎ) అనే అభియోగాల మీద వారిని అరెస్టు చేస్తున్నారు. దేశం లోపల వేరే రాష్ట్రం కావాలని మాత్రమే కోరుతున్న ఉద్యమం ఒకవేళ తుపాకులు పట్టుకున్నా దాని మీద ఈ అభియోగాలు వేయడంలో ఏమాత్రం అర్థం లేదు. అంతేకాక కాంటాపురి ఉద్యమం చేపట్టిన హింసాత్మక చర్యలన్నిటినీ పోగు చేసినా అది ఏ అర్థంలోనూ 'యుద్ధం' అనిపించుకోదు.

మరి ఈ సెక్షన్ల కింద కేసులు ఎందుకు పెడుతున్నారంటే అవి రుజువవుతాయనీ శిక్ష పడుతుం దనీ కాదు. అవి చట్టం కళ్లలో చాలా తీవ్రమైన అభియోగాలు కాబట్టి బెయిల్ దొరకడం కష్టమవు తుందని. సెక్షన్ 121 కింద ఉరిశిక్ష కూడా వేయవచ్చు. మిగిలిన నేరాలకు పది సంవత్సరాల నుంచి జీవితఖైదు దాకా విధించవచ్చు. అందువల్ల ఈ సెక్షన్ల కింద కేసు కడితే కోర్టులు సులభంగా బెయిలు ఇవ్వవు.

అయినప్పటికీ ఏదో ఒక రోజు బెయిలు రావచ్చు. కాబట్టి పోలీసులు ఏం చేస్తున్నారంటే ఒక్కొక్కరినీ అయిదు పది కేసులలో ముద్దాయిలుగా చూపించి ఒక కేసులో బెయిలు వచ్చేదాకా ఆగి, బెయిలు రాగానే మరొక కేసులో రిమాండు తీసుకుంటున్నారు. ఒక్కొక్కసారి ఇంకా జైలు నుంచి బయటకు రాకముందే రిమాండు తీసుకుంటున్నారు. ఒక్కొక్కసారి బయటకు రానిచ్చి గేటు దగ్గర అరెస్టు చేస్తున్నారు.

జల్పాయ్‌గుడి జిల్లా బడాదల్లలీకి చెందిన నిర్మల్‌దాస్‌ను 1999 సెప్టెంబర్ 24న అరెస్టు చేశారు. కాంటాపురి ఉద్యమంలో ఇదే మొదటి అరెస్టు. 90 రోజుల తరువాత చార్జిషీటు దాఖలు చేయని కారణంగా కోర్టు అతనిని బెయిలుపైన విడుదల చేయగా గేటు దగ్గరే తిరిగి అరెస్టుచేసి మళ్లీ లోపల వేశారు. ఈ విధంగా తొమ్మిదిసార్లు జరిగిన తరువాత అతను 2002 మే 19వ తేదీన బయటికి వచ్చాడు. అతనికి ఏ ఒక్క కేసులోనూ శిక్ష పడలేదు. అసలు విచారణే జరగలేదు. కేవ లం రిమాండు ఖైదీగా ఒక సంవత్సరం 8 నెలలు జైలులో ఉన్నాడు. పోలీసులు అతనిపైన పోటా ప్రయోగించినా జాతీయ భద్రతా చట్టం ప్రయోగించినా ఇంతకంటె ఎక్కువ 'ప్రయోజనం' కలిగేది కాదు. 'నల్ల చట్టాలను' ప్రయోగించిన అప్రతిష్ఠ మాత్రం పశ్చిమ బెంగాల్ వామపక్ష ప్రభుత్వానికి దక్కేది.



నిర్మల్‌దాస్‌తో మొదలయిన దుష్ట ప్రక్రియను ఆ తరువాత చాలామంది కాంటాపురీ ఉద్యమ కారులపైన పోలీసులు ప్రయోగించారు. అయితే వారిలో కొందరు ఈ విషయాన్ని కలకత్తా హైకోర్టు దృష్టికి తీసుకుపోగా హైకోర్టు 2001 సెప్టెంబర్ 10న పోలీసులకు చీవాట్లు పెట్టింది.

'మేము బెయిలుపైన విడుదల చేసిన వారిని జైలు గేటు బయటే అరెస్టుచేసి మా ఆర్డర్లను వమ్ముచేయాలని చూడడం సహించరాని విషయం' అనింది.

'ఈ ముద్దాయిలను ఇప్పటికే ఇంకా ఏయే కేసులలో అనుమానితులుగా చూపించారో, లేక వారు కావాలని గుర్తించారో, భవిష్యత్తులో వారిని ఏ కేసులలో అరెస్టు చేసే అవకాశం ఉందో లేక వారి అవసరం ఉండగలదో, ఆ కేసులన్నిటి జాబితా మాకు సమర్పించవలసిందిగా బరువెక్కిన గుండెతో ఆదేశిస్తున్నాం'

అనింది కూడా. పశ్చిమ బెంగాల్ పోలీసుల ప్రవర్తన దీనితో మారలేదు. హైకోర్టు ఆదేశంపైన సుప్రీంకోర్టులో స్టే తెచ్చుకొని ఎప్పటిలాగే వ్యవహరిస్తున్నారు.

జల్పాయ్‌గుడి జిల్లా దఖిన్‌పుఖ్రిగ్రాం నివాసి అయిన ఆక్సు వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీనివాస్‌దాస్ ఇప్పటికి ఆరుసార్లు బెయిలు పొంది ఆరుసార్లు వెంటనే మళ్లీ రిమాండ్ అయి రెండేళ్లుగా జైలులో ఉన్నాడు.

అదే జిల్లా కుమార్‌గ్రాం పోలీస్ స్టేషన్ పరిధిలోని చంగ్‌మారి నివాసి అయిన సుర్మాదాస్ నాలుగుసార్లు బెయిలు పొంది నాలుగుసార్లూ వెనువెంటనే రిమాండయి జైలులోనే ఉన్నాడు.

ఇది చూసి వేరేవాళ్లు బెయిల్ కోసం అర్జీ పెట్టుకోవడమే మానేశారు. శ్రీనివాస్ దాస్ స్వగ్రామ మయిన దఖిన్‌పుఖ్రిగ్రాం నివాసులు మరొక నలుగురు అతని గతి చూసి బెయిల్ కోసం ప్రయత్నమే చేయకుండా ఉండిపోయారు. వెరసి జల్పాయ్‌గుడి, ఆలీపూర్‌ద్వార్, కూచ్‌బిహార్, తూఫాన్‌గంజ్, మాతాభంగా జైళ్లలో బెయిలు పొందినవారూ, పొందనివారూ ఒక 350 మంది దీర్ఘ నిర్బంధంలో ఉన్నారు. 350 మందిని పోటా కిందనయినా, నాసా కిందనయినా అరెస్టుచేసి దీర్ఘ నిర్బంధంలో పెట్టి ఉంటే పశ్చిమ బెంగాల్ ప్రభుత్వానికి చాలా చెడ్డపేరు వచ్చి ఉండేది. ఆ బెడద లేకుండా 'సాధారణ చట్టాల'తోనే ఆ ఫలితాన్ని పశ్చిమ బెంగాల్ పోలీసులు సాధించిపెట్టారు.

ఒకే వ్యక్తి మీద పదే పదే కేసులు పెట్టడానికి అన్ని కేసులు పోలీసులకెక్కడ దొరుకుతున్నాయా అని ఆశ్చర్యపోతున్నారేమో. బహుశా కాంటాపూర్ ఉద్యమం చాలా హింసాత్మక ఘటనలకు పాల్పడు తుండవచ్చు ననుకుంటున్నారేమో. కాంటాపూర్ ఉద్యమం హింస చేయకపోలేదుగానీ ఒక్కొక్కరి మీదా ఏడెనిమిది కేసులు పెట్టేటన్ని ఘటనలేం జరగడం లేదు. మరి అన్ని కేసులెక్కడి నుంచి వచ్చాయి?

ఒకే ఒక రాత్రి – 2000 సంవత్సరం నవంబర్ 27 రాత్రి – పోలీసులు ఉత్తర బెంగాల్‌లోని భిన్న పోలీస్ స్టేషన్లలో కాంటాపూర్ ఉద్యమకారులపైన 39 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. ఇవన్నీ కుట్రకేసులే. ఒక్కొక్క కేసులోనూ డజన్ల సంఖ్యలో ముద్దాయిలను చూపించారు. భారత ప్రభుత్వంతో యుద్ధం చేసే లక్ష్యంతో వారందరూ ఎక్కడెక్కడో కలుసుకొని కుట్రలు చేశారని ఆ ఎఫ్ఐఆర్‌లు చెప్తాయి. అవన్నీ ఆ రాత్రే పోలీసుల పరిశోధనలో బయటపడ్డాయని చెప్తాయి. నిర్దిష్టమయిన నేరా రోపణలతో అరెస్టయిన వారిని పదే పదే అరెస్టు చేయడానికి ఈ 39 ఎఫ్ఐఆర్‌లు అక్కరకొచ్చాయి.

ఈ రకమైన నిర్బంధం ఫలితం కేవలం అరెస్టయిన వ్యక్తుల స్వేచ్ఛను హరించడం మాత్రమే

కాదు. వారి రాజకీయ అభిప్రాయాలకూ ఆకాంక్షలకూ అది ఉనికే లేకుండా చేస్తుంది. ఆక్సు, కెపిపిలు ఇప్పుడు కాగితం మీద మాత్రమే ఉన్నాయి. ఆక్సు కార్యవర్గమంతా జైలులో ఉన్నారు. కెపిపి ముఖ్యులలో అధ్యక్షుడు అతుల్ చంద్రరాయ్, జల్పాయ్‌గుడి జిల్లా కమిటీ అధ్యక్షురాలు మిటాలిరాయ్ మాత్రమే బయట ఉన్నారు. తక్కినవారంతా కటకటాల వెనుక ఉన్నారు. కాంటాపురి ఉద్యమానికి ప్రధాన కేంద్రం జల్పాయ్‌గుడి జిల్లా కాగా, ఆ జిల్లా కెపిపి శాఖ కార్యవర్గంలో అధ్యక్షు రాలు తప్ప అందరూ జైలులో ఉన్నారు. ప్రధాన కార్యదర్శి ధీరేంద్రనాథ్‌రాయ్ నాలుగుసార్లు బెయిలు తీసుకోగా నాలుగుసార్లు కొత్త కేసులు చూపించి అతనిని లోపల వేశారు. మధ్య మధ్యలో పోలీసుల కస్టడీలో ఉన్న కొద్దిసేపు కెపిపికి రాజీనామా చేసి సిపిఐ (ఎం)లో గానీ ఆర్ఎస్‌పిలో గానీ చేరమని అతనిపైన ఒత్తిడి పెడుతున్నారు.

సారాంశంలో, కాంటాపురీ ఉద్యమం లేవదీసిన ఏ ప్రశ్నకూ జవాబు చెప్పకుండానే కేవలం క్రిమినల్ చట్టం సహాయంతో పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ఆ ఉద్యమ సంస్థలన్నిటి గొంతూ నొక్కే సింది. పనిలో పనిగా, 'ఈ ఉద్యమాలెందుకు? అధికార పక్షంలో చేరరాదా' అని వామపక్ష ప్రభుత్వం పోలీసులు ఆ ఉద్యమకారులపైన ఒత్తిడి పెడుతున్నారు కూడా.

కాంటాపురీ ఉద్యమం సిపిఐ (ఎం) నుంచి ప్రధానంగా రాజకీయ వ్యతిరేకత ఎదుర్కుంటున్నది. ఘర్షణ కూడా సిపిఐ (ఎం)తోనే ఎక్కువ ఉంది. కెఎల్ఓ ఏర్పడిన తరువాత వారి తుపాకులకు గురయింది కూడా ప్రధానంగా సిపిఐ (ఎం) వారే. అయితే మన దగ్గర జరిగినట్టే, కాంటాపురీ ఉద్యమకారులు సిపిఐ (ఎం) కార్యకర్తలపైన దాడిచేసినప్పుడల్లా పోలీసులు రంగంలోకి దిగి పాలక పార్టీ అయిన సిపిఐ (ఎం) తరఫున ప్రతీకారం తీర్చుకున్నారు. 2000 సంవత్సరం సెప్టెంబర్ నెలలో కాంటాపురి ఉద్యమకారులు జల్పాయ్‌గుడి జిల్లాలోని ధూప్‌గుడిలో ఇద్దరు సిపిఐ (ఎం) కార్యకర్తలను చంపారు. వెంటనే పోలీసులు ధూప్‌గుడికి చెందిన బారిపదరాయ్, కొయ్‌లాన్‌రాయ్ అనే రాజ్‌బన్షీలను ఎత్తుకుపోయి కూచ్‌బిహార్ జిల్లా మాతాభంగా పోలీస్ స్టేషన్ పరిధిలోని బెల్టోలి గ్రామం దగ్గర కాల్చి చంపి 'ఎన్‌కౌంటర్' జరిగిందన్నారు.

ఇటువంటి పరోక్ష ప్రతీకారంతో సంబంధంలేని 'ఎన్‌కౌంటర్'లు కూడా జరిగాయి. 2000 సంవత్సరం డిసెంబర్ నెలలో నబ్లుదాస్, కందూరదాస్, జితేందర్‌దాస్ అనే ముగ్గురు రాజ్‌బన్షి యువకుల శవాలు భూటాన్ సరిహద్దు దగ్గర దొరికాయి. అవి బుల్లెట్లతో నిండి ఉన్నాయి. 'కెఎల్ఓ' లోని అంతర్గత కలహాలలో వారు చనిపోయారని ఆలీపూర్‌ద్వార్ సబ్ డివిజనల్ పోలీస్ అధికారి ప్రకటించాడు గానీ ఆ ముగ్గురినీ పోలీసులు కుమార్‌గ్రాం పోలీస్ స్టేషన్‌కు పిలిపించారనీ ఆ తరు వాత వారు కనిపించలేదనీ కెపిపి నాయకులంటారు.

2002 వచ్చేసరికి ఎన్‌కౌంటర్ల సంఖ్య పెరిగింది. ఆ సంవత్సరం పదిమంది ఎన్‌కౌంటర్‌లలో చనిపోయారు. మనబోటి రాష్ట్రాలతో పోలిస్తే ఇది చిన్న సంఖ్యే కావచ్చునుగానీ తాము ప్రతిపక్షంలో ఉన్న రాష్ట్రాలలో 'ఎన్‌కౌంటర్ల'ను ఖండించడం సిపిఐ (ఎం) ఒక విధానంగా అలవరచుకున్న తరువాత కూడ వారి పాలనలోని రాష్ట్రంలో పోలీసులు అదేరకమైన హత్యాకాండకు పాల్పడడాన్ని ఏమనాలి?

మొత్తంగానే కాంటాపురీ ఉద్యమం విషయంలో పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ఇతర ప్రభుత్వాల కంటే ఏమాత్రం భిన్నంగా వ్యవహరించడం లేదు. ఆ ఉద్యమం న్యాయమయిన సమస్యలను



లేవనెత్తుతున్నదని ఒప్పుకోవడంలేదు. ఆ ఉద్యమం వామపక్ష ప్రభుత్వాలు అమలుచేసిన భూ సంస్క రణల వల్ల భూములు కోల్పోయిన రాజ్‌బన్షి జోతేదార్ల కుట్ర అనేది సిపిఐ (ఎం) వ్యాఖ్య. బెంగాలీ కాందిశీకుల చేతిలోకి తమ భూములు పోవడం రాజ్‌బన్షీలకు మనస్తాపం కలిగించిందని సిపిఐ (ఎం) నాయకులు ఒప్పుకోరు. ఒళ్లు వంచకుండా జల్సాగా తిరిగే సంస్కృతిగల రాజ్‌బన్షీలు సాగుచేయడం ఇష్టం లేక తమ భూములు బెంగాలీలకు అమ్ముకున్నారనీ ఇప్పుడు ఏదో ఒక పేరు చెప్పి ఆ భూములను తిరిగి పొందాలని చూస్తున్నారనీ వారి వ్యాఖ్య. వలస వచ్చిన బెంగాలీలదే ఉత్తర బెంగాల్‌లో పైచేయి కావడం స్థానికులలో నిరసనకు దారితీసిందని ఒప్పుకోరు. బెంగాలీలు కష్టపడి పైకి వచ్చారు తప్ప ఒకరిని దోచుకోలేదే అంటారు. కెఎల్ఓ చేతిలోని తుపాకుల వెనుక న్యాయమైన ఆకాంక్షలున్నాయని ఒప్పుకోరు. వామపక్ష సంఘటన ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టి రాజ్‌బన్షీ – బెంగాలీ అనే జాతి విభజన రెచ్చగొట్టి సంకుచిత ప్రయోజనాలు పొందాలని చూసే తిరోగామిశక్తుల హింసోన్మాదం తప్ప అందులో వేరే ఏమీ లేదంటారు.

ఈ వైఖరి అన్యాయమయినదే కాక నిరర్థకం కూడానన్న అవగాహన మన దేశ పాలకులకు ఎప్పటికీ రాదేమో. 50 ఏళ్ల కింద నాగాలాండ్ ఉద్యమంతో మొదలుపెట్టి కాంటాపురి ఉద్యమం వరకు అన్ని జాతి ఉద్యమాల పట్ల అన్ని పార్టీలూ ఇదే వైఖరి అనుసరించాయి. ప్రజలను పదే పదే హింసించడానికి తప్ప ఇది ఇంకెందుకూ పనికిరాలేదు, పనికిరాదు.

**–నిజనిర్ధారణ కమిటీ నివేదిక**

# పౌరహక్కుల ఉద్యమం: రామ్‌మనోహర్ లోహియా దృక్పథం

– యం.కోదండరామ్ *

హక్కులను భారతదేశ పరిస్థితులకు అన్వయించి వాటి పరిరక్షణకు ఉద్యమించిన వ్యక్తులలో రామ్‌మనోహర్ లోహియా అగ్రగణ్యుడు. పౌరహక్కుల ఉద్యమాన్ని వ్యాప్తిచేయడానికి 1936లోనే రామ్‌మనోహర్ లోహియా 'The Struggle for Civil Liberties' అనే పుస్తకాన్ని రాశారు. ఈ పుస్తకంలో పౌరహక్కులను నిర్వచించడమే కాక వాటి పరిరక్షణకై చేపట్టవలసిన కర్తవ్యాలను కూడా పేర్కొన్నారు. పౌరహక్కుల కార్యకర్తలు నేటికీ బైబిల్‌గా భావించే ఈ గ్రంథాన్ని తెలుసుకోకుండా భారతదేశంలో అమలులో ఉన్న పౌరహక్కుల స్వభావాన్ని గాని, పౌరహక్కుల ఉద్యమాన్ని గాని అర్థం చేసుకోలేము.

రామ్‌మనోహర్ లోహియా పుస్తకం 1930లలో నెలకొన్న పరిస్థితులకు ప్రతిస్పందనగా రూపొందింది. అప్పటికింకా భారతదేశంలో పౌరహక్కుల సంఘాలు ఏర్పడలేదు. అయితే ఆయా పార్టీలు, ఉద్యమాలు పౌరహక్కుల సమస్యల మీద ఆందోళన చేస్తున్నాయి. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ ఏర్పడిన నాటి నుండే పౌరహక్కుల కోసం పోరాటం చేసింది. 1918, 1925, 1931లలో కాంగ్రెస్ పార్టీ పౌరహక్కుల ప్రకటనలను కూడా తయారు చేసింది. కాంగ్రెస్ పార్టీతో సహా అన్ని పార్టీలు పౌరహక్కుల పరిరక్షణకు కృషిచేస్తున్నా 1930లలో నెలకొన్న నిర్బంధ పరిస్థితిని ఎదుర్కొనడానికి ఈ ప్రయత్నం సరిపోలేదు.

ఎందుకంటే ఖిలాఫత్ ఉద్యమంతో మొదలైన ఉధృత ప్రజా ఉద్యమాలను అణచడానికి బ్రిటిష్ ప్రభుత్వం ఎన్నో నిర్బంధ చట్టాలను తయారు చేసింది. వాటిలో రౌలట్ చట్టం (1919), బెంగాల్ ప్రావిన్షియల్ చట్టం (1925), షోలాపూర్ మార్షల్ లా ఆర్డినెన్సు (1930), బెంగాల్ క్రిమినల్ లా (సవరణ) చట్టం (1930), బెంగాల్ క్రిమినల్ లా (సవరణ) చట్టం (1932), బీహార్ మెయింటనెన్సు ఆఫ్ పబ్లిక్ ఆర్డర్ చట్టం నిర్బంధ చట్టాల కోవకు చెందినవి. ఈ చట్టాలు స్వాతంత్రోద్యమాన్నే నేరంగా నిర్వచించాయి. స్వాతంత్రోద్యమంలో పాల్గొన్నవారిని విచారించడానికి ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేశాయి. ఈ కోర్టులు న్యాయమైన, నిష్పాక్షికమైన విచారణ పద్ధతులను పాటించలేదు. విచారణను వేగంగా ఒక తంతుగా ముగించి శిక్షలు విధించేవి. ప్రత్యేక కోర్టుల తీర్పులపై అప్పీలుకు కూడా అవకాశం ఉండేది కాదు.



ఉధృతంగా సాగుతున్న స్వాతంత్రోద్యమాన్ని అణచివేయడానికి నిర్బంధ చట్టాలను ప్రయోగించడమే కాక బ్రిటిష్ పాలకులు ఉద్యమకారులను క్రూరమైన చిత్రహింసల పాల్జేశారు. జలియన్‌వాలా బాగ్ ఉదంతం ఇందుకు ఒక ఉదాహరణ. నాటి నిర్బంధ వాతావరణం గురించి లోహియా ఇలా అన్నారు."పోలీసుల మితిమీరిన చర్యలు బాగా పెరిగిపోయాయి. ప్రైవేటు హింసను కూడా అనుమతిస్తున్నారు. అసలు స్వేచ్ఛకు రక్షణే లేకుండా పోయింది." ఈ పరిస్థితి వలన "భారతదేశం ఈరోజు నియంతృత్వపు నీడలో, దాడుల భయంతో జీవిస్తున్నది. సామాజిక – రాజకీయ ఆలోచనలు కానీ, కళలు కానీ అంతెందుకు అసలు ఏ కార్యకలాపమైనా నిరుపయోగమౌతున్నది, నీరుగారిపోతున్నద"ని అన్నారు.

ఈ నియంతృత్వాన్ని ఎదుర్కొనడానికే విశాల ప్రాతిపదికన పనిచేసే పౌరహక్కుల సంఘం అవసరం ఏర్పడింది. 1936లో నెహ్రూ కృషి వలన అటువంటి సంఘం ఉద్భవించింది. దానిపేరే భారతీయ పౌరహక్కుల యూనియన్ (Indian Civil Liberties Union - ICLU). ఈ నేపథ్యంలో పౌరహక్కుల ఆవశ్యకతను, వాటి పరిరక్షణకై ఒక ప్రత్యేక సంస్థను ఏర్పాటు చేయవలసిన అవసరాన్ని వివరించడానికే లోహియా ఈ చిన్న పుస్తకాన్ని రాశాడు.

లోహియా పుస్తకంలో మూడు భాగాలున్నాయి. మొదటి భాగంలో ఫ్రాన్స్, అమెరికా, ఇంగ్లండ్ దేశాలలో పౌరహక్కుల పరిస్థితిని, ఆ దేశాలలో పౌరహక్కుల పరిరక్షణకై కృషిచేస్తున్న సంస్థల కార్యకలాపాలను వివరించాడు. రెండవ భాగంలో పౌరహక్కులను నిర్వచించగా, చివరి భాగం పై రెంటి ఆధారంగా పౌరహక్కుల సంఘాలు నిర్వహించవలసిన పనులను విశదీకరించింది.

అన్ని దేశాల్లోనూ హక్కులు చట్టబద్ధమయ్యాయని, అయినా సామాజిక – ఆర్థిక పరిస్థితుల కారణంగా బలహీన వర్గాల ప్రజల హక్కులు ఉల్లంఘనకు లోనవుతున్నాయని లోహియా అమెరికా, ఫ్రాన్స్, బ్రిటన్ దేశాలలో నెలకొన్న పౌరహక్కుల పరిస్థితిని సమీక్షించి నిర్ధారించాడు.

ఫ్రాన్సులో జరిగిన డ్రేఫస్ కేసును, అమెరికాలో జరిగిన మూనీ–బిల్లింగ్సు కేసును ఉదాహరణగా తీసుకొన్నారు. డ్రఫస్ సమర్థవంతమైన సైనికాధికారి. పుట్టుకతో యూదుడై డ్రేఫస్ సైన్యంలో ఉద్యోగాలు కొద్దిమందికే పరిమితం చేయడాన్ని నిరసించాడు. అందుకని డ్రేఫస్‌పై జర్మనీకి మిలటరీ రహస్యాలను చేరవేస్తున్నారన్న అభియోగాన్ని మోపి శిక్షించారు. అమెరికాకు చెందిన మూనీ, బిల్లింగ్స్‌లు ట్రేడ్ యూనియన్ నాయకులు. ఈ ఇద్దరి కృషి వలన రైల్వే, విద్యుత్ కంపెనీలలో పనిచేసే కార్మికులు సంఘటితమయ్యారు. ఎలాగైనా మూనీ, బిల్లింగ్సులను అణచాలన్న ఉద్దేశ్యంతో కంపెనీ యజమానులు వారిని ఒక బాంబు పేలుడు కేసులో ఇరికించారు. పోలీసులు తప్పుడు సాక్ష్యాలు సృష్టించి మూనీ–బిల్లింగ్స్‌లకు శిక్ష పడటానికి దోహదపడ్డారు.

లోహియా అమెరికాలో నల్లజాతీయుల పట్ల ఉండే వివక్షను కూడా వివరించాడు. అయితే ఇంగ్లండులో పరిస్థితి వేరుగా ఉందని అన్నారు. తప్పుడు కేసుల్లో ఇరికించిన సంఘటనలు ఇంగ్లండులో లేవుకానీ పోలీసులు, స్థానిక ప్రభుత్వాలు అతిగా ప్రవర్తించిన సందర్భాలు ఉన్నాయని లోహియా గమనించాడు.

అందుకే బ్రిటన్‌లో పౌరహక్కుల ఉద్యమాలు చట్టబద్ధ పాలన కొరకు, పోలీసుల మితిమీరిన ప్రవర్తనను ఎదిరించడానికి కృషిచేశాయి. 1936 నాటికే ఫ్రాన్సు, అమెరికా, ఇంగ్లండులలో బలమైన హక్కుల ఉద్యమాలున్నాయి. లక్షా అరవై వేల మంది సభ్యులు గల లీగు అన్యాయాలు జరిగినప్పుడు,

అధికారులు విచ్చలవిడిగా ప్రవర్తించినప్పుడు, అధికార దుర్వినియోగానికి పాల్పడినప్పుడు, వ్యక్తులతో, సంస్థలతో ప్రభుత్వం చట్టానికి అతీతంగా వ్యవహరించినప్పుడు జోక్యం చేసుకొనేది.

అమెరికన్ సివిల్ లిబర్టీస్ యూనియన్ 1920లో ఏర్పడింది. ఫ్రెంచి లీగు మాదిరిగా అమెరికన్ సివిల్ లిబర్టీస్ యూనియన్‌కు విస్తృతమైన కార్యరంగం లేదు. కేవలం నిరంతర జాగరూకతే పౌరహక్కులను కాపాడుతుందన్న లక్ష్యంతో పనిచేసేది. బ్రిటన్‌లో పౌరహక్కుల సంప్రదాయం బలంగా వేళ్ళూనుకున్నది కాబట్టి పౌరహక్కుల ఉల్లంఘనకు నిరసనగా ప్రజలు వెంటనే కదులుతారని లోహియా అన్నారు. 1934లో ఏర్పడిన నేషనల్ కౌన్సిల్ ఫర్ సివిల్ లిబర్టీస్ భావ ప్రకటనా, వాక్, సభా స్వాతంత్ర్యాల పరిరక్షణకై కృషిచేసేది.

వివిధ దేశాలలోని పౌరహక్కుల పరిస్థితిని సమీక్షించాక లోహియా పౌరహక్కులను నిర్వచించారు. పౌరహక్కులు రాజ్య యంత్రాంగాన్ని పరిమితం చేసి వ్యక్తికి స్వేచ్ఛను ప్రసాదిస్తాయని చెప్పారు. వివిధ దేశాలలో అమలులోనున్న హక్కుల జాబితాను కూడా లోహియా వివరించారు. లోహియా పుస్తకం రాసిన నాటికి వివిధ దేశాలు జీవించే హక్కు, ఆస్తి హక్కు, స్వాతంత్ర్యపు హక్కు, భావప్రకటనా స్వేచ్ఛ, సభలు జరుపుకునే హక్కు, సంస్థలు పెట్టుకొనే హక్కు, మత స్వేచ్ఛ, చట్ట ప్రకారం విచారణ జరిపే హక్కు, సమానత్వపు హక్కు, రాజకీయాలలో పాల్గొనే హక్కులను గుర్తించి చట్టబద్ధం చేసి ఉన్నాయి. సారాంశంలో తేలిందేమిటంటే 'The conceptual extent for civil liberties is now clear. It embraces the rights in regard to security both of the person and devellings, to freedom of opinion and assembly, thought and organisation, to equal justice and control over the government, to release from political convictions.' ఫ్యూడల్ ప్రభువులకు, పారిశ్రామికవేత్తలకు మధ్య చెలరేగిన సంఘర్షణ ఫలితంగానే హక్కులు ఉనికిలోకి వచ్చాయని లోహియా వివరించారు.

పై వివరాల ద్వారా ఒక్క విషయం స్పష్టంగా గమనించవచ్చు. పౌరహక్కులు రాజ్య యంత్రాంగం నుంచి వ్యక్తికి స్వేచ్ఛను ప్రసాదిస్తాయి. అయితే రాజ్యం ఒక్కటేకాక సమాజంలో కొనసాగే ఆధిపత్య సంబంధాల వలన కూడా వ్యక్తి స్వాతంత్ర్యానికి ప్రతిబంధకాలు ఏర్పడతాయి. ఉదాహరణకు కుల వ్యవస్థ వలన, పురుషాధిక్యత వలన కూడా వ్యక్తులు స్వేచ్ఛను కోల్పోతారు. అటువంటి సంబంధాల నుంచి విముక్తిని కల్పించే హక్కుల గురించి లోహియా పట్టించుకోలేదు.

అలాగని లోహియా ఆధిపత్య సంబంధాల వలన పౌరహక్కులకు తలెత్తే ప్రమాదాన్ని విస్మరించలేదు. కాకపోతే ఆధిపత్య శక్తులు రాజ్య యంత్రాంగం ద్వారానే ఆధిపత్యాన్ని నిలబెట్టుకునే ప్రయత్నం చేస్తాయని, సమాజాన్ని మార్చాలనుకునే వర్గాలను రాజ్య యంత్రాంగం ద్వారా అణచివేస్తాయని లోహియా భావించాడు. "గుత్త పెట్టుబడి శక్తులకు, భూస్వాములకు దాడులనేవి వర్గ విధానంగాను, రాజ్యం యొక్క సాధనాలుగాను సాగుతున్నాయని" లోహియా అన్నారు.

ఈ వాదన ఇప్పుడున్న ప్రభుత్వాలను మార్చితేనే హక్కులకు రక్షణ ఉంటుందన్న అభిప్రాయానికి బలం చేకూర్చుతుందని లోహియా గుర్తించాడు. అయితే ప్రభుత్వాన్ని మార్చకుండా పౌరహక్కులకు రక్షణ ఉండదనే అభిప్రాయంతో లోహియా ఏకీభవించలేదు. ఎందుకంటే ప్రభుత్వాలను మార్చడానికి కావలసిన రాజకీయ కార్యకలాపాలు కొనసాగాలన్నా పౌరహక్కులు ఉండితీరాలని లోహియా అభిప్రాయం. రాజ్యాధికారానికి వ్యతిరేకంగా సాగే పోరాటంలో లోహియా పౌరహక్కుల ఉద్యమానికి కీలకమైన పాత్రను కల్పించారు.

పౌరహక్కుల ప్రాతిపదికన రాజ్యాధికారాన్ని నిర్వచించి, పరిమితం చేయకపోతే ఆ వ్యవస్థ సమాజ ప్రగతికి ఆటంకంగా తయారవుతుంది. "పరిపాలనా యంత్రాంగాన్ని, ప్రభుత్వ విధానాలను, న్యాయశాఖను సంస్కరించే ఉద్యమం, ప్రైవేటు శక్తుల గూండాయిజాన్ని రూపుమాపే ఉద్యమం పౌరహక్కుల భావనలో అంతర్భాగమని" లోహియా అంటారు. కనుక పౌరహక్కులు రాజ్యాధికారాన్ని నిర్వచించి, రాజ్యాధికారాన్ని పరిమితులలో ఉంచి సామాజిక పురోభివృద్ధికి మార్గాన్ని సుగమం చేస్తాయంటాడు.

అంతేకాదు పౌరహక్కుల ఉద్యమం హక్కుల ఉల్లంఘనకు మూలకారణమైన, సమాజంలో సాగుతున్న అన్యాయాలను వెలుగులోకి తెస్తుంది. సమాజంలో కొనసాగుతున్న దురాగతాల పట్ల ప్రజలను మేల్కొలిపి, వాటిని ఎదిరించవలసిన అవసరాన్ని గుర్తుచేస్తుంది. కనుక పౌరహక్కులు వాటంతట అవే సామాజిక మార్పును తీసుకొనిరావు. రాజ్యాధికారాన్ని చెలాయించే పద్ధతులను సంస్కరించడం ద్వారా సమాజంలోని పీడనను ఎదిరించడానికి, సమాజాన్ని మార్చడానికి హక్కులు అవకాశాన్ని కల్పిస్తాయి. అందుకే వ్యక్తి స్వేచ్ఛను పెంపొందించడానికి రక్షణ కవచంగా పౌరహక్కుల ఉద్యమమే కాక అవసరమైతే ఇతరేతర మార్గాలను కూడా అన్వేషించాలంటాడు లోహియా.

లోహియా ఇచ్చిన హక్కుల నిర్వచనానికీ, పాశ్చాత్యుల హక్కుల భావనకూ ఎంతో తేడా వుంది. పాశ్చాత్యులు రాజ్య నిరంకుశత్వం నుండి వ్యక్తిని కాపాడే సాధనంగానే హక్కులను నిర్వచించారు. అయితే లోహియా పుస్తకాన్ని రాసిన కాలం నాటికే, వ్యక్తి వికాసానికి రాజ్యం చేయవలసిన కనీస కర్తవ్యాలను కూడా హక్కులుగా నిర్వచించినవారు లేకపోలేదు. ప్రధానంగా సోషలిస్టులు హక్కులను, రాజ్యాధికారాన్ని కుదించే నెగెటివ్ రూపంలోనే కాక, వ్యక్తి పట్ల రాజ్యాధికారం బాధ్యతలను తెలియచేసే పాజిటివ్ అంశంగా కూడా హక్కులను పునర్నిర్వచించారు. ఈ హక్కులను సాధారణ భాషలో సామాజిక, ఆర్థిక హక్కులంటారు. అయితే లోహియా సామాజిక, ఆర్థిక హక్కుల గురించి ప్రస్తావించనే లేదు.

ప్రపంచవ్యాప్తంగా సోషలిస్టులు, కమ్యూనిస్టులు, జాతీయోద్యమ నాయకులు నిర్బంధానికి గురవుతున్న తరుణంలో లోహియా తన పుస్తకాన్ని రాశారు. కాబట్టి రాజ్యాధికార స్వభావాన్ని, దాని మూలాధారాలను మార్చాలన్న తపన పుస్తకంలో కనబడుతుంది. సామాజిక ఆర్థిక హక్కులను పట్టించుకునే పరిస్థితి లేదు. రాజ్య నిరంకుశత్వాన్ని రూపుమాపడానికే లోహియా హక్కులను సాధనంగా చూశాడు. హక్కులకు సార్వజనీనమైన భాష వున్నా నిర్దిష్ట పరిస్థితిలో నిర్దిష్ట ఆధిపత్యం నుండి, అన్యాయాల నుండి బయటపడటానికి పౌరులు వాటిని సాధనంగా చూస్తారు కనుక హక్కులకు నిర్దిష్టమైన అర్థం కూడా వుంటుంది.

వలస రాజ్యం ప్రయోగిస్తున్న నిర్బంధాన్ని ఎదిరించే క్రమంలో లోహియా హక్కులను రాజ్యాధికారాన్ని పరిమితం చేసే సాధనంగానే కాక అధికారాన్ని సంస్కరించే ఆయుధంగా కూడా చూశాడు. అట్లా మారిన రాజకీయ వ్యవస్థ సమాజాన్ని మార్చడానికి వ్యక్తికి అవకాశాన్ని కల్పిస్తుందని లోహియా అంటాడు. కనుక హక్కులు లోహియా దృష్టిలో సామాజిక మార్పుకు తోడ్పడతాయి. లోహియా పుస్తకం రాసినప్పటి నుంచి ఇప్పటివరకు భారతదేశంలో పౌరహక్కుల ఉద్యమకారులు హక్కులను సామాజిక మార్పుకు సాధనంగానే పరిగణించారు. పాశ్చాత్య సంప్రదాయం హక్కులను రాజ్య

నిరంకుశత్వం నుండి వ్యక్తిని కాపాడే సాధనంగా చూసింది. కానీ మూడవ ప్రపంచ దేశాల హక్కుల సిద్ధాంతకర్తలు ఒక అడుగు ముందుకు పోయారు. వీరి దృష్టిలో హక్కులు, రాజ్యవ్యవస్థను సంస్కరించి సామాజిక మార్పుకు తోడ్పడతాయి.

అయితే పైన పేర్కొన్నట్టు లోహియా సమాజంలోని ఆధిపత్య శక్తుల నుండి విముక్తిని కలిగించగల సాధనాలుగా హక్కులను చూడలేదు. కుల వ్యవస్థ నుండి, పురుషాధిక్యత నుండి, పెట్టుబడిదారుల ఆధిపత్యం నుండి, భూస్వాముల పెత్తనం నుండి స్వేచ్ఛను ఇవ్వగల విలువగా హక్కులను పరిగణించలేదు. ఎందుకంటే రాజ్యాధికారాన్ని హక్కుల ద్వారా పరిమితం చేయగలిగితే ఆధిపత్య వ్యవస్థలను కూల్చవచ్చునన్నది లోహియా అభిప్రాయం. నాటికి, నేటికి పౌరహక్కుల ఉద్యమాన్ని ఈ దృక్పథమే శాసిస్తున్నది. రాజ్యవ్యవస్థను పరిమితం చేసి సామాజిక మార్పుకు దోహదపడాలన్న దృక్పథాన్ని పౌరహక్కుల సంఘాలు ఇప్పటికీ విడిచిపెట్టలేదు.

అయితే ఆధిపత్య శక్తులను ఎదిరించవలసిన అవసరాన్ని లోహియా విస్మరించలేదు. లోహియా ప్రతిపాదించిన సప్త విప్లవాల లక్ష్యం అసమానతలను రూపుమాపడమే. లోహియా దృష్టిలో ఏడు రకాల అసమానతలున్నాయి. అవి: లైంగిక అసమానతలు; ఆస్తిపరమైన అసమానతలు; కుల అసమానతలు; జాతుల మధ్య నెలకొన్న అసమానతలు; వర్ణ అసమానతలు; సమష్టి ఆధిపత్యం నుండి వ్యక్తి రక్షణ. ఈ అసమానతలను న్యాయమైన పద్ధతుల్లో ఎదిరించడానికి సప్త విప్లవాలను లోహియా ప్రతిపాదించారు. తద్వారా సమానత్వం, న్యాయం పెంపొందుతుందని, వ్యక్తి వికాసం జరుగుతుందని లోహియా భావించారు. కనుక లోహియా సమాజంలో నెలకొన్న ఆధిపత్య వ్యవస్థలను గుర్తించాడు. వాటిని కూల్చకుండా వ్యక్తి గౌరవాన్ని పొందలేడని అంగీకరించాడు.

లోహియా హక్కులను కేవలం విప్లవానికి తోడ్పడగల సాధనాలుగానే చూడలేదు. వ్యూహాత్మకంగా అవసరమైన ఎత్తుగడగా మాత్రమే పరిగణించలేదు. హక్కులు ఆచరణలో లేకపోతే ఏ విప్లవమైనా దిగజారిపోతుందని లోహియా అన్నాడు. పురోగామి శక్తులు కూడా అధికారంలోకి రాగానే మార్పును తేవలసిన కర్తవ్యాన్ని విస్మరించి, పేద బలహీన వర్గాల ప్రయోజనాలను నీరుగార్చి ప్రభుత్వాధికారాన్ని స్వప్రయోజనాలకు ఉపయోగించాలని చూస్తాయన్నారు లోహియా. కానీ ఈ అంశాన్ని లోహియా ఎందుకనో విశదీకరించలేదు. కాకపోతే లోహియా రచనలను సమగ్రంగా పరిశీలిస్తే హక్కులను పరిరక్షించి, పెంపొందించే లక్ష్యాన్ని స్వీకరించకపోతే ఏ విప్లవమైనా దిగజారిపోతుందనే అభిప్రాయం స్పష్టంగానే ఉంది. బహుశా ఇక్కడే లోహియాకూ ఆధునిక పౌరహక్కుల సంఘాల కార్యకర్తలకు తేడా కనబడుతుంది. చాలామంది పౌరహక్కుల కార్యకర్తలు పౌరహక్కులను ఒక ఎత్తుగడగానే చూస్తారు. నూతన సమాజ నిర్మాణానికి ఒక ప్రాతిపదికగా చూడరు. లోహియా ఆధునిక పౌరహక్కుల కార్యకర్తల వలె కాక హక్కులను అభిలషణీయమైన అంతిమ లక్ష్యంగా కూడా చూస్తున్నాడనటానికి కొన్ని ఆధారాలున్నాయి. కేరళలో సోషలిస్టు పార్టీకి చెందిన పట్టంతాను పిళ్ళై అధికారంలో వుండగా పోలీసులు కాల్పులు జరిపారు. కాల్పులకు నైతిక బాధ్యత వహించి ముఖ్యమంత్రి పదవి నుంచి వైదొలగాలని లోహియా పట్టుబట్టారు. పౌరహక్కులను రాజకీయ కార్యాచరణకు మార్గదర్శకంగా తీసుకోవాలన్న ఆలోచన లోహియాకు బలంగా వుండేదనటానికి ఈ ఘటన సాక్ష్యం.

అయితే నేటి పౌరహక్కుల కార్యకర్తలు, సోషలిస్టులు రాజ్యాన్ని ఎదుర్కొనడానికి ఒక సాధనంగా మాత్రమే హక్కులను పరిగణిస్తున్నారు. కానీ హక్కులు ఉద్యమాలకు అంతిమ లక్ష్యంగా వుండాలని భావించడం లేదు. హక్కులను అంతిమ లక్ష్యంగా స్వీకరించి వుంటే హక్కుల ప్రాతిపదికన ఆయా ఉద్యమాల చర్యలను మూల్యాంకనం చేయడానికి, వాటివలన ప్రజలకు జరిగే నష్టాన్ని ఎత్తి చూపడానికి ప్రమాణాలు పెంపొందేవి. పౌరహక్కుల ఉద్యమాలు ప్రజా ఉద్యమాలకు అనుబంధంగా కాక నిర్దిష్టమైన కార్యరంగాన్ని రూపొందించుకోగలిగితే పౌరహక్కుల అవగాహనకు మరింత పరిపుష్టత చేకూరుతుంది.

ఈవిధంగా లోహియా 1930 నాటి పరిస్థితిని సమీక్షించి, ఆ నేపథ్యంలో పౌరహక్కులను నిర్వచించారు. వలసరాజ్యం అమలుచేస్తున్న నిర్బంధాన్ని అంతం చేసి స్వాతంత్ర్యాన్ని పెంపొందించడానికి పౌరహక్కుల ఉద్యమాన్ని ఆయన ఒక సాధనంగా చూసినా హక్కులకు, సామాజిక మార్పులకు సంబంధాన్ని వివరించడం వలన సార్వజనీనత సంక్రమించింది. అందుకే లోహియా పుస్తకానికి ప్రస్తుత సంక్షుభిత సన్నివేశంలో ఎంతో ఉపయుక్తత వున్నది.

C

# ఇంకొక 'గుజరాత్' ఎక్కడా జరగనివ్వొద్దు

**మ**నుషుల ఘోరమైన ప్రవర్తన గురించి వార్తలు విన్నప్పుడు, చదివినప్పుడు, మనమసలు నాగరికుల మేనా? అన్న సందేహం వస్తుంది.

గుజరాత్ ఘటనల గురించి విన్నప్పుడు ఇంకొక మెట్టు కిందికి దిగి మనమసలు మనుషులమేనా? అన్న సందేహం చాలామందికి వచ్చింది.

స్త్రీలను మూకుమ్మడిగా రేప్‌చేసి ముక్కలుగా నరికి తగలబెట్టిన వాళ్లు, చిన్న పిల్లలను పెట్రోలు పోసి సజీవంగా తగలబెట్టినవాళ్లు, రహదారి మీద పోతున్న వాహనాలను తాళ్లతో బంధించి పెట్రోలు పోసి వాహనంలోని ప్రయాణీకులతో సహా దానికి నిప్పుపెట్టి హతమార్చిన వాళ్లు – వీళ్లు కూడా మనుషులే అయితే మనం ఏమిటి?

మూడు నెలలుగా ఈ ప్రశ్న మనల్ని వేధిస్తున్నది. అయితే ఈ ఆవేదనకు బాధ్యులయిన సంఘ్ పరివార్ పార్టీల వాళ్లు ఈ ప్రశ్నకు జవాబు చెప్పడం లేదు. 'మీరు గోధ్రా మారణకాండను ఖండించడం లేదు' అని ఎదురుదాడి చేస్తున్నారు. ఎవరూ ఆ మారణకాండను ఖండించలేదు కాబట్టే గుజరాతీ హిందువులు కోపోద్రిక్తులయి ముస్లింల పైన దాడికి దిగారని దబాయిస్తు న్నారు.

ఇందులో రెండు అబద్ధాలున్నాయి. గోధ్రా మారణకాండను ఎవరూ ఖండించలేదన్నది ఒక అబద్ధం. ఖండించడానికి అందరికీ టైం ఇచ్చిన తరువాతే హిందుత్వవాదులు పోగుచేసిన మూకలు ముస్లింలపైన దాడికి దిగారన్నది రెండవ అబద్ధం.

గోధ్రా మారణకాండ జరిగింది ఫిబ్రవరి 27 పొద్దున్న. 28 పొద్దున్నుండే ముస్లింలపైన మారణ కాండ పెద్దఎత్తున గుజరాత్ వ్యాప్తంగా మొదలయింది. కొన్నిచోట్ల 27 రాత్రే మొదలయింది. ఎవరైనా ఖండిస్తున్నారా లేదా అని వాళ్లు చూసిందెక్కడ? దానికోసం ఆగిందెక్కడ?

కరసేవకులు అయోధ్యకు వస్తూపోతూ రైళ్లలోనూ స్టేషన్లలోనూ కనిపించిన ముస్లింలను పలువిధాల సతాయిస్తున్నారు. దీనికి ఆగ్రహించిన గోధ్రా రైల్వే స్టేషన్ వెండర్లు తమ నివాస ప్రాంతమైన సిగ్నల్ ఫాలియా అనే బస్తీ దగ్గర చెయిన్ గుంజి, బస్తీవాసులను కూడగట్టి కరసేవకుల మీద కక్షతో వారు ప్రయాణిస్తున్న బోగీని తగలబెట్టారు. అందులో దాడిచేసిన వారి ఆగ్రహానికి కారకులయిన కరసేవకులే కాక ఇతర ప్రయాణీకులు – స్త్రీలూ పిల్లలతో సహా– ఉన్నారు. మొత్తం 58 మంది చనిపోయారు.

ఒకరి మీద కోపంతో వాళ్లు ప్రయాణం చేస్తున్న రైలు బోగీని మొత్తంగా తగలబెట్టి పసిపిల్లలతో సహా 58 మందిని చంపడం అతి ఘోరమైన చర్య. దానిని ఖండించని వారెవ్వరూ ఉండరు. ఆ ఆరోపణ పచ్చి అబద్ధం.

ఆ అబద్ధాన్ని అడ్డం పెట్టుకొని హిందుత్వవాద సంస్థలు సాగించిన మారణహోమం నిజానికి ఆ క్షణమే మొదలయినది కూడా కాదు. దాని కోసం ఏర్పాట్లు చాలా కాలంగా సాగుతున్నాయి. ఏ అదను దొరికినా ముస్లిం ప్రజానీకం పైన మొత్తంగానే దాడిచేయడానికి వాళ్లు చాలా కాలంగా తయారుగా ఉన్నారు. గోధ్రా మారణకాండను అవకాశం చేసుకొని అప్పటికే తయారయిన పథకాన్ని అమలు చేశారు. అతి క్రూరంగా (పాశవికంగా అంటే పశువులను అవమానపరచడం అవుతుంది) అమలు చేశారు.

మనుషుల మెదళ్లలో ఈ దేశ చరిత్ర గురించి అబద్ధాలు చొప్పించారు. మనసులలో ముస్లింల గురించీ, ఇస్లాం గురించీ విద్వేష విషాన్ని నింపారు. త్రిశూలాలు, తల్వార్లు పంచారు. అబద్ధపు వదంతుల ప్రచారాన్ని ఒక కళగా అభ్యసించి ప్రదర్శించారు. ప్రభుత్వాన్ని జేబులో వేసుకొని పోలీసులను తమ ఏజెంట్లుగా మలచుకున్నారు. ముస్లింలను ఒక వర్గంగానే భౌతికంగా ఆర్థికంగా సాంఘికంగా అణచివేయడానికీ వెలివేయడానికీ నాశనం చేయడానికీ కావలసిన భావ, భౌతిక వాతావరణాన్ని రూపొందించుకున్నారు.

గోధ్రా మారణకాండను ఆసరా చేసుకొని, అప్పటికే తయారుగా ఉన్న ఈ పథకాన్ని పకడ్బందీగా మరుసటిరోజు తెల్లవారి నుంచే అమలు చేశారు.

ఫిబ్రవరి 28 నుంచి దాదాపు మార్చి 15వ తేదీ దాకా సాగిన ఈ దౌర్జన్యకాండలో ముస్లింల నివాసాలు, దుకాణాలు, హోటళ్లు మొత్తం 22,515 అగ్నికి ఆహుతి అయ్యాయి. 3800 కోట్ల రూపాయల ఆస్తి ధ్వంసం అయింది. 1500 మంది దాకా హతమయ్యారు. స్త్రీలు లెక్కలేనంత మంది లైంగిక అత్యాచారానికి గురయ్యారు. లక్షన్నర జనాభా తమ ఆవాసాలను వదిలిపెట్టి శరణార్థుల శిబిరాలలో చేరారు.

ఈ వైనాన్ని క్లుప్తంగా వివరించే ప్రచురణ, మానవహక్కుల వేదిక అచ్చువేసిన 'గాంధీ గుజరాత్‌లో గాడ్సే రాజ్యం'. 8 రోజుల పాటు అయిదు హక్కుల సంఘాల బృందంలో భాగంగా ముగ్గురు మానవహక్కుల వేదిక బాధ్యులు గుజరాత్‌లో చేపట్టిన పర్యటన ఫలితం ఈ ప్రచురణ.

దీని ఉద్దేశ్యం క్రూరత్వాన్ని మళ్లీ మళ్లీ జ్ఞాపకం చేసి ద్వేషాన్ని రెచ్చగొట్టడం కాదు. మత అసహనం ఇప్పటికే ఎంతటి విద్వేషపూరితమైన రూపం తీసుకుందో, ఎవరి పుణ్యాన తీసు కుందో వివరించి చెప్పి ఆ విషాన్ని తొలగించే ప్రయత్నానికి తోడ్పడటం. చట్టబద్ధ పాలననూ ప్రాథమిక హక్కులనూ ప్రమాణంగా పెట్టుకొని పరిపాలించవలసిన పాలనా యంత్రాంగం మైనారిటీ వర్గం పైన జరిగిన మారణకాండలో తానూ భాగమైన వైనాన్ని విపులీకరించి ఆ పాలనా విలువలను పునస్థాపించడానికి తోడ్పడడం.

క్లుప్తంగా చెప్పాలంటే, ఇంకొక గుజరాత్ ఎక్కడా జరగకుండా చూడడానికి కావలసిన చైతన్యం కలిగించడం ఈ ప్రచురణ లక్ష్యం.

చట్టబద్ధ పాలననూ ప్రాథమిక హక్కులనూ లౌకికవాద స్ఫూర్తినీ కాపాడుకోవడం కోసం, అసా మాన్య వైవిధ్యం ఉన్న మన నాగరికతను ఒకే మూసలోకి కుదించి వేసే సంఘ్ పరి వార్ సంకుచిత ప్రయత్నాన్ని ఎదుర్కొనడం కోసం ప్రజాస్వామ్యాన్ని ప్రేమించే వారంతా ఒకటిగా కదిలి రావాలని పిలుపునిస్తూ–

11.6.2002

# తలతోటి నాగేశ్వరరావు దళితుడు కాకపోయివుంటే ఆ శవానికి అంత అన్యాయం జరిగి ఉండేదా?

**దొం**గిలించిన చెవి కమ్మల్ని అమ్మడానికి సహకరించాడనే నెపంతో గుర్రం రామయ్య కుటుంబాన్నంత టినీ ఒంగోలు తాలూకాలో పడేసి బీభత్సంగా కొట్టి, చివరికి గుర్రం రామ య్యను చంపేశారు.

ఒక అనుమానాస్పద మృతికి సంబంధించిన కేసులో శ్రీదేవి అనే ఆమెను, ఆమె తల్లినీ మద్దిపాడు స్టేషన్‌లో మూడు రోజులు ఉంచి చిత్రవధ చేస్తే ఆ దెబ్బలకు తట్టుకోలేక కూతురు శ్రీదేవి చనిపోయింది.

మొదటిది 427 కేసు. రెండవది 174 కేసు. ఈ రెండూ ఏపాటి సెక్షన్లో అందరికీ తెలిసిన విష యమే. కానీ పోలీసులు మాత్రం వారికి మరణ శిక్షలు వేసేశారు.

అదే చీరాల్లో తలతోటి నాగేశ్వరరావును క్రూరంగా చంపి, ఈపూరుపాలెం పోలీస్ స్టేషన్‌కి దగ్గర్లో శవాన్ని పడేస్తే అక్కడ ఒక శవం ఉందని తెలిసి కూడా ఒక రోజంతా నిర్లక్ష్యం చేసింది చాలక, 'నన్ను హత్య చేశారంటూ' వంటినిండా గాయాల్ని సాక్ష్యంగా ఆ శవం చూపించినా దాన్ని 174 క్రింద కట్టి, ఆ హత్యను మాఫీ చేయాలని చూశారు.

174 అనే సెక్షన్‌కు ఎంత పక్షపాతమో చూడండి! ఎక్యూజ్డ్ దళితుడైతే, అదే 174 ఆ దళితుడ్ని చంపేస్తుంది. డిసీజ్డ్ దళితుడైనప్పుడేమో అదే 174 కేసును మాఫీ చేయాలని చూస్తుంది. ఎంత కపటత్వం? ఎంత పక్షపాతం? అంటే ఇండియన్ పీనల్ కోడ్‌కీ, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌కీ కూడా 'కులం' ఉందన్నమాట!

ఈ మాట జిల్లా ఎస్.పి. కుమార్ విశ్వజిత్తు గారికి కోపం కలిగించవచ్చు. రుచించకపోవచ్చు. కానీ ఏం చేస్తాం? నిజం అదే! "నిజం అదికాదు, వాటిని అమలుపర్చే పోలీసులదే తప్పు" అంటారా? అయితే ఈపూరుపాలెం ఎస్.ఐ. కరుణాకర్‌పై చర్య తీసుకోవడానికి ఇంకా ఆలస్యం దేనికి?

తలతోటి నాగేశ్వరరావుది చీరాల. దళిత కులం. కారు డ్రైవర్. జూన్ 28న డ్యూటీ పనిమీద వెళ్ళిన వ్యక్తి జులై 1న ఈపూరుపాలెం సాల్వేషన్ జామాయిల్ తోటల్లో శవమై తేలాడు. అప్పటికి అతను చనిపోయాడని ఇంట్లో తెలియదు. దారినపోయే వాళ్ళెవరో ఆ శవాన్ని చూసి పోలీసులకు తెలియచేశారు. పాపం ఆ రోజంతా పోలీసులకు తీరనేలేదు. మరుసటిరోజు తీరిగ్గా శవాన్ని వీక్షించారు అదేదో ఖర్మ పట్టినట్టు. జేబులో పర్సు కనిపించింది. దాంట్లో ఉన్న ఒక నెంబరుకు ఫోన్ చేశారు. ఆ నెంబరు తాలూకు ఇంటినించి ఒక పిల్లవాడు వస్తే శవం కుళ్ళిపోయిందని ఆ పిల్లాడ్ని భయపెట్టి శవాన్ని చూపించకుండానే పంపించివేశారు. ఈపూరు పాలెం పోలీసుస్టేషన్ హౌస్ ఆఫీసర్ కరుణాకర్ గారి పరిశోధన అంతటితో ముగిసిపోయింది.

వెంటనే ఈపూరుపాలెం పంచాయతీ కార్యదర్శి సుబ్బారావుతో తనకు నచ్చిన పంచాయతీదారుల్ని పెట్టుకుని పంచనామా అయిందనిపించాడు. ఆ వెంటనే చీరాల గవర్నమెంట్ డాక్టర్ నాగభూష



ణంతో పోస్టుమార్టమ్ తంతు పూర్తిచేయించి, కనీసం గుంటలో పూడ్చిపెట్టాలనే సంస్కారాన్ని కూడా పాటించకుండా పైపైన ఇసుకపోసి వెళ్ళిపోయారు.

ఆ తర్వాత ఈ దిక్కులేని శవం కోసం ఎవ్వరూ రాకుండా ఉంటే బాగుండు అనుకుంటూ మొక్కుబడి ప్రకటనొకదాన్ని పేపరుకిచ్చాడు. ఆ ప్రకటన చూసిన ఎవరో 'ఈ శవం కలివరగుంట ఇసాక్‌దే'నంటూ బ్రాహ్మణ నిడమానూరువాసులకు ఫోను చేశారట! ఆ ఊరి వాళ్ళు వచ్చి, చెప్పులు,బట్టలు చూసి 'ఈ శవం మా ఇసాక్‌దే' అని తేల్చి, ఆ శవం గుట్టపై ఒక దండవేసి వెళ్ళిపోయారట! దాంతో ఈ శవం పీడ విరగడైపోయిందని ఎస్.ఐ. కరుణాకర్ హాయిగా గాలి పీల్చుకున్నాడు. కానీ ఇంతలో 'ఇసాక్ బతికే ఉన్నాడు' అంటూ బ్రాహ్మణ నిడమానూరు నుంచి ఒక కబురొచ్చింది. దాంతో మళ్ళీ ఇదేం ఖర్మరా అనుకుంటూ– 'నేను హైదరాబాద్‌కి ట్రైనింగ్ పనిమీద వెళ్తున్నాను. ఆ ఫోన్ నెంబర్‌ని పట్టుకుని ఆ ఎదురింట్లోనో, పక్కింట్లోనో కనుక్కుని సమాచారం ఇవ్వండి' అంటూ ఎస్.ఐ. కరుణాకర్ హైదరాబాద్ వెళ్ళిపోయాడు. మరుసటి రోజు అంటే జులై 8వ తేదీన పోలీసులు తలతోటి నాగేశ్వరరావు ఇంటికెళ్ళి 'మీ ఇంట్లో మొగ మనిషి ఎవరైనా కనిపించట్లేదా' అని అడిగి ఆ వివరం తెలుసుకుని 'స్టేషన్లో చెప్పులు, బట్టలు ఉన్నాయి. గుర్తుపట్టండి' అని చెప్పారు.

నాగేశ్వరరావు ఇంట్లో వాళ్ళు వాటిని చూసి 'ఇవి మా మనిషివే' అని చెప్పారు. అప్పటికి అర్థమైంది ఇన్ని రోజులైనా నాగేశ్వరరావు ఇంటికి రాకపోవడానికి కారణం! ఇది ఎలా జరి గింది అని ఇంట్లో వాళ్ళు పోలీసుల్ని అడిగితే 'మీ ఆయనకి త్రాగుడు అలవాటుంది కదా, తాగి తాగి గొంతెండిపోయి చచ్చి ఉండొచ్చు' అని జవాబిచ్చారు. ఈ విషయాన్ని తెలుసుకున్న కొన్ని దళిత సంఘాలు వెంటనే చీరాల వెళ్ళి హతుని బంధువుల్ని కలిసి, అక్కణ్ణించి ఈపూరుపాలెం పోలీసు స్టేషన్‌కి వెళ్ళి నాగేశ్వరరావు మరణంపై పోలీసులు చెప్పే 'చందమామ కథలు' విని, అక్కణ్ణించి స్టేషన్‌కి ఒక కిలోమీటర్లోనే ఉన్న ఘటనా స్థలానికి వెళ్ళాయి.

శవం ఉన్న ప్రదేశానికి వెళ్లడానికి ముందే 'ఇది సహజ మరణం కాదు' అనే అనుమానం సంఘాల్ని పట్టుకుంది. నాగేశ్వరరావుకి ఆత్మహత్య చేసుకోవాల్సిన అగత్యం లేదు. బహిరంగం గానే తాగే వ్యక్తి రహస్యంగా తోటల్లో ఒక్కడే తాగాల్సిన పనిలేదు అని అనుకొంటూ అయినా పాజిటివ్‌గానే ఆలోచనల్ని స్టార్ట్ చేసి శవం పడివున్న చుట్టుప్రక్కల ప్రాంతాన్ని వెతకడం ప్రారంభించారు.

శవం ఎక్కడైతే పడి ఉందని పోలీసులు చెప్పారో దానికి కొన్ని అడుగుల దూరంలో ఒక తెల్లటి కొత్త తాడు రక్తపు మరకలతో ఉచ్చు ఆకారంలో పడివుంది. దీనికి కొంచెం అవతలగా కుర్చీలకు చేతులుగా ఉపయోగించే చెక్క సగానికి విరిగి, మిగిలిన ఆ సగభాగం రక్తపు మరకలతో ఉంది. ఈ రెంటికీ మధ్యలో జూన్ 27వ తేదీ 'వార్త' పేపరు ముక్క ఒకటి దొరి కింది. వెంటనే ఫోటోగ్రాఫర్‌ని పిలిపించి వాటిని యథాస్థానంలో ఉంచి, పోలీసుల సమక్షంలోనే ఫోటోలు తీయించి ఆ వస్తువుల్ని 'ఎవిడెన్స్'గా ఉంచమని పోలీసులకిచ్చారు.

ఈ దొరికిన ఆధారాల్ని బట్టి ఇది ఖచ్చితంగా హత్యే అనే నిర్ధారణకు వచ్చి అప్పటికప్పుడే చీరాల డి.ఎస్.పి. గారిని కలిసి 'రీ పోస్టుమార్టమ్' డిమాండ్ చేశారు. రీ–పోస్టు మార్టమ్‌కి గుంటూరు ప్రొఫెసర్ రాజ్‌కుమార్‌గారు వచ్చారు. ఆయన శవం ఉన్నచోటుకి వచ్చీ రాగానే

'ఇదేంటీ ఇక్కడొక విరిగిన సగం పన్ను (టీత్) ఉంది' అంటూ దాన్ని కనిపెట్టారు. ఇన్ని సాక్ష్యాలున్నా పట్టించుకోని పోలీసుల్ని ఏమనాలి?

వెంటనే ఎస్.పి. కుమార విశ్వజిత్ గారిని కలిశారు. జరిగినదంతా చెప్పారు. 'ఇందులో ఖచ్చితంగా పోలీసు నెగ్లిజెన్సీ ఉంది' అని ఖండించారు. 'ఇందులో పోలీసు నెగ్లెజెన్సీ ఏమీలేదు' అంటూ ఆయన తిరిగి వాళ్లనే ఖండించారు. 'నిర్లక్ష్యం కాకపోతే మాఫీ చేయాలనే ప్రయత్నం ఉండవచ్చు కదా' అన్నాం. 'ఆ అవసరం పోలీసులకు లేదు' అంటూ ఆయన ఖరాఖండిగా తెగేసి చెబుతూ– మొత్తం ఈ కేసును విచారించడానికి ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్‌గా చీరాల సి.ఐ. తాడి జయప్రసాద్ గారిని వేశారు. ఈ సి.ఐ. గారు ఎస్.ఐ. కరుణాకర్ గారికంటే నాలుగాకులు ఎక్కువే చదివారు. ఫలానా వాళ్ళు నా భర్తను చంపి ఉండొచ్చు, ఫలానా వాళ్ళకి ఈ విషయం తెలిసి ఉండొచ్చు అని ఎవరి పేరైనా చెబితే ఈ సి.ఐ. గారు నేరుగా వాళ్ళని పిలిపించి విచారించాల్సింది పోయి, ఇళ్ళ దగ్గర అమ్మలక్కలు చాడీలు చెప్పినట్లుగా చాడీలు చెప్పి, నాగేశ్వరరావు ఇంటిపైకి తగాదాలకు పంపించడం ప్రారంభించాడు. అంతేగాకుండా నాగేశ్వరరావు ఇంట్లో వాళ్ళే ఎందుకు చంపి ఉండకూడదు? అంటూ వేరే వాళ్ళ దగ్గర నుంచి ఫిర్యాదులు తీసుకుని మనిషి పోయిన బాధలో ఉన్న నాగేశ్వరరావు ఇంట్లో వాళ్ళని వేధించడం ప్రారంభించాడు. 'ఈ సి.ఐ. మాకు వద్దు. వెంటనే ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్‌గా ఇతన్ని మార్చండి. ఇతనికి మోరల్స్ ఏమీ లేవు. సొంత తండ్రి కేసులోనే ఇతను రిమాండ్‌కి పోయి వచ్చాడు. ఇతని మీద చాలా అవినీతి ఆరోపణలున్నాయి. ఇతను డబ్బు కోసం మా కేసును నీరు గార్చవచ్చు' అని చెప్పి, చనిపోయిన నాగేశ్వరరావు ఎస్.సి. కనుక విచారణాధికారిగా డి.ఎస్.పి. స్థాయి అధికారిని వేయమని అన్ని సంఘాలూ కోరాయి. ఎస్.పి.గారు సరే అని, ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్‌గా ఒంగోలు డి.ఎస్.పి. కె.మాధవరావుగారిని నియమించారు. అలాగే 174 సెక్షన్ నుంచి 302 సెక్షన్‌కు ఆల్టర్ చేయమని అడిగారు. పోస్టుమార్టం రిపోర్టు రావాలని ఎస్.పి.గారు అన్నారు. ఇప్పుడు ఆ రిపోర్టు కూడా వచ్చింది. దానిలో క్లియర్‌గా 'ఇది హత్యే' అని ఉంది. కాబట్టి 302 క్రింద మార్చి ఈ హత్యకు కారణమైన ఆసోది నాగేశ్వరరావుని అరెస్టు చేయండి' అని అడిగారు. 'ఈ శవం మాది అంటూ మొదట వేరేవాళ్ళు వచ్చారు కాబట్టి డి.ఎన్.ఏ. పరీక్ష చేసి అప్పుడు ఆలోచిస్తామని ఎస్.పి.గారు అన్నారు. (నిజానికి ఈ మాటలన్నీ మొదటగా చీరాల సి.ఐ.గారు మాతో అన్నవే. అవే మాటల్ని ఇప్పుడు ఎస్.పి.గారు వల్లిస్తున్నారు) మొదటిగా ఈ శవం ఎవరిది అని అనుకొన్నారో ఆ వ్యక్తి (ఇసాక్) బ్రతికే ఉన్నాడని తేలింది. అలాగే ఈ శవం నాగేశ్వరరావుదే అనడానికి శవం ఫోటోలు, బట్టలు, చెప్పులు చాలు కదా అన్నాయి ప్రజా సంఘాలు. 'అయినా సూపర్ ఇంపోజ్, డి.ఎన్.ఏ. పరీక్షలు రావాలని' ఎస్.పి. గారు సెలవిచ్చారు. 'కళాచౌదరి విషయంలో సూపర్ ఇంపోజ్ ఏమైంది. అది ఫెయిల్ కాలేదా?' అని అడిగాం. 'డి.ఎన్.ఏ.లో తప్పురాదు. అది రానివ్వండి' అని ఎస్.పి.గారు అన్నారు.

'ఈ శవం నాగేశ్వరరావుదే అనడానికీ, ఇది తప్పనిసరిగా హత్యే' అనడానికి ఎన్ని ఆధారాలను ఎస్.పి. గారికి చూపించినా వారు మాత్రం చీరాల పోలీసు వారి మాటలపైనే ఆధారపడుతున్నారు. సరే. మంచిది. వారిపైనే ఆధారపడండి. ఆ తరువాత అభాసుపాలు కండి.

## ఎస్.ఐ. కరుణాకర్ మాటేమిటి?

జామాయిల్ తోటల్లో శవం పడి ఉందని తెలిసికూడా వెంటనే వెళ్ళకుండా బాడీ డీ-కంపోజ్



అయిందాకా ఆలస్యం చేసిందానికీ, శవం పైన ఉన్న గాయాల్ని శవ పంచనామాలో నమోదు చేయనిదానికీ అతనికి పనిష్మెంట్ ఏమీ ఇవ్వరా?

శవం జేబు పరుసులో ఉన్న ఫోన్ నెంబర్లకు ఫోన్లుచేసి, వాటి ద్వారా ఆ మనిషి ఎవరో తెలుసుకొని అతని బంధువుల్ని పిలవని దానికీ, శవాన్ని ఫోటోలు తీసికూడా ఆ ఫోటోల్ని పేపరులో ప్రకటించకపోడానికీ, 'నాగేశ్వరరావుది హత్యే' అని నిరూపించే తాడు, కర్ర, విరిగిన పన్ను వంటి ఆధారాల్ని భద్రపరచకుండా డ్యూటీని నిర్లక్ష్యం చేసినదానికీ ఎస్.ఐ. కరుణాకర్‌ని సస్పెండ్ చేయరా? అతనిపై ఎస్.సి., ఎస్.టి. ఎట్రాసిటి యాక్టు పెట్టి అరెస్టు చేయరా?

## డిమాండ్లు

1. తలతోటి నాగేశ్వరరావుని హత్యచేసిన ఆసోది నాగేశ్వరరావు (అలియాస్ మెకానిక్ రెడ్డి)ని, అతని ముఠాని అరెస్టు చేయాలి!
2. తలతోటి నాగేశ్వరరావు కేసును ఎస్.సి., ఎస్.టి. అట్రాసిటీ కేసుగా నమోదు చేయాలి.
3. కేసును మాఫీ చేయాలని చూసిన ఈపూరుపాలెం ఎస్.ఐ. కరుణాకర్‌ని, డా॥ నాగభూషణాన్ని, పంచాయతీ కార్యదర్శి సుబ్బారావులను ఎస్.సి., ఎస్.టి. అట్రాసిటీ యాక్ట్ క్రింద కేసు నమోదుచేసి వారిని అరెస్టు చేయాలి.
4. సాక్షులను బెదిరించిన చీరాల సి.ఐ. తాడి జయప్రసాద్‌పై శాఖాపరమైన చర్య తీసుకోవాలి.

ఒంగోలు 31.7.2002

**–ఇతర సంఘాలతో కలిసి**

# ప్రభుత్వానికీ నక్సలైట్లకూ మధ్య చర్చల పునరుద్ధరణ కోసం కృషిచేద్దాం

పీపుల్స్‌వార్‌కూ రాష్ట్ర ప్రభుత్వానికీ మధ్య చర్చలు మొదలయినట్టే మొదలయి అంతలోనే నిలిచిపోవడం రాష్ట్రంలో అధిక భాగం ప్రజలకు నిరాశ కలిగించింది.

ఈ పరిణామానికి ప్రధానంగా ప్రభుత్వాన్నే తప్పు పట్టాలనడానికి తటపటాయించవలసిన పనిలేదు.

మనిషికయినా ప్రభుత్వానికయినా ఒకే నాలుక ఉండాలి. పది నాలుకలు పెట్టుకుని ఒక్కొక్కసారి ఒక్కొక్క నాలుకతో మాట్లాడితే ఎదుటివారికి సంభాషించడం అసాధ్యం అవుతుంది. సంభాషణే అసాధ్యమయితే ఇంక చర్చలెట్లా జరుగుతాయి?

'ఎప్పుడయినా ఎక్కడయినా మాట్లాడటానికి మేము సిద్ధమే'నని ఈ ప్రభుత్వమే ఒకనాడు అనలేదా? చర్చల 'విధివిధానాలు' నిర్ణయించడం కోసమని చెప్పి పీపుల్స్‌వార్ పంపించిన ప్రతినిధులతో మూడు దఫాలు మాట్లాడలేదా? కాల్పుల విరమణ పాటిస్తారా లేదా అన్న విషయంలో తేడాలు వచ్చాయిగానీ చర్చలు జరిపే విషయంలో రాలేదు కదా? కాల్పుల విర మణ విషయంలో ప్రభుత్వం ఏ హామీ ఇవ్వకపోయినప్పటికీ జులై 20 నాటికి చర్చలకు వస్తామని పీపుల్స్‌వార్ ప్రకటించింది. ప్రభుత్వం ఆ ప్రకటనకు సాదరంగా స్పందించినట్టే అనిపించింది.

మూడు వారాల తరువాత ముఖ్యమంత్రి 'ఆయుధాలు పట్టుకొని చర్చలంటే ఎట్లా?' అంటున్నారు. ప్రజలు పిచ్చివాళ్లని చంద్రబాబు అనుకుంటున్నాడా, లేకపోతే అతని ప్రభుత్వానికి మతి చెడిందని ప్రజలనుకోవాలా? ఈ మాట మొదట్లోనే అంటే 'విధి విధానాల' ప్రహసనం నడిచేదే కాదుకదా? 'పీపుల్స్‌వార్‌తో చర్చలకు సిద్ధమే'నని ప్రకటించినప్పుడు ఆయుధాలు దించేస్తే చర్చలకు సిద్ధమని ప్రభుత్వం చెప్పదలచుకుందని అనుకోవాలా? వాళ్లంతట వాళ్లు ఆయుధాలు దించేస్తే ఇహ వారితో ప్రభుత్వం చర్చించేది ఏమిటి? పాకిస్తాన్ పిఒకెని అప్పగించేస్తే తప్ప ఆ దేశంతో మాట్లాడకూడదని బాల్‌థాకరే, బలరాజ్ మథోక్ వంటి హిందుత్వవాదులు అంటుంటారు. వాళ్లను విజ్ఞతగల వాళ్లుగా ఎవరూ ఎప్పుడూ భావించలేదు గానీ, తెలివయిన వ్యవహర్తగా పేరు తెచ్చుకోవాలని ఉబలాటపడే మన ముఖ్యమంత్రి అదే స్థాయిలో మాట్లాడితే ఎట్లా?

ఈ చర్చల ప్రస్తావన ఎప్పుడు మొదలయిందో, ఎందుకు మొదలయిందో ఒకసారి జ్ఞాపకం చేసుకోవడం ఉచితంగా ఉంటుంది. అప్పుడు తప్ప చర్చల ఆవశ్యకతా అర్థంకాదు, ప్రభుత్వం ఎంత అర్థరహితంగా మాట్లాడుతున్నదో కూడ అర్థంకాదు.

నక్సలైట్ ఉద్యమం మొదలయి ముప్పై ఏళ్లు దాటింది. పేదరికం సమస్యనూ, గ్రామీణ ప్రాంతాలలోనూ ఏజెన్సీ ప్రాంతాలలోనూ శతాబ్దాలుగా స్థిరపడిపోయి ఉన్న అణచివేత సమస్యనూ ఆ ఉద్యమం రాజకీయ అజెండా మీదికి తెచ్చింది. వాటి పరిష్కారానికి తాను కొంతమేరకు తోడ్పడింది, ప్రభుత్వ వైఫల్యాన్ని చర్చకు పెట్టింది, ప్రజలకు కొంత బలాన్ని ఇచ్చింది, అంతకు మించి ఆశించే సాహసం అందిచ్చింది.



అయితే ఈ పనులన్నీ చేయడానికి నక్సలైట్ ఉద్యమం ఎంచుకున్న సాయుధ పోరాట మార్గం, దానిని ఎదుర్కొనే పేరు మీద ప్రభుత్వం ఆ ఉద్యమం పైననేకాక దానిని ఆదరించిన ప్రజలందరిపైనా ప్రయోగించిన హింసాత్మక నిర్బంధం, ఆ నిర్బంధాన్ని తిప్పికొట్టడానికి నక్సలైట్లు ప్రయోగించిన ఎదురుదాడి, దానిని ఎదుర్కొనడానికి ప్రభుత్వం మరింతగా పెంచిన అణచివేత... ... ...

ఈ వలయం దొంతరలు దొంతరలుగా పెరుగుతూ పోయింది. ప్రజల సమస్యలు పూర్తిగా పక్కకు పోకపోయినప్పటికీ, నక్సలైట్లకూ రాజ్యానికీ మధ్య పోరాటం కేంద్రస్థానాన్ని ఆక్రమించుకుంది. ఆ పోరాటం జరుగుతున్న ప్రాంతాలలో బతుకుతున్న ప్రజలు భయం నీడలో బతకసాగారు. ఆ ప్రజలు ప్రభుత్వాన్నీ 'అన్నల'నూ ఒకేరకంగా చూడకపోయినప్పటికీ, ప్రభుత్వం కంటే 'అన్నల' మీదనే ఎక్కువ మందికి ఎక్కువ అభిమానం ఉన్నప్పటికీ, ఇద్దరి మధ్య జరుగుతున్న పోరులో ప్రజలు నలిగిపోసాగారన్నది వాస్తవం.

సరిగ్గా ఈ నేపథ్యంలోనే పౌరస్పందన వేదిక ఏర్పడింది. మీరేం చేస్తున్నారో కొంచెం ఆలోచించండి అని ఇరుపక్షాలనూ నిలదీసింది. వారి మీద సమాజంలో ఉన్న విమర్శను వారికి వినిపించి జవాబు కోరింది. ఆ విమర్శనూ జవాబునూ పుస్తకాలుగా అచ్చువేసి ప్రజలలో ప్రచారం చేసింది.

కరపత్రం

ఈ క్రమంలోనే, ప్రభుత్వానికీ నక్సలైట్లకూ మధ్య చర్చలు జరగాలి అన్న ప్రతిపాదన ముందుకు వచ్చింది. చర్చల ఆవశ్యకతను ఈ నేపథ్యంలోనే అర్థం చేసుకోవడం ఉచితంగా ఉంటుంది. చర్చల అజెండా రూపురేఖలను కూడా ఈ నేపథ్యమే నిర్ణయించడం ఉచితంగా ఉంటుంది. ముప్పై ఏళ్లు చర్య ప్రతి చర్యలుగా పెరుగుతున్న హింసావలయాన్ని, ఆ వలయంలో బతుకుతున్న ప్రజల మీద దాని ఫలితంగా పడుతున్న ఒత్తిడిని వీలయిన మేరకు తగ్గించడం చర్చల లక్ష్యంగా ఉండాలి. ఆ హింసావలయానికి ఎవరు ఏమేరకు బాధ్యులన్న వివాదంతో నిమిత్తం లేకుండ ఈ ప్రయత్నం జరగడం అవసరం అన్నది పౌరస్పందన వేదిక ప్రతిపాదన సారాంశం. నక్సలైట్లు పనిచేస్తున్న ప్రాంతాలలో బతుకుతున్న ప్రజలలో అత్యధికులు దీనినే కోరుకుంటారని నిస్సందేహంగా చెప్పవచ్చు. అందులో నక్సలైట్ రాజకీయాలను అభిమానించే వారూ ఉన్నారు, వ్యతిరేకించే వారూ ఉన్నారు, తటస్థంగా ఉండేవారూ ఉన్నారు.

చర్చలకు కూర్చునే ముందు ఈ లక్ష్యాన్ని నిర్దిష్టమైన అజెండాలో బిగించవలసిన అవసరం ఉంటుంది. ఆ వివరాలలోకి ఇప్పుడు పోనక్కరలేదుగానీ కొన్నిటిని సూచించడం ఉచితంగా ఉంటుంది. నక్సలైట్లను పట్టియ్యమని పోలీసులు ప్రజలను హింసించడం మానుకోవాలి, నక్సలైట్ రాజకీయాలను అభిమానించడం, ఆదరించడం నేరమన్నట్టు వ్యవహరించడం మానుకోవాలి, ఎవరు ఏ హక్కుల గురించి మాట్లాడినా ఉద్యమించినా నక్సలైట్లతో సంబంధాలు అంటగట్టి సతాయించడం మానుకోవాలి. అటువైపు నక్సలైట్లు ప్రజల రాజకీయ స్వేచ్ఛను గౌరవించాలి, ప్రభుత్వ విధానాలకు ప్రతీకారంగా కిందిస్థాయి పాలక పార్టీ ప్రతినిధులపైన, ఉద్యోగుల పైన దాడులు చేయడం మానుకోవాలి, ప్రజావసరాలతో ముడిపడి ఉన్న ప్రభుత్వ ఆస్తుల విధ్వంసం మానుకోవాలి.

ఇవీ ఇటువంటివీ చర్చల అజెండాలోని అంశాలు కాగలవు. ఇటువంటి అజెండాను రూపొందించుకొని, చర్చలు ముగిసేదాకా ఇరుపక్షాలూ కాల్పుల విరమణ పాటించడానికి

ఒప్పుకొని, చర్చలకు వచ్చే పీపుల్స్‌వార్ ప్రతినిధులకు ప్రభుత్వం 'సేఫ్ పాసేజ్' ఇచ్చేటట్టయితే చర్చలు జరగగలవు.

ఇదెందుకు సాధ్యంకాలేదు? 'విధి విధానాల' చర్చలోనే ఇవన్నీ జరిగిపోవలసింది. కానీ జరగలేదు. 'సేఫ్ పాసేజ్' ఇస్తామని ప్రభుత్వం ఒప్పుకునింది గానీ కాల్పుల విరమణకు ఒప్పుకోలేదు. అజెండా అసలే నిర్ణయం కాలేదు. అజెండా విషయంలో ఒక నిర్ణయానికి రాలేకపోవడానికి ఇద్దరినీ తప్పుపట్ట వచ్చునేమో గానీ, కాల్పుల విరమణకు ఒప్పుకోకపోవడం ప్రభుత్వ వైఖరిలోని ప్రధాన లోపం. ఒకపక్క ప్రతిరోజూ ఎదుటివారు తమ సహచరులను చంపుతుంటే, వారితో కూర్చొని మర్యాదపూర్వకంగా మాట్లాడడం వారికైనా వీరికైనా సాధ్యం కాదుకదా? తమకైనా సాధ్యమవుతుందని తెలుగుదేశం పాలకులు అనుకుంటున్నారా?

రాజకీయంగా ఆలోచిస్తే ఈ ప్రశ్నకు కాదు, లేదనే జవాబు రాగలదు. కానీ ఇక్కడ 'పోలీసు దృష్టి' ప్రధానంగా పనిచేసిందనేది స్పష్టమే. పోలీసులు పెట్టిన ఒత్తిడి వల్ల ఇది జరిగిందా, లేక రాజకీయ పాలకులే 'పోలీసు దృష్టి'తో చూస్తున్నారా అనేది ఇక్కడ అప్రస్తుతం. ఆ దృష్టితో చర్చల ప్రక్రియను చూడడం తప్పని మాత్రం నిర్ద్వంద్వంగా ప్రకటించాలి.

చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయిననాటి నుండి నక్సలైట్ ఉద్యమంపైన పోలీసుల ఇనపబూట్ల అణచివేత చాలా పెరిగింది. సంవత్సరానికి 200 మందికి పైగా ఎన్‌కౌంటర్లలో చనిపోతున్నారు. అంటే ప్రతీ మూడు రోజులకూ ఇద్దరని అర్థం. దీనివల్ల నక్సలైట్ ఉద్యమాన్ని బాగా వెనక్కి నెట్టగలిగామనీ, ఇప్పుడు రెండు నెలలో మూడు నెలలో చర్చల పేరిట విరమణ ఇచ్చినట్టయితే నక్సలైట్లు మళ్లీ 'విజృంభిస్తారనీ' పోలీసు దృష్టి భావిస్తుంది. అది పోలీసు దృష్టికి అపచారంగా తోచవచ్చునుగానీ, రాజకీయంగా చూసినప్పుడు అందులో అవాంఛనీయం ఏముంది? చర్చల ఫలితంగా కానివ్వండి, చర్చల విషయంలో వచ్చిన ప్రజాభిప్రాయపు ఒత్తిడి ఫలితంగా కానివ్వండి, నక్సలైట్ పార్టీలు నిర్విచక్షణమైన హింసను అదుపు చేసుకునేటట్టయితే, వాళ్లు రాజకీయంగా 'విజృంభించడం' అవాంఛనీయం ఎందుకు కావాలి? తెలుగుదేశం దృష్టికి కావచ్చునుగానీ ప్రజాస్వామిక దృష్టికి కాదు.

దురదృష్టమేమిటంటే, ముప్పై ఏళ్లుగా మన రాష్ట్రంలో నక్సలైట్ ఉద్యమం విషయంలో పోలీసుల అణచివేత వ్యూహమే ప్రభుత్వం పాలనా వ్యూహంగా ఉంది. దీనివల్ల ఇప్పటికే ప్రజలకు – అందులో అట్టడుగు వర్గాల ప్రజలకు – చాలా నష్టం జరిగింది. పౌర స్పందన వేదిక చొరవ ఫలితంగానైనా ఈ దుస్థితి పోయి ప్రభుత్వం ఒక అర్థవంతమైన పాలనా వ్యూహాన్ని అనుసరిస్తుందేమోనని ఆశిస్తే అది జరగలేదు. తిరిగి పోలీసుల అణచివేత వ్యూహం నిర్దేశించే ప్రమాణాలే ప్రభుత్వానికి ప్రామాణికం అయ్యాయి. అందుకే జరిగినదంతా మరచి పోయి, 'ఆయుధాలు పట్టుకొని చర్చలంటే ఎట్లా?' అని ముఖ్యమంత్రి అనగలిగాడు. ఆయన ఆ మాట అనేదాకా పోలీసులు పూటకిద్దరిని హతమార్చి ఒత్తిడి పెట్టారు.

'పోలీసు దృష్టి' మరొకసారి గెలిచింది. కానీ ఓడిపోయింది నక్సలైట్లు కాదు; ప్రజలు, ప్రజావసరాలు. అందుకే పౌరస్పందన వేదిక మొదలుపెట్టిన ప్రయత్నం విఫలం కావడానికి వీలులేదంటున్నాము. చర్చల ప్రక్రియ అర్థవంతంగా తిరిగి మొదలు పెట్టవలసిందిగా ప్రభుత్వం పైన ఒత్తిడి పెట్టాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాము.

7.8.2002



కరపత్రం

# ఎలికె రాజేంద్రప్రసాద్ అరెస్టును ఖండించండి

మానవహక్కుల వేదిక పశ్చిమ గోదావరి జిల్లా శాఖ కన్వీనర్ ఎలికె రాజేంద్రప్రసాద్‌ను నకిలీ నక్సలైట్ ముఠా నాయకుడు అని వర్ణిస్తూ ఆ జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ కృపానంద్ త్రిపాఠి ఉజేలా పత్రికా విలేకరుల సమావేశంలో ప్రకటించిన సంగతి అన్ని దినపత్రికలూ అన్ని ఎడిషన్లలోనూ ప్రచురించాయి కాబట్టి రాష్ట్రమంతా ఎరుగును.

దీనికి బదులుగా ఉజేలాగారిని చట్ట వ్యతిరేక ఖాకీ హంతక ముఠానాయకుడు అని మేము నిందించవచ్చును. మాకు ఆ మాత్రం మాటలు చేతకాక కాదు, సాహసం లేక కాదు. కానీ వారి స్థాయికి దిగజారడం మాకు ఇష్టంలేదు. రాజేంద్రప్రసాద్‌పైన పోలీసులు పెట్టిన తప్పుడు కేసులకు సంబంధించిన అసలు వాస్తవాలు ఏమిటో వివరిస్తూ మేము పత్రికలకు ప్రకటనలు ఇచ్చాము.

అక్టోబర్ 29న ఎస్.పి. ఉజేలాగారు ఏలూరులో నిర్వహించిన విలేకరుల సమావేశాన్ని రాష్ట్రవ్యాపితంగా ప్రచారం చేసిన దినపత్రికలు, 30వ తేదీన మేము హైదరాబాద్‌లో విడుదల చేసిన ప్రకటనను హైదరాబాద్ ఎడిషన్‌కే పరిమితం చేసి ప్రచురించాయి. ఒకటి రెండు పత్రికలు అసలే ప్రచురించలేదు. ఆ తరువాత మేము నవంబర్ 3వ తేదీన చింతలపూడిలో నిర్వహించిన విలేకరుల సమావేశం వార్తను పత్రికలన్నీ ఆ జిల్లాకే పరిమితం చేశాయి.

అధికారంలో ఉన్నవారు ఒక పౌరుని వ్యక్తిత్వాన్ని భ్రష్టుపట్టించే నింద వేస్తే దానిని పత్రికలు వెనువెంటనే లక్షలాది పాఠకులకు అందజేస్తాయి. ఆ వ్యక్తి లేక అతని సంస్థ దానికి జవాబు చెప్పాలంటే ఒక్కొక్క జిల్లాలోనూ ఒక్కొక్కసారి గొంతు చించుకోవాలి. అప్పటికీ అంతే ప్రముఖంగా వారి గొంతును పత్రికలు ప్రజలకు వినిపింప జేస్తాయన్న భరోసా లేదు. ఇది ఏరకమైన న్యాయమో దినపత్రికల సంపాదకులు ఆలోచిస్తారని ఆశిస్తూ, మాకున్న ఒకే ఒక ప్రత్యామ్నాయం అయిన ఈ కరపత్రాన్ని మీ ముందు ఉంచుతున్నాం. నిజమే, దినపత్రికలకు లక్షల పాఠకులు ఉంటారు. మేము 10 వేల కరపత్రాలు వేయగలిగితే అదే మా స్తోమతకు ఎక్కువ. అయినప్పటికీ మౌనంగా నిందను భరించడం కంటె ఇది ఉచితం అనుకుంటున్నాము.

ఎలికె రాజేంద్రప్రసాద్ నకిలీ నక్సలైట్ ముఠానాయకుడు కాదు, మరే ముఠానాయకుడూ కాదు. అతను న్యాయవాది, విద్యార్థి దశనుంచి అభ్యుదయ రాజకీయాలలో చురుగ్గా పనిచేసిన ప్రజాస్వామికవాది. అతను నివసించేది, న్యాయవాద వృత్తి నిర్వహించేది, మానవహక్కుల వేదిక జిల్లా శాఖ కన్వీనర్‌గా పశ్చిమ గోదావరి జిల్లాలో మా సంస్థ కార్యకలాపాలను నడిపేది చింతలపూడిలో. చింతలపూడి పశ్చిమ గోదావరి జిల్లా మెట్ట ప్రాంతంలోని ఒక మారుమూల నియోజకవర్గం. దానిని ఆనుకొని ఖమ్మం జిల్లాలోని మారుమూల నియోజకవర్గమైన

సత్తుపల్లి ఉంది. ఈ రెండు నియోజకవర్గాలూ ఆదివాసులు పెద్ద సంఖ్యలో నివసించే వెనుకబడిన ప్రాంతాలు. అయితే ఈ రెండు నియోజకవర్గాల ఎమ్మెల్యేలు రాష్ట్ర ప్రభుత్వంలో చాలా ప్రాబల్యం ఉన్న మంత్రులు. వారినీ, వారి అనుచర గణాన్నీ, వారి అడుగులకు మడుగులొత్తే అధికార గణాన్నీ ఎదిరించే సాహసం అక్కడ ఎవరూ చేయరు.

అందుకు మినహాయింపుగా ఉండడం ఎలికె రాజేంద్రప్రసాద్ చేసిన ఏకైక నేరం. నీతిమాలిన అధికార యంత్రాంగం దీనికి ప్రతీకారంగా రాజేంద్రప్రసాద్ పైన అతి నీచమైన అభియోగం మోపి పత్రికలకెక్కి రాష్ట్రమంతటా దానిని ప్రచారం చేసింది.

రాజేంద్రప్రసాద్‌ను 28 అక్టోబర్ అర్ధరాత్రి అరెస్టు చేయడానికి దారితీసిన ఘటనలు చూస్తే ఈ విషయం స్పష్టం అవుతుంది. చింతలపూడి సమీపంలోని టి.నర్సాపూర్ మండలం అల్లంచెర్ల గ్రామానికి చెందిన మరుగుదొడ్ల సావిత్రి అనే దళిత స్త్రీ, తనను కొందరు వ్యక్తులు వేధిస్తున్నారని టి.నర్సాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదుపైన టి.నర్సాపూర్ ఎస్.ఐ. ఎటువంటి చర్య తీసుకోకపోయేసరికి ఆమె రాజేంద్రప్రసాద్‌ను కలిసి సహాయం కోరింది. అతని సలహామేరకు ప్రతీ శనివారం చింతలపూడి మేజిస్ట్రేటు నిర్వహించే లోక్ అదాలత్‌లో ఫిర్యాదు చేసింది.

ఇది జరిగి కొంతకాలం అయింది. చింతలపూడి కోర్టు నుంచి తాఖీదు ఏమైనా అందిందేమో, టి.నర్సాపూర్ ఎస్.ఐ. సావిత్రిని అక్టోబర్ 26 నాడు (శనివారం) స్టేషన్‌కు రమ్మన్నాడు. తనపైన కోర్టులో ఫిర్యాదు చేసినందుకు కక్షకొద్దీ ఆమెను విపరీతంగా దూషిం చాడు, కొట్టాడు. ఈ సంగతి ఆమె మళ్లీ ఎలికె రాజేంద్రప్రసాద్‌కు చెప్పగా, అతను ఆమెచేత పత్రికల వారితో మాట్లాడించి, మళ్లీ చింతలపూడి మేజిస్ట్రేటుకు ఫిర్యాదు ఇప్పించాడు. ఇది జరిగింది అక్టోబర్ 28 సాయంత్రం. ఈ సందర్భంగా 'ఈనాడు' దినపత్రికలో వచ్చిన వార్తను దిగువ యథాతథంగా ఇస్తున్నాం.

## మహిళలను అర్ధనగ్నంగా నిలబెట్టిన ఎస్.ఐ.

చింతలపూడి, అక్టోబర్ 28 (న్యూస్‌టుడే): రక్షణ కోరుతూ పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన ఒక దళిత మహిళకు తీరని పరాభవం ఎదురయిన సంఘటన టి.నర్సాపూర్ పోలీస్‌స్టేషన్‌లో జరిగింది. రక్షణ కల్పిం చాల్సిన ఎస్.ఐ. తనపట్ల అసభ్యంగా ప్రవర్తించడమే కాక తనను అర్ధనగ్నంగా స్టేషన్‌లో నిలబెట్టారంటూ ఆ మహిళ రోదిస్తోంది. న్యాయవాది, మానవహక్కుల వేదిక జిల్లా కన్వీనర్ ఎలికె రాజేంద్రప్రసాద్ సహాయంతో సోమవారం సాయంత్రం పశ్చిమ గోదావరి జిల్లా చింతలపూడి కోర్టులో ఆమె ఫిర్యాదు దాఖలు చేసింది. గంగాధరరావు, దావీదు అనే ఇద్దరు వ్యక్తులు తనను కొంతకాలంగా వేధిస్తున్నట్టు గతంలో తాను చేసిన ఫిర్యాదును పోలీసులు పట్టించుకోలేదనీ, పైగా వారి ప్రోద్బలంతో టి.నర్సాపూర్ ఎస్.ఐ. తాతారావు శనివారం ఉదయం పది గంటలకు తనను స్టేషన్‌కు పిలిపించి అసభ్యంగా ప్రవర్తించారని పేర్కొన్నారు. పోలీస్‌స్టేషన్‌లో ఆరోజు సాయంత్రం వరకు తనను అర్ధనగ్నంగా నిలబెట్టి అవహేళన చేశారని ఆమె ఆరోపించారు. టి.నర్సాపురం అల్లంచెర్ల కొత్తగూడెంకు చెందిన బాధితురాలు ఎస్.ఐ.



తాతా రావుతో పాటు చొప్పా గంగాధరరావు అనే ఆర్ఎంపి డాక్టర్‌ను, తారంకి దావీదు అనే మరో వ్యక్తిని తన ఫిర్యాదులో ముద్దాయిలుగా పేర్కొంది. తనను కులం పేరుతో దూషించి తీవ్రంగా కొట్టడంతో ఒళ్లంతా కమిలిపోయిందని రోదిస్తూ శరీరం పైన ఉన్న గాయాలను కోర్టులో చూపించింది. నిందితుల నుంచి, ఎస్.ఐ. నుంచి తనకు రక్షణ కల్పించి న్యాయం చేయవలసిందిగా మేజిస్ట్రేట్‌ను అభ్యర్థించింది. దీనిపై మేజిస్ట్రేట్ ఎన్.రాజ్‌కుమార్ స్పందించి వెంటనే ఆమెను ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించా ల్సిందిగా పోలీసులను ఆదేశించారు.

అక్టోబర్ 28 సాయంత్రం 4.00 గంటలకు, 4.30 గంటలకు రాజేంద్రప్రసాద్ పైన టి.నర్సాపూర్, చింతలపూడి పోలీస్‌స్టేషన్లలో రెండు కేసులు బుక్ అయ్యాయి. అంటే సావిత్రి తనపైన జరిగిన దౌర్జన్యాన్ని గురించి రాజేంద్రప్రసాద్‌కు చెప్పిందనీ, అతను ఆమెకు ఫిర్యాదు రాసిచ్చి మేజిస్ట్రేటు దగ్గరకు పంపుతున్నాడనీ తెలిసి ఈ రెండు కేసులూ అతనిపైన పోలీసులు బుక్ చేశారు. ఇవి కక్షసాధింపు కోసం కల్పించిన కేసులని వాటిని నమోదుచేసిన సందర్భమే చెప్తుంది.



ఒకటి ఎప్పుడో అస్పష్టమైన గతంలో రాజేంద్రప్రసాద్ తాను నక్సలైటునని చెప్పి బెదిరించి ఒకరి దగ్గర 15,000 రూపాయలు వసూలు చేసుకున్నాడన్న అభియోగంతో నమోదయిన కేసు. రెండవది, 'సుమారు 20 రోజుల క్రితం' నక్సలైటునని చెప్పి, నీ భూమిలోకి గిరిజనులను దింపుతానని చెప్పి, ఒక గిరిజనేతర రైతు దగ్గర రాజేంద్రప్రసాద్ 20,000 రూపాయలు బలవంతంగా వసూలు చేసుకున్నాడన్న అభియోగంతో నమోదయిన కేసు. స్పష్టమైన తేదీ కూడ తెలీని పాత ఘటనలపైన ఆ సాయంత్రమే ఫిర్యాదు ఇవ్వాలని ఆ 'బాధితు'లిద్దరికీ ఎందుకు అనిపిస్తుందన్న అనుమానం ఎవరికైనా రావాలి.

దళిత స్త్రీ సావిత్రిని టి.నర్సాపూర్ ఎస్.ఐ. కొట్టి, అవమానపరచిన వైనాన్ని కోర్టు దృష్టికి తీసుకుపోయిన పాపానికి రాజేంద్రప్రసాద్‌పైన ఈ తప్పుడు కేసులు నమోదుచేసిన చింతలపూడి, టి.నర్సాపూర్ ఎస్.ఐ.లు 28 అర్ధరాత్రి చింతలపూడి సి.ఐ.తో కలిసి రాజేంద్రప్రసాద్ ఇంటిపైన దాడిచేశారు. తలుపులు విరగ్గొట్టి అయినా సరే అతనిని పట్టుకుపోతామంటూ నానా హంగామా చేశారు. రోజూ కోర్టులో ప్రాక్టీస్ చేసే అడ్వకేట్‌ను అర్ధరాత్రి అరెస్టు చేయవలసిన అవస రం ఏముందంటే 'మాకు పైనుంచి ఆదేశాలున్నాయి' అంటాడు చింతలపూడి ఎస్.ఐ. 'అరెస్టు చేయడానికి వారంట్ ఉందా?' అని అడిగితే ఇది సినిమా కాదు అని జవాబు చెప్తాడు. అరెస్టు చేయడానికి వారంట్ ఉండి తీరాలన్నది సిని మాల వల్ల వ్యాపించిన అభిప్రాయమే కావచ్చును గానీ, పోలీసులాడిన అర్ధరాత్రి డ్రామా ప్రజలకు సినిమాను తలపింపజేస్తే ఆ తప్పెవరిది?

ఈ విధంగా వీరోచితంగా అరెస్టుచేసిన ఎలికె రాజేంద్రప్రసాద్‌ను అప్పటికో వారంపైగా పోలీసుల కస్టడీలో ఉన్న మరొక 12 మంది యువకులతో కలిపి వాళ్లంతా డబ్బులు దండుకునే నకిలీ నక్సలైట్లు అనీ, రాజేంద్రప్రసాద్ వారి నాయకుడనీ కథ అల్లి జిల్లా ఎస్.పి. కృపానంద్

త్రిపాఠి ఉజేలా 29నాడు పత్రికా విలేకరుల సమావేశం నిర్వహించి ప్రకటించాడు.

రాజేంద్రప్రసాద్ నకిలీ నక్సలైట్ ముఠా నాయకుడనడం ఎంత అబద్ధమో, ఆ 12 మందీ నకిలీ నక్సలైట్లనడమూ అంతే అబద్ధం. వాళ్లలో నలుగురు మాత్రమే ఆ బిరుదుకు అర్హులు. మిగిలిన వాళ్లలో రైతుకూలీ సంఘం కార్యకర్తలు, ప్రజాపార్టీ కార్యకర్తలు, న్యూ డెమోక్రసీ కార్యకర్తలు ఉన్నారు. వీళ్లంతా అప్పటికే కొన్ని రోజులుగా పోలీసుల అదుపులో ఉన్నారు. వారిని కోర్టులో హాజరుపరచాలని ఆయా సంస్థలు డిమాండ్ చేసి ఉన్నాయి. మానవహక్కుల వేదిక ప్రతినిధిగా రాజేంద్రప్రసాద్ కూడా వారిని కోర్టులో హాజరుపెట్టాలని ప్రకటన ఇచ్చి ఉన్నాడు. జిల్లా పౌరహక్కుల సంఘం బాధ్యులు కూడా ప్రకటనలు ఇచ్చి ఉన్నారు.

వీరందరినీ నకిలీ నక్సలైట్లు అనీ, రాజేంద్రప్రసాద్‌ను వాళ్ల నాయకుడనీ అనడం వల్ల వారిపట్ల ప్రజలలో సానుభూతి లేకుండ చేయడం ఎస్.పి. ఉజేలాగారి దిక్కుమాలిన తెలివితేటలనుకోవాలి. బహుశా తాను చాలా గొప్పపని చేశానని ఆయన అనుకుంటూ ఉండాలి. పత్రికలు ఆయన ప్రకటనను రాష్ట్రమంతటా ప్రచారం చేయడమేకాక దానికి 'ఫాలోఅప్'గా 'రాజమండ్రి జైలుకు నకిలీ నక్సలైట్లు' అని ఒకరోజు, 'నకిలీ నక్సలైట్ల ఆటకట్టు' అని రెండవ రోజు వార్తలు ప్రచురించాయి. అరెస్టయిన వ్యక్తులు ఎవరు, వారి పూర్వాపరాలు ఏమిటి అని ఆ మాత్రం తెలుసుకోని సొంత గొంతుతో రాయడం పత్రికలకు సాధ్యం కాదనుకోవాలా? ఒక అధికారి ఒక కల్పన చేయగానే ఆ కల్పన చుట్టూ వార్తలు అల్లడమే పత్రికల కర్తవ్యమా? పత్రికా రంగం కొంచెం ఆత్మపరీక్ష చేసుకుంటుందని ఆశిస్తాం.

మా మాటకొస్తే తప్పుడు కేసులూ, తప్పుడు అభియోగాలూ హక్కుల ఉద్యమానికి కొత్త కాదు. ఒకప్పుడు నక్సలైట్ అన్న ముద్రవేసి అణచాలని చూశారు. ఇప్పుడు నకిలీ అన్న విశేషణం తగిలించి భ్రష్టుపట్టించేశానని కృపానంద్ త్రిపాఠి ఉజేలాగారు సంతోషిస్తుండవచ్చు. అయితే ఈ ప్రయత్నాల వల్ల చట్టాన్నీ, అధికారాన్నీ దుర్వినియోగం చేసే వ్యక్తులుగా ఆయనవంటి అధికారులు భ్రష్టుపట్టారే తప్ప, మమ్మల్ని భ్రష్టుపట్టించడం వారి తరం కాదు. తాత్కాలికంగా ఒక దురభిప్రాయం కలిగించినా మా ఆచరణే మా వ్యక్తిత్వం ఏమిటో ప్రజలకు రుజువు చేసి చూపిస్తుంది.

8.11.2002



# కృష్ణా జలాల ట్రిబ్యునల్‌పైన చర్చకు రండి

కరపత్రం

**కృ**ష్ణా నదీ జలాల వినియోగంపైన కొత్త ట్రిబ్యునల్ రానుంది. కృష్ణా నదీ పరీవాహక రాష్ట్రాలయిన ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్రలు తమ డిమాండ్లు, ఫిర్యాదులు ఆ ట్రిబ్యునల్ ముందు ఉంచి పరిష్కారం కోరబోతాయి. ట్రిబ్యునల్ ఇవ్వబోయే అవార్డు ఇంకొక ముప్పై ఏళ్లో నలభై ఏళ్లో అమ లులో ఉండబోతుంది.

కృష్ణానదీ జలాలు తప్ప వేరే గత్యంతరం లేని కరువు జిల్లాలు మన రాష్ట్రంలో మెండుగా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కొత్తగా రాబోయే కృష్ణా జలాల ట్రిబ్యునల్ ముందు ఏ వైఖరి అవలంబించబోతుందనేది ఆ ప్రజలందరి సమస్య. ప్రభుత్వం సంప్రదించిన ఒక్కొక్క పార్టీ ఒక్కొక్క అభిప్రాయం చెప్పడమే కాక, కృష్ణానదీ జలాల సమస్యను అధ్యయనం చేసిన మేధావులు కూడా రకరకాల అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ అభిప్రాయాలన్నిటినీ విని, చర్చించడం కోసం ఈ సెమినార్ నిర్వహిస్తున్నాం.

రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం ఇప్పటికే తుది రూపం తీసుకుంది. కాబట్టి దాని గురించి నాలుగు మాటలు చెప్పి, మా ప్రతిపాదన వివరించి మిమ్మల్ని సెమినార్‌కు ఆహ్వానిస్తాము.

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలలో ఒకటి సమంజసమయినదే. మూడు రాష్ట్రాల మధ్య నదీ జలాల పంపకం అంటూ జరిగిన తరువాత, దాని అమలు గురించి నిత్యం ఒకరినొకరు తిట్టుకుంటూ జనాన్ని రెచ్చగొట్టుకుంటూ సంకుచిత ప్రయోజనాలు పొందజూసే బదులు దాని పర్యవేక్షణకు నిష్పాక్షికమైన వ్యవస్థను నెలకొల్పడం ఉచితంగా ఉంటుంది. అది రివర్ వ్యాలీ అథారిటీ రూపంలో నయినా ఉండవచ్చు, వేరే ఏ ఉచితమైన రూపంలోనయినా ఉండవచ్చు.

మిగిలిన ప్రతిపాదనలు కర్ణాటక, మహారాష్ట్రలు కృష్ణానదీ జలాలలో తమ వాటాను మించి వినియోగించుకోకుండా ఉండగలందుకు ఆంక్షలు పెట్టే ప్రతిపాదనలు. ఒక్కొక్క రిజర్వాయర్ నుంచి పారించుకోవడానికి అనుమతి గల నీటిలో 2/3వ వంతు కంటె ఎక్కువ రిజర్వాయర్‌లో నిలువ ఉంచుకోకూడదనీ, ఒక సబ్ బేసిన్ నుంచి మరొక సబ్ బేసిన్‌కు నీటి కేటాయింపును బదలాయింపు చేసుకోకూడదనీ మన ప్రభుత్వం ప్రతిపాదిస్తున్నది.

ఒక రిజర్వాయర్‌లో ఎంత నీరు నిలువ ఉంచుకుంటే ఎంత నీరు పారించుకోవచ్చుననే దానికి సార్వత్రికమైన ప్రమాణమేదీ లేదు. గంగానది లాగా నిత్యం ప్రవహించే నది అయితే అతి చిన్న రిజర్వాయర్‌తోనయినా పుష్కలంగా నీరు పారించుకోవచ్చు. వర్షాభావ ప్రాంతంలో ప్రవహించే నది అయితే ఎక్కువ ఉంచుకోవలసి ఉంటుంది. 2/3 అనే నిష్పత్తి సార్వత్రికంగా సరిపోతుందని మన ప్రభుత్వానికి ఎవరు చెప్పారు? ఎక్కువ నిలువ ఉంచుకొని వారి వాటా కంటె ఎక్కువ వాడుకుంటు న్నారన్న అనుమానం ఉంటే రివర్ వ్యాలీ అథారిటీ వంటి పర్యవేక్షక యంత్రాంగం దానికి పరిష్కారం కాగలదు గానీ ఇటువంటి అహేతుకమైన

పరిమితులు కాదు. ఇక ఒక సబ్ బేసిన్‌లోని ప్రాజెక్టులకు కేటాయించిన నీటిని మరొక సబ్ బేసిన్‌లోని ప్రాజెక్టులకు బదలాయించకూడదన్న నియమం – మాకు అర్థమయినంతవరకు – దుర్మార్గమైన ఆలోచన. కృష్ణా నది నీటిలో కోస్తా జిల్లాలు వాడుకుం టున్న దానిలో గణనీయమైన భాగాన్ని నది ఎగువన ఉన్న దక్షిణ తెలంగాణ, రాయలసీమ జిల్లాలకు బదలాయించనిదే ఆ జిల్లాల కరువు సమస్య తీరదనేది అందరూ ఎరిగిన సత్యం (ఎరిగినట్టు బయ టకు ఒప్పుకున్నా, ఒప్పుకోకున్నా).

ఇంకొక ప్రతిపాదన అతి తెలివి ప్రతిపాదన. కర్ణాటక, మహారాష్ట్రలు బచావత్ అవార్డు గడువు ముగిసేనాటికి (అంటే 2000 సంవత్సరం మే నెల 31 నాటికి) వారి వాటాలో ఎంత వాడుకొని ఉంటే అంతే వారి హక్కని ప్రకటించి, ఆ పైన మిగిలివున్న నీటిని మళ్ళీ మూడు రాష్ట్రాలకూ పంచాలని మన వాళ్ళు అంటున్నారు. అంటే నీకిచ్చింది నువ్వు వాడుకోకపోతే అది నాకు చెందుతుందని దబాయింపు. మనందరి తరపున మన ప్రభుత్వం ఈ మాటలు మాట్లాడుతున్నందుకు మనమంతా సిగ్గుపడాలి.

ఇంకొక అతి తెలివి ప్రతిపాదన కూడా మన ప్రభుత్వం పెడుతున్నది. ఒకవైపు మిగులు జలాలపైన పూర్తి హక్కు (ప్రాజెక్టులు కట్టుకునే హక్కుతో సహా) మనకే ఉండాలని అడుగుతూ, అదే సమయంలో ఎగువన ఉన్న కర్ణాటక, మహారాష్ట్రలు తమ హక్కు మేరకు నీళ్ళు నింపుకున్నాకనే మనకు నీళ్ళు వదిలే పద్ధతి విడిచిపెట్టి వచ్చిన నీళ్ళలో మన వాటాను వచ్చింది వచ్చినట్టు కిందికి రానివ్వా లంటున్నారు. ఇవి రెండూ ఏక సమయంలో సాధ్యమా? పై వాళ్ళు తమ కోటా మేరకు పూర్తిగా నింపుకున్నాకనే కిందికి నీళ్ళు వదిలేటట్టయితే, అందరి కేటాయింపులనూ మించి ప్రవహించే నీరే దయినా ఉంటే దానిని కింది రాష్ట్రం వాడుకోవడం ఉచితంగా ఉంటుందనీ, ఎప్పటికప్పుడు నదిలోకి వచ్చిన నీటిని కింది వాళ్ళ వాటా మేరకు కిందికి విడిచిపెట్టేటట్టయితే, అందరి కేటాయింపులనూ మించి ప్రవహించే నీటి మీద అందరికీ వాడకపు హక్కు ఇవ్వడం ఉచితంగా ఉంటుందనీ జస్టిస్ బచా వత్ భావించారు. ఈ తర్కంలో తప్పేమీ లేదు. రెండు స్కీములలోని అనుకూల అంశాలను కలిపి కొత్త స్కీము తయారుచేసి ప్రతిపాదించడం ప్రజలను మభ్యపెట్టడానికే తప్ప ఇంక దేనికీ పనికిరాదు.

అయితే మన ప్రభుత్వం ప్రతిపాదన 'ఫ్రేంవర్క్'లోనే లోపం ఉంది. 'ముందు కర్ణాటకతో ఐక్యంగా కొట్లాడుదాం, ఆ తరువాత మన అంతర్గత విభేదాలు పరిష్కరించుకుందాం' అని మన ప్రభుత్వం అంటున్నది. కానీ టిఆర్ఎస్ వారు అన్నట్టు, రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల ప్రజలకూ కర్ణాటకతో ఒకేరకమైన విభేదం ఉందని ఎందుకనుకోవాలి?

అంతేకాక, అంతర్గత విభేదాల పరిష్కారాన్ని గురించి ఒక నిర్ణయం తీసుకున్నాకనే ట్రిబ్యునల్ ముందు ఏ ప్రతిపాదన పెట్టాలో నిర్ణయించుకోగలము. ముందు ట్రిబ్యునల్‌కు పోయి కర్ణాటకను కట్టుదిట్టం చేసి మిగులు జలాలపైన కూడా హక్కు పొందుదాం, ఆ తరు వాత మనం మన విభేదాలు పరిష్కరించుకుందాం అంటే పరిష్కరించుకోవడానికీ ఎంచుకోవ డానికీ మిగులు జలాలు మాత్రమే ఉంటాయి. దక్షిణ తెలంగాణ, రాయలసీమ జిల్లాల ముఖాన ఆ మిగులు జలాలు కొట్టి, 'తన్నుకు చావండి' అనబోతారు. ఈ మధ్య కాలంలో ఈ రెండు ప్రాంతాల నాయకులు చేస్తున్న ప్రకటనలు చూస్తే తన్నుకు చావడం తథ్యం అని అర్థం అవుతుంది.



దక్షిణ తెలంగాణ, రాయలసీమ జిల్లాలకు కృష్ణానది నీటికి సంబంధించి అనేక హామీలు దశాబ్దాలుగా ఇస్తున్నారు. 1953లో ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటుకూ, 1956లో ఆంధ్రప్రదేశ్ ఏర్పాటుకూ శ్రీబాగ్ ఒప్పందంలోనూ, పెద్దమనుషుల ఒడంబడికలోనూ ఉన్న ఈ హామీయే ప్రాతిపదిక. యాభై ఏళ్ళుగా ఈ హామీలు పునాదిరాళ్ళయ్యాయి, పైలాన్‌లు అయ్యాయి. అంతే తప్ప అవి ప్రాజెక్టులు కాలేదు.

ఇవి వర్షాభావ ప్రాంతాలు కాబట్టి, వీటికి అందరి హక్కులూ పోను మిగిలిన జలాలు కాక కచ్చితమైన నికర జలాలు కేటాయించాలి. అది జరగాలంటే సర్కార్ జిల్లాలు కృష్ణా జలాలలో వాడుకుంటున్న వాటాను గణనీయంగా తగ్గించి శ్రీశైలంలోనూ, దానికి ఎగువన మహబూబ్‌నగర్ భూభాగంలోనూ నిలుపుకోవాలి (టిఆర్ఎస్ వారు సూచించినట్టు ఆల్మట్టిలోనూ కొంత భాగం నిలుపుకొని మహబూబ్‌నగర్‌కు పారించుకోవచ్చు).

దశాబ్దాలుగా హామీలిచ్చిన ఈ ప్రాజెక్టులకు నెలవయిన నల్లగొండ, మహబూబ్‌నగర్, కర్నూలు, అనంతపురం, కడప జిల్లాల ప్రతినిధులతో 2002 సంవత్సరం జనవరి 21న గద్వాల పట్టణంలో జరిగిన ఒక సెమినార్‌లో, ఈ అవగాహనతో కృషి చేయడానికి కృష్ణానదీ జలాల పునఃపంపిణీ ఉద్యమం ఏర్పడింది. హామీ ఇచ్చిన అన్ని ప్రాజెక్టులకూ ముందు నికర జలాలు పునఃపంపిణీ చేసి ఆ పైన ట్రిబ్యునల్ ఎదుట మన రాష్ట్రం వైఖరిని నిర్ణయించుకోవాలనీ, దానికోసం హామీ ఇచ్చిన ప్రాజెక్టుల కోసం ఆందోళన చేస్తున్న ఉద్యమకారులను సంప్రదించాలనీ ప్రభుత్వానికి సూచిస్తూ ఒక లేఖ రాశాము.

మాకొక అభిప్రాయం ఉన్నట్టే అన్ని పార్టీలకూ, అందరు నిపుణులకూ తలా ఒక అభిప్రాయం ఉంది. ఈ అభిప్రాయాల మధ్య చర్చ, సంవాదం జరగడం అవసరం అని మేము భావిస్తున్నాం. అందుకోసం నిర్వహిస్తున్న సెమినార్‌కు అందరూ హాజరై న్యాయమైన నీటి హక్కు సాధనకు తోడ్పడతారని ఆశిస్తున్నాం.

**17.11.2002** **–కృష్ణా నదీజలాల పునఃపంపిణీ ఉద్యమం**

*Movement for Redistribution of Krishna River Waters*

# ఆదివాసులను అడవి నుంచి వెళ్ళగొట్టడాన్ని వ్యతిరేకిద్దాం

**అ**టవీ సంరక్షణ పేరుమీద ప్రభుత్వం ఏకపక్షంగా అడవులపైన తన అధికారాన్ని ప్రకటించుకోవడానికి వీలులేదని అడవులలో అనాదిగా నివసిస్తున్న ప్రజల హక్కులను గౌరవించే పద్ధతిలో వ్యవహరించాలని గట్టిగా మనందరం అనాల్సిన సమయం వచ్చింది.

కొన్ని వేల సంవత్సరాలుగా అడవులలో నివసిస్తున్న ఆదివాసులు నేడు అటవీ దురాక్రమణ దారులుగా, నేరస్తులుగా పరిగణించబడుతున్నారు. ప్రభుత్వ యంత్రాంగమే ఆ విధంగా ముద్రవేసి వారికి వ్యతిరేకంగా చర్యలు మొదలుపెట్టింది. ఆదివాసుల పంటలను నాశనం చేసి, ఇళ్ళు కూలగొట్టి, తగులబెట్టే ప్రక్రియ కొన్నిచోట్ల అప్పుడే మొదలైంది. ఇదంతా అటవీ భూముల క్రమబద్ధీకరణకు సంబంధించి నవంబరు 23, 2001 నాడు సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వు పేరుతో జరుగుతున్నది. ఈ ఉత్తర్వును ఆధారంగా చేసుకొని కేంద్ర పర్యావరణ అటవీ మంత్రిత్వ శాఖ ఆదివాసులను అడవుల నుంచి తరిమివేయడానికి ఒక ప్రణాళికను తయారుచేసింది. ఈమేరకు 2002, మే 3వ తేదీన ఈ మంత్రిత్వశాఖ అన్ని రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులకు, అటవీశాఖ కార్యదర్శులకు, అటవీ సంరక్షణ అధికారులకు ఒక సర్క్యులర్ (నెం. 7-16/2002)ను జారీచేసింది. దేశంలో అటవీ భూముల దురాక్రమణ తీవ్రస్థాయికి చేరింది (దేశంలో సుమారు 12.50 లక్షలు హెక్టార్ల అటవీ భూమి ఆక్రమణకు గురయ్యిందని అందులో 3.08 లక్షల హెక్టార్లు ఆంధ్రప్రదేశ్‌లో ఉందని ప్రభుత్వ అంచనా) కనుక దానిపై దృష్టి కేంద్రీకరించి దురాక్రమణదారులందరినీ సెప్టెంబరు 30, 2002 లోపు తొలగించాలని ఆ లేఖలో ఆదేశించింది. ఇందుకోసం అన్ని రాష్ట్రాలలోనూ కమిటీలను ఏర్పరచాలని కూడా ఆదేశించింది.

అడవిని నాశనం చేసే ఖనిజ పరిశ్రమలు, మందు మొక్కల సేకరణ జరిపే ప్రైవేటు కంపెనీలు, స్మగ్లర్లు, ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న టూరిజం, గనుల పరిశ్రమ మొదలైన ఆటవికేతర కార్యక్రమాలను, వాటికి కారకులను ఆక్రమణలుగా, ఆక్రమణదారులుగా ప్రకటించకుండా ఒక కోటి ఆదివాసులను నిర్వాసితులను చేయడం చాలా అన్యాయం.

గతంలో సుప్రీంకోర్టు ఆదివాసుల హక్కులను పరిరక్షించడంలో బాధ్యతాయుతంగానే ప్రవర్తించింది. బన్వాసీ సేవాశ్రం (1985-1994) కేసులలో సుప్రీంకోర్టు ఆదివాసులకు న్యాయంగా దక్కవలసిన భూములను వారికి అప్పగించేటట్లు ప్రత్యేకమైన కోర్టులను, న్యాయ సహాయాన్ని అందించింది. భూమిలేని ఆదివాసులకు వారి హక్కులను కల్పించవలసిందిగా ఆదేశిస్తూ ఆ రాష్ట్ర ప్రభుత్వానికి కేసును తిప్పి పంపింది. మధ్యప్రదేశ్ ప్రభుత్వానికి కూడా అదేవిధమైన ఉత్తర్వులను జారీచేసింది. 1997 సమతా కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు అటవీ భూములపై ఆదివాసుల హక్కుల గురించి సమగ్రమైన వైఖరి తీసుకొని, అటవీ భూములలో ఉన్న విలువైన వనరులన్నీ ఆదివాసుల సామాజిక, ఆర్థిక అభివృద్ధికి నిర్దేశించబడాలని అభిప్రాయపడింది.



అయితే ఇప్పుడు ప్రభుత్వం సుప్రీంకోర్టు ఉత్తర్వులను దుర్వినియోగపరుస్తూ ఆదివాసులను అణచివేయడానికి సిద్ధపడుతున్నది. ఒక్కసారిగా లభించిన అపరిమితమైన అధికారాలతో కేంద్ర పర్యావరణ అటవీ మంత్రిత్వశాఖ కోర్టు ఉత్తర్వులను ముందుకు తీసుకెళ్ళడానికి జయకృష్ణన్ చైర్మన్‌గా ఒక సెంట్రల్ ఎంపవర్‌మెంట్ కమిటీ (సిఇసి)ని ఏర్పరచింది. ఆదివాసి ప్రతినిధులెవరూ లేని ఈ కమిటీ గతంలో ఆదివాసుల హక్కుల పరిరక్షణ దిశలో వచ్చిన విధానాలను, వాగ్దానాలను విస్మరించి, వాటిని కప్పిపెడుతున్నది. 1980 అటవీ సంరక్షణ చట్టం ఆమోదించబడక ముందు ఆదివాసులకు వివరమైన వాగ్దానాలు చేయబడ్డాయి. 1988 అటవీ విధానం ఆదివాసులకు, అటవీ పరిరక్షణకు ఉన్న పరస్పర సంబంధాన్ని నొక్కిచెప్పింది. 1990లో వచ్చిన ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ 29వ రిపోర్టు సూచించిన పథకం అనేక సర్క్యులర్‌ల ద్వారా అమలుపరచబడింది.

ఇప్పుడు కేంద్ర పర్యావరణ అటవీ మంత్రిత్వశాఖ ఏర్పరచిన సిఇసి పై విషయాలన్నీ జరగనట్టుగా వ్యవహరిస్తూ వక్రీకరించబడిన గణాంక వివరాలను ఆధారంగా చేసుకొని, ఆదివాసుల కారణంగా గత 50 సంవత్సరాలలో దేశానికి 4,59,978 కోట్ల రూపాయల నష్టం వచ్చిందని చెబుతున్నది. ఈ లెక్కలు ఎన్ని అబద్ధాలతో కూడుకున్నవో అంత మూర్ఖమైనవి కూడా.

1990లో జారీచేయబడిన సర్క్యులర్‌ను ఇప్పుడు తిరగదోడటానికి ప్రయత్నం జరుగుతున్నది. 1980 అక్టోబర్ 25వ తేదీ ముందు జరిగిన లీజుల ప్రకారం ఆదివాసుల భూముల క్రమబద్ధీకరణ విషయంలో సమగ్రమైన ప్రణాళిక తయారు చేయాలని సర్క్యులర్‌లు సూచించాయి. ఆదివాసుల జీవితాన్ని, అడవులను సుసంపన్నం చేయడానికి అనుకూలమైన విధంగా 1980 తర్వాత భూమి క్రమబద్ధీకరణ జరగాలని ఈ ప్రణాళిక సారాంశం. 1980 అటవీ సంరక్షణ చట్టం క్రింద కేంద్ర ప్రభుత్వం అనేక దారుణమైన ప్రతిపాదనలను ఆమోదించింది. గత 12 సంవత్సరాలుగా ఈ చట్టంలో ఆదివాసులకు న్యాయంగా చెందవలసిన హక్కులకు సంబంధించిన అంశాలు ఆచరణలోకి రాలేదు. ఇప్పుడు అకస్మాత్తుగా సుప్రీంకోర్టు ఉత్తర్వులను అనుసరించి, అనేక సంవత్సరాల క్రితమే ఆచరణలో పెట్టవలసిన విధానాన్ని ప్రభుత్వం అర్థంలేకుండా తిరగదోడుతున్నది.

ఆదివాసి ప్రాంతాలను, ఆదివాసులను రక్షించేందుకు భారత రాజ్యాంగంలో ప్రత్యేక ప్రొవిజన్లు (5వ షెడ్యూలు) ఉన్నాయి. పెద్ద పెద్ద పరిశ్రమలు, వ్యాపార సంస్థలు చేస్తున్న మాదిరిగా ఆదివాసులు అడవులను కబళించడం లేదు. మే 3వ తేదీన కేంద్ర పర్యావరణ అటవీ మంత్రిత్వ శాఖ జారీచేసిన సర్క్యులర్ అందరినీ ఒకే గాటన కడుతున్నది.

**అ**డవులపైన ప్రభుత్వానికి సకల హక్కులు కల్పించే చట్టాలేవీ లేక ముందునుంచీ కూడా ఈనాటి ఆదివాసుల పూర్వీకులు అడవు లలో నివసిస్తున్నారు. వెనక వచ్చిన చట్టం ముందునుంచీ అక్కడ వున్న ఆదివాసులను చొరబాటుదార్లు లేక కబ్జాదారులు అనడం హాస్యాస్పదం. కాబట్టి చట్టమే అడవులలో అసలయిన చొరబాటు దారు అని ఆదివాసులు ప్రకటించి, చట్టాన్నీ దాన్ని చేసిన రాజ్యాన్నీ అడవుల నుంచి వెళ్లిపొమ్మని ఆదేశించినా వారిని నైతికంగా ఎవరూ తప్పుపట్టలేరు.

> **అ**డవులు, భూమి ప్రజల మనుగడకు భూమిక. మనుగడ ప్రజల ప్రాథమిక హక్కు. ఆదివాసీ ప్రాంతాలలో ఈ జీవించే హక్కుకే విఘాతం కలుగుతున్నది. ప్రాథమిక హక్కులతో ఈ చెలగాటం ఆగాలి. అయితే అడవులు నాశనం కాకుండా ఉండ దానికి తగు జాగ్రత్తలు కూడా తీసుకోవాలి. ఇది ఆదివాసులను ప్రభుత్వం అణచివేసే రూపంలో ఉండకూడదు. ఆదివాసులను అర్థం చేసుకొని వారికి సమాన భాగస్వామ్యం కలిగించే పద్ధతిలో ఉండాలి.
>
> **–29వ ఎస్సి, ఎస్టి కమిషనర్ నివేదిక నుంచి**

సెప్టెంబర్ 9, 2002 తేదీన కేసు సుప్రీంకోర్టులో విచారణకు వచ్చినపుడు అందరూ భయపడినట్టు కోర్టు సిఇసి రిపోర్టుకు ఆమోదముద్ర వేయలేదు. ప్రస్తుతానికి గండం గడచినట్లే. అట్లాగే సెప్టెంబర్ 30 గడుపు లోపల అడవులన్నీ ఖాళీ చేయించడం ఆచరణ సాధ్యంకాదని వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు చెప్పడం వలన మే 3 నాటి సర్క్యులర్ అమలు కూడా ప్రస్తుతానికి ఆగివుంది.

కాని ఆ సర్క్యులర్‌ను కేంద్ర ప్రభుత్వమింకా వెనక్కి తీసుకోలేదు. ఇంకొక తారీఖుపెట్టి తిరిగి జారీచేయవచ్చు. అలాగే సిఇసిని నెలకొల్పిన ఆర్డర్‌ను సుప్రీంకోర్టు వెనక్కి తీసుకోలేదు. వారి నివేదికను సుప్రీంకోర్టు ఇంకా పరిశీలించాల్సి ఉంది.

కాబట్టి గొడ్డలివేటు తాత్కాలికంగా తప్పించుకున్న ఆదివాసులు అప్రమత్త స్థితిని విడనాడకుండ ఒక పాజిటివ్ అజెండాతో కలసికట్టుగా ముందుకు పోవలసి ఉంది. 1990 నాటి ఆరు సర్క్యులర్లను 29వ ఎస్సి, ఎస్టి కమిషన్ రిపోర్టుకు అనుగుణంగా సవరించి తక్షణం అమలు చేయాలన్న డిమాండ్ ఆచరణ సాధ్యమైన అజెండా కాగలదు. దానితోనే ఆదివాసీ ఉద్యమాలు సంతృప్తి చెందనవసరం లేదు. ఉద్యమాల బలాన్ని బట్టి, పరిస్థితుల అనుకూలతను బట్టి ఇంకా ముందుకుపోవచ్చు.

రాజమండ్రి 1.3.2003



కరపత్రం

# ఇరాక్‌పైన అమెరికా దాడిని వ్యతిరేకిద్దాం

**గూ**డెం బయట క్రూర మృగం తచ్చాడుతున్న అడవివాసుల లాగ, బుష్ ఇరాక్‌ను ఏ అపరాత్రి వేళ తినడం మొదలుపెడతాడో అని ప్రపంచమంతా కొన్ని నెలల పాటు భయం భయంగా ఎదురు చూసింది. నిన్న రాత్రి ఆ ఘడియ వచ్చేసింది.

అప్పుడెప్పుడో మంగోలులను చూసి యూరోపియన్లు ఇదే విధంగా హడలి చచ్చారంట. మంగోలులు అతి క్రూరులని అప్పటినుంచి యూరోపియన్ల నుండి మనకు సంక్రమించిన ప్రపంచ చరిత్ర చెపుతున్నది. అది నిజమా లేక పాశ్చాత్యుల పాక్షిక దృష్టి కల్పించిన అర్ధసత్యమా (అసలు పూర్తిగా అసత్యమా) అన్న ప్రశ్న ఈ మధ్య చరిత్రకారులలోనే తలెత్తింది.

దాని సంగతేమోగానీ, ప్రస్తుత అమెరికా పాలకులు అతి క్రూరులన్న అభిప్రాయం పాక్షికం అనడానికి వీలులేనిది.

'మనం చెప్తున్నాం కాబట్టా?' అంటారేమో. కాదు. ప్రపంచమంతా చెప్తున్నది కాబట్టి. పశ్చిమం కాదు, పూర్వం కాదు, తెలుపు కాదు, నలుపు కాదు, ఎరుపు కాదు, పసుపు కాదు, ఉత్తరం కాదు, దక్షిణం కాదు, ఇది ఏ ఒక్క ప్రాంతం అభిప్రాయమో, ఏ ఒక్క జాతి అభిప్రాయమో కాదు. నిజమే, అన్ని ప్రాంతాలలో అన్ని జాతులలో బుష్ ప్రభుత్వంతో లాలూచీపడి వారు తేబోయే వేటలో ఒక వాటా పొందాలని చూస్తున్న వారున్నారు. అయితే వీరు అన్నిటా ఉన్నారు. క్రూరత్వాన్ని క్రూరత్వం అనే వారు కూడా అన్నిటా ఉన్నారు.

కాబట్టి చరిత్రలో సార్వజనీన సత్యాలు ఉన్నా లేకున్నా, సమకాలీన అమెరికా పాలకులు అతి క్రూరులు అనేది ఒక సార్వజనీనమైన వర్తమాన సత్యం. వారు క్రూరులు మాత్రమే కారు. వారి నోట్లో ఉన్నది ఒక నాలుక కాదు, వారి మాటలకున్నది ఒక భావం కాదు, వారి చర్యలకున్నది ఒక నీతి కాదు.

ప్రపంచంలో ఎక్కడయినా ఏ మూలనయినా తన ప్రయోజనాలకు హాని కలిగించగల రాజకీయ వ్యవస్థగానీ ప్రభుత్వంగానీ ఉద్యమంగానీ ఉన్నట్టయితే ఏ నీతీ పాటించకుండ ఏ నియమాన్నీ గౌరవించకుండ స్థానిక ప్రజల ఇష్టాయిష్టాలతో కష్టనష్టాలతో నిమిత్తం లేకుండా దానిని తొలగించివేయడం, అణచివేయడం, తన అదుపులోకి తెచ్చుకోవడం అమెరికా రాజకీయ నీతి.

రెండవ ప్రపంచ యుద్ధం తరువాత 150 యుద్ధాలు – చిన్నవీ పెద్దవీ – జరిగాయనీ వాటిలో దాదాపు ఎనిమిదిన్నర కోట్ల మంది చనిపోయారనీ ఈ యుద్ధాలన్నిటితోనూ అమెరికాకు ప్రత్యక్షంగానో పరోక్షంగానో ప్రమేయం ఉందనీ ఒక యుద్ధ పరిశీలకుని అంచనా. వీటిలో ఏ ఒక్క యుద్ధమూ అమెరికా భూభాగం గురించి జరిగినది కాదు. ఏ ఒక్కటీ అమెరికా మీద మరొక దేశం యుద్ధం ప్రకటించగా మొదలయినది కాదు. అయితే ప్రతీ యుద్ధంలోనూ అమెరికా తన ప్రయోజనాలను కాపాడుకోవడానికి ఒక పక్షమో మరొక పక్షమో ప్రత్యక్షంగానో పరోక్షంగానో తీసుకుంది. చాలా సందర్భాలలో యుద్ధాన్ని తానే ఒక పక్షం

చేత మొదలు పెట్టించింది. అన్ని సందర్భాలలోనూ 'స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, పౌరహక్కులు, మానవ నాగరికత' మొదలైన ఉదాత్తమైన విషయాలను రక్షించడానికి తాను ప్రపంచానికి సేవ చేయబూను కున్నానే తప్ప యుద్ధం చేయడం లేదని బుకాయించింది.

1964 నుండి 1972 దాకా అమెరికా వియత్నాంపైన అతి క్రూరమైన యుద్ధం చేసింది. వియత్నాంతో మొదలయిన ఆ యుద్ధం లావోస్, కంబోడియాల భూభాగానికి వ్యాపించింది. ఈ దేశాలేవీ అమెరికాపైన యుద్ధం ప్రకటించలేదు. అమెరికాయే తన ప్రపంచ ఆధిపత్య వ్యూహంలో భాగంగా వాటిపైన యుద్ధం చేసింది. యుద్ధం అయిపోయేటప్పటికి అమెరికా 70 లక్షల టన్నుల బాంబులు వేసింది. మొత్తం రెండవ ప్రపంచ యుద్ధంలో యూరప్‌లోనూ ఆసియాలోనూ పడిన బాంబులకు ఇది రెండు రెట్ల కంటె ఎక్కువ. ఈ యుద్ధంలో మొత్తం 10 లక్షల మందిని అమెరికా చంపింది. పంట పొలాలనూ మనుషుల ఆరోగ్యాన్నీ నాశనం చేసే రసాయన పదార్థాలను బాంబులుగా ప్రయోగించింది.

అమెరికా ప్రత్యక్షంగా చేసిన క్రూరమైన యుద్ధానికి వియత్నాం ప్రముఖ నిదర్శనం కాగా, తన మిత్ర రాజ్యానికి అన్నిరకాల సహాయ సహకారాలు అందిచ్చి అతి ఘోరమైన యుద్ధం చేయించిన వైనానికి ప్రముఖమైన ఉదాహరణ పాలస్తీనా ప్రజలపైన ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధం. యాభై ఏళ్లు గడిచినా ఎడతెగని ఈ యుద్ధంలో పాలస్తీనా ప్రజలు ఎంత కోల్పోయారన్న అంచనా వేసినవారు లేరు.

ఇజ్రాయిల్‌కు అమెరికా ఆయుధాలు విరివిగా సరఫరా చేసింది. అంతకు మించి అంతర్జాతీయ రాజకీయ వేదిక మీద అచంచలమైన భరోసా ఇచ్చింది. 1967 యుద్ధంలో ఇజ్రాయిల్ కొత్తగా ఆక్రమించుకున్న అరబ్బు ప్రాంతాలను వదిలిపెట్టి వెనక్కి పోవాలన్న భద్రతా మండలి తీర్మానం నెంబర్ 242ను అమలు చేయడానికి ఐక్యరాజ్యసమితి ఎప్పుడు పూనుకున్నా అమెరికా అడ్డంపడు తున్నది. లెబనాన్‌లో పాలస్తీనా పోరాటకారుల స్థావరాలున్నా యన్న నెపంతో 1982లో లెబనాన్‌పైన చేసిన దాడిలో ఇజ్రాయిల్ 17 వేల మంది సాధారణ పౌరులను హత మార్చింది. ఈ దాడికి ఇజ్రాయిల్ ఉపయోగించిన ఆయుధ సామగ్రి అమెరికా సరఫరా చేసినదే. తాను ఒక దేశానికి సరఫరా చేసిన ఆయుధాలను ఆ దేశం రక్షణ కోసమే తప్ప దాడి కోసం వాడుకోకూడదన్న నియమమొకటి తన ఆయుధ వ్యాపార నీతిలో భాగమని అమెరికా అంటుంటుంది. కానీ ఇజ్రాయిల్ విషయంలో ఆ నియమాన్ని అమలుచేసే ప్రయత్నం అమెరికా ఏరోజూ చేయలేదు.

లెబనాన్‌లో ఇజ్రాయిల్ ఆక్రమించుకున్న భూభాగాన్ని వదిలి వెళ్లిపోవాలని ఐక్యరాజ్యసమితి భద్రతామండలి మూడుసార్లు తీర్మానించే ప్రయత్నం చేసింది. మూడు ప్రయత్నాలనూ అమెరికా వీటో చేసింది. 2002లో రామల్లా ప్రాంతంలో ఇజ్రాయిల్ చేసిన బీభత్సకాండను ఆపడానికి ఐక్యరాజ్య సమితి చేసిన కొనఊపిరి ప్రయత్నాలను కూడ అమెరికా సాగనివ్వలేదు.

పాలస్తీనా ప్రజలు అమెరికాకు ఏ హానీ తలపెట్టలేదనీ అమెరికా మీద ఎన్నడూ యుద్ధం ప్రకటించలేదనీ వేరే చెప్పనవసరం లేదు. అమెరికాయే తన ప్రపంచ ఆధిపత్య ప్రయోజనాలలో భాగంగా పాలస్తీనా ప్రజలపైన ఇజ్రాయిల్ దాడులను సమర్థిస్తున్నది.

ఇక దేశాల అంతర్గత రాజకీయాలలో తలదూర్చి తనకు ప్రతికూలమైన ప్రభుత్వాలనూ వ్యక్తులనూ అమెరికా అంతమొందించిన ఉదంతాలు కోకొల్లలు. ఇక్కడ ఇరాక్ గురించి మాత్రమే మాట్లాడు కుందాం.



* 1958లో ఇరాక్‌లో అబ్దుల్ కరీం కాసిం నాయకత్వంలోని సైనిక బృందం బ్రిటన్ ఏజెంటుగా వ్యవహరిస్తున్న రాజును తొలగించింది. ఇరాక్‌లోని చమురు బావుల మీద హక్కులు నెలకొల్పుకొని ఉన్న ఇరాక్ పెట్రోలియం కంపెనీ అనే బహుళజాతి సంస్థ మీద కాసిం ప్రభుత్వం కొన్ని ఆంక్షలు విధించింది. దానికి పోటీగా ప్రభుత్వరంగ చమురు సంస్థను నెలకొల్పింది. కాసిం ప్రభుత్వాన్ని కూలదోయడానికి అమెరికా సిఐఏని రంగంలోకి దింపింది. సిఐఏ సహాయంతో 'బాత్' పార్టీ 1963లో అధికారంలోకి వచ్చింది. ఈ 'ఆపరేషన్'కు ఇన్‌చార్జిగా ఉండిన సిఐఏ అధికారి 'ఇది నా కెరీర్‌లోని అతి గొప్ప విజయం' అని గర్వంగా చెప్పుకున్నాడు. ఆ విధంగా అధికారంలోకి వచ్చిన 'బాత్' పార్టీ ప్రస్తుత నాయకుడే సద్దాం హుసేన్. (1968లో రెండవసారి అధికారంలోకి వచ్చిన బాత్ పార్టీ అమెరికాను కాదని ఇరాక్ పెట్రోలియం కంపెనీని 1972లో జాతీయం చేయడం వేరే కథ)

* 1980 నుంచి 1988 వరకు సద్దాం హుస్సేన్ నాయకత్వంలోని ఇరాక్ అమెరికా, బ్రిటన్‌ల సంపూర్ణ సహాయ సహకారాలతో ఇరాన్‌పైన భీకరమైన యుద్ధం చేసింది. అప్పటికి ఇరాన్‌లో అమెరికా మద్దతు ఉన్న పహ్లావి రాజవంశాన్ని కూలదోసి ఇస్లామిక్ తిరుగుబాటుదార్లు రాజ్యం చేస్తున్నారు. ఇరాక్ ఏ ఆయుధాలు కావాలంటే ఆ ఆయుధాలు అమెరికా బ్రిటన్‌లు వారికి అమ్మాయి. మార్గరెట్ థాచర్ ప్రభుత్వం సద్దాం హుసేన్‌కు ఆయుధాల కొనుగోలు కోసం 34 కోట్ల పౌండ్ల అరువు సదుపాయం కూడ కల్పించింది. బుష్ – బ్లెయిర్‌లు సద్దాం హుస్సేన్ దగ్గర ఉన్నాయి ఉన్నాయంటూ ఈ రోజు గావుకేకలు పెడుతున్న రసాయనిక ఆయుధాలను అతనికి తొలుత అందిచ్చింది, అలవాటు చేసింది బ్రిటనే. ఇరాన్‌పైన ఈ రెండు అగ్రరాజ్యాల ప్రోత్సాహంతో ఎనిమిదేళ్ల పాటు ఇరాక్ నడిపిన యుద్ధంలో ఇరువైపులా 10,00,000 మంది చనిపోగా, అమెరికా, బ్రిటన్‌లకు చెందిన ఆయుధ కంపెనీలకు అన్ని లక్షల డాలర్ల లాభాలు వచ్చాయి.

* సద్దాం హుస్సేన్ తన దేశంలోని మైనారిటీ జాతి అయిన కుర్దుల మీద అత్యాచారాలకు పాల్పడు తున్నాడనేది 1990 తరువాత అతనిపైన అమెరికా, బ్రిటన్‌లు వేస్తున్న ఆరోపణలలో ఒకటి. అప్పటికి అతను ఆ రెండు అగ్రరాజ్యాలకు కంటగింపయాడు. కానీ ఇరాక్ ప్రభుత్వం కుర్దు మైనారిటీల పైన పెద్దఎత్తున హింసాకాండకు పాల్పడిన మొదటి ఘటన 1988లోనే జరిగింది. కుర్దుల గ్రామమైన హలాబ్జాలో 1988లో ఇరాక్ ప్రభుత్వం బ్రిటన్ నుంచి, అమెరికా నుంచి తెచ్చుకున్న విషవాయువును ప్రయోగించి క్రూరమైన హత్యాకాండకు పాల్పడింది. ఈ విషవాయువు దాడిలో 5,000 మంది కుర్దులు చనిపోయారు. అప్పటికింకా ఇరాన్‌తో ఇరాక్ యుద్ధం అయిపోలేదు కాబట్టి ఆ ఘోరకాండను కప్పిపెట్టడానికి అమెరికా బ్రిటన్‌లు శతవిధాల ప్రయత్నం చేశాయి. ఆ హత్యాకాండ ఇరాన్ పాపమేనని అమెరికా ఒక వదంతిని ప్రచారం చేసింది కూడా.

* 1990 తరువాత, కుర్దులను సద్దాం హుస్సేన్ నుంచి కాపాడే కర్తవ్యాన్ని తన మీద వేసుకున్నట్టు అమెరికా ప్రకటించుకుంది. సద్దాం హుస్సేన్ పాలనపైన అజమాయిషీ చేసే కర్తవ్యంలో భాగంగా అమెరికా యుద్ధ విమానాలు తరచుగా ఇరాక్ గగనతలం పైన పహారా కాస్తుంటాయి. ఆ విమానాల స్థావరాలు పొరుగు దేశమైన టర్కీలో ఉన్నాయి. టర్కీలోనూ కుర్దులు ఉన్నారు. అక్కడ కూడ కుర్దులపైన క్రూరమైన అణచివేత సాగుతున్నది. అయితే

అమెరికా దాని గురించి మాట్లాడదు. పైగా ఇరాక్ గగనతలంలో విహరించడానికి బయలుదేరే అమెరికా యుద్ధ విమానాలు, అదే సమ యంలో టర్కీ – ఇరాక్‌ల సరిహద్దులోని కుర్దు గ్రామాలపైన దాడి చేయడానికి టర్కీ దేశపు యుద్ధ విమానాలు పోతున్నట్టు గమనించినట్టయితే కొంచెం సేపు ఆగాలనీ టర్కీ విమానాలు వెనక్కి తిరిగి వచ్చిన తరువాతే తాము బయలుదేరాలనీ ఆదేశాలు కూడ అమెరికా సైనిక అధికారులు ఇచ్చారు. టర్కీ పాలకులు అమెరికాకు ప్రీతిపాత్రులయిన నియంతలు.

ఇటువంటి ఘన చరిత్ర గల అమెరికా, దానికితోడుగా బ్రిటన్, ఇవ్వాళ సద్దాం హుస్సేన్ దగ్గర మానవాళికి అత్యంత ప్రమాదకరమయిన ఆయుధాలు ఉన్నాయనీ వాటినతను పూర్తిగా ధ్వంసం చేయాలనీ చేయని పక్షంలో యుద్ధం తప్పదనీ అంటున్నాయి.

ఇది విని ఎవరయినా అమెరికా నిరాయుధీకరణ ఉద్యమంలో ముందు నిలబడిందనుకుంటే పొరబాటే. ఏ నిరాయుధీకరణ డిమాండ్‌నూ అమెరికా ఏ రోజూ గౌరవించలేదు. తనకు వ్యతిరేక మయిన వారు ఆయుధాలు వదులుకోవాలన్నది మాత్రమే అమెరికా డిమాండు. తన అనుకూలురు దగ్గర ఎన్ని ఆయుధాలున్నా ఫర్వాలేదు.

1980–88 మధ్య కాలంలో ఇరాక్‌కు సంప్రదాయక ఆయుధాలే కాక రసాయన ఆయుధాలు (కెమికల్ వెపన్స్), రోగాలను వ్యాపింపచేసే క్రిములను ఉత్పత్తి చేసే ఆయుధాలు అమెరికా బ్రిటన్‌లే అమ్మాయి. ఇరాన్‌పైన ఇరాక్ 1985–86లలో విషవాయువులు ప్రయోగిం చగా ఐక్యరాజ్యసమితి ఖండించబోతే అమెరికాయే అడ్డం పడింది. ఇరాక్ యుద్ధ ప్రయోజనాల కోసం విషవాయువులు ప్రయోగించడం 'వ్యూహాత్మకంగా పెద్దగా ఆందోళన కలిగించే విషయం కాదు' అని అప్పటి అమెరికా అధికారి ఒకరు అన్నారు. ఇరాక్ దగ్గర ఈనాడు ఉన్న 'బయొలాజికల్' ఆయుధాలకు మూలమైన క్రిములను అతనికి అమెరికాయే ఇచ్చిందని 1995లో అమెరికా సెనేట్ నిర్వహించిన ఒక విచారణలో బయటపడింది. ఈ సత్యాన్ని దాచడానికి అమెరికా, బ్రిటన్‌లు చేస్తున్న ప్రయత్నం అంతా యింతా కాదు.

'నీ దగ్గరున్న ఆయుధాల వివరాలు ప్రకటించమని' ఐక్యరాజ్యసమితి ఒత్తిడి పెట్టగా సద్దాం హుస్సేన్ గత సంవత్సరం పెద్ద నివేదిక ఒకటి సమర్పించాడు. 11,800 పేజీల ఆ నివేదికలో 1200 పేజీలను అమెరికా స్వాధీనం చేసేసుకుంది. ఎందుకని అడిగితే, అందులో కొంత 'సున్నిత మయిన సమాచారం' ఉందనీ దానిని 'ఎడిట్' చేయవలసిన అవసరం ఉందనీ అనింది! ఏమిటా 'సున్నితమయిన' సమాచారమంటే, ఇరాక్‌కు అణుధార్మిక, రసాయనిక, క్షిపణి సాంకేతిక ప్రక్రియలను అమ్మిన 150 అమెరికన్, బ్రిటిష్ కంపెనీల పేర్లు, ఆ అమ్మకాల వివరాలు అందులో ఉన్నాయి.

ఇరాన్ మీద యుద్ధం చేయడానికి ఇరాక్‌కు అమెరికా, బ్రిటన్‌లు అందనిచ్చిన ప్రమాదకర మైన ఆయుధాలను ఆ యుద్ధం అయిపోయిన తరువాత సద్దాం హుస్సేన్ తన సొంత ఆధిపత్య ప్రయోజనాల కోసం వాడుకోవాలని చూడడం తప్పయిపోయింది. 1988 దాకా అమెరికాకు సన్నిహిత మిత్రుడయిన అతను 1991 నాటికి ప్రపంచానికే ప్రమాదకారి అయిపోయాడు. 1988 దాకా అమెరికా, బ్రిటన్‌లే అతనికి అమ్మిన ఆయుధాలు 1991 తరువాత మానవాళి మనుగడకే ప్రమాదకర మైన మారణాయుధాలయి పోయాయి. 1988 దాకా అతను ప్రయోగించిన రసాయన యుద్ధ ప్రక్రియ 'వ్యూహాత్మకంగా పెద్దగా ఆందోళన కలిగించే విషయం' కాకపోగా, 1991 తరువాత అది భీకరమైన ఆంక్షలు పెట్టడానికి యోగ్యమైన తప్పిదం అయిపోయింది.

చమురు ధరలు తనకు అనుకూలమైన మోతాదులో ఉంచడానికి సహకరించడం లేదన్న నెపంతో



సద్దాం హుస్సేన్ కువైట్ పైన 1990లో దాడిచేశాడు. ఆ దాడిని అమెరికా గట్టిగా వ్యతిరేకిం చింది. కువైట్‌పైన ఇరాక్ చేసిన దాడిని నిలుపుదల చేయడానికి 'ఎటువంటి చర్యలయినా తీసుకోవచ్చు నన్న' తీర్మానం అమెరికా ఒత్తిడి మేరకు ఐక్యరాజ్యసమితి చేసింది. ఈ ఐక్యరాజ్య సమితి తీర్మానాన్ని అడ్డం పెట్టుకొని 1991లో అమెరికా (బ్రిటన్ సహకారంతో) ఇరాక్‌పైన 43 రోజుల భీకర యుద్ధం చేసింది. ఈ యుద్ధం ప్రధానంగా 'వాయు యుద్ధం', పూర్తిగా ఏకపక్షమైన యుద్ధం. అమెరికా వాయుసేనకు చెందిన బాంబర్లు ఆ 43 రోజులలో 1,09,876 సార్లు ఇరాక్ గగనతలంపైకి దూసుకుపోయి బాంబుల వర్షం కురిపించాయి. మొత్తం 84 వేల టన్నుల బాంబులు వేశాయి. ఇరాక్ సైనికులు లక్ష నుంచి 2 లక్షల మంది చనిపోవడమే కాక, 35 వేల మంది నిరాయుధులయిన పౌరులు ఆ 'యుద్ధం'లో చనిపోయారని ఐక్యరాజ్య సమితే అంచనా వేసింది. అంతేకాక ఇరాక్ పారిశ్రామిక వ్యవస్థ, విద్యుత్ వ్యవస్థ, మంచినీటి వ్యవస్థ, పౌర జీవితానికి అవసరమయిన వ్యవస్థలన్నీ నాశనం అయ్యాయి. అవతలివైపు ఇరాక్ సైన్యం చేతిలో కేవలం 76 మంది అమెరికా సైనికులు చనిపోయారంటే ఇది ఎంత ఏకపక్షమైన 'యుద్ధమో' అర్థమవుతుంది.

యుద్ధం ముగియడంతో ఇరాక్ వెతలు తీరలేదు. ఆ దేశం మీద అమెరికా ఐక్యరాజ్యసమితి చేత అతి తీవ్రమైన ఆంక్షలు విధింపజేసింది. ఇరాక్ తన ప్రమాదకరమైన ఆయుధాల తయారీ కార్యక్రమాన్ని మొత్తంగా వదులుకునే దాకా ఈ ఆంక్షలు అమలులో ఉంటాయన్నారు.

ఒకప్పుడు ప్రపంచ స్థాయిలో నిరాయుధీకరణ కోసం ఒప్పందాలూ, ఒడంబడికలూ రూపొందించే ప్రయత్నం చేసిన ఐక్యరాజ్యసమితి ఇప్పుడు అమెరికాకు కంటగింపయిన ఒకానొక మూడవ ప్రపంచ దేశాన్ని పూర్తిగా నిరాయుధీకరించే బృహత్కార్యానికి ఆమోదముద్ర వేసింది. అందుకోసం ఇరాక్‌పైన పెట్టిన ఆంక్షల అమలు ఐక్యరాజ్యసమితి బాధ్యత అయింది. ఐక్యరాజ్యసమితి సంపూర్ణంగా అమెరికా సైనిక వ్యూహంలో ఒక సాధనంగా మారిపోయింది.

చమురు అమ్ముకొని ఇతర జీవిత అవసరాలనూ, సాంకేతిక ప్రక్రియలనూ, యంత్రాలనూ దిగుమతి చేసుకొని బతికే దేశం ఇరాక్. దానిపైన ఘోరమైన ఎగుమతి, దిగుమతి ఆంక్షలు పెట్టడం, వాటిని ఒక దశాబ్దం పైగా అమలు చేయడం ఇరాక్ ప్రజల ప్రాణం మీదికి వచ్చింది. వైద్య సదుపాయం లేక ఇరాక్‌లో 7.5 లక్షల మంది పిల్లలు చనిపోయారనేది ఇప్పుడందరూ అంగీకరిస్తున్న వాస్తవం. పారిశుధ్య వ్యవస్థ, మంచినీటి వ్యవస్థ దెబ్బతినడం వల్ల, మందుల దిగుమతిపైన ఆంక్షలు పెట్టడం వల్ల, మొత్తం 12 లక్షల మంది ఇరాకీలు చనిపోయారని 1997లో ఐక్యరాజ్యసమితి అంచనా వేసింది. ఇరాక్ అధికంగా ఎడారి దేశం కావడం వల్ల అక్కడ శుభ్రమైన మంచినీరు సులభంగా దొరకదు. దొరికిన నీటిని శుభ్రం చేసుకునే సాంకేతిక వ్యవస్థను వారు నిర్మించుకున్నారు. దానిని అమెరికా తన బాంబుదాడులలో నాశనం చేయడం 'అంటువ్యాధుల వ్యాప్తికి అనుకూలమైన పరిస్థితిని కల్పించడం' అని అమెరికా సైనిక ఇంటెలిజెన్స్ నివేదిక 1991లో యుద్ధం మొదలయిన తొలి దినాలలోనే ప్రకటించింది. అదే ఆ తరువాత జరిగింది.

నిజమే, 'మానవతా అవసరాలు' అనే పేరుమీద ఆంక్షల నుంచి కొన్నిటికి మినహాయింపు ఇచ్చారు. కానీ ఆ మినహాయింపు పరిమితమైన ఆహార వైద్య అవసరాలను దాటకపోవడం వల్ల వేరే అవసరాలే కాదు, ఆహార, వైద్య అవసరాలు కూడా సరిగ్గా అందలేదు. పైగా,

ఐక్యరాజ్యసమితి 'మానవతా అవసరాలు'గా గుర్తించినవి కూడా అమెరికా ఆమోదం లేకుండా ఇరాక్‌కు చేరలేదు. అమెరికా 500 కోట్ల డాలర్ల 'మానవతా అవసరాలను' ఆపేసిందని అంచనా. 1997-98 సంవత్సరంలో ఇరాక్‌లో ఐక్యరాజ్యసమితి తరఫున సంధానకర్తగా నియమించబడ్డ డెనిస్ హాలిడే ఈ ఆంక్షలను 'మానవ హననం' (జెనోసైడ్) అని అభివర్ణిస్తూ తన పదవికి రాజీనామా చేశాడు. అతని స్థానంలో నియమితుడయిన హాన్స్ ఫాన్ స్పోనెక్ 2000 సంవత్సరంలో అదే కారణంగా రాజీనామా చేశాడు. ఆ కాలంలో ఇరాక్‌లో ఐక్యరాజ్యసమితి ప్రపంచ ఆహార పథకం అమలుకు బాధ్యుడుగా ఉన్న జట్టా బుర్గ్‌హార్డ్ 'ఫాన్ స్పోనెక్ అభియోగం వాస్తవమే'నంటూ తాను కూడా పదవికి రాజీనామా చేశాడు.

యుద్ధం అయిపోయిన తరువాత కూడా ఇరాక్ సంపూర్ణ నిరాయుధీకరణ గురించి ఐక్యరాజ్యసమితి చేసిన తీర్మానాన్ని పర్యవేక్షించే పేరిట అమెరికా, బ్రిటన్‌లు తమ సైనిక చర్యలు కొనసాగించాయి. ఇరాక్ గగనతలంపైన సర్వాధికారాలు తమకు తాము దత్తం చేసుకున్నాయి. ఇరాక్ విమానాలు తమ దేశ ఉత్తర, దక్షిణ సరిహద్దుల పైన ఎగరడానికి వీలులేదని ఆంక్షలు పెట్టాయి. తాము మాత్రం ఇరాక్ భూభాగం మీద పది సంవత్సరాలుగా ప్రతీరోజూ బాంబులు వేస్తున్నాయి. ఇవన్నీ ఇరాక్ ఆయుధాల ఉత్పత్తిని నిరోధించడానికేనంటున్నారు గానీ ఇరాక్ పౌర జీవితానికి అవసరమైన ఉత్పత్తి, సరఫరా వ్యవస్థలను విస్తృతంగా ధ్వంసం చేశారు. అణు ధార్మిక స్వభావం గల యురేనియంను ప్రయోగించారు. దీనివల్ల ఇరాక్‌లో ఈ పది సంవత్సరాలలో ముఖ్యంగా పిల్లలలో కాన్సర్ వ్యాధి పెద్దఎత్తున వ్యాపించింది. 1991-94 మధ్య కాలంలో కాన్సర్ వ్యాధిగ్రస్తుల సంఖ్య ఇరాక్‌లో 700% పెరిగిందని ఐక్యరాజ్యసమితి అంచనా. సారాంశంలో, ఇరాక్‌పైన అమెరికా, బ్రిటన్‌ల యుద్ధం మొదలయి పదేళ్లయింది. రేపు జరగబోయేది యుద్ధాన్ని ముగించడం మాత్రమే.

**ఇరాక్‌పైన ఆధిపత్యం నెలకొల్పడానికి ఇంత ఆరాటం ఎందుకు?**

ఇరాక్‌లో విస్తారంగా చమురు నిక్షేపాలున్నాయి. ప్రపంచంలో రెండవ అతిపెద్ద చమురు నిక్షేపాలున్న దేశం ఇరాక్ అని అంచనా. చమురు వినియోగంలో అమెరికా ప్రపంచంలోనే ఫస్టు. ప్రపంచమంతా వినియోగించే చమురులో నాలుగవ వంతు ఒక్క అమెరికాయే వాడుతుందని అంచనా. అందువల్ల విస్తారంగా చమురు ఉన్న ఇరాక్ ప్రభుత్వం అమెరికాకు అనుకూలంగా ఉండాలి, అమెరికా చెప్పుచేతలలో బతకాలి. దానికి సద్దాం హుస్సేన్ సిద్ధంగా లేడు కాబట్టే అతనిని తొలగించాలి. అతను అమెరికాకు అనుకూలంగా నడుచుకున్ననాడు అతని ఆయుధ సంపద మానవజాతికి హానికరమని అమెరికా అనుకోలేదు. రేపు అతని స్థానంలో అమెరికా చెప్పినట్లు నడుచుకునే ప్రభుత్వం వచ్చినాక కూడా ఇదే ఆయుధ సంపద అమెరికాకు ఆందోళన కలిగించదు. మధ్యలో వచ్చిన తంటా ఆయుధ సంపదతో కాదు, సద్దాం హుస్సేన్‌తో. ఆయుధ సంపద మాటకొస్తే అమెరికాతో ఆ విషయంలో ఎవరు పోటీకి రాగలరు? తెల్లవాళ్లు బాధ్యత ఎరిగిన వారు కాబట్టి వారి దగ్గర ఎన్ని ఆయుధాలున్నా ఫరవాలేదు గానీ అరబ్బులను నమ్మలేం అని తెల్లవాళ్లు అనుకుంటే అనుకోవచ్చును గానీ నల్లవాళ్లమయిన మనమంతా ఎందుకొప్పుకోవాలి? అమెరికాతో మొదలుపెట్టి అన్నిదేశాలూ నిరాయుధీకరణకు ఒప్పుకోవాలని ఉద్యమిద్దాం - అంతే తప్ప ఇరాక్ మాత్రమే తన ఆయుధాలు వదులుకోవాలని డిమాండ్ చేయడంలో అర్థం లేదు. సద్దాం హుస్సేన్ ప్రభుత్వం దుర్మార్గమైనదే, కాదనము గానీ అమెరికా కంటే దుర్మార్గమైనది కాదు. అమెరికా ఈరోజు ప్రపంచంలోని ప్రధానమైన రౌడీ రాజ్యం (రోగ్ స్టేట్), టెర్రరిస్టు రాజ్యం. ఇరాక్ ప్రభుత్వం అమెరికా అనుచరులయిన ఇజ్రాయిల్,



టర్కీ, కొలంబియా దేశాల ప్రభుత్వాల కంటే ఎక్కువ దుర్మార్గమైనది కాదు.

పాశ్చాత్య దేశాలలో అమెరికా చేయనున్న ఈ యుద్ధం పట్ల నిరసన బలంగా వ్యక్తం అవుతున్నది. ప్రజలు పెద్ద సంఖ్యలో ప్రదర్శనలు చేస్తున్నారు. ఈ యుద్ధం అన్యాయం అని నినదిస్తున్నారు. పాశ్చాత్య దేశాల కంటే ప్రజాతంత్ర చైతన్యం మనకు ఎక్కువ అని మనం అనుకుంటుంటాముగానీ నిరసన అక్కడే ఎక్కువ వ్యక్తమవుతున్నది. కారణమేమైనా ఇది దురదృష్టకరం.

కొన్ని పాశ్చాత్య దేశాలు, రాజకీయ పార్టీలు ఈ యుద్ధం అన్యాయం అనే బదులు ఐక్యరాజ్యసమితి అనుమతి లేకుండా యుద్ధం చేస్తే ఒప్పుకోం అంటున్నారు. తొలినాడు ఉద్దేశించినంత నిష్పాక్షికంగా ఐక్యరాజ్యసమితి ఈనాడు ఉండి ఉంటే అదొక రకంగానీ పదేళ్లుగా ఐక్యరాజ్యసమితి అమెరికా జేబు సంస్థగా ఉంది. అయినప్పటికీ ఐక్యరాజ్యసమితిలో యుద్ధ నిర్ణయాన్ని వ్యతిరేకించడానికి ఒకటి రెండు దేశాలు సిద్ధంగా ఉన్న కారణంగా ఈ సాంకేతిక అభ్యంతరానికి కొంత ఉపయోగం లేకపోలేదని 'ప్రాక్టికల్' రాజకీయవేత్తలు భావిస్తుండవచ్చు. కానీ ఆ దేశాలు రేపు ప్లేటు ఫిరాయిస్తే ఏం గతి?

ఈ యుద్ధాన్ని సూత్రప్రాయంగానే వ్యతిరేకించాలి. దానితోబాటు ఐక్యరాజ్యసమితిని తిరిగి బతికించుకొని వీటో అధికారాలూ, శాశ్వత భద్రతా మండలి సభ్యత్వాలూ తొలగించి ఒక దేశానికి ఒక ఓటు ప్రాతిపదికన నిజమైన ప్రజాస్వామిక అంతర్జాతీయ వేదికగా రూపొందించుకోవాలి. అమెరికాతో మొదలుపెట్టి అన్ని రాజ్యాల శాశ్వత నిరాయుధీకరణ కోసం నిజాయితీగా కృషిచేయాలి.

మన దేశ పాలకులు ఇందుకు సిద్ధంగా లేరనేది స్పష్టమే. అసలు ఒక పెద్ద విపత్తు మన కళ్ల ఎదుట ఉందన్న స్పృహ వారిలో ఏ కోశానా లేదు. లేకపోతే చచ్చేది ముస్లింలు కాబట్టి ఫరవాలేదనుకుంటున్నారో. మొదట్లో, యుద్ధం వస్తే చమురు ధరలు పెరుగుతాయి కాబట్టి రాకుండ ఉంటే మంచిదని మన ప్రధానమంత్రి ఒక లారీ యజమాని స్థాయిలో ఆందోళన వ్యక్తం చేశారు. తన తెలివితేటలు తనకే నచ్చాయో ఏమో, ఆ అభిప్రాయాన్ని ఒక వారం రోజులలో మూడుసార్లు ప్రకటించాడు. అయితే ప్రస్తుత పార్లమెంటు సమావేశంలో ప్రతిపక్షాలు మరీ ఒత్తిడి చేయగా, యుద్ధమొస్తే ఏ వైఖరి అవలంబిస్తాడో స్పష్టం చేయలేదు గానీ ఐక్యరాజ్యసమితి అనుమతి లేకుండా యుద్ధంచేయడం అనుచితం అన్నాడు. ఈ మధ్య కాలంలో ఎప్పుడయినా ఐక్యరాజ్య సమితిని స్వతంత్ర వ్యవస్థగా నిలబెట్టడానికి కృషిచేసి ఉంటే ఈ అభిప్రాయాన్ని ఆమోదించకపోయినా కనీసం గౌరవించవచ్చు. కానీ ఐక్యరాజ్య సమితితో అమెరికా ఫుట్‌బాల్ ఆడుకుంటుంటే అందరిలాగా తాను కూడా మౌనంగా చూస్తూ పాకిస్తాన్‌కు ఒక దెబ్బ వేయడానికి అదేమయినా ఉపయోగపడుతుందేమోనని లెక్కలు వేస్తున్న అటల్ బిహారీ ప్రభుత్వం ఇప్పుడు ఐక్యరాజ్యసమితి మీద విశ్వాసం ప్రకటించడం వారి విజ్ఞత గురించే కాదు నిజాయితీ గురించి కూడా సందేహానికి తావు కల్పిస్తుంది.

20.3.2003

# పెద్దగట్టు యురేనియం గనులు అవసరమా? వాంఛనీయమా?

## కొంచెం ఆలోచిద్దాం రండి

పెద్దగట్టు, లంబాపూర్ గ్రామాలలో యురేనియం గనులు నెలకొల్పుతామంటూ ప్రభుత్వం చేస్తున్న హడావిడి నల్లగొండ ప్రజలకెరుకే.

రేపు 19వ తేదీన దీని విషయమై పెద్దగట్టులోనే 'ప్రజా విచారణ' జరపబోతున్నారు. దానికి ప్రజలందరినీ హాజరయి ఆ గనులు నెలకొల్పడం తప్పా ఒప్పా చెప్పమని మనల్ని ఆహ్వానిస్తున్నారు.

ఇది యురేనియం కార్పొరేషన్‌కు అకస్మాత్తుగా పుట్టిన ప్రజాస్వామ్య చైతన్యం కాదు. చట్టపరంగా వారి బాధ్యత. ఆ బాధ్యత వెనుక పర్యావరణ ఉద్యమకారులు దశాబ్దాలుగా చేపట్టిన పోరాటాలు ఉన్నాయి. పర్యావరణానికి (అంటే గాలికీ నీటికీ నేలకూ మనుషులకూ మొక్కలకూ జంతువులకూ) హాని కలిగించగల పరిశ్రమలు గానీ, గనులు గానీ ప్రారంభించే ముందు పర్యావరణ సంబంధమైన అనుమతి తప్పనిసరిగా పొందాలని ఈ ఉద్యమాల ఫలి తంగా 1994లో కేంద్ర ప్రభుత్వం ఎస్.వో. నెంబర్ 60(ఇ) జారీ చేసింది. (రాష్ట్ర ప్రభుత్వం తాఖీదులను జి.వో. అన్నట్లు కేంద్ర ప్రభుత్వం ఆదేశాలను ఎస్.వో. అంటారు). 1997లో దానిని సవరిస్తూ, పర్యావరణ సంబంధమైన అనుమతి పొందేముందు స్థానిక ప్రజల అభిప్రాయాలు సేకరించడం కోసం 'ప్రజా విచారణ' నిర్వహించాలని చెప్పే ఎస్.వో. నెం.31(ఇ) జారీ చేసింది.

రేపు పెద్దగట్టులో జరగబోయే విచారణ ఈ నియమాల ప్రకారం జరుగుతున్నదే తప్ప యురేనియం కార్పొరేషన్ వారి పెద్ద బుద్ధి వల్ల నిర్వహిస్తున్నది కాదు. అయితే ప్రజావిచారణ అర్థవంతంగా జరగాలంటే ప్రజలకు సమగ్రమైన సమాచారం అందియ్యాలి. యురేనియం గనుల వల్ల చుట్టుపక్కల ఉన్న గాలికీ నీటికీ జీవాలకూ జరగగల హాని ఏమిటో ప్రజలకు అర్థం అయ్యేటట్టు చెప్పాలి. ఇప్పటికే దేశంలోనూ ప్రపంచవ్యాప్తంగానూ ఉన్న యురేనియం గనుల అనుభవమేమిటో చెప్పాలి. జరగగల హానినీ, ఇతర గనులలో జరిగిన హానినీ నివారించడానికి నిర్వాహకులు ఏం చేయబోతారో, ఏ రకమైన జాగ్రత్తలు తీసుకోబోతారో చెప్పాలి. ఆ చర్యల గురించి నిపుణులు, అనుభవజ్ఞులు ఏమంటున్నారో చెప్పాలి.

ఇవన్నీ ప్రజలకు అర్థమయ్యేటట్లు వివరించిన తరువాత జరిపే ప్రజా విచారణకు అర్థం ఉంటుంది గానీ, ఇవేదీ చేయకుండ నిర్వహిస్తే ఆ విచారణను 'తంతు' అనక తప్పదు.

రేపు 19న పెద్దగట్టులో జరగబోయేది అటువంటి 'తంతు' కాదని యురేనియం కార్పొరేషన్ అనగలదా? యురేనియం గనుల వల్ల పరిసర ప్రాంతాలలో నివసించే ప్రజలకు, గనిలో పనిచేసే కార్మికులకు జరగగల హాని గురించి ప్రపంచ వ్యాప్తంగా చాలా చర్చ జరిగింది. నిర్దిష్టమైన అను



భవమూ ఉంది. దాని గురించి రెండు వైపులా వాదనలున్నాయి. యురేనియం ఖనిజం తవ్వకం చేపట్టవద్దనే వారూ ఉన్నారు, తగు జాగ్రత్తలు తీసుకుంటే ఫరవాలేదనే వారూ ఉన్నారు. వీరిలో ఎవరి వాదన సరయినదనేది తరువాతి సంగతి. ఈ అన్ని విషయాలనూ దృక్పథాలనూ వాటి పూర్వాపరాలనూ ప్రజలకు అర్థమయ్యేటట్టు వివరించి, ఆ వివరణకు తగు ప్రచారం కల్పించి 'ప్రజా విచారణ' నిర్వహిస్తారా లేక పెళ్లిలో అయ్యగారు కదా అర్థం కాని భాషలో మంత్రాలు చదివి 'ఆశీర్వదించండి' అన్నట్టు ప్రజల ఆశీర్వాదం కోరుకుంటారా?

ప్రభుత్వం, యురేనియం కార్పొరేషన్ చెప్పవు కాబట్టి మేము చెప్పే ప్రయత్నం చేస్తాం. మరీ సాంకేతిక వివరాలలోకి పోకుండ చెప్పే ప్రయత్నం చేస్తాం.

మన చుట్టూ ఉన్న పదార్థాలు చాలావరకు తమంతట తాము తమ స్వభావాన్నీ స్వరూపాన్నీ మార్చుకోవు. అంటే అవి 'స్థిరంగా' ఉంటాయి. వాటిని మనం పనిగట్టుకొని బాగా వేడి చేస్తేనో మరొక రకమైన ఒత్తిడికి గురిచేస్తేనో అవి మారుతాయి.

కానీ కొన్ని పదార్థాలు 'అస్థిర'మయినవి. అవి వాటంతటవే మారుతుంటాయి. దీనికి కావలసిన చర్య వాటి కడుపులోనే నిత్యం జరుగుతుంటుంది. అవి మారే క్రమంలో కొన్నిరకాల విద్యుదయస్కాంత స్వభావం గల కణాలనూ కిరణాలనూ లేక అణుధార్మిక శక్తినీ తమ పరిసరాలలోకి వదులుతుంటాయి.

కరపత్రం

యురేనియం అటువంటి 'అస్థిర' పదార్థాలలో ఒకటి. అది తనంతట తాను థోరియంగా, రేడియంగా, రేడాన్ వాయువుగా మారుతూ ఉంటుంది. ఈ క్రమంలో కొన్ని హానికర పదార్థాలను, శక్తినీ గాలిలోకి వదులుతుంటుంది.

ఒక యురేనియం ముద్దను మనం పక్కన పెట్టుకుని కూర్చున్నా మనకేం కాదుగానీ యురేనియం కలిసిన ధూళిని పీల్చినట్టయితే అది శరీరంలోకి పోయి చాలా హాని కలిగించగలదు. యురేనియం గనిలో పని చేసే కార్మికులు ఆ ధూళి పీల్చక తప్పదు. వారికి ఊపిరితిత్తుల క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని యూరప్‌లో యురేనియం గనులను అధ్యయనం చేసిన వారు చెప్పారు.

కార్మికులకు జరగగల హానిని అరికట్టడానికి గని లోపల వెంటిలేటర్లు అమర్చి ఆ ధూళిని ఎప్పటికప్పుడు బయటికి పంపించేటట్టయితే దాని ప్రభావం తీవ్రత తగ్గవచ్చునేమోగానీ అది చుట్టుపక్కలనున్న పర్యావరణంలో కలిసి పరిసరాలలో నివసించే ప్రజలకు హాని చేయగలదు.

దీనిని నివారించగల చిట్కా ఏదయినా యురేనియం కార్పొరేషన్ దగ్గర ఉన్నట్టయితే తెలుసుకోవడానికి మాకు అభ్యంతరం లేదుగానీ, ఈ సంగతే ప్రజలకు చెప్పకుండ ఆశీర్వదించమంటే ఎట్లా?

పెద్దగట్టు – లంబాపూర్‌లలో తవ్వితీసిన ఖనిజాన్ని మల్లాపూర్‌లో నిర్మించబోయే కార్ఖానాలో 'శుద్ధి' చేస్తారు. శుద్ధి చేయగా వచ్చే యురేనియం ఆక్సైడ్‌ను హైదరాబాద్‌లోని ఎన్ఎఫ్‌సికి పంపించి దాన్నించి యురేనియం వెలికి తీస్తారు.

యురేనియం ఖనిజాన్ని 'శుద్ధి' చేయగా దాని నుంచి వచ్చే యురేనియం ఆక్సైడ్ ఒక

శాతం కంటె తక్కువ ఉంటుంది. తక్కిన 99 శాతం 'వ్యర్థ పదార్థ'మే ఉంటుంది. ఈ వ్యర్థ పదార్థాన్ని అంతకు మూడురెట్లు నీళ్లతో కలిపి బురద లాంటిది చేసి నేలలో తవ్వి తొట్లలో పోస్తారు. అంటే మల్లాపూర్ పరిసరాలలో వ్యర్థపదార్థాల కోనేరులు ఉండబోతాయి. (టెయిలింగ్ పాండ్ అంటారు వీటిని).

ఈ వ్యర్థపదార్థాలలో ఏమేముంటాయి? ఒకప్పుడు యురేనియంగా ఉండి కాలక్రమంలో దానిలోని అంతర్గత మార్పు వల్ల థోరియంగా, రేడియంగా రూపాంతరం చెందిన పదార్థాలు ఉంటాయి. వీటి రూపాంతరమైన రేడాన్ అనే వాయువు ఈ కోనేరుల నుంచి నిత్యం గాలిలోకి కలుస్తూనే ఉంటుంది. పెద్ద మొత్తంలో కాకపోవచ్చు. కొంచెమే కావచ్చు, కాని కలుస్తూనే ఉంటుంది. ఈ వాయువు కూడా కాన్సర్ రోగకారిణి.

ద్రవరూపంలో ఉన్న ఈ వ్యర్థ పదార్థం కోనేరుల నుంచి భూగర్భ జలాలలోకి, పక్కనున్న నదులు, వాగులలోనికి పోతుందనేది ఇతర దేశాల అనుభవం తెలిపే విషయం. ముఖ్యంగా రేడియం భూగర్భ జలాలలో పెద్దమోతాదులో చేరినట్టు కనుగొన్నారు.

మల్లాపూర్ సమీపంలో నాగార్జునసాగర్ రిజర్వాయర్ ఉండి భూగర్భ జలాలను అది తనవైపు గుంజుకుంటుంది. వాటితోపాటు ఈ వ్యర్థ పదార్థాలనూ గుంజుకోదా? నాగార్జునసాగర్ అయిదు జిల్లాలలో లక్షల ఎకరాలకు సాగునీరు ఇచ్చే ప్రాజెక్టు. దానిని రేడియంతో కలుషితం చేసే ప్రమాద మున్న ప్రయోగాన్ని సులభంగా అనుమతిద్దామా?

పెద్దగట్టు–లంబాపూర్‌లలో ఉన్న ఖనిజాన్ని 20 సంవత్సరాలలో తీసేయడం జరుగుతుందనీ ఆ తరువాత ఆ గనులను మూసేయడం జరుగుతుందనీ యురేనియం కార్పొరేషన్ అంటున్నది. కానీ ఆ 20 సంవత్సరాలలోని అణుధార్మికత కొన్ని వేల సంవత్సరాలు సజీవంగా ఉంటుంది. అమెరికాలోని యురేనియం వ్యర్థపదార్థాల 'టెయిలింగ్ పాండ్స్' సమీపంలో నివసించేవారు సంవత్సరానికి సగటున అయిదుగురు చొప్పున క్యాన్సర్ రోగానికి బలి అవుతున్నారని అంచనా. యురేనియం కార్పొరేషన్ వారు పెద్ద అడిశర్లపల్లిని విడిచిపెట్టి వెళ్లిపోయిన తరువాత కొన్ని వేల సంవత్సరాలు ఇది జరుగుతూనే ఉంటుందని దీనిని బట్టి భావించవచ్చు.

ఇంతటి ప్రమాదమేమీ లేదనీ, ఇదంతా అతిశయోక్తి అని తాము రుజువు చేయగలమనీ, ఏ కొంచెం ప్రమాదం ఉన్నా దానిని నివారించే శక్తి తమ దగ్గర ఉందనీ యురేనియం కార్పొరేషన్ వారు వాదించదలచుకుంటే మేము వినడానికి సిద్ధమే. ప్రతివాదానికీ సిద్ధమే. కానీ ఈ సమస్యలు ఉన్నాయని ప్రజలకు చెప్పకుండా, యురేనియం మైనింగ్ విషయంలో తీవ్ర అభ్యంతరాలు ప్రపంచ వ్యాప్తంగానే వ్యక్తమయ్యాయని చెప్పకుండా, తమ జవాబు ఏమిటో చెప్పకుండా 'ప్రజా విచారణ' జరిపేసి 'ఓకే' అనిపించేసుకుందామని చూస్తే ఎట్లా?

మన దేశానికి యురేనియం మైనింగ్ కొత్త కాదు. జార్ఖండ్ రాష్ట్రంలోని జాదుగూడలో యురేనియం గనులున్నాయి. వాటి దుష్ఫలితాల గురించి తీవ్ర వాదోపవాదాలు జరుగుతున్నాయి. యురేనియం ధూళి పీల్చగా వచ్చిన రోగాల వల్ల జాదుగూడలో 1994లో 17 మంది కార్మికులు చనిపోయారనీ, 1995లో 14 మంది, 1996లో 19 మంది, 1997లో 21 మంది చనిపోయారని స్థానిక ఆందోళన కారుల అంచనా. రేడియేషన్ కారణంగా సంభవించే జన్యు సంబంధమైన వైపరీత్యాల వల్ల కార్మికుల పిల్లలు అవిటివాళ్లుగా పుడుతున్నారని వారి అభియోగం. అణుధార్మిక పదార్థాలు నిండి ఉన్న



వ్యర్థపదార్థాల 'టెయిలింగ్ పాండ్'ల కారణంగా పశువులు, పిల్లలు రోగాల పాలవుతున్నారని వారి ఆరోపణ.

యురేనియం కార్పొరేషన్ వీటిని ఖండించింది. ఈ మాత్రం రోగాలూ చావులూ సగటున ఎక్కడయినా ఉండేవేననింది. ఈ వివాదం ఇప్పుడు సుప్రీంకోర్టు ముందు ఉంది. సుప్రీంకోర్టు అందులోని సత్యాసత్యాలు నిర్ధారించడానికి ఒక నిపుణుల కమిటీని నియమించింది. ఆ కమిటీ తన పని ఇంకా పూర్తిచేయలేదు. తన నివేదిక ఇవ్వలేదు. అంతలోనే నల్లగొండ మీద వచ్చి ఎందుకు పడినట్టు? ఆ నివేదిక వచ్చేదాకా ఆగలేనంత అత్యవసరం యురేనియంతో ఏమొచ్చింది?

ఇంతా చేసి యురేనియం దేనికి కావాలి? అణుశక్తిని ఉత్పత్తి చేయడం తప్ప దానికి వేరే ప్రయోజనమేదీలేదు. అణుశక్తితో బాంబులు చేయొచ్చు. కరెంటు ఉత్పత్తి చేయొచ్చు. అణు బాంబులను ప్రపంచమంతటా మానవత్వం ఉన్న వాళ్లు వ్యతిరేకిస్తున్నారు. వాటిని ఆయుధంగా ప్రయోగిస్తే లక్షలాదిగా జనం చనిపోవడమే కాక భావితరాలు కూడ అంగవైకల్యంతో పుడతారు. అటువంటి అణుబాంబు మనకొద్దని మనం నిర్ద్వందమైన వైఖరి తీసుకోవాలి. ఇక కరెంటు విషయానికొస్తే దానిని వేరే పద్ధతులలో ఉత్పత్తి చేసుకోవచ్చు. చేసుకుంటున్నాం. అణు విద్యుత్తు చవక అంటారుగానీ దాని ఉత్పత్తి వల్ల జరగగల పర్యావరణ నష్టాన్నీ, ప్రమాదాలు జరిగే అవకాశాన్నీ దృష్టిలో పెట్టుకున్నప్పుడు అన్నిటికంటే అదే ఖరీదయిన ప్రక్రియ అని ఇప్పుడు సర్వత్రా గ్రహించారు. అందుకే పాశ్చాత్య దేశాలు అణు విద్యుత్తు కేంద్రాలను కొత్త గా నెలకొల్పడం మానేశాయి. మనకు మాత్రం అవి ఎందుకు? మన దగ్గర బొగ్గు విస్తారంగా ఉంది. జలవిద్యుత్తు ఉత్పత్తికి అవసరమైన నదీ ప్రవాహం ఉంది. సౌర విద్యుత్తును ఉత్పత్తి చేయడం మీద దృష్టి కేంద్రీకరించి పరిశోధనలు జరిపినట్టయితే శాశ్వతంగా మన ఇంధన సమస్యను పరిష్కరించుకోవడానికి కావలసినంత ఎండ ఉంది. ఇక యురేనియం తవ్వకాలు ఎందుకు?

చర్చించవలసిన అసలు విషయాలు ఇవి కాగా, యురేనియం కార్పొరేషన్ పెద్దఅడిశర్లపల్లి మండలంలో తాను పెద్దఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పించబోతున్నట్టు, 'అభివృద్ధి' తీసుకు రాబోతున్నట్టు ప్రజలలో అభిప్రాయం కలిగించి వారి మద్దతును కూడగట్టి పర్యావరణ సంబంధమైన అభ్యంతరాలను దాటవెయ్యాలని చూస్తున్నది. భ్రమలలో పడే ప్రజలను మేము తప్పుపట్టడం లేదుగానీ యురేనియం కార్పొరేషన్ అనుసరిస్తున్న ఈ ఎత్తుగడ పట్ల మా నిర సన తీవ్రంగా వ్యక్తం చేస్తున్నాం.

వారి రిపోర్టు ప్రకారమే వారు కల్పించబోయే ఉద్యోగాలు 442. అందులో సాంకేతిక నైపుణ్యం, శిక్షణ అవసరమైనవే అత్యధికం ఉండబోతాయి. పెద్దగట్టు వంటి గ్రామాల ప్రజలకు 30 లేక 40 ఉద్యోగాలు ఉంటే ఎక్కువ. స్థానికులకు ఉద్యోగాలు కార్పొరేషన్ నియమాలను అనుసరించి ఇస్తామని తమ రిపోర్టులో రాశారుగానీ ఆ నియమాలేమిటో చెప్పలేదు. చివరికి హమాలి పని మాత్రమే దక్కేటట్టయితే దానికోసం ఇంత ప్రమాదం కొనితెచ్చుకోవడం ఎం దుకు? హమాలి పని మిర్యాలగూడెం రైస్‌మిల్లులలో దొరకదా, సిమెంటు ఫ్యాక్టరీలలో దొర కదా? కాగా, ఏ ఉద్యోగాలు దొరికినా అవి 20 సంవత్సరాల కోసమే. ఆ తరువాత గనులు

ఉండవు. కానీ కాలుష్య ప్రమాదం మాత్రం నిరంత రం కొనసాగుతుంది.

19వ తేదీన ప్రజా విచారణకు హాజరు కాబోయే ప్రజలు, ఉద్యమకారులు ఈ విషయాలన్నీ దృష్టిలో ఉంచుకొని యురేనియం కార్పొరేషన్‌ను నిలదీయాలని కోరుతున్నాం.

- ఆగస్ట్ 19న జరిగే తంతుతో ప్రజావిచారణను ముగించడానికి వీలులేదు.
- కాలుష్య సంబంధమైన సమాచారాన్నీ, వివాదాలనూ, ఇతర ప్రాంతాలలో జరిగిన యురేనియం తవ్వకాల అనుభవాన్నీ ప్రజలకు అర్థం అయ్యే పద్ధతిలో వివరించి, సమాచారం గ్రామ పంచాయతీ ఆఫీసులలో ఉంచి ఆ తరువాత ప్రజావిచారణ కొనసాగించాలి.
- జాదుగూడ కాలుష్యం సమస్య గురించి అధ్యయనం చేయడానికి సుప్రీంకోర్టు నియమిం చిన నిపుణుల కమిటీ నివేదిక వెలుగు చూసేవరకు పెద్దగట్టు-లంబాపూర్‌లలో తవ్వకం మొదలు పెట్టకూడదు.
- పర్యావరణ ఉద్యమకారులపైన స్థానిక ప్రజలను కృత్రిమ హామీలతో రెచ్చగొట్టే నీచమైన ఎత్తుగడను యురేనియం కార్పొరేషన్ విడిచిపెట్టాలి.
- ఈసారి జరిగే ప్రజా విచారణ పెద్దగట్టులో కాక నల్లగొండలో గానీ, మిర్యాలగూడెంలో గానీ జరపాలి.

నల్లగొండ 16.8.2003



# 610 జీవోను వెంటనే అమలు చేయాలి

తెలంగాణ పట్ల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చూపుతున్న వివక్షకు 610 జివో ఒక సాక్ష్యం. 1985లో జారీఅయిన ఈ ప్రభుత్వ ఉత్తర్వు మార్చి 31, 1986 నాటికే అమలుకావాలి. కానీ ఈనాటికీ అమలుకు నోచుకోలేదు. 610 జీవో అమలుకు తగు సూచనలిమ్మని ప్రభుత్వం నియమించిన కమిటీల నివేదికలు కూడా పాతబడుతున్నాయి. కానీ ఆ జీవో మాత్రం అమలుకావడం లేదు.

తెలంగాణ ప్రాంతంలో ఆరు సూత్రాల పథకం అమలులో జరిగిన అవకతవకలను సరిచేయడానికి, అక్రమాలను రూపుమాపటానికి ఈ జీవో వచ్చింది. కనుక జీవో విశిష్టత తెలుసుకోవాలంటే ముందుగా ఆరుసూత్రాల పథకం గురించి తెలుసుకోవాలి.

1973లో జారీఅయిన ఆరుసూత్రాల పథకాన్ని తెలంగాణవాసులు కోరలేదు. ఇది జై ఆంధ్ర ఉద్యమ ఫలితంగా కోస్తా ఆంధ్ర ప్రయోజనాలను కాపాడటానికి పుట్టుకొచ్చింది. 1956లో పెద్దమను షుల ఒప్పందం ఉద్యోగ రంగంలో తెలంగాణకు ఇచ్చిన రక్షణలన్నింటినీ ఆరుసూత్రాల పథకం నీరుగార్చింది.

1973 వరకు కొనసాగిన పెద్దమనుషుల ఒప్పందం ప్రకారం తెలంగాణలో కనీసం 15 సంవత్సరాల స్థిరనివాసమున్న వారికే ఈ ప్రాంతంలో ఉద్యోగం పొందే అర్హత ఉండేది. దీన్నే ముల్కీ నిబంధన అనేవారు. ముల్కీ నిబంధనల వల్ల తెలంగాణ ప్రాంత ఉద్యోగాలను తెలంగాణ వాసులే పొందే అవకాశం కలిగింది. మిగతా ప్రాంత ఉద్యోగాలను, రాష్ట్ర స్థాయి ఉద్యోగాలను ఓపెన్ కాంపిటీషన్‌లో ఎంపికైన వారితో భర్తీచేసేవారు. రాష్ట్ర పాలనా యంత్రాంగంలో తెలంగాణ వాసులకు తగు భాగస్వామ్యం కల్పించడానికే ముల్కీ నిబంధనలు ఉనికిలోకి వచ్చాయి. ఆరు సూత్రాల పథకం తెలంగాణ ప్రాంతంలోని ఉద్యోగాలను తెలంగాణవాసులకే రిజర్వు చేసిన ముల్కీ నిబంధనలను రద్దుచేసింది. వాటి స్థానంలో దిగువ పద్ధతిని ప్రతిపాదించింది.

నాన్‌గెజిటెడ్ ఉద్యోగాలైన తహసిల్దారు, జూనియర్ ఇంజనీరు, సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్థాయిలేక అంతకన్నా దిగువస్థాయి ఉద్యోగాలకు స్థానికులనే ఎంపిక చేయాలి. ఈ నియమం ప్రకారం పైన పేర్కొన్న ఉద్యోగాలకు స్థానికులే అర్హులు. ఉద్యోగం ఏ ప్రాంతంలో ఉంటే ఆ ప్రాంతం వారినే నియమించాలి. అంటే తెలంగాణవాసులకేకాదు ఆంధ్ర రాయలసీమ వాసులకు కూడా తమ ప్రాంత ఉద్యోగాలలో రిజర్వేషన్ లభించింది. నిజానికి తెలంగాణ వాసులెవ్వరూ తమ ప్రాంతాన్ని వదిలి ఇతర ప్రాంతాలలో ఉద్యోగాలను కాజేయలేదు. కాబట్టి అక్కడ లోకల్ కాండిడేట్లకు లోకల్ ఉద్యోగాలలో రిజర్వేషన్లు అనవసరం. ఎక్కడైనా బలహీనులకు విద్యా, ఉద్యోగ రంగాలలో ప్రాతినిధ్యం కల్పించడానికే రిజర్వేషన్లు అమలు చేస్తారు. ఆరు సూత్రాల పథకం ఈ నియమానికి విరుద్ధమైనది.

ఆరు సూత్రాల పథకానికి చట్టబద్ధత కల్పించడానికి నాటి కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగాన్ని సవరించింది. ఈ సవరణ వలన రాష్ట్రాన్ని వివిధ జోన్లుగా వర్గీకరించే అధికారం, ఆయా జోన్లలోని ఉద్యోగాలలో స్థానికులకు రిజర్వేషన్ కల్పించే అధికారం రాష్ట్రపతికి సంక్రమించింది. కొత్తగా వచ్చిన అధికారంతో రాష్ట్రపతి జారీచేసిన ఆర్డరు రాష్ట్రాన్ని ఆరు జోన్లుగా విభజించింది. హైదరాబాద్ ఆరవ జోనులో భాగమైంది. ఒక వ్యక్తి ఏదేనీ జోనులో లోకల్ క్యాండిడేటుగా గుర్తింపు పొందడానికి కనీసంగా ఆ జోనులో నాలుగు సంవత్సరాలు స్థిరనివాసముంటే చాలు. ఈ నియమం వలన నాలుగు సంవత్సరాలు తెలంగాణలో నివాసముంటే చాలు తెలంగాణ వాసులైపోవచ్చు. ఆవిధంగా ప్రాంతేతరులు తెలంగాణలో ఉద్యోగం పొందడానికి అవకాశం కలిగింది.

ఇదిగాక రాష్ట్రపతి ఆర్డరు కొన్ని ఉద్యోగాలను లోకల్ కేడర్స్‌గా గుర్తించింది. వీటికి లోకల్ అభ్యర్థులే అర్హులు. లోకల్ కేడర్స్‌లోని ఉద్యోగ స్థాయిని బట్టి లోకల్ అభ్యర్థులకు 60-80 శాతం ఉద్యోగాలు రిజర్వు చేయబడినాయి. క్లర్కు ఉద్యోగాలలో 80 శాతం రిజర్వేషన్ ఉండగా ఉద్యోగ స్థాయి పెరిగినకొద్దీ రిజర్వేషన్ పాలు తగ్గుతుంది. లోకల్ కేడర్స్‌లో స్థానిక అభ్యర్థులకు రిజర్వేషన్ పోగా మిగిలిన ఉద్యోగాలకు ఓపెన్ కాంపిటీషన్‌లో రాష్ట్రంలోని ఏ ప్రాంతం వారినైనా ఎన్నుకోవచ్చు. రాష్ట్రపతి ఉత్తర్వులో మరొక ముఖ్యమైన అంశమేమిటంటే లోకల్ కేడర్స్‌కు చెందని ఉద్యోగాలలో (సచివాలయం, డైరెక్టరేట్లు, కార్పొరేషన్లు, భారీ అభివృద్ధి ప్రాజెక్టులు తదితర రాష్ట్ర స్థాయి ఆఫీసులకు చెందిన ఉద్యోగాలలో) రాష్ట్రపతి ఆర్డరు ప్రకారం అన్ని ప్రాంతాల వారికి న్యాయ సమ్మతమైన వాటా కల్పించాలి.

రాష్ట్రపతి ఉత్తర్వులను తెలంగాణలో మాత్రమే అమలు చేయలేదు. సచివాలయం స్థాయి విభాగాలలో తెలంగాణవాసులకు న్యాయ సమ్మతమైన వాటా లభించలేదు. ఇక లోకల్ కేడర్స్ విషయంలో కూడా తెలంగాణలో ఆరుసూత్రాల పథకాన్ని పాటించనేలేదు. బదిలీల ద్వారా, డిప్యుటేషన్ ద్వారా, బోగస్ సర్టిఫికెట్ల ద్వారా, స్థానికేతరులను అక్రమంగా తెలంగాణకు తీసుకొచ్చారు. ఇదికాక స్థానికేతరులు రావడానికి మరొక తప్పుడు పద్ధతిని అవలంబించారు. అదేమిటంటే ఓపెన్ కాంపిటీషన్ పోస్టులను స్థానికేతరులతో నింపారు. ఓపెన్ కాంపిటీషన్ పోస్టులకు లోకల్, నాన్‌లోకల్ అభ్యర్థులిద్దరినీ సమానంగా పరిగణించి ఆ ఇద్దరిలో మెరిట్ కలవారినే నియమించాలి. కానీ అందుకు భిన్నంగా ఓపెన్ కాంపిటీషన్ పోస్టులను నాన్‌లోకల్ అభ్యర్థులకు రిజర్వేషన్‌గా పరిగణించి వారినే నియమిస్తూ వచ్చారు.

ఈ విధంగా తెలంగాణలో స్థానికేతరులు వివిధ ఉద్యోగాలలో ప్రవేశించారు. ముల్కీ నిబంధనల వలన వచ్చిన హక్కులను హరించి వేసిన ఆరు సూత్రాల పథకం కూడా సరిగ్గా అమలుకాలేదు. ఈ అక్రమాలను రూపుమాపటానికే 610 జీవో వచ్చింది.

ఈ గవర్నమెంట్ ఆర్డర్ ఆరు సూత్రాల నిబంధనలకు విరుద్ధంగా నియమించబడిన నాన్‌లోకల్ ఉద్యోగస్తులను వారి స్వస్థలాలకు పంపించాలని సూచించింది. అంతేకాక వివిధ జోన్ల మధ్య విచ్చలవిడిగా బదిలీ చేయరాదని, తెలంగాణ వారికి రాష్ట్రస్థాయి ఉద్యోగాలలో సముచితంగా అవకాశాలు కల్పించాలని, బోగస్ సర్టిఫికెట్లను పెట్టిన వారిపై చర్య తీసుకోవా లని, ఆరు సూత్రాల పథకం వచ్చిన తర్వాత జరిగిన నియామకాలన్నింటిని పరిశీలించాలని, అక్రమ బదిలీలు, నియామకాలు ప్రమోషన్లపై తెలంగాణ అభ్యర్థులు పెట్టుకొన్న అప్పీళ్ళను త్వరితంగా పరిష్కరించాలని ఈ



జీవో పేర్కొన్నది. ఈ చర్యలన్నీ 31 మార్చి 1986లోగా పూర్తిగా అమలుకావలసి ఉండె. కానీ ఇప్పటికీ జీవో అమలుకు నోచుకోలేదు. 1985లో జీవో జారీ అయిన నాటికే తెలంగాణలో 59 వేల మంది స్థానికేతరులు అక్రమంగా నియమించబడినారు. జీవో అమలుకాక పోవడం వలన తెలంగాణలో స్థానికేతరుల నియామకాలు అడ్డూ అదుపు లేకుండా కొనసాగాయి. ఇప్పుడు దాదాపు ఆ సంఖ్య లక్షన్నర దాటింది.

తెలంగాణవాదం బలపడిన తరువాతనే 610 జీవో మళ్ళీ వెలుగులోకి వచ్చింది. జీవోను అమలు చేయాలన్న డిమాండ్ బలపడింది. ఒత్తిడికి తలవంచి ప్రభుత్వం జీవో అమలుకు సూచనలివ్వమని, ఆరుసూత్రాల పథకం అమలును సమీక్షించమని కోరుతూ మాజీ ఐఎఎస్ అధికారి గిర్‌గ్లానిని ఏకసభ్య కమిషనుగా నియమించింది. కమిషన్ మూడు నెలల్లోనే తొలి నివేదికను సమర్పించింది. కమిషన్ తన నివేదికలో ఆరుసూత్రాల పథకం ఉల్లంఘన జరిగిన తీరును వివరించింది. తెలంగాణలో ఆరు సూత్రాల పథకాన్ని పటిష్టంగా అమలు చేయడానికి తగు సూచనలు చేసింది. నివేదికపై అసెంబ్లీలో వాడిగా వేడిగా చర్చ జరిగింది. ఫలితంగా ఆరు సూత్రాల పథకం అమలును సమగ్రంగా పరిశీలించడానికి సభా సంఘం నియమించబడింది. సభా సంఘం కూడా మధ్యంతర నివేదికను సమర్పించింది. ఇంత జరిగినా ప్రభుత్వం 610 జీవోను గానీ, సభా సంఘం నివేదికను గానీ, గిర్‌గ్లాని కమిటీ నివేదికనుగాని అమలు చేయలేదు. వాటి అమలుకు సభలో ఇచ్చిన వాగ్దానాలను కూడా నిలబెట్టుకోలేదు. ఏ ప్రాంతం వారికి ఆ ప్రాంతం ఉద్యోగాలన్నీ దక్కాలన్న ఆరుసూత్రాల పథకం, దాన్ననుసరించి వచ్చిన రాష్ట్రపతి ఆర్డరు రాష్ట్రమంతటా అమలవుతున్నాయి ఒక్క తెలంగాణలో తప్ప. తెలంగాణ పట్ల రాష్ట్రంలో కొనసాగుతున్న వివక్ష వల్లనే ఆరు సూత్రాల పథకం కూడా అమలుకు నోచుకోవడం లేదు. కనుక 610 జివోను గాని, గిర్‌గ్లానీ కమిషన్ నివేదికను గాని, సభా సంఘం నివేదికను గాని అమలు చేయాలని కోరడమంటే తెలంగాణ పట్ల కొనసాగుతున్న వివక్షను వ్యతిరేకించడమే. వివక్షను చూపడమంటే మనుషులందరినీ ప్రభుత్వాలు సమానంగా చూడాలన్న సమానత్వపు హక్కు తెలంగాణవాసుల విషయంలో ఉల్లంఘించుతున్నట్లే లెక్క. అందుకే మానవహక్కుల వేదిక సమానత్వపు హక్కును గౌరవించి, 610 జివో తదితర నివేదికలను అమలు చేయాలని డిమాండు చేస్తున్నది.

మెదక్ 24.8.2003

# కృష్ణా జలాల జగడం

## కొన్ని వాస్తవాలు, కొన్ని సూచనలు

కృష్ణా నది నీటి గురించి కొంత కాలంగా రాష్ట్రంలోని మూడు ప్రాంతాలలోనూ జరుగు తున్న ఆందోళనలను చూస్తున్నాం. ఎవరికి వారు మా ప్రాంతానికి నీళ్లు మొదట ఇవ్వాలని అడుగుతున్నారని అర్థమవుతున్నదే తప్ప ఇందులో న్యాయాన్యాయాలు అర్థం చేసుకోవడానికి కావలసిన సమాచారం ప్రజల దగ్గర లేదు, పత్రికలు ఇవ్వడంలేదు.

ఒకటి మాత్రం స్పష్టం అయ్యే ఉండాలి. కృష్ణా నదిలో మామూలుగా వచ్చేదానికంటె ఈ సంవత్సరం తక్కువ నీళ్లు వచ్చాయి కాబట్టి వచ్చిన నీటిని ఎవరికి ముందు ఇవ్వాలి – లేదా దానిని పంచడంలో ఎవరి అవసరాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి – అన్న తగవు వచ్చిందని అర్థం అయ్యే ఉండాలి. ఇది ఎప్పుడయినా వచ్చి ఉండగల సమస్యే కాబట్టి దీని పరిష్కారానికి ఒక నియమం ఏదీ ఇన్నాళ్లూ ఎందుకు ఏర్పరచుకోలేదు అన్న సందేహం కూడా వచ్చే ఉండాలి.

కిందటి సంవత్సరం దేశవ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు ఉన్న సంగతి తెలిసిందే. అందువల్ల అన్ని ప్రాజెక్టులలోనూ నీటిమట్టం బాగా అడుగంటింది. శ్రీశైలం, నాగార్జున సాగర్‌ల నుండయితే కనీస నీటి నిలువ మట్టాన్ని దాటి నీటిని దిగువకు మన రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. దానికి తోడు ఈ సంవత్సరం కూడా కృష్ణా నదికి ప్రధానంగా నీళ్లు అందిచ్చే పడమటి కనుమలలో మళ్లీ వర్షాభావ పరిస్థితులు ఉన్నాయి. మన రాష్ట్రంలో (మొత్తంమీద) సగటు వర్షపాతం ఉన్నప్పటికీ కృష్ణానదిలో నీళ్లెక్కువ లేకపోవడానికి కారణం ఆ నదిలోకి నీటిని పారించే 'కాచ్‌మెంట్' ప్రధానంగా కర్నాటక, మహారాష్ట్రలలో ఉండడం, అక్కడ ఈ సంవత్సరం కూడా వర్షాభావ పరిస్థితులు ఉండడం.

కృష్ణానది మీద (దాని ఉపనదులైన కొయ్‌నా, తుంగభద్ర, భీమ, ఘటప్రభ, మూసి మొదలైన నదులను కలుపుకొని) మహారాష్ట్ర, కర్నాటక, ఆంధ్రప్రదేశ్‌లు మూడింటిలోనూ ప్రాజెక్టులున్నాయి. ఈ మూడు రాష్ట్రాలూ ఎంతెంత నీళ్లు ఆ నది నుంచి తీసుకోవచ్చునో చెప్పే బచావత్ అవార్డు ఉంది.

బచావత్ అవార్డు కృష్ణానదిలో నాలుగింట మూడు సంవత్సరాలు (అంటే 75 శాతం భరోసాతో) 2060 టిఎంసిల నీరు ఉంటుందని అంచనా వేసి, అందులో 800ల టిఎంసిల పైన ఆంధ్రప్రదేశ్‌కు హక్కు ఇచ్చింది. (695 టిఎంసిల పైన కర్నాటకకు, 565 టిఎంసిల పైన మహారాష్ట్రకు ఇచ్చింది). అంతేకాక, ప్రాజెక్టుల నుంచి పొలాలకు పారించే నీటిలో కొంత భాగం తిరిగి నదిలోకి పోతుందని అంచనా వేసి ఆ లెక్క కింద ఆంధ్రప్రదేశ్‌కు మరొక 11 టిఎంసిల నీటిపైన హక్కు ఇచ్చింది. అంటే ఆంధ్రప్రదేశ్‌కు మొత్తం 811 టిఎంసిల నీటిపైన హక్కు ఉంది.

టిఎంసి అంటే ఎంతో తెలుసుకోకపోతే ఈ అంకెలూ సంఖ్యలూ అర్థంకావు కాబట్టి ఒక టిఎంసి అంటే వంద కోట్ల ఘనపుటడుగులు అని చెప్పుకోవాలి. వందకోట్ల ఘనపుటడుగుల



నీటిని ఊహించుకోలేము కాబట్టి దానిని అర్థం చేసుకోవడానికి ఒక వివరణ ఇవ్వడం ఉచితంగా ఉంటుంది. మనం ఏ ప్రాంతం వారిమయినా చెరువులను చూసే ఉంటాము. ఒక టిఎంసిలో మూడవ వంతు నీటి నిలువ సామర్థ్యం ఉండే చెరువు మామూలుగా పెద్ద చెరువుగా భావించబడు తుందని చెప్పుకుంటే ఒక అంచనా వస్తుందనుకుంటాము.

ఒక టిఎంసి నీటితో ఎంత పొలం సాగు అవుతుందో తెలుసుకోవడం కూడా ఈ సందర్భంలో ఉపయోగపడుతుంది. ఒక టిఎంసి నీటిని మాగాణి (తరి) సాగుకు వాడేటట్టయితే 6,000 ఎకరాలకు, ఆరుతడి (ఇరిగేటెడ్-డ్రై) పంటకు పెట్టేటట్టయితే 10,000 ఎకరాలకు సరిపోతుందని అంచనా. ఇతర నీటి వనరులతో కలుపుకొని పొదుపుగా వాడుకునేటట్టయితే ఇంకా ఎక్కువ భూమికి పారించుకోవచ్చునని వేరే చెప్పనవసరం లేదు.

ఇప్పుడు మన రాష్ట్రం ఎదుర్కుంటున్న సమస్యను తిరిగి ప్రస్తావిద్దాం. నాలుగింట మూడు సంవత్సరాలు నదిలో 2060 టిఎంసిల నీరు ఉంటుందని అంచనా వేసి మూడు రాష్ట్రాలకూ పైన చెప్పిన పద్ధతిలో బచావత్ అవార్డు పంచిందని చెప్పుకున్నాము. ఆ 2060 టిఎంసిల మేరకూ ప్రాజెక్టులు కట్టేసుకున్న తరువాత ఏ సంవత్సరమైనా నదిలో అంతకంటె తక్కువ నీళ్లు వస్తే ఏమవుతుంది? నాలుగింట ఒక సంవత్సరం అది జరిగే అవకాశం ఉందని బచావత్ అవార్డే అంటుంది కాబట్టి ఇది వేసుకోనక్కరలేని ప్రశ్న కాదు.

బచావత్ అవార్డు మూడు రాష్ట్రాల మధ్య నది నీటిని పంపిణీ చేసే తీర్పే తప్ప రాష్ట్రం లోపలి విషయాలతో దానికి ప్రమేయం లేదు. రాష్ట్రాల మధ్య ఏం జరుగుతుందంటే ఎగువ రాష్ట్రం తన అవసరాల మేరకు తన ప్రాజెక్టులలో నీళ్లు నిలుపుకున్న తరువాతే దిగువకు నీళ్లు పంపుతుంది.

మరి రాష్ట్రం లోపల ఏం జరుగుతుంది? బచావత్ అవార్డులో దానికి జవాబు లేదు. ఒక రాష్ట్రానికి కేటాయించిన నీటి వాటాను ఆ రాష్ట్రం తన సరిహద్దుల లోపల ఏ విధంగా పంచుకుంటుందనే విషయంలో దానికే స్వేచ్ఛ ఉంటుందని బచావత్ అవార్డు అంటుంది. ఆల్మట్టి కేసులో ఇదే విషయాన్ని సుప్రీంకోర్టు ధృవీకరించింది.

స్వేచ్ఛ ఉన్న చోట బాధ్యత కూడ ఉంటుందని వేరే చెప్పనవసరం లేదు. నీళ్లు తక్కువ వచ్చిన సంవత్సరం రాష్ట్రంలోని ప్రాజెక్టుల మధ్య దానిని ఏవిధంగా పంచాలి? పై ప్రాజెక్టు తన అవసరాల మేరకు నిలుపుకున్న తరువాతే కిందికి పంపించాలా? లేకపోతే వచ్చిన నీటిని వచ్చినట్టు ఒక నిర్దిష్ట నిష్పత్తిలో అన్ని ప్రాజెక్టులకూ పంచాలా? రెండవదే జవాబయితే ఏ నిష్పత్తిలో పంచాలి? ఆయా ప్రాజెక్టుల సామర్థ్యం నిష్పత్తిలో పంచాలా? లేకపోతే కరువు ప్రాంతాలకు కొంచెం ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చే పద్ధతిలో నిష్పత్తిని నిర్ణయించాలా?

దీనికి అధికారికంగా ఏ జవాబూ లేదు. ఇన్నేళ్లలో ఈ ప్రశ్నలకు జవాబు చెప్పే ఒక విధానం గానీ, ఒక ఆనవాయితీ గానీ – చట్టం సంగతి సరేసరి – మన రాష్ట్ర పాలకులు రూపొందించలేదు. గడచిన నెల రోజులుగా మచిలీపట్నం నుంచి మిర్యాలగూడెం దాకా, మిర్యాలగూడెం నుంచి నంద్యాల దాకా ధర్నాలు, నిరాహార దీక్షలు చేపట్టిన రాజకీయ పార్టీలు దీని గురించి ప్రభుత్వాన్ని అడగవలసింది. కానీ ఈ పాపంలో అందరికీ భాగం ఉంది కాబట్టి అడగకుండా జాగ్రత్త పడ్డారు. ఒకో పార్టీ నాయకులు నంద్యాలలో ఒక

డిమాండుతో, మిర్యాలగూడెంలో ఇంకొక డిమాండుతో, మచిలీపట్నంలో వేరొక డిమాండుతో ఆందోళన చేపట్టారు. ఈ మూడు నాల్కల వైఖరికి ఏ పార్టీ మినహాయింపు కాదు.

ఏ నియమమూ లేకపోయినా ఇటువంటి సంక్షోభం ఇన్నాళ్లూ తలెత్తకపోవడానికి కారణం కర్నాటక తన వాటా నీటిమేరకు ప్రాజెక్టులు కట్టుకోవడానికి తొందరపడకపోవడం. 1990ల మధ్యభాగం దాకా కర్నాటక తన నీటి హక్కుల విషయంలో తాత్సారం చేస్తూ ఉండింది. (ఇది ఆ రాష్ట్రంలోని ప్రాంతీయ అసమానతలతో ముడిపడి ఉన్న విషయం). అంతేకాక మన రాష్ట్రం వాటాలో కొత్తగా మంజూరయిన జూరాల, శ్రీశైలం కుడిగట్టు కాలవ ప్రాజెక్టులు నత్తనడక నడుస్తూ ఉన్నాయి. అందువల్ల బెజవాడ దగ్గర కృష్ణా డెల్టాకు కేటాయించిన నీటి వాటా కంటె సగటున 400 టిఎంసిలు ఎక్కువ నీరు మూడేళ్ల కిందటి వరకు కృష్ణా నదిలో లభ్యమయ్యేవి. తీవ్ర వర్షాభావ సంవత్సరాలలో సహితం కృష్ణా డెల్టాకు తన వాటాకంటే 100 టిఎంసిలకు తక్కువ కాకుండా అదనపు నీరు లభించేది. ఆల్మట్టి పూర్తయిన తరువాతే తన వాటాకు కొంచెం ఇటూ అటూగా మాత్రమే నీళ్లు లభించే సగటు స్థితి డెల్టాకు వచ్చింది. ఈ సంవత్సరం నెలకొన్న అసాధారణ పరిస్థితులలో అందరిలాగా వారికి కూడా సాగునీటికి కటకట అయింది.

ఏ నియమమూ లేకపోతే ఏమవుతుందంటే బలవంతుల ఆటలే సాగుతాయి. ఒక నెల రోజులుగా రాష్ట్రంలో ఇదే చూస్తున్నాం. 'ఏమయినా సరే డెల్టా భూములను కాపాడుతాం' అని ముఖ్యమంత్రి పదే పదే ప్రకటిస్తున్నాడు. డెల్టా రైతులు కూడా రైతులే, వారికీ ప్రభుత్వం చేయూత ఇయ్యవలసిందే గానీ వారు మాత్రమే రైతులా? ఎగువ ప్రాంతం వ్యవసాయాన్ని కాపాడే బాధ్యత ప్రభుత్వానికి లేదా? ప్రభుత్వం అందరినీ కాపాడవలసిందే, నీటి వనరుల యినా ఏ వనరులయినా అందరికీ తగు మోతాదులో అందియ్యవలసిందే. కానీ అది నియమ బద్ధంగా ఉండాలి, ఆ నియమం న్యాయంగా ఉండాలి, ఆ న్యాయానికి ఒక ఉచితమైన ప్రమాణం ఉండాలి. వీటి దాఖలాలేవైనా ఈ నెల రోజులలో కనిపించాయా?

కడప, కర్నూలు జిల్లాలకు శ్రీశైలం రిజర్వాయర్ నుంచి ఒక చుక్క నీరు ఇయ్యాలన్నా శ్రీశైలంలో నీటిమట్టం 854 అడుగులు ఉండాలి. ఆ జిల్లాల ఆయకట్టుదార్ల అవసరాలు పూర్తిగా తీర్చడానికి కాదు, ఒక చుక్క నీరియ్యాలన్నా శ్రీశైలం రిజర్వాయర్‌లో నీటిమట్టం 854 అడుగులు ఉండక తప్పదు. పోతిరెడ్డిపాడు 'టేక్-ఆఫ్' లెవలే అంత. ఆ జిల్లాల వాళ్లు ఆ మాట అంటే ముఖ్యమంత్రి సెప్టెంబర్ 15 దాకా శ్రీశైలం నుంచి నీళ్లు కిందికి వదల బోమని హామీ యిచ్చాడు. సెప్టెంబర్ 15 నాటికి నీటిమట్టం 854 అడుగులు చేరుకోకపోతే ఏం చేస్తారో మాత్రం చెప్పలేదు.

ఇది సెప్టెంబర్ మొదటి దినాలలో. అయితే ఒక వారం తిరగకముందే ముఖ్యమంత్రి కృష్ణా జిల్లాకు పోయి వెంటనే శ్రీశైలం రిజర్వాయర్ నుంచి నీళ్లు కిందికి విడిచిపెడతామని హామీ ఇచ్చాడు. ఈ హామీ వెంటనే అమలయింది కూడా. (అయినప్పటికీ వారి అవసరాలకు చాలినంత రాలేదనీ, ఇంకా విడిచిపెట్టమనీ డెల్టా నాయకులు ఆందోళన కొనసాగించారు – అది వేరే సంగతి).

శ్రీశైలం నుంచి కిందికి ప్రవహించే కృష్ణానది నీళ్లు నేరుగా బెజవాడకు పోవు. మధ్యలో నాగార్జునసాగర్ ఉంది. దానికి కుడి, ఎడమ కాలువలున్నాయి. గుంటూరు, ప్రకాశం జిల్లాలకు నీళ్లిచ్చే కుడికాలువకు కొంచెం దిగువనుండే నీళ్లు అందుతాయిగానీ సాగర్‌లో నీటిమట్టం 510 అడుగులుంటే తప్ప నల్లగొండకూ, ఖమ్మంకూ (కొంచెం కృష్ణా జిల్లా మెట్ట తాలూకాలకు కూడా) నీళ్లిచ్చే ఎడమ కాలువకు నీళ్లందవు. ఆపైన కూడా నీళ్లుంటే తప్ప ఈ మధ్యనే రాష్ట్ర ప్రభుత్వం నల్లగొండకు వరమంటూ ఆర్భాటంగా ప్రకటించిన ఎలిమినేటి మాధవరెడ్డి కాలవ కోసం నీళ్లు ఎత్తిపోసి నిలువ ఉంచే అక్కంపల్లి రిజర్వాయర్ కనీసం తడవదు. ముఖ్యమంత్రి కృష్ణా జలాల వివాదం గురించి చేసిన ప్రకటనలలో ఈ అవసరాల ప్రస్తావన సహితం లేదు.

ఈ విషయాలన్నీ దృష్టిలో ఉంచుకుంటే తప్ప రాష్ట్రంలోని మూడు ప్రాంతాలలో నెల రోజులుగా సాగుతున్న ఆందోళనలను అర్థం చేసుకోలేం. అర్థం చేసుకోకపోతే అన్ని ఆందోళనలనూ ఒకేగాటన కట్టి నిందించడమో, అభినందించడమో జరుగుతుంది. అది అవాంఛనీయం.

కృష్ణా నదిలో నీళ్లు తక్కువ ఉన్నప్పుడు దానిని భిన్న ప్రాజెక్టుల మధ్య ఏ ప్రాధాన్యతల ఆధారంగా పంచాలో నిర్ధారించే నియమావళిని రాష్ట్ర ప్రభుత్వం రూపొందించాలనీ, ఆ నియమావళి అందరి అవసరాలనూ లెక్కలోకి తీసుకుంటూ, కరువు ప్రాంతాల ప్రాజెక్టుల అవసరాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చేదిగా ఉండాలనీ, ఈ సమస్య ఎప్పుడొచ్చినా ప్రభుత్వం ఏ ఒత్తిడులకూ లొంగకుండా ఈ నియమావళి ప్రకారం నడుచుకోవాలనీ, అందుకోసం ఒక స్వతంత్రమైన రెగ్యులేటరీ కమిషన్‌ను నెలకొల్పాలనీ డిమాండ్ చేయడం అవసరం. ఆ డిమాండ్‌ను సాధించుకోవడం అవసరం.

అయితే కృష్ణా జలాలకు సంబంధించిన అసలు సమస్య ఇది కాదు. మన రాష్ట్రంలో భిన్న ప్రాంతాల మధ్య ఆ నది నీటిలో మన వాటాగా వచ్చిన 800 (లేక 811) టిఎంసిల నీటిని పంపిణీ చేసిన విధానమే అన్యాయమైనది. కోస్తా ఆంధ్రకు 377 టిఎంసిలు, తెలంగాణకు 267 టిఎంసిలు, రాయలసీమకు 123 టిఎంసిలు పంపిణీ చేశారు. తెలంగాణకు ఇచ్చిన 267 టిఎంసిలలో చెప్పుకోదగ్గ మొత్తం కాయితాల మీద తప్ప ఎక్కడున్నాయో తెలియని మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు కేటాయించబడ్డాయి.

ఈ పంపిణీ ఏరకంగా చూసినా అన్యాయమైనది. వర్షపాతం, భూగర్భ జలాలు ఎక్కువ ఉన్న ప్రాంతానికి ఎక్కువ నది నీరు, తక్కువ ఉన్న ప్రాంతాలకు తక్కువ నది నీరు కేటాయించడం అన్నిటి కంటె ప్రాథమికమైన అన్యాయం. దీనిని ఇప్పటికయినా సవరించి వర్షాభావం, కరువు, పేదరికం అధికంగా ఉన్న తెలంగాణ, రాయలసీమ ప్రాంతాలకు నీళ్లిచ్చే పెండింగ్ ప్రాజెక్టులకు నీటిని ఒక హక్కుగా కేటాయించడం ద్వారా కృష్ణానది నీటిని పునఃపంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ ఉద్యమిం చడం అవసరం. అప్పుడుగానీ నీటి హక్కుల విషయంలో న్యాయం జరగదు.

## కృష్ణా నదీజలాల పునఃపంపిణీ ఉద్యమం

9.10.2003 *(Movement for Redistribution of Krishna River Waters)*

# సంపన్నుల 'సేవ'లో జిల్లా పోలీసులు

**ఒ**క నేరం జరిగిందన్న అనుమానం సమాజంలో వ్యక్తమైనపుడు అందునా అది ప్రాణాంతక మైన నేరమైనపుడు పోలీసుల విధి ఏమిటి? నిష్పక్షపాతంగా విచారించి, నిజం నిగ్గుతేల్చడానికి శాయశక్తులా ప్రయత్నించడమా, లేకపోతే అర్జంటుగా ఒక అభిప్రాయానికి వచ్చేసి, దానిని ప్రకటించేసి కాదన్న వారినందరినీ ఎద్దేవా చేయడమా?

ప్రొద్దుటూరుకు చెందిన జూటూరు సరోజమ్మ, సుబ్బరాయుడు, దేవీల మరణం విషయం లో పోలీసులు రెండవ మార్గాన్నే ఎంచుకున్నారు. వాళ్లు ఆత్మహత్య చేసుకున్నారనేది నిర్వివాదం. ఎందుకు చేసుకున్నారన్నది ప్రశ్న. ఆ ఆత్మహత్యలకు వేరొకరి వేధింపులు, ప్రోద్బలం ఉంటే అది నేరమవుతుంది. ఇందులో మొదటిదే జరిగిందని స్థానికుల నుంచి ఒక బలమైన అను మానం వినిపిస్తున్నప్పుడు దానిని పరిశీలించే ఓపిక, బాధ్యత పోలీసులకు ఉండనవసరం లేదా? ఆర్థిక సమస్యల కారణంగానే ఆత్మహత్య చేసుకున్నారని వెంటనే ప్రకటించి చేతులు దులిపేసుకోవడం సబబా?

ఆత్మహత్య చేసుకోవల్సినంతటి ఆర్థిక వత్తిడులు వారికి ఏమున్నాయి? ఆడపిల్లలు ఎక్కువైనందున, ఇంకా ఒకరికి వివాహం కావలసి ఉన్నందున, అప్పులు అయినందున ఆత్మహత్యలకు పాల్పడినట్లు శవ పంచనామాలో సాక్షులు చెప్పారని పోలీసులు రాశారు. నలుగురు ఆడపిల్లల్లో ముగ్గురికి పెళ్లి చేసిన కుటుంబానికి చివరి కూతురు వివాహము భారమైపోయిందా? పదిహేడేళ్లకే ఆ పిల్లకు పెళ్లి కాకుండా పోతుందేమోనని ప్రాణం తీసుకునేంత చింత పట్టుకుందా? అప్పులైనాయి అంటున్నారు! ఏ మాత్రమైనాయి? తీర్చలే నంతగా అయినాయా? ఇంటిపెద్ద గోపాలశెట్టి వంట పని చేస్తున్నాడు. సరోజమ్మ, దేవి ఇంటి దగ్గరనే టీ అంగడి పెట్టుకుని అంతో, ఇంతో సంపాదిస్తున్నారు. సుబ్బరాయుడు బుశెట్టి జ్యూవెలర్స్‌లో గుమాస్తాగా పనిచేస్తున్నాడు. తలా యింతా సంపాదించే ఈ కుటుంబానికి తట్టుకోలేనంతగా ఆర్థిక సమస్యలు ఏమొచ్చాయి?

వారి ఆత్మహత్యకు వేరే కారణం ఉండగలదని ప్రజలు అనుకుంటున్నారు. తెలుగు దినపత్రికలు ఆ అనుమానాలను ప్రముఖంగానే రాశాయి. మానవ హక్కుల వేదిక ఇంగ్లీషులో రాసి టైప్ చేసి తెలుగురాని ఎస్పీ గారికి ఇచ్చింది. బుశెట్టి జ్యూవెలర్స్‌లో జరిగిన దొంగతనాన్ని గురించి ఆ అం గడి యజమానులు సుబ్బరాయుడును అనుమానించారని, అక్టోబర్ 9వ తారీఖు నుంచి 11వ తేదీ వరకు అతనిని తమ అదుపులో పెట్టుకుని హింసించినారనీ, సోదా కోసం వెళ్లి అతని చెల్లెలితో అసభ్యంగా ప్రవర్తించారని, అంతేగాక బాండు రాయించు కున్నారని, అందువల్లనే అవమానం భరించలేకనో, ఇంకా ఏమౌతుందో అన్న భయం వల్లనో ఆ ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారని స్థానిక ప్రజల్లో బలమైన అనుమానం ఉంది. ఆ విషయమై పత్రికలు రాశాయి. మేము ఎస్పీ గారి దృష్టికి తీసుకుపోయాం.

సుబ్బరాయుడు, దేవీల శరీరాల మీద ఫోటోలలో సహితం స్పష్టంగా కనిపిస్తున్న గాయాలు ఈ అనుమానాన్ని సమర్థిస్తున్నాయి. వాటిలో కొన్ని శవ పంచాయతీలో గుర్తించబడగా మరికొన్ని



డాక్టర్లు చేసిన శవ పరీక్ష నివేదికలో నమోదయ్యాయి. అవి డాక్టరు చెప్పినట్లు కేవలం గోకుడు గాయాలు లేక పోలీసులు చెబుతున్న చీమలు పట్టిన గాయాలు కాకపోవచ్చని, కొట్టిన దెబ్బల చిహ్నాలు కావచ్చునని ఫోటోలు చూసిన వైద్య నిపుణులు అంటున్నారు.

ఇవి పరిశోధించవలసిన విషయాలు కావా? ఓపికగా పరిశోధించి ఒక అభిప్రాయం ప్రకటించి ఉంటే దానితో అంగీకరించినా, విభేదించినా, విధి నిర్వహించారని గౌరవించి ఉండవచ్చు. కాని జిల్లా ఎస్పీ గారు, ప్రొద్దుటూరు డిఎస్పీ గారు ఏం చేశారు? నేరాన్ని పరిశోధించడానికి ఫిర్యాదు ఉండాలని, ఫిర్యాదు లేకుండా పరిశోధించలేమనీ అంటున్నారు.

పత్రికలలో వచ్చిన వార్తలు ఫిర్యాదు కాదా? మానవహక్కుల వేదిక ఇచ్చిన వినతిపత్రం ఫిర్యాదు కాదా? పోలీసులకు చట్టాల గురించి పెద్దగా తెలియని మాకు కూడా తెలుసును. కాని 'కాగ్నైజబుల్' నేరానికి నిర్వచనం కూడా తెలియదని మహానుభావులు జిల్లాను ఏలుతుంటే ఎట్లా? ఇది కేవలం బాధ్యతారాహిత్యమా? లేక లాలూచీ కూడా ఉందా?

బుశెట్టి జ్యూవెలర్స్ అధినేత రాము ప్రొద్దుటూరులోని వైశ్య ప్రముఖులలో ముఖ్యుడు. కోట్లకు పడగెత్తినవాడు. అలాంటి వారికి ఇబ్బంది కలగకుండా నడుచుకుంటే ఉండగల ప్రయోజనాలు పోలీసులకు తెలియనివి కావు. వారికి అది బాగా తెలిసిన సంగతని ప్రజలకు తెలియనిది కాదు. ఈ మధ్య కాలంలో పోలీసులనే అనుచరులుగా చేసుకుని రాము చేస్తున్న పంచాయతీలు కూడా ప్రజలకు బాగా తెలుసు.

లాలూచీ ఏదో లేకపోతే, శవపరీక్షలో కనిపించిన గాయాలు మూడున్నర గంటలసేపు సాగిన శవ పంచనామాలో ఎందుకు కనిపించలేదు? ప్రజలలో వ్యక్తమైన అనుమానాలపై కనీసం పరిశోధిస్తామని కూడా పోలీసులు ఎందుకు అనరు? బుశెట్టి రామును తీసుకొచ్చి విచారించినట్లయితే అతను ఆత్మహత్య చేసుకోవచ్చుననీ, చేసుకుంటే పోలీసులనే అంటారని ఎస్పీ హేళనగా ఎందుకు మాట్లాడుతారు? జిల్లాలో నిత్యం జరుగుతున్న అరెస్టులలో రాని అనుమానం బుశెట్టి రాము విషయం లోనే ఎందుకు వస్తుంది?

కరపత్రం

వైశ్య సాంప్రదాయం ప్రకారం పెండ్లికాని వారి శవాలను పూడ్చిపెడతారే తప్ప, దహనం చేయరు. అయినప్పటికీ సుబ్బరాయుడు, దేవీల శవాలను దహనం చేయడం పోలీసులకు ఎందుకు అనుమానాస్పదంగా తోచలేదు. వారి తండ్రి గోపాలశెట్టి అర్భకుడే తప్ప, నేరాన్ని కప్పిపెడితే అతనికి వచ్చే ప్రయోజనం ఏమీ లేదు. మరి అతనిచేత దహనం చేయించింది ఎవరు? ఈ సందే హం పోలీసులకు ఎందుకు రాలేదు?

ఇప్పటికయినా మించిపోయింది లేదు. నేర పరిశోధనకు కాలపరిమితి లేదు. జిల్లా పోలీసు యంత్రాంగం చట్టాన్ని కాపాడటంలో నిజాయితీ నిరూపించదల్చుకుంటే జూటూరు సరోజనమ్మ, సుబ్బరాయుడు, దేవీల మరణంపై చిత్తశుద్ధితో నేర పరిశోధన జరిపి దోషులను కోర్టు బోను ఎక్కించవలసిందిగా డిమాండ్ చేస్తున్నాము.

కడప 27.10.2003

# ప్రజారోగ్య వ్యవస్థను ప్రజానుకూలంగా మలచుకుందాం

సరళీకరణ విధానాల ప్రజా వ్యతిరేక స్వభావాన్ని నలభై దినాలుగా సాగుతున్న జూనియర్ డాక్టర్ల సమ్మె బయట పెట్టినంత సంపూర్ణంగా వేరే ఏ ఘటనా పెట్టలేదు.

అందుకే ఆ సమ్మెకు ఏ విధంగా జవాబు చెప్పాలో తోచక ప్రభుత్వం దబాయింపుకూ, బెదిరింపులకూ దిగింది. తన పాలనా విధానాలన్నిటినీ ప్రపంచ బ్యాంకుతో చర్చించి, వారి ఆమోదం పొందే ముఖ్యమంత్రి 'ప్రభుత్వ విధానాలతో జూనియర్ డాక్టర్లకేంపని' అంటూ మిగిలివున్న పరువు కాస్తా పోగొట్టుకున్నాడు.

ప్రజల ప్రాథమిక అవసరాల కల్పన కోసం ప్రభుత్వం నెలకొల్పిన అన్ని సంస్థల బాధ్యతనూ ఒక్కొక్కటిగా వదిలించుకొని, ప్రభుత్వంతో ఏ ప్రమేయంలేని సొసైటీల చేతిలో పెట్టాలనీ, ఆ సొసైటీలు వినియోగదారులు ఇచ్చే 'యూజర్ చార్జీల' మీదా దాతలిచ్చే విరాళాల మీదా తమ అదుపులో ఉన్న స్థలాలను లీజుకివ్వడం ద్వారా వచ్చే కిరాయి మీద ఆధారపడి మౌలిక సేవలు కల్పించాలనీ 1997లో ప్రపంచ బ్యాంకు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. చెప్పేవాడికి లేనప్పుడు నాకెందుకు బుద్ధివుండాలని రాష్ట్ర ప్రభుత్వం వారి మాటలు ఆలకించింది. నీటి సరఫరా, రవాణా, వైద్యం ఇందుకు ఉద్దేశించబడిన ప్రధాన సేవారంగాలు.

ప్రపంచ బ్యాంకు ఆదేశానికి తలఒగ్గిన తరువాత నాలుగయిదు సంవత్సరాలు సేవా వ్యవస్థను మార్చకుండా యూజర్ చార్జీలు నెమ్మదిగా ప్రవేశపెట్టిన ప్రభుత్వం, ఇప్పుడు పూర్తిస్థాయిలో ఆ ఆదేశాన్ని అమలు చేయడానికి నడుం కట్టింది. 2003 సంవత్సరం ఏప్రిల్ 17న రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ జారీచేసిన జివో 90 ఇందులో మొదటి మెట్టు. దీనిని దాటితే మంచినీటి సరఫరా రెండవది కావచ్చు.

వినియోగదారుల వద్ద డబ్బులు వసూలు చేసుకోవడం అనే యూజర్ చార్జీల వ్యవస్థ గురించి మాత్రమే చర్చ జరిగినట్టయితే వినడానికి హేతుబద్ధంగా కనిపించే వాదనలతో తప్పించుకోవడానికి ప్రభుత్వానికొక అవకాశం దొరుకుతుంది. దారిద్ర్య రేఖకు దిగువనున్న తెల్లకార్డు కుటుంబాలకు ఉచితంగానే వైద్య సేవలందిస్తున్నప్పుడు చెల్లించగలవాళ్ల దగ్గర తీసుకుంటే తప్పేముంది? అని ప్రభుత్వ ప్రతినిధులు అడుగుతున్నారు.

తప్పు చాలా ఉంది. ఒకటి, అర్హులయి వుండి కూడా తెల్లకార్డులు లేని కుటుంబాల సంఖ్య ఎప్పుడూ లక్షల్లో ఉంటుంది. నిన్న మొన్నటిదాకా రాష్ట్రంలో ఏ గ్రామానికి పోయినా ఈ ఫిర్యాదు వినిపించేది. ఎన్నికలు దగ్గరికొస్తున్నాయని పది సంవత్సరాల తరువాత తెల్లకార్డులు కొత్తగా జారీచేసే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టడం వల్ల ఈ సమస్య తీవ్రత తాత్కాలికంగా తగ్గింది. కానీ ఇప్పుడు



సవరిస్తున్న జాబితాను ఇంకొక దశాబ్దం పాటు సవరించబోరు కాబట్టి క్రమంగా సమస్య మళ్లీ పెరుగుతుంది. గ్రామాలు వదిలి పట్టణాలకు వచ్చే పేద కుటుంబాలకూ కూలికోసం వలసపోయే కుటుంబాలకూ కొత్త స్థలంలో తెల్లకార్డులివ్వరు. ఉన్న ఊరిలోనే అయినా కుటుంబంలో పిల్లలు పెరిగి రెండు కుటుంబాలయినా కార్డులు రెండు కావు, ఒకటే ఉంటుంది.

రెండు, ప్రభుత్వం ఇచ్చే ఏ సేవ అయినా అతిపేదలకు మాత్రమే ఇచ్చేటట్టయితే దాని నాణ్యత ఘోరంగా ఉంటుందనేది విద్యా వైద్య రంగాలలో ప్రైవేటీకరణను అధ్యయనం చేసిన వారంతా ఏకగ్రీవంగా చెప్పే విషయం. ప్రభుత్వ ఆస్పత్రులకూ, ప్రభుత్వ స్కూళ్లకూ పేదలేకాక చదువుకున్న మధ్యతరగతి ప్రజలు కూడా వెళ్లిన రోజులలో అక్కడి సేవలలో నాణ్యత ఒకమేరకు ఉండింది. హైదరాబాద్‌లోని ఉస్మానియా, గాంధీ దవాఖానాల నుంచి విశాఖపట్నంలోని కింగ్ జార్జి ఆస్పత్రిదాకా జనరల్ ఆస్పత్రులు అందరి ఆస్పత్రులుగా ఉన్న రోజులలో కాన్సర్ వంటి రోగాలకు కూడా ధైర్యంగా అక్కడే చికిత్స చేయించుకునేవారు.

చెల్లించగల వాళ్లు ప్రైవేట్ రంగంలో సేవలు పొందితే తప్పేముంది అన్న వాదనతో విద్యా వైద్య రంగాలలో ప్రైవేట్ పెట్టుబడులను ప్రోత్సహించడం మొదలుపెట్టిన తరువాత మధ్యతరగతి ప్రభుత్వరంగ సంస్థలకు దూరం అయింది. ఆ సంస్థలలో సేవలు నాణ్యతకు దూరం అయ్యాయి. నోరులేని వర్గాలకు మాత్రమే ఇచ్చే సేవలలో నాణ్యత ఉండవలసిన 'కర్మ' ఏముంటుంది?



యూజర్ చార్జీల పేరు మీద ఒకే సంస్థలో కొందరికి ఉచితంగా సేవలు, కొందరికి ఫీజుకు సేవలు అందియ్యడం మొదలుపెట్టిన తరువాత ఇద్దరికీ సేవలు ఒకేరకంగా అందిస్తారనుకోవడం కల్ల. వనరులు పరిమితంగా ఉన్న సంస్థలు ఉచితంగా ఇచ్చే సేవలు కుదించివేసి ఫీజుకు ఇచ్చేవి పెంచుకుంటాయి. ఇది ఉద్దేశ్యపూర్వకంగానూ జరుగుతుంది, అసంకల్పితంగానూ జరుగుతుంది.

మూడు, మొదట యూజర్ చార్జీలను వేణ్ణీళ్లకు చన్నీళ్ల చందంగా సమర్థించుకున్న ప్రభుత్వం పోనుపోను సంస్థకు ఏ అవసరమొచ్చినా 'మీరే వసూలు చేసుకోండి – నేనెక్కడి నుంచి తెచ్చివ్వగలను?' అనగలదు. 'సెల్ఫ్ ఫైనాన్స్‌డ్' కోర్సులు మొదలుపెట్టిన తరువాత విద్యా రంగంలో ఇదే జరుగుతున్నది. అప్పుడు ఆ సంస్థలో అభివృద్ధి ఫీజులు వసూలు కాగల దిశగా మాత్రమే జరుగుతుంది. మధ్యతరగతికి అవసరమైన వైద్య సేవారంగాలు అభివృద్ధి చెందుతాయే తప్ప మెదడువాపు చికిత్సా రంగం అభివృద్ధి చెందదు. కానీ అత్యధికంగా ప్రాణాలు తీసేది తెల్లకార్డు వర్గాల రోగాలయిన అతిసార, మెదడువాపు వ్యాధులే. ఒక సమాజం అనుసరించే వైద్య విధానం ఆ సమాజంలో ప్రధానంగా తలెత్తే వ్యాధులకు అనుగుణంగా ఉండాలి. మన సమాజంలో అతివేగంగా వ్యాపించి వందల ప్రాణాలు తీసే అంటువ్యాధులు ఇప్పటికీ ప్రబలంగా ఉన్నాయి. వీటిని పటిష్టమైన ప్రభుత్వ వైద్య వ్యవస్థ ఎదుర్కోగలదే తప్ప వైద్య వ్యాపారం ఎదుర్కోలేదు.

కాబట్టి 'యూజర్ చార్జీల' వసూలు ఒక్కటే సమస్య అయి వున్నా అది పైకి కనిపించేంత అమాయకమయిన విషయం కాదు.

అయితే జివో 90లో యూజర్ చార్జీలు అనుబంధ విషయం మాత్రమే, అసలు విషయం కాదు. అసలు విషయం ఆస్పత్రుల నిర్వహణను ప్రభుత్వం చేతి నుంచి తీసేసి స్వయం ప్రతిపత్తిగల సొసైటీల చేతిలో పెట్టడం. ఈ సొసైటీలలో సభ్యులుగా ఎవరుంటారంటే స్థానిక ప్రజా ప్రతినిధులు, ఇతర పెద్దలు, సంఘ సేవకులు, దాతలు వగైరా. వీరికి ఆస్పత్రులు నిర్వహించడానికి వనరులెక్కడి నుంచి వస్తాయంటే విరాళాల నుంచి, యూజర్ చార్జీల నుంచి, అభివృద్ధిని స్పాన్సర్ చేసే దాతల నుంచి, ఆవరణలో అంగళ్లు పెట్టుకునే వర్తకులిచ్చే కిరాయి నుంచి – ఎక్కడి నుండయినా రావచ్చును గానీ ప్రభుత్వం మాత్రం ఒక్క దమ్మిడీ కూడా ఇవ్వదు.

యూజర్ చార్జీలు వసూలు చేసినా నిర్వహణ ప్రభుత్వం చేతిలో వుంటే బడ్జెట్ కేటాయింపు కొంతయినా ఉండక తప్పదు. ఎన్నికల వంటి ప్రత్యేక సీజన్లలో ప్రజలు అల్లరిచేసి ఆ కేటాయింపులను పెంచుకునే అవకాశమూ ఉంటుంది. కానీ దాతల మీద, ఫీజుల వసూళ్ల మీద పూర్తిగా ఆధారపడే సొసైటీల చేతిలో ఆస్పత్రులను పెట్టేస్తే ఇంక అడగడానికేమీ ఉండదు. సొసైటీల పెద్దలు మనతో కోడెల శివప్రసాదరావు లాగ వాదనకు కూడా దిగరు. 'మీరు చెప్పేదంతా కరెక్టే – కానీ మా దగ్గర డబ్బులు లేవు. ఏం చేయమంటారు?' అని మర్యాదగా చేతులెత్తేస్తారు. మనం మరీ అల్లరి చేస్తే ఏ 'దాత'కో ఆస్పత్రిని అమ్మేసి వెళ్లిపోతారు.

నిజానికి ఈ సొసైటీలు వ్యాపారేతర లక్ష్యాలనే కలిగి వుండాలని అన్నప్పటికీ ఇవి ఆస్పత్రులతో పాటు మెడికల్ కాలేజీలను కూడా – భారీ ఫీజులతో – నడపబోతాయి కాబట్టి ఇవి చాలావరకు వ్యాపార సంస్థలుగానే ఉండబోతాయి. ఎవరో ఒక 'దాత' చేపట్టే వ్యాపారానికి ముసుగులుగా ఉండబోతాయి. ప్రభుత్వ ఆస్పత్రులను ఒకేసారి వ్యక్తులకు, లేక సంస్థలకు అమ్మేస్తే గొడవ అవుతుంది కాబట్టి ప్రైవేటీకరణకు తొలిదశగా వ్యాపారేతర సొసైటీలకు అప్పగించడం అనే ఎత్తుగడను ఎంచుకున్నారని అంటే అది కుసంశయం కాబోదు. ప్రస్తుతం ప్రభుత్వ ఆస్పత్రులలో వసూలు చేస్తున్న యూజర్ చార్జీలు మొత్తం లెక్కగడితే సాలీనా 50 కోట్లు ప్రభుత్వానికి వస్తున్నదని సమ్మె చేస్తున్న జూనియర్ డాక్టర్లు సవివరంగా నిరూపించారు. ప్రభుత్వ బడ్జెట్‌లో ఇదేం పెద్ద వాటా కాదు. ఈ మాత్రం కేటాయించలేక యూజర్ చార్జీలు ప్రవేశపెట్టి సొసైటీలకు ఆస్పత్రులను అప్పగిస్తున్నారంటే నమ్మడం కష్టం. ఊరికొక్క సొసైటీ ఏర్పడిన తరువాత ఒక్కొక్కటీ తన మార్గంలో ప్రైవేట్ ఆస్తిగా మారుతుంటే గమనించడం కష్టం, ఎదుర్కోవడం కష్టం కాబట్టి ఈ మధ్యేమార్గాన్ని ఎంచుకున్నారన్నది స్పష్టమే.

ఈ వ్యాపారంలో తమ ఆరోగ్యాన్ని వెతుక్కునే దౌర్భాగ్యానికి ప్రజలను వదిలేద్దామా? లేకపోతే జూనియర్ డాక్టర్ల పోరాటాన్ని అందరి పోరాటంగా మలచుకొని ప్రజారోగ్య వ్యవస్థను ప్రజానుకూలంగా దిద్దుకుందామా?

22.1.2004



కరపత్రం